

'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 15 | సంచిక: 316

SUNDAY Special

ఆదివారం 30-7-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మను భాకర్‌కు రెండు స్వర్ణాలు

వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో భారత అగ్రశ్రేణి షూటర్ మను భాకర్ రెండు పసిడి పతకాలతో మెరిసింది. ఓవరాల్‌గా ఈ పోటీల్లో భారత్ ఖాతాలో 3 స్వర్ణాలు, ఒక కాంస్యం చేరాయి.

- స్పోర్ట్స్‌లో



భారత్ 181కు ఆలౌట్

వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ 40.5 ఓవర్లలో 181 పరుగులకే ఆలౌటైంది. ఇషాన్ కిషన్ 55 పరుగులు, శుబ్‌మన్ గిల్ 34 పరుగులు చేశారు.

- స్పోర్ట్స్‌లో



ప్రతి భారతీయ భాషకు గౌరవం

నూతన జాతీయ విద్యా విధానం ద్వారా దేశంలోని ప్రతి భాషకూ సముచిత గౌరవం లభిస్తుందని ప్రధాని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸



మీరే పిల్లను చూడండి..!

హరియాణ మహిళ 'రాహుల్‌కి పెళ్లి చేద్దామా' అని అడగ్గా.. సోనియా నవ్వుతూ 'మీరే పిల్లని చూడండి' అని బదులిచ్చారు.

వివరాలు 6లో ▸



సంపూర్ణంగా కోలుకున్న లాలూ

కిడ్నీ ఆపరేషన్ తర్వాత పూర్తిగా కోలుకున్న ఆర్జేడీ చీఫ్ లాలూప్రసాద్‌యాదవ్ హుషారుగా బ్యాడ్మింటన్ ఆడుతూ కనిపించారు.

వివరాలు 6లో ▸



రంగంలోకి సీబీఐ

మణిపూర్‌లో ఇద్దరు మహిళలపై జరిగిన దారుణ లైంగిక దాడికి సంబంధించిన కేసు విచారణను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) చేపట్టింది.

బాబు కమీషన్ల కక్కుర్తే పోలవరానికి శాపం



- జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపాటు
- లేదంటే 2022 నాటికే సీఎం వైఎస్ జగన్ పూర్తి చేసేవారు
- నా ప్రశ్నలకు జవాబు చెప్పకుండా సిగ్గు లేకుండా మాట్లాడతావా?
- కేంద్రమే కట్టాల్సిన ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను ఎందుకు తీసుకున్నావ్?
- 2016–17 ధరలతో రామోజీ బంధువుకు పనులు ఎలా అప్పగించావ్?
- నీ కమీషన్ల నిర్వాకం వల్లే వరద ఉధృతికి దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్

10 లో

ఫ్యాక్ట్ చెక్

విదేశీ విద్యపైనా 'ఈనాడు' విషం

- జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంపై తప్పుడు రాతలు
- ప్రతిభ ఉన్నవారికే పారదర్శకంగా పథకం అమలు
- ప్రపంచంలో టాప్–50లో ఉన్న 320 విద్యా సంస్థల్లో ప్రవేశాలు
- బాబు పాలనలో కనీస నిబంధనలు పాటించకుండానే అమలు.. ఇచ్చింది గరిష్టంగా రూ.15 లక్షలే
- నూరు శాతం ఫీజు చెల్లిస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం

10 లో

వేగంగా సాయం..

ముమ్మరంగా పునరావాసం.. వరద వేళ సర్కారు బాసట

- గోదావరి వరద ప్రాంతాల్లో చురుగ్గా సహాయక చర్యలు
- 74 పునరావాస కేంద్రాల ఏర్పాటు
- వేగంగా 46 వేల మంది తరలింపు
- మంచినీరు, భోజనం, వసతి ఏర్పాట్లు.. 68 వైద్య శిబిరాలు, 178 బోట్లు, 10 లాంచీలు
- సహాయక చర్యల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు
- ఒక్క అల్లూరి జిల్లాలోనే 51 పునరావాస కేంద్రాలు.. 43 వేల మందికి వసతులు
- ప్రజలు ఇళ్లకు వెళ్లేటప్పుడు రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు సాయం
- ఐదు జిల్లాల్లో దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం రూ.10 వేలకు పెంపు
- 25 కేజీల బియ్యం, లీటర్ పామాయిల్, కేజీ కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు
- వసతి, సౌకర్యాలు, ఇతరత్రా సాయంపై బాధితుల సంతృప్తి



రాజమహేంద్రవరంలోని ఆల్కాట్‌తోట పునరావాస కేంద్రంలో వరద బాధితులకు భోజన వసతి

సాక్షి, అమరావతి / సాక్షి నెట్‌వర్క్: గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ముంపు బారిన పడిన జిల్లాల్లోని 211 గ్రామాల ప్రజల కోసం ప్రభుత్వం 74 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసింది. 46,170 మంది బాధితులను అక్కడికి యుద్ధ ప్రాతిపదికన తరలించింది. అత్యధికంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 51 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి అక్కడికి 43,587 మందికి తాత్కాలికంగా పునరావాసం కల్పించారు. ఏలూరు జిల్లాలో 4 కేంద్రాల్లోకి 1,528 మందిని, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 18 కేంద్రాలకు 758, తూర్పుగోదావరి జిల్లాలో ఒక కేంద్రం ఏర్పాటు చేసి 306 మందిని తరలించారు. ఆయా ప్రాంతాల్లో తక్షణ వైద్య సౌకర్యం కల్పించేందుకు 68 వైద్య శిబిరాలు నెలకొల్పారు. మొత్తం 178 బోట్లు, 10 లాంచీలను సహాయక చర్యల కోసం ఏర్పాటు చేశారు. ఐదు జిల్లాలకు ప్రభుత్వం తక్షణ అవసరాల కోసం రూ.12 కోట్లు విడుదల చేయడంతో పునరావాసకేంద్రాల ఏర్పాటు, బాధితుల తరలింపు, వారికి అవసరమైన ఆహారం, తాగు నీరు ఇతర సౌకర్యాల కల్పన వేగంగా జరిగింది. ఐదు జిల్లాల్లో

మిగతా 3వ పేజీలో ▶

మణిపూర్‌లో 'ఇండియా'

20 మంది ఎంపీల బృందం పర్యటన

శిబిరాల్లో బాధితులతో మాటామంతి

ఈ హింసతో దేశ ప్రతిష్ట దెబ్బ తింది

అయినా మౌనమే మోదీ భాష: కాంగ్రెస్

వాళ్లది రాజకీయ నాటకం: బీజేపీ



మణిపూర్‌లో ఓ అవ్వను ఓదార్చుతున్న టీఎంసీ ఎంపీ సుష్మితా దేవ్

హింసాకాండతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో విపక్ష 'ఇండియా' కూటమి సభ్యుల రెండు రోజుల పర్యటన మొదలైంది. కాంగ్రెస్‌తో పాటు పలు పార్టీలకు చెందిన ఎంపీలు శనివారం మొయిరంగ్, విష్ణుపూర్ జిల్లాలతో పాటు తాజాగా హింసాకాండ చెలరేగిన చౌరాచంద్‌పూర్‌లో పర్యటించారు. కుకీ తెగకు చెందిన బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

- వివరాలు 6లో


నా వాంగ్మూలాన్ని మార్చేశారు

సీబీఐ పేర్కొన్నదంతా అవాస్తవం

'సాక్షి' ఇంటర్వ్యూలో ఏపీ ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం

నేను చెప్పనివి.. చెప్పినట్లు చార్జిషీట్‌లో ఎలా ఇస్తారు?

ఆ రోజు ఉదయం 6.30 గంటలకు వైఎస్ జగన్‌కు వివేకా మరణ వార్త తెలిసింది



- దిగ్భ్రాంతికి గురై 'చిన్నాన్న చనిపోయారు' అని చెప్పారు
- ఆ వెంటనే సమావేశం ఆపేసి మేము బయటకు వచ్చాం.. గుండెపోటుతో చనిపోయారని జగన్ వెల్లడించలేదు
- కానీ ఓ పత్రిక అసత్య వార్తలు రాస్తూ తప్పుదారి పట్టిస్తోంది
- వాస్తవాలు తెలుపడం కోసం అప్పట్లో ప్రెస్ మీట్ పెట్టి చెప్పాను
- ఈ కేసులో సీబీఐని ఎవరో వెనుక నుంచి నడిపిస్తున్నారు
- తప్పుడు వాంగ్మూలాన్ని తొలగించాలని హైకోర్టును ఆశ్రయించా

2 లో

వలంటీర్లే 'రక్షణ' కవచాలు

- గోదావరి ఏటిగట్లపై నిరంతర పర్యవేక్షణ
- అర కిలోమీటరుకు ఒకరు చొప్పున నియామకం
- గట్లపై 740 మంది రేయింబవళ్లు కాపలా.. ఎప్పటికప్పుడు పై అధికారులకు సమాచారం

3 లో



వాకలగరువు ఏటిగట్టు వద్ద వలంటీర్లు నాగబాబు, ప్రసాద్

ఇక గుడి భూములకు పక్కా లెక్క!

- రాష్ట్రంలోని అన్ని ఆలయాల వివరాలన్నీ కంప్యూటరీకరణ
- సర్వే నంబర్ల వారీగా అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు
- ఇప్పటివరకు ఆలయాల రికార్డుల్లోనే భూముల వివరాలు
- కంప్యూటరీకరణతో ఈ భూములపై మరింత పారదర్శకత
- వీటిలో మార్పులు చేసే అవకాశం లేకుండా పటిష్ట ఏర్పాట్లు

2 లో



ఆక్వాలో అగ్రగామి.. ఉమ్మడి పశ్చిమ

పశ్చిమ నుంచి భారీగా రొయ్య ఎగుమతులు

- రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో ఆక్వా సాగు
- గతేడాది 3.05 లక్షల మెట్రిక్ టన్నుల ఎగుమతి
- వ్యాపారం ప్రతి ఏటా రూ.9 వేల కోట్ల పైమాటే
- రాష్ట్రంలోనే ఆక్వా సాగుకు శ్రీకారం చుట్టింది ఇక్కడే



సాక్షి ప్రతినిధి, ఏలూరు: సహజసిద్ధంగా సముద్ర, నదీతీర పరీవాహక ప్రాంతాల్లో దొరికే రొయ్యలను చిన్నచిన్న మడులతో సాగు ఆరంభించి వేల ఎకరాల్లో అత్యధిక రొయ్యల వెరైటీలను సాగు చేస్తూ పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్రం, దేశంలో అగ్రస్థానంలో నిలిచింది. దేశం నుంచి ఏటా సుమారు 10 లక్షల మెట్రిక్ టన్నుల రొయ్యలు విదేశాలకు ఎగుమతి అవుతుంటే అందులో ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్రం నుంచి, దీనిలో 3.05 లక్షల మెట్రిక్ టన్నులు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఎగుమతి అవుతుండటం విశేషం. రొయ్య సాగుకు రాష్ట్రంలోనే మొదట శ్రీకారం చుట్టింది ఈ జిల్లా ఆక్వా రైతులే. చిన్న చిన్న మడుల్లో రొయ్యలను పెంచి బకెట్ల ద్వారా విక్రయించే స్థాయి నుంచి నేడు డాలర్ల వర్షం కురిపించే స్థాయికి ఆక్వా రంగం జిల్లాలో ఎదిగింది. ఆక్వా విస్తీర్ణం వేల ఎకరాలకు చేరడంతో పాటు హేచరీలు, సీడ్ కంపెనీలు కూడా దీనికి అనుబంధంగా జిల్లాలో ఏర్పాటై ప్రపంచ వ్యాప్తంగా పశ్చిమ రొయ్యకు ఖ్యాతి తెచ్చింది. ప్రత్యక్షంగా వేలాది మంది రైతులు, హేచరీలు, ఫీడ్ కంపెనీల ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు దొరకడంతో పాటు జిల్లా ఖ్యాతిని పెంపొందించింది.

ఆక్వా సాగుకు శ్రీకారం ఇలా..

సహజసిద్ధంగా సముద్ర, నదీ తీర పరీవాహక ప్రాంతాల్లో దొరికే చిన్న చిన్న రొయ్యలను మడుల్లో పెంచే రొయ్య సాగుకు 1970వ దశకంలో పశ్చిమగోదావరి, కృష్ణా డెల్టా రైతాంగం శ్రీకారం చుట్టింది. పశ్చిమగోదావరితో పాటు యానాం, ఎదురులంక, ముమ్మిడివరం, చించినాడ, కృష్ణా జిల్లాలోని డెల్టా ప్రాంతంలోని పలు మండలాల్లో చేతి వలల ద్వారా పీఎల్ (రొయ్య రకం)ను సేకరించి, బకెట్ల ద్వారా విక్రయించేవారు. రొయ్య పిల్లల పెంపకానికి మేతగా తవుడు, ఉడకబెట్టిన బంగాళదుంప, చెక్క మేతను వినియోగించేవారు. రొయ్య కొంత బరువు వచ్చాక నత్త మాంసంతో పెంచేవారు. ఇలా ప్రారంభమైన ఆక్వా సాగుకు 1980లో అప్పటి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించింది. మడుల్లో రొయ్యల పెంపకం, సహజసిద్ధమైన పద్ధతుల ద్వారా వ్యాపారం లాభసాటి ఉండదని, వైజాగ్, చెన్నైలో హేచరీలను ఏర్పాటు చేసినప్పటికీ సాగుకు ప్రోత్సాహం లభించలేదు. ఈ క్రమంలో మార్కెట్‌లోకి వచ్చిన టైగర్ రొయ్యపై పశ్చిమ రైతులు దృష్టి సారించడంతో జిల్లాలో టైగర్ రొయ్య కల్చర్ పెరగడంతో పాటు అధిక లాభాలను తీసుకువచ్చే సాగుగా మారింది. ఈ క్రమంలో రైతులే అవసరమైన సీడ్‌ను రొయ్యలకు కావాల్సిన మేతను సిద్ధం చేసుకుంటూ వైరస్‌లను ఎదుర్కొంటూ సాగు చేశారు. 2000 సంవత్సరం నుంచి విదేశీ రొయ్యల సీడ్ హవా ప్రారంభమైంది. అమెరికాలోని ఫ్లోరిడా ప్రాంతం నుంచి తల్లి రొయ్యను దిగుమతి చేసుకున్నారు. 2004 నుంచి జిల్లాలో వనామీ సాగు ప్రారంభమైంది. బ్లాక్ టైగర్ సాగు తగ్గి వనామీ సాగు ప్రారంభం కావడం, వనామీ ద్వారా ఉత్పత్తి వేగం పుంజుకోవడంతో నార్త్ అమెరికా, ఫ్లోరిడా ప్రాంతం నుంచి తల్లి రొయ్య దిగుమతికి జిల్లాలో డిమాండ్ భారీగా పెరిగింది. దీంతో జిల్లాలో 30 ఎకరాలతో ప్రారంభమైన రొయ్యల సాగు విస్తీర్ణం 72 వేల ఎకరాలకు విస్తరించింది.

ఎగుమతులు ఇలా

గతంలో ప్రభుత్వం నుంచి సాగుకు, ఎగుమతి వ్యాపారులకు ప్రోత్సాహం లేకపోవడం, ఇతర కారణాలతో ఎగుమతులు ఆశాజనకంగా లేని పరిస్థితి. కరోనా అనంతరం ఎగుమతి మార్కెట్ మళ్లీ పుంజుకుంది. అమెరికాతో పాటు యూరోపియన్ దేశాలకు కూడా జిల్లా నుంచి భీమవరం, నర్సాపురం ప్రధాన కేంద్రాలుగా అమెరికా, చైనాతో పాటు యూరోపియన్ దేశాలకు రొయ్యలు ఎగుమతులు జరుగుతున్నాయి. అప్పడా అధికారిక లెక్కల ప్రకారం2017–18లో 1.52 లక్షల మెట్రిక్ టన్నులు, 2018–19లో 1.50 లక్షల మెట్రిక్ టన్నులు, 2019–20లో 1.70 లక్షల మెట్రిక్ టన్నులు, 2021–22లో 2.60 లక్షల మెట్రిక్ టన్నులు, 2022–23లో 3.05 లక్షల మెట్రిక్ టన్నులు ఎగుమతులు జరిగాయి. గతేడాది 3.05 లక్షల మెట్రిక్ టన్నుల్లో 1.37 లక్షల మెట్రిక్ టన్నులు అమెరికాకు, లక్ష మెట్రిక్ టన్నులు చైనాకు, 65 వేల మెట్రిక్ టన్నులు యూరోపియన్ దేశాలకు మన జిల్లా నుంచి ఎగుమతులు జరిగాయి. ఆక్వా వ్యాపారుల సమాచారం మేరకు రాష్ట్రం నుంచి ఎగుమతి జరిగే వ్యాపారంలో 50 శాతం పశ్చిమగోదావరి జిల్లా నుంచే ఉంటుందని, గతేడాది రికార్డు స్థాయిలో సుమారుగా నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ఎగుమతులు జరిగాయని, దీనిలో సుమారు రూ.9 వేల కోట్ల ఎగుమతి మార్కెట్ జరిగిందని అంచనా.

విద్యార్థుల ఆత్మహత్యలనూ బయట పెడతా: ప్రియ



టీడీపీ సీనియర్ నేత నారాయణ ఆకృత్యాలపై ఆయన మరదలు ప్రియ మరో వీడియో విడుదల చేశారు. 'నేను క్యాన్సర్ పేషెంట్‌ను.. చనిపోయేలోపు వాస్తవాలన్నీ బయటపెడతా. విద్యా సంస్థల్లో పిల్లల ఆత్మహత్యలపై కూడా మాట్లాడతా' అని చెప్పారు.

- వివరాలు 13లో

బాణసంచా యూనిట్‌లో పేలుడు



తమిళనాడులోని క్రిష్ణగిరి పట్టణంలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఓ బాణసంచా తయారీ యూనిట్‌లో పేలుడు సంభవించి 8 మంది మృతి చెందారు. మరో 20 మందికి పైగా గాయాలపాలయ్యారు.

- వివరాలు 6లో

రొట్టెల పండుగ ప్రారంభం



నెల్లూరు రొట్టెల పండుగ శనివారం ప్రారంభమైంది. రొట్టెలు వదిలేందుకు.. రొట్టెలు తీసుకునేందుకు వచ్చిన భక్తులతో బారాషహీద్ దర్గా ప్రాంగణం కిటకిటలాడింది. వరాల రొట్టెలు మార్చుకునే స్వర్ణాల చెరువు భక్తులతో నిండిపోయింది.

క్లుప్తంగా...

త్యాగానికి ప్రతీక మొహర్రం
సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: త్యాగానికి ప్రతీక 'మొహర్రం' అని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. 'ఇస్లాం నూతన సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆ దేవుని కరుణాకటాక్షాలు మన రాష్ట్రంపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని ఆయన శనివారం ట్వీట్ చేశారు.

నాలుగు పీహెచ్‌సీలకు ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ప్రజారోగ్య సౌకర్యాలను కేంద్రం ప్రశంసించింది. ఎన్టీఆర్ జిల్లా కండ్రిక యూపీహెచ్‌సీకి కూడా కేంద్రం సేవలను సైతం అభినందించింది. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీ ఇటీవల 96.2 టాప్ స్కోరుతో రాష్ట్రంలోనే ఉత్తమ ఆస్పత్రిగా గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. కాగా, ఇటీవల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏపీ ప్రభుత్వం కల్పిస్తున్న ప్రజారోగ్య సౌకర్యాల్లో నాణ్యతా ప్రమాణాలను స్వయంగా పరిశీలించిన కేంద్ర బృందం ఎన్టీఆర్ జిల్లా కండ్రిక యూపీహెచ్‌సీకి 88.2 శాతం మార్కులు వేసింది. దీంతో పాటు నెల్లూరు జిల్లా రామతీర్థం, సత్యసాయి జిల్లా వీఎం చెరువు, అల్లూరి సీతారామరాజు జిల్లా యల్లవరం, అన్నమయ్య జిల్లా పెదమాండ్యం పీహెచ్‌సీలకు నాణ్యతా ప్రమాణాల సర్టిఫికెట్లను ప్రకటించింది. ఈ ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో సంతృప్తికరమైన వైద్య సదుపాయాలు, సేవలందిస్తూ నాణ్యతా ప్రమాణాలను పాటించడంతో ఈ గుర్తింపు లభించింది. ఈమేరకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి విశాల్ చౌహాన్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఎంటీ కృష్ణబాబుకు రాసిన లేఖలో అభినందనలు తెలిపారు.

గుంటూరు జీజీహెచ్‌కు అరుదైన రికార్డు
హెల్త్ రికార్డులు ఆన్‌లైన్ చేయడంలో జాతీయ స్థాయిలో రెండో స్థానం



సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స కోసం వచ్చే రోగుల హెల్త్ రికార్డులను ఆన్‌లైన్‌లో డిజిటలైజ్ చేయడంలో గుంటూరు జీజీహెచ్‌కు ఇండియాలో రెండో స్థానం దక్కిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ శనివారం చెప్పారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌లో మొదటి స్థానాన్ని యూపీలోని ప్రయాగ్‌రాజ్ స్వరూప్‌రాణి నెహ్రూ హాస్పిటల్ దక్కించుకోగా, గుంటూరు జీజీహెచ్ రెండో స్థానంలో నిలిచిందన్నారు. కొద్దిరోజులుగా ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌ను డిజిటలైజేషన్ చేయడంలో ప్రత్యేక దృష్టి సారించి స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజల ఆరోగ్య రికార్డులను ఆధార్ కార్డుతో అనుసంధానం చేయడం వల్ల ఫలితాలు వచ్చాయని వెల్లడించారు.

విజయవాడ జీజీహెచ్‌లో అరుదైన చికిత్స
ఎడమ చేతి ప్రధాన రక్తనాళానికి స్టెంట్



ఉయ్యూరు ఆదిలక్ష్మి

లబ్బీపేట(విజయవాడ తూర్పు): విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో ఓ మహిళకు వైద్యులు అరుదైన చికిత్స అందించారు. వివరాల్లోకి వెళితే... కృష్ణాజిల్లా యనమలకుదురుకు చెందిన 46 ఏళ్ల ఉయ్యూరు ఆదిలక్ష్మి ఇంటి వద్ద టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తుంది. ఇటీవల ఎడవ చేయి పట్టు కోల్పోవడంతో పాటు స్పర్శ కూడా తగ్గింది. దీంతో చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రికి రాగా, అక్కడ ఎడమ చేతికి బీపీ పరీక్ష చేసేందుకు ప్రయత్నించగా రీడింగ్ చూపడం లేదు. దీంతో గుండె వైద్య విభాగానికి సిఫార్సు చేయగా, అక్కడి వైద్యులు యాంజియోగ్రామ్ నిర్వహించారు. గుండె నుంచి ఎడమ చేతికి రక్తప్రసరణ చేసే సబ్‌క్లావియన్ ఆర్టరీలో గుండెకు సమీపంలో పూడిక ఉన్నట్లు గుర్తించారు. ఆ మహిళకు క్యాథ్‌ల్యాబ్‌లో రక్తనాళంలోని పూడికను తొలగించి స్టెంట్ అమర్చారు. ప్రస్తుతం చేతికి రక్త ప్రసరణ యధాతథంగా జరగడంతో పాటు బీపీ కూడా రికార్డు అవుతుంది. అరుదైన చికిత్స చేసిన గుండె వైద్య నిపుణులు డాక్టర్ విజయ్‌చైతన్య, డాక్టర్ శ్రీహరిలను సూపరింటెండెంట్ అభినందించారు.


యూజీసీ అధ్యాపకుల సర్వీసు 65 ఏళ్లకు పెంపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తూ యూజీసీ వేతనాలు పొందుతున్న రెగ్యులర్ ప్రొఫెసర్లు, అధ్యాపకుల పదవీవిరమణ వయసును 62 నుంచి 65 ఏళ్లకు పెంచారు. ఈ మేరకు ఉన్నత విద్య శాఖ ప్రధాన కార్యదర్శి శ్యామలరావు శనివారం జీవో నం.39 జారీ చేశారు. రెగ్యులర్ ప్రొఫెసర్లు, అధ్యాపకుల పదవీవిరమణ వయసును 2014లో 60 నుంచి 62 ఏళ్లకు పెంచారు. న్యాక్ గ్రేడింగ్, కేంద్ర గ్రాంట్స్ సౌకర్యాలు ఉపయోగించుకునేందుకు విశ్వవిద్యాలయాల్లోని సీనియర్ మోస్ట్ అధ్యాపకులను మరికొంతకాలం కొనసాగించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

టెలి మెడిసిన్‌లో టాప్



దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికం
- వృద్ధులు, మహిళలకు రికార్డు స్థాయిలో సేవలు
- గ్రామీణ ప్రాంతాలకూ చేరువైన పెద్ద డాక్టర్ల సలహాలు
- 21,236 పీహెచ్‌సీలు, హెల్త్‌క్లినిక్స్‌తో టెలిమెడిసిన్ అనుసంధానం



సాక్షి, అమరావతి: వయో వృద్ధులు, మహిళలకు టెలీ మెడిసిన్ సేవలు అందించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రకటించింది. ఈ ఏడాది జూలై 19వ తేదీ నాటికి దేశవ్యాప్తంగా 1,10,12,570 మంది వయో వృద్ధులు టెలిమెడిసిన్ సేవలు పొందగా ఆంధ్రప్రదేశ్‌లో 34.17 లక్షల మందికి ప్రయోజనం చేకూరినట్లు ఇటీవల పార్లమెంట్‌కు తెలిపింది. దేశవ్యాప్తంగా పోలిస్తే 31.04 శాతం వయో వృద్ధులకు ఏపీలో సేవలు అందాయి. మహిళలకు టెలిమెడిసిన్ సేవలందించడంలో కూడా ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. దేశంలో 5,22,15,224 మంది మహిళలకు టెలిమెడిసిన్ సేవలు అందగా ఆంధ్రప్రదేశ్‌లోనే 1.37 కోట్ల మంది మహిళలు దీన్ని సద్వినియోగం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా పోలిస్తే ఏపీలో 26.41 శాతం మంది మహిళలు టెలి మెడిసిన్ సేవలు పొందారు. ఆంధ్రప్రదేశ్ మినహా మరే రాష్ట్రంలోనూ కోటి మందికి పైగా మహిళలకు టెలిమెడిసిన్ సేవలు అందలేదు. పశ్చిమ బెంగాల్‌లో 85.16 లక్షల మంది మహిళలు, తమిళనాడులో 62.94 లక్షల మంది మహిళలకు టెలిమెడిసిన్ సేవలను వినియోగించుకున్నట్లు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది.

21,236 స్పోక్స్ హబ్‌లు

ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం టెలి మెడిసిన్ ద్వారా స్పెషలిస్టు డాక్టర్ల వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాలకు సైతం అందుబాటులోకి తెచ్చింది. టెలిమెడిసిన్ సేవలందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలలు, జిల్లా అస్పత్రుల్లో ప్రత్యేక హబ్‌లను ఏర్పాటు చేసింది. వీటిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య హెల్త్ క్లినిక్స్, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లతో అనుసంధానం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు టెలిమెడిసిన్ సేవలకు సంబంధించి 21,236 స్పోక్స్ హబ్‌లను ఏర్పాటు చేసినట్లు కేంద్రం తెలిపింది. ఒక్కో హబ్‌లో ఇద్దరు జనరల్ మెడిసిన్, గైనకాలజీ, పీడియాట్రిక్స్, కార్డియాలజీ స్పెషలిస్టులు ఉంటారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, విలేజ్ క్లినిక్స్‌కు వచ్చిన రోగులకు స్పెషలిస్టు డాక్టర్ల వైద్య సేవలు అవసరమైతే టెలిమెడిసిన్ ద్వారా హబ్‌లోని వైద్యులను సంప్రదిస్తారు. హబ్ నుంచి వైద్యులు ఆడియో, వీడియో కాల్ రూపంలో రోగులతో మాట్లాడి తగిన ఎలాంటి మందులు వాడాలో సూచిస్తారు. ఆ మందులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ క్లినిక్స్‌లోని వైద్య సిబ్బంది రోగులకు అందజేస్తున్నారు. స్మార్ట్ ఫోన్ ఉన్నవారు ఈ–సంజీవని (ఓపీడీ) యాప్‌తో ఇంటి నుంచే వైద్య సేవలను పొందవచ్చు. స్మార్ట్ ఫోన్ లేని వారితో పాటు వాటిని వినియోగించలేని వారి కోసం ఇంటి వద్దే ఈ–సంజీవని ఓపీ డిపార్ట్‌మెంట్ సేవలు అందించేందుకు ప్రభుత్వం 42 వేల మంది ఆశా వర్కర్లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేసింది. వీటిని హబ్‌లకు అనుసంధానించారు. దీంతో మారుమూల ప్రాంతాల్లోని వారు కూడా టెలిమెడిసిన్ ద్వారా స్పెషలిస్టు డాక్టర్ల వైద్య సేవలను పొందగలుగుతున్నారు. ఏపీలో పెద్ద ఎత్తున అందిస్తున్న టెలిమెడిసిన్ సేవలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున అవగాహన కల్పించడంతో అత్యధికంగా వృద్ధులు, మహిళలకు టెలి మెడిసిన్ సేవలు అందుతున్నట్లు వైద్యారోగ్య శాఖ తెలిపింది.

ఇక గుడి భూములకు పక్కా లెక్క!

- రాష్ట్రంలోని అన్ని ఆలయాల వివరాలన్నీ కంప్యూటరీకరణ
- సర్వే నంబర్ల వారీగా అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు
- ఇప్పటివరకు ఆలయాల రికార్డుల్లోనే భూముల వివరాలు
- కంప్యూటరీకరణతో ఈ భూములపై మరింత పారదర్శకత
- వీటిలో మార్పులు చేసే అవకాశం లేకుండా పటిష్ట ఏర్పాట్లు



సాక్షి, అమరావతి: రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల భూములన్నింటి వివరాలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో కంప్యూటరీకరణ చేస్తోంది. ఆలయం వారీగా ఏ గ్రామంలో, ఏ సర్వే నంబరులో, ఎంతెంత భూమి ఉంది, తదితర వివరాలను పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తోంది. దీని ద్వారా అన్ని ఆలయాల వివరాలు ఒకే చోట అందుబాటులోకి వస్తాయి. దేవదాయ శాఖ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 24,669 వరకు ఆలయాలు, సత్రాలు, మఠాలు, ట్రస్టులు ఉన్నాయి. వీటి భూముల వివరాలు ఆలయం లేదా సంస్థల వద్ద '43 నెంబరు' రిజిస్టర్ పేరుతో ఉండే ప్రత్యేక రికార్డుల్లో మాత్రమే ఉండేవి. ఇటీవల కొన్ని చోట్ల రికార్డుల్లో భూముల వివరాలను ఉండే పేజీలను ప్రత్యేకంగా స్కాన్ చేసి, వాటిని మాత్రం ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. దేవదాయ శాఖ కమిషనర్ సహా అధికారులకు ఏదైనా సమాచారం కావాలంటే జిల్లా లేదా ఆలయాల ఈవో నుంచి తెప్పించుకోవాల్సి వచ్చేది. దీనివల్ల ఏళ్ల తరబడి ఆలస్యం కావడంతోపాటు పారదర్శకత లోపించి, పలు చోట్ల ఆలయాల భూములు పెద్ద ఎత్తున ఆక్రమణలకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దేవుడి భూముల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా, శాఖలోని కీలక అధికారులకు ఆలయాల వారీగా భూముల వివరాలన్నీ ఒకే చోట అందుబాటులో ఉండేలా కంప్యూటరీకరణకు చర్యలు చేపట్టింది. గత నెల రోజులుగా ఈవో స్థాయిలో ఆలయాల భూముల వివరాలు ప్రత్యేక ఫార్మాట్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మాగాణి లేదా మెట్ట లేదా కొండ ప్రాంతం లేదా ఖాళీ స్థలం లేదా చెరువు తదితర కేటగిరీతో సర్వే నంబర్ల వారీగా భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ ప్రక్రియ పూర్తి కావడంతో ఈవో స్థాయిలో నమోదు కార్యక్రమాన్ని నిలిపివేశారు. వీటిలో మార్పులు చేసే అధికారం ఇకపై ఈవోలకు ఉండదు. ఇంకా ఎక్కడన్నా ఏ ఆలయం వివరాలు ఏవైనా మిగిలిపోతే వాటిని నమోదు చేసే అవకాశం దేవదాయ శాఖ జిల్లా అధికారులకు మాత్రమే కల్పించారు. ఈ ప్రక్రియను కూడా ముగించి.. ఆగస్టు మొదటి వారంలో రికార్డులను సరిపోల్చుకునే ప్రక్రియ చేపడతారు. వారం రోజుల్లో దీనిని పూర్తి చేస్తారు. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాల్లో మార్పులకు వీలు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తామని అధికారులు తెలిపారు. భవిష్యత్‌లో ఆలయాల భూముల వివరాల్లో మార్పులు చేయాలంటే జిల్లా అధికారులు, ఈవోలు ముందుగా దేవదాయ శాఖ కమిషనర్‌కు స్పష్టమైన కారణాలను తెలియజేసి, ఆయన అనుమతి పొందాల్సి ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి.

సూర్యుడిపై అధ్యయనానికి ఆదిత్య–ఎల్1

ఆగస్టులో పీఎస్‌ఎల్‌వీ సీ57 ద్వారా ప్రయోగానికి ఇస్రో సన్నాహం



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సౌరగోళంపై అధ్యయనం కోసం ఇస్రో పీఎస్‌ఎల్‌వీ సీ57 రాకెట్ ద్వారా 1,475 కిలోల బరువు కలిగిన ఆదిత్య–ఎల్1 ఉపగ్రహాన్ని ఆగస్టు మూడో వారంలో ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తోంది. సౌర తుపాను సమయంలో వెలువడే రేణువుల వల్ల భూమిపై సమాచార వ్యవస్థకు అవరోధాలు ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. దీంతోపాటు ఫోటోస్పియర్, క్రోమోస్పియర్‌లపై అధ్యయనం చేసి సమాచారాన్ని సేకరించేందుకు ఈ ప్రయోగాన్ని నిర్వహించబోతున్నారు. బెంగళూరులోని ప్రొఫెసర్ యూఆర్ రావు స్పేస్ సెంటర్‌లో ఈ ఉపగ్రహాన్ని రూపొందించారు. ఆస్ట్రోశాట్‌తో పాటు చంద్రయాన్–1, చంద్రయాన్–2 మిషన్లలో పాల్గొన్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.శంకర సుబ్రమణియన్ ఆధ్వర్యంలో ఆదిత్య–ఎల్1 ఉపగ్రహానికి రూపకల్పన చేశారు. 1,475 కేజీల బరువు కలిగిన ఆదిత్య–ఎల్1లో ఉండే ఆరు పేలోడ్స్ బరువు 244 కేజీలే. మిగిలిన 1,231 కేజీలు ద్రవ ఇంధనంతో నింపి ఉంటాయి. ఉపగ్రహాన్ని సూర్యునివైపు తీసుకెళ్లేందుకు ద్రవ ఇంధనం ఎక్కువ అవసరం. మొదట ఉపగ్రహాన్ని జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టిన తర్వాత.. భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని లాగ్రేంజ్ బిందువు–1లోకి చేరవేయడానికి 177 రోజులు పడుతుంది. అక్కడి నుంచి ఎలాంటి అవరోధాలు, అడ్డంకులు లేకుండా సూర్యుడిని నిరంతరం పరిశోధించేందుకు వీలవుతుందని శాస్త్రవేత్తలు అంచనాలు వేస్తున్నారు. ఆదిత్య–ఎల్1లో యాస్‌పెక్స్, సూట్, వెల్క్, హెలియోస్, పాపా, సోలెక్స్ అనే ఆరు పేలోడ్స్ అమర్చి పంపిస్తున్నారు. సూర్యుడి వెలుపలి వలయాన్ని కరోనా అంటారు. సూర్యగోళానికి వేల కిలోమీటర్ల దూరం వరకు ఇది విస్తరించి ఉంటుంది. అక్కడ ఉష్ణోగ్రత దాదాపు పది లక్షల డిగ్రీల కెల్విన్ వరకు.. సూర్యుడి అంతర్భాగ ఉష్ణోగ్రత ఆరు వేల కెల్విన్ డిగ్రీల వరకు ఉంటుంది. కరోనాలో వేడి పెరిగిపోతుండడానికి గల కారణం అంతు చిక్కడం లేదు. ఈ అంశంపై కూడా ఆదిత్య–ఎల్1 పరిశోధనలు చేయనుంది.

ఉపగ్రహానికి నామకరణం వెనుక..

సూర్యుడికి ఉన్న మరో పేరే ఆదిత్య. ఈ ఉపగ్రహాన్ని 'లాగ్రేంజ్' అనే బిందువు వద్ద ప్రవేశపెడుతున్నందున ఎల్ అని.. సూర్యుడిపై అధ్యయనం చేసే మొదటి ఉపగ్రహమైనందున '1' అని పెట్టారు. మొత్తంగా దీని పూర్తి పేరు ఆదిత్య–ఎల్1 అని ఖరారు చేశారు.

జీఐఎస్ ఒప్పందాల్లో మరో 36 కార్యరూపంలోకి తేవాలి

- డిసెంబర్ నెలాఖరులోగా వాటికి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు జరగాలి
- పరిశ్రమల శాఖ అధికారులకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: విశాఖ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు (జీఐఎస్)లో పరిశ్రమల శాఖకు చేసుకొన్న అవగాహన ఒప్పందాల్లో మరో 36 ప్రాజెక్టులను కార్యరూపంలోకి తేవాలని, వాటికి డిసెంబరు నెలాఖరులోగా శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా. కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) ఆమోదించిన ప్రాజెక్టులు, జీఐఎస్‌లో ఒప్పందాలు చేసుకొన్న ప్రాజెక్టులు, పరిశ్రమలకు భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం తదితర అంశాలపై సీఎస్ సమీక్షించారు. జీఐఎస్‌లో పరిశ్రమల శాఖకు సంబంధించి రూ. 3.41 లక్షల కోట్ల పెట్టుబడులతో 2.38 లక్షల మందికి ఉపాధి కల్పించే 107 ఒప్పందాలు జరగ్గా, ఇప్పటికే కొన్ని పరిశ్రమలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారని చెప్పారు. డిసెంబర్ నెలాఖరులోగా మరో 36 ప్రాజెక్టులు సిద్ధం చేయాలని ఆదేశించారు. జీఐఎస్ ఒప్పందాలన్నీ త్వరితగతిన కార్యరూపం దాల్చాలని, ఎస్ఐపీబీ ఆమోదం పొందిన ప్రాజెక్టులన్నీ వేగంగా ఏర్పాటవ్వాలని స్పష్టం చేశారు. వీటి ప్రగతిపై ప్రతి 15 రోజులకు నివేదిక సమర్పించాలని పరిశ్రమల శాఖ కమిషనర్ ప్రవీణ్ కుమార్‌ను ఆదేశించారు. వీటిపై నెలకు ఒకసారి సమీక్షిస్తానని చెప్పారు. అంతకు ముందు రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల పురోగతి, జీఐఎస్‌లో ఒప్పందాలు చేసుకొన్న కంపెనీల ఏర్పాటుపై ప్రవీణ్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ రామలింగేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతం చేయండి

పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంపై కూడా పరిశ్రమలు, ఏపీఐఐసీ తదితర విభాగాల అధికారులతో సీఎస్ సమీక్షించారు. రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టు పనులను వేగవంతం చేయాలని, గడువులోగా నిర్మాణం పూర్తి చేయాలన్నారు. జువ్వలదిన్నె, నిజాంపేట, ఉప్పాడ, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ల మొదటి దశ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్, ఏపీఐఐసీ వీసీ అండ్ ఎండీ ప్రవీణ్ కుమార్ పవర్, ఏపీ మారిటైమ్ బోర్డు డిప్యూటీ సీఈవో రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

- పీఎంఈజీపీ రుణాలతో భారీగా యూనిట్ల ఏర్పాటు
- పీఎంఈజీపీపై అవగాహన పెంచాలని కలెక్టర్లకు సీఎస్ ఆదేశం

సాక్షి, అమరావతి: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది. ఇందుకోసం ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం(పీఎంఈజీపీ)ను వినియోగించుకుంటోంది. ఈ పథకం ద్వారా కొత్త తయారీ యూనిట్లకు గరిష్టంగా రూ.25 లక్షలు, సర్వీస్ ఓరియంట్ వ్యాపారాన్ని మొదలు పెట్టిన వారికి రూ.10 లక్షల వరకు ఆర్థిక సాయాన్ని కేంద్రం అందజేస్తోంది. ప్రాజెక్టు వ్యయంలో మిగిలిన మొత్తాన్ని వర్కింగ్ క్యాపిటల్ రుణంగా మంజూరు చేస్తోంది. నాలుగు సంవత్సరాల కిందట ఈ పథకం కింద రాష్ట్రంలో ఏడాదికి ఐదు వేల దరఖాస్తులు వస్తే.. ఇప్పుడు ఆ సంఖ్య 11 వేలు దాటిందని, అదే సమయంలో రుణాల మంజూరు కూడా భారీగా పెరిగిందని ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపాలకృష్ణ 'సాక్షి'కి వివరించారు. గత నాలుగేళ్లలో ఈ పథకం ద్వారా 8,645 మంది రుణం తీసుకొని కొత్తగా యూనిట్లు నెలకొల్పారని ఆయన చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 3,232 దరఖాస్తులను బ్యాంకులకు పంపించగా.. 1,616 యూనిట్లకు రూ.49.96 కోట్ల రుణాన్ని మంజూరు చేశాయని పేర్కొన్నారు. అత్యధిక మందికి ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈ రంగాన్ని మరింతగా ప్రోత్సహించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పీఎంఈజీపీపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు డీఆర్‌డీఏ, మెప్మా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాలు, ఎంపీడీవోల సహాయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.


నా వాంగ్మూలాన్ని మార్చేశారు

- సీబీఐ పేర్కొన్నదంతా అవాస్తవం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఏపీ ప్రభుత్వ సలహాదారు అజేయ కల్లం

సాక్షి, హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో చార్జిషీట్ దాఖలు చేసిన సీబీఐ.. అందులో అవాస్తవాలను పొందు పరిచిందని, తన తన వాంగ్మూలాన్ని ఇష్టానుసారం మార్చిందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం వెల్లడించారు. తాను వాంగ్మూలం ఇవ్వలేదని చెప్పకపోయినా.. చెప్పినట్లు ఓ పత్రిక అసత్యాలను ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. సీబీఐని వెనుక ఎవరో ఉండి నడిపిస్తున్నారని, అందుకే కొందరిని ఈ కేసులో ఇరికించడం కోసం ప్రయత్నిస్తున్నారని చెప్పారు. 2019 మార్చి 15న వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో కమిటీ సమావేశం జరుగుతుండగా, ఉదయం 6.30 గంటల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివేకా మరణ వార్త తెలిసిందన్నారు. ఈ విషయమై తన వాంగ్మూలం రికార్డు చేసిన తర్వాత ఓ పత్రికలో తప్పుడు కథనం వచ్చిందని, నిజాలు ప్రజలకు తెలియజేయడం కోసం అప్పట్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, వాస్తవాలు వెల్లడించానన్నారు. తన వాంగ్మూలాన్ని తప్పుగా రికార్డు చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొంటూ, దాన్ని తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ప్రస్తుతం హైకోర్టును కూడా ఆశ్రయించానని తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం ఆయన 'సాక్షి' ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

పిటిషన్‌లో ఏముందంటే..

'2023 ఏప్రిల్ 29న సీబీఐ నా నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. నేను చెప్పింది ఒకటైతే సీబీఐ దాన్ని మార్చి చార్జిషీటులో మరోలా పేర్కొంది. వివక్ష లేకుండా, పక్షపాతం లేకుండా విచారణ సాగాలన్న ఉద్దేశంతో కోర్టు దృష్టికి తెస్తున్నాను. 2019 మార్చి 15న జగన్ నివాసంలో సుమారు ఉదయం 5 గంటల ప్రాంతంలో మేనిఫెస్టోపై సమావేశం ప్రారంభమైంది. గంటన్నర తర్వాత అటెండర్ వచ్చి డోరు కొట్టారు. ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి బయటకు వెళ్లి, తిరిగి వచ్చి జగన్ చెవిలో ఏదో చెప్పారు. వెంటనే జగన్ షాక్‌కు గురైనట్టుగా లేచి చిన్నాన్న చనిపోయారని చెప్పారు. ఇంతకు మించి నేనేమీ సీబీఐకి చెప్పలేదు. జగన్ గారి భార్య ప్రస్తావనకాని, మరే ఇతర ప్రస్తావన కాని చేయలేదు. అయితే దురదృష్టవశాత్తు సీబీఐ చార్జిషీటులో వీటిని మార్చివేసింది. చార్జిషీటులో సీబీఐ పేర్కొన్న స్టేట్‌మెంట్‌లో అబద్ధాలే ఉన్నాయి. దర్యాప్తును తప్పుదోవపట్టించే ధోరణి ఇందులో కనిపిస్తోంది. కొంత మంది వ్యక్తులను ఇరికించే ప్రయత్నాల్లో భాగంగానే సీబీఐ ఇలా చేస్తోంది. నా విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని చార్జిషీటులో నా స్టేట్‌మెంట్‌గా పేర్కొన్న అంశాలను కొట్టేయాలి' అని అజేయ కల్లం పేర్కొన్నారు. కాగా, 'నా వాంగ్మూలాన్ని తప్పుగా రికార్డు చేశారు' అనే శీర్షికన శనివారం సాక్షిలో ప్రచురితమైన వార్త అనువాదంలో పొరపాటు వల్ల 'సమావేశం ప్రారంభమైన అరగంటకు' అని ప్రచురితమైంది. 'సమావేశం ప్రారంభమైన గంటన్నర తర్వాత' అని ఉండాలి.



9. In contrast to the above, I had clearly stated to the officer who examined me on 29-04-2023 that the meeting for preparation of manifesto of YSRCP commenced in the house of Sri Jagan Mohan Reddy at around 5 AM on 15-03-2019 and after one and half hour thereafter, an attendant knocked the door of the meeting hall and the OSD to Sri Jagan Mohan Reddy went to attend to the knock and came back in to the room and whispered something to Sri Jagan Mohan Reddy who immediately got up expressing his shock and surprise and said that his chinanna had died. Further, I had not stated anything about Sri Jagan Mohan Reddy being called for by his spouse and I submit that, unfortunately, what I had stated was not accurately recorded by the CBI and the version as recorded by the CBI is entirely false and it has the tendency to prejudice the investigation and falsely implicate several individuals.

వైఎస్ జగన్‌తో సమావేశం ప్రారంభమైన గంటన్నర తర్వాత వివేకా మృతి విషయం తెలిసిందని పిటిషన్‌లో పేర్కొన్న అజేయ కల్లం

నాకు కనీసం చూపించలేదు..

2023 ఏప్రిల్ 29న వికాస్ సింగ్ తొలుత నాకు మెసేజ్ పంపారు. ఆ తర్వాత కాల్ చేశారు. మిస్డ్ కాల్ పడటంతో నేను తిరిగి కాల్ చేశా. సీబీఐ ఎస్పీ వికాస్‌సింగ్‌గా తనను తాను పరిచయం చేసుకుని.. కలవాలని అడిగారు. నేను రమ్మన్నాను. ఆయన వచ్చాక 20 నిమిషాలు మాట్లాడారు. తర్వాత వైఎస్ వివేకా హత్య కేసులో మీ వాంగ్మూలాన్ని రికార్డు చేసుకుంటామని అడిగారు. నేను అభ్యంతరం లేదని చెప్పాను. సీఆర్‌పీసీ 161 కింద నా వాంగ్మూలం తీసుకున్న తర్వాత.. దాన్ని నాకు చూపించలేదు. కనీసం చదివి వినిపించలేదు. ఆశ్చర్యపోయే విషయం ఏమిటంటే.. నా వాంగ్మూలంపై వికాస్ సింగ్ సంతకం కాకుండా ముఖేశ్ శర్మ అనే వ్యక్తి సంతకం ఉంది. అతనెవరో కూడా నాకు తెలియదు.

నేను చెప్పింది ఇదీ..

2019 మార్చి 15న ఉదయం 5 గంటలకు సమావేశం ప్రారంభమైంది. గంటన్నర తర్వాత (ఉదయం 6.30)ఎవరో డోర్ కొట్టారు. జగన్‌మోహన్‌రెడ్డి ఓఎస్డీ (కృష్ణమోహన్‌రెడ్డి) బయటికి వెళ్లారు. కాసేపటి తర్వాత వచ్చి జగన్ చెవిలో ఏదో చెప్పారు. తీవ్ర దిగ్భ్రాంతికి గురైన ఆయన.. 'చిన్నాన్న చనిపోయారు' అని చెప్పారు. ఆయన ఘటనా స్థలానికి వెళ్లాల్సి ఉండటంతో మేం సమావేశాన్ని అక్కడితో ఆపేసి బయటికి వచ్చాం.

ఆ పత్రిక రాసిందంతా అవాస్తవం

వైఎస్ వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయారని జగన్ చెప్పినట్లు నేను వెల్లడించానని ఓ పత్రిక రాసింది. అది వాస్తవం కాదు. ఆ పత్రికలో వచ్చిన తప్పుడు వార్తలపై వివరణ ఇచ్చేందుకే విలేకరుల సమావేశం పెట్టి నిజాలు వెల్లడించా. అలాగే ఆ పత్రికలో వచ్చింది తప్పు అని ఖండించాలని సీబీఐని కోరా. అసలు చార్జిషీట్ వేయకముందే సీబీఐకి నేను ఏం చెప్పాను అన్నది ఆ పత్రికకు ఎలా వచ్చింది? ఎలా ప్రచురించింది? అంటే దీని వెనుక సీబీఐని ఎవరో నడిపిస్తున్నారని తెలుస్తోంది. పైగా సమాచారాన్ని ఇష్టం వచ్చినట్లు మార్చి ప్రచురించింది.

నేను వాంగ్మూలం ఇవ్వలేదని ఎప్పుడూ చెప్పలేదు..

నేను వాంగ్మూలం ఇవ్వలేదని ఎక్కడా చెప్పలేదు. ప్రెస్‌మీట్‌లో కూడా ఇచ్చాననే చెప్పా. ఒకవేళ నేను ఇవ్వను అంటే సీబీఐ అధికారులు చేసేదేమీ లేదు కదా అని మాత్రమే పేర్కొన్నా. నేను గతంలో ఇవ్వలేదని చెప్పానని.. ఇప్పుడు నా వాంగ్మూలం మార్చారని పిటిషన్ వేశానని ఓ చానల్ ప్రచారం చేయడం అసంబద్ధం. సత్యదూరం. ఊహాజనిత వార్తలతో తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారు. కావాలంటే నా ప్రెస్‌మీట్‌ను చూడొచ్చు.

ఇలాగైతే దర్యాప్తు సంస్థలపై నమ్మకం పోతుంది

ఈ నెల మొదటి వారంలో సీబీఐ చార్జీషీట్ కోర్టుకు అందజేసింది. ఆ తర్వాత ఒకట్రెండు పత్రికల్లో నా వాంగ్మూలం ప్రచురితమైంది. అది చూసి నేను షాక్‌కు గురయ్యా. నేను చెప్పిన దానికి.. సీబీఐ చార్జిషీట్‌లో పొందుపరిచిన దానికి చాలా వ్యత్యాసం ఉంది. అలా ఎందుకు వక్రీకరించారో అర్థం కావడం లేదు. నేను ఎక్కడా వైఎస్ జగన్ భార్య పేరును ప్రస్తావించలేదు. అయినా వారు చార్జీషీట్‌లోని వాంగ్మూలంలో ఆమె పేరు చేర్చారు. దీని వెనుక రాజకీయ కుట్ర ఉండవచ్చు. ఒక ఐఏఎస్ అధికారినైన నా వాంగ్మూలంలోనే ఇంత వ్యత్యాసం ఉంటే ఇక సామాన్యుల నుంచి తీసుకున్న వాటిలో ఎన్ని మార్పులు చేశారో చూడాల్సిన అవసరం ఉంది. కేంద్ర దర్యాప్తు సంస్థ వెనుక ఎవరో ఉండి ఇదంతా చేయిస్తున్నారని తెలుస్తోంది. ఇలాంటి చర్యలతో దర్యాప్తు సంస్థలపై ప్రజలకు నమ్మకం పోతుంది.

అందుకే కోర్టును ఆశ్రయించా

నేను చెప్పనిది.. చెప్పినట్లు రాసిన తర్వాత కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. చట్ట ప్రకారం 161 స్టేట్‌మెంట్ సాక్ష్యంగా చెల్లదు. అయినా నా వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశా. చార్జిషీట్‌లో నుంచి తప్పుడు వాంగ్మూలాన్ని తొలగించి.. అవసరం అనుకుంటే సహజ న్యాయ సూత్రాల మేరకు నోటీసులు జారీ చేసి మళ్లీ తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరా.

క్లుప్తంగా...

జగనన్న కాలనీలపై దుష్ప్రచారం

1,035వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: పేదల దేవాలయాలుగా నిర్మితమవుతున్న జగనన్న కాలనీలపై ఎల్లో మీడియాతో కలిసి బాబు అండ్ కో దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం 1,035వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ భారీ వర్షాలకు హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, అమెరికా వంటి మహా నగరాలే మునుగుతున్నాయని, కానీ కేవలం జగనన్న కాలనీలనే బాబు అండ్ కో టార్గెట్ చేయడంలో ఆంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. బాబు నిర్మిస్తానని చెప్పిన ప్రపంచస్థాయి అమరావతి రాజధాని మునకపై ముందు స్పందించాలన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, బేతపూడి సాంబయ్య, పులి దాసు, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి పాల్గొన్నారు.

1 నుంచి చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన

అచ్చెన్నాయుడు వెల్లడి

సాక్షి, అమరావతి: ఆగస్టు ఒకటి నుంచి పదో తేదీ వరకు ప్రతిపక్ష నేత చంద్రబాబు రాష్ట్రంలోని ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమం నిర్వహిస్తారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చెప్పారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రాజెక్టుల దుస్థితిని తెలియజేసి, ప్రజలను చైతన్యపరచడానికి చంద్రబాబు ఈ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. పెన్నా నుంచి వంశధార వరకు రాష్ట్రంలోని అన్ని నదులపై ఉన్న ప్రాజెక్టులను పరిశీలిస్తారని చెప్పారు. ఒకటో తేదీన ఉమ్మడి కర్నూలు జిల్లా నందికొట్కూరు నియోజకవర్గంలోని ముచ్చుమర్రి ప్రాజెక్ట్ వద్దకు వెళతారని తెలిపారు. చివరిగా ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాజెక్టుల వద్దకు వెళతారని తెలిపారు. ప్రాజెక్టుల వద్దే రైతులతో కలిసి బస చేస్తారని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులపై చంద్రబాబు చెప్పిన వాటిపై స్పందించకుండా జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు బుద్ధి లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు.

స్టీల్‌ప్లాంట్ ఎక్కడికీ పోదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



గాజువాక: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంపై బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి పాత వ్యాఖ్యలనే ఉద్ఘాటించారు. స్టీల్‌ప్లాంట్ ఎక్కడికీ పోదని పేర్కొన్నారు. గాజువాకలో నిర్వహించిన బీజేపీ బూత్ అధ్యక్షులు, శక్తికేంద్ర ప్రముఖుల సమావేశం అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటీకరణ నుంచి స్టీల్‌ప్లాంట్‌కు రక్షణ కల్పిస్తారా అని విలేకరులు ప్రశ్నించగా.. ఆమె సమాధానం దాటవేస్తూ ఈ విధంగా స్పందించారు. ప్లాంట్‌కు సంబంధించి మిగతా విషయాలు తమ అగ్రనాయకత్వంతో మాట్లాడుతున్నామని చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో అదానీ గంగవరం పోర్టు వైఖరిపై ప్రశ్నించగా, ఈ విషయంపై తనకు ఇప్పుడే వినతిపత్రం వచ్చిందని, చదివి విషయాలు తెలుసుకోవాల్సి ఉందన్నారు. బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రాత్రివేళ లోకేశ్ యాత్ర

సాక్షి ప్రతినిధి, బాపట్ల: నారా లోకేశ్ యువగళం పాదయాత్ర శనివారం అద్దంకి నియోజకవర్గంలో పొద్దుపోయాక సాగింది. సాయంత్రం 5 గంటల సమయంలో ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గంలోని గుళ్లాపల్లి వద్ద నుంచి లోకేశ్ యాత్రను ప్రారంభించగా ఆరు గంటల సమయంలో తిమ్మనపాలెం వద్ద బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలోకి ప్రవేశించారు. ఆ తరువాత మేదరమెట్ల, బొడ్డువానిపాలెం వరకూ యాత్ర సాగింది. రాత్రి 10 గంటల ప్రాంతంలో లోకేశ్ యాత్రను ముగించి విడిది శిబిరానికి చేరారు. లోకేశ్ యువగళం యాత్ర రాత్రి పూట సాగడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

ఆదివాసీలను దెబ్బతీసేందుకు బీజేపీ కుట్ర

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: దేశంలో ఆదివాసీలను దెబ్బ తీసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఆయన ఓ ప్రకటనలో ఆరోపించారు. అడవులపై ఆదివాసీలకు హక్కు లేకుండా చేసి అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు అటవీ సంరక్షణ చట్టానికి సవరణ చేస్తోందని విమర్శించారు. పాడేరు వైద్య కళాశాలలో 75 సీట్లు ఆదివాసీలకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీలో జగనన్న ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని, గిరిజనులకు అన్ని సంక్షేమ పథకాలు అందించాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాం నుంచి జరుగుతున్న రేషన్ బియ్యం మాఫియాపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

వలంటీర్లే 'రక్షణ' కవచాలు

గోదావరి ఏటిగట్లపై 740 మంది రేయింబవళ్లు కాపలా

- అర కిలోమీటరుకు ఒకరు చొప్పున నియామకం
- ఎప్పటికప్పుడు పైఅధికారులకు సమాచారం



పి.గన్నవరం మండలం గంటిపెదపూడి వద్ద విధులలో ఉన్న వలంటీర్ కాండ్రేగుల వీర నారాయణ



తాతపూడి ఏటిగట్టు వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న వలంటీర్లు స్వాతికుమారి, కనకలక్ష్మి

సాక్షి అమలాపురం: తమ వ్యవస్థపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు సేవలతోనే వలంటీర్లు బదులిస్తున్నారు. ప్రమాదకరంగా ప్రవహిస్తున్న గోదావరి ఏటిగట్లు తెంచుకుని ఊళ్లపై పడిపోకుండా తీసుకునే రక్షణ చర్యల్లో వారు కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఏటిగట్లను రేయింబవళ్లు పర్యవేక్షిస్తూ ప్రజల ప్రాణాలకు రక్షణ కవచంగా నిలుస్తున్నారు. గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తున్నపుడు ఏటిగట్ల రక్షణ చాలా ముఖ్యం. ఆ ఏటిగట్లకు గండ్లు పడి ప్రాణ, ఆస్తి నష్టాలు భారీగా సంభవించిన సందర్భాలు గోదావరి జిల్లాల్లో గతంలో ఎన్నో ఉన్నాయి. వరదల సమయంలో ఉమ్మడి గోదావరి జిల్లాల్లో 534.73 కి.మీల పొడవునా ఉన్న ఏటిగట్ల పరిరక్షణ గతంలో ప్రభుత్వ యంత్రాంగానికి తలకుమించిన భారంగా ఉండేది. తక్కువ మంది సిబ్బంది ఉండటంతో ఇంత పొడవున ఏటిగట్లను పర్యవేక్షించడం సాధ్యం అయ్యేది కాదు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వందలాది మంది వలంటీర్లు ఏటిగట్లను పర్యవేక్షిస్తూ పైఅధికారులకు నిరంతరం సమాచారం అందిస్తున్నారు.

సమాచారం తక్షణం చేరవేత

గత ఏడాది భారీ వరదలకు రాజోలులోని నున్నవారిబాడవ వద్ద గట్టు దాటి నీరు ప్రవహిస్తున్న విషయాన్ని తొలిసారిగా గుర్తించింది వలంటీర్లే. వారిచ్చిన సమాచారంతో అధికారులు వేగంగా రక్షణ చర్యలు చేపట్టడం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది. ఈ అనుభవాల దృష్ట్యా ఈ ఏడాది కూడా ఏటిగట్ల పర్యవేక్షణ బాధ్యతలను 740 మంది వలంటీర్లకు అప్పగించారు. ప్రతి అర కిలో మీటర్‌కు ఒక వలంటీర్‌ను నియమించారు. వీరు ఏటిగట్ల వద్ద రేయింబవళ్లు కాపలాగా ఉంటూ వరద ఉద్ధృతి, గట్ల పటిష్టతకు సంబంధించిన సమాచారాన్ని నిరంతరం పైఅధికారులకు అందిస్తున్నారు.

ముంపు గ్రామాల్లో సేవలు

ఏటిగట్ల పర్యవేక్షణ ఒక్కటే కాకుండా వరద ముంపుబారిన పడిన లంక గ్రామాల్లో వలంటీర్లు పలు రకాల సేవలందిస్తున్నారు. ముంపు బాధితులను గుర్తించి, బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించడంలో సహాయపడుతున్నారు. వారికి భోజన సదుపాయల కల్పన, నిత్యావసర వస్తువుల పంపిణీ విషయంలో చొరవ చూపుతున్నారు. పి.గన్నవరం, మామిడికుదురు, ముమ్మిడివరం, అయినవిల్లి వంటి వరద ప్రభావం అధికంగా ఉన్న మండలాల్లోని లంక గ్రామాల్లో వీరు చురుగ్గా సేవలందిస్తున్నారు. కష్టసమయంలో ఆసరాగా నిలబడి ప్రజల మన్ననలు పొందుతున్నారు.

నిరంతరం అప్రమత్తంగా..



గోదావరి ఏటిగట్ల వద్ద వలంటీర్లు నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నారు. ఎప్పటికప్పుడు వారి పరిధిలోని ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తున్నారు. గతేడాది వారిచ్చిన సమాచారంతో పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టారు. ఈ ఏడాది కూడా వారు పర్యవేక్షణ పనిలో నిమగ్నమయ్యారు.

– పువ్వాడ విజయ్ థామస్, డీడీవో, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

నాడు తక్కువగా సిబ్బంది

గతంలో గోదావరి వరద సమయంలో ధవళేశ్వరం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన తరువాత ఇరిగేషన్ అధికారులకు రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు సహాయంగా ఉండేవారు. ఒక హెడ్ వర్క్స్ ఏఈ తన పరిధిలో సుమారు 10 నుంచి 15 కి.మీ.ల పొడవున ఏటిగట్టు బాధ్యత చూసేవారు. వీరికి లష్కర్లు సహాయం అందించేవారు. ఇరిగేషన్ శాఖలో కొన్నేళ్లుగా లష్కర్ల కొరత ఉంది. అప్పట్లో ఏటిగట్లకు కన్నాలు పడినా, కుంగిపోయినా, గండ్లు పడే అత్యవసర సమయాల్లో సమాచారం ఉన్నతాధికారులకు చేరడంలో ఆలస్యమయ్యేది. ఈ కారణంగానే 2006 గోదావరి వరదలకు అయినవిల్లి మండలం శానపల్లిలంక, పి.గన్నవరం మండలం మొండెపులంక వద్ద ఏటిగట్లకు గండ్లు పడి స్థానికులు పెద్దఎత్తున నష్టాలను చవిచూడాల్సి వచ్చింది.

సగటుకు చేరువగా వర్షపాతం


మొదట్లో తక్కువైనా తర్వాత పుంజుకున్న వర్షాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్ మొదట్లో వర్షాభావ పరిస్థితులతో రైతులు నిరుత్సాహపడ్డారు. అయితే ఆ తర్వాత నెమ్మదిగా వర్షాలు పుంజుకోవడంతో వారిలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. జూన్ నెలలో వర్షాభావం ఉన్నా జూలై మూడు, నాలుగు వారాల్లో రాష్ట్రమంతా విస్తారంగా వర్షాలు కురిశాయి. బంగాళాఖాతంలో ఒకదాని తర్వాత ఒకటి రెండు అల్పపీడనాలు ఏర్పడడంతో జోరుగా వర్షాలు పడ్డాయి. కోస్తా అంతటా కుండపోత వర్షాలు కురిశాయి. రాయలసీమలోనూ చెప్పుకోదగ్గ వర్షాలే పడ్డాయి. మొత్తం ఈ సీజన్‌లో ఇప్పటివరకు సాధారణ వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో సాధారణంగా ఈ సీజన్‌లో 248.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదవ్వాల్సివుండగా 240 మిల్లీమీటర్లు నమోదైంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కృష్ణా, గుంటూరు, బాపట్ల.. ఈ ఆరు జిల్లాల్లో సాధారణంగా కంటే అధికంగా వర్షాలు పడ్డాయి. కృష్ణా జిల్లాలో 61 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. ఇక పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, చిత్తూరు.. ఈ 13 జిల్లాల్లో సాధారణంగానే వర్షం పడింది. ఇక అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, పొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో మాత్రం లోటు వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో ఇంకా రెండు నెలలు ఉండటంతో వర్షాలు ఆశాజనకంగా ఉంటాయని వాతావరణ శాఖ తెలిపింది.

తగ్గుతున్న వరద

ఎగువన గోదావరి, కృష్ణాల్లో ప్రవాహం తగ్గుముఖం

- గోదావరి నదిపై ఉన్న శ్రీరామ్‌సాగర్ గేట్లు మూసివేత
- ఎల్లంపల్లి, కాళేశ్వరం వద్ద తగ్గిన వరద ప్రవాహం
- భద్రాచలం, ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న ప్రమాద హెచ్చరికలు
- కృష్ణానదిపై ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల వద్ద తగ్గిన వరద
- శ్రీశైలం ప్రాజెక్టులోకి స్థిరంగా కొనసాగుతున్న ప్రవాహం
- ప్రకాశం బ్యారేజ్ నుంచి 1,06,370 క్యూసెక్కులు కడలిలోకి



రాజమహేంద్రవరం పుష్కరాల రేవు హేవలాక్ బ్రిడ్జ్ వద్ద గోదావరి వరద


సాక్షి, అమరావతి/ధవళేశ్వరం/శ్రీశైలం ప్రాజెక్ట్: పరీవాహక ప్రాంతంలో వర్షాలు ఆగిపోవడంతో గోదావరి, కృష్ణా నదుల్లో వరద ప్రవాహం క్రమేపీ తగ్గుతోంది. మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో వర్షాలు తెరిపి ఇవ్వడంతో ఎగువ గోదావరి వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. తెలంగాణలోని గోదావరి నదిపై ఉన్నశ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లను మూసేశారు. గోదావరి వరద ప్రవాహం ఎల్లంపల్లి, కాళేశ్వరం వద్ద తగ్గింది. ఎగువన వరద తగ్గిన నేపథ్యంలో.. ఆదివారం రాత్రి నుంచి భద్రాచలం, ధవళేశ్వరం బ్యారేజ్‌ల వద్ద వరద ఉధృతి క్రమంగా తగ్గనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రాచలం వద్ద శనివారం సాయంత్రం 6 గంటలకు 15,69,011 క్యూసెక్కులు వస్తుండటంతో అక్కడ నీటి మట్టం 55.6 అడుగులకు చేరుకుంది. దాంతో మూడో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. భద్రాచలం నుంచి వస్తున్న వరదను వచ్చినట్టుగా పోలవరం ప్రాజెక్టు 48 గేట్లను పూర్తిగా ఎత్తేసి అధికారులు దిగువకు వదిలేస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 14,80,862 క్యూసెక్కులు చేరుతుండగా.. గోదావరి డెల్టాకు 7,100 క్యూసెక్కులను వదులుతూ మిగులు జలాలను 175 గేట్ల ద్వారా అధికారులు కడలిలోకి వదిలేస్తున్నారు. బ్యారేజ్‌లో నీటి మట్టం 15 అడుగుల వద్ద స్థిరంగా ఉండటంతో రెండో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు.

శ్రీశైలం ప్రాజెక్టులోకి 1.51 లక్షల క్యూసెక్కులు

పశ్చిమ కనుమల్లో వర్షాలు తగ్గడంతో కృష్ణా, తుంగభద్రలలో వరద తగ్గుముఖం పట్టింది. ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల్లోకి వరద ప్రవాహం తగ్గింది. ఇక తుంగభద్ర డ్యామ్‌లోకి 84,202 క్యూసెక్కులు చేరుతుండగా నీటి నిల్వ 69.23 టీఎంసీలకు చేరుకుంది. మరో 36 టీఎంసీలు చేరితే తుంగభద్ర డ్యామ్ నిండుతుంది. శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. శనివారం సాయంత్రం 6 గంటలకు శ్రీశైలంలోకి ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టు నుంచి 1,48,875, సుంకేశుల నుంచి 2,181 వెరసి 1,51,056 క్యూసెక్కులు చేరుతున్నాయి. దాంతో నీటి నిల్వ 837.9 అడుగుల్లో 58.81 టీఎంసీలకు చేరుకుంది. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 885 అడుగులు. పూర్తి నీటి నిల్వ 215.81 టీఎంసీలు. శ్రీశైలం ప్రాజెక్టు నిండాలంటే ఇంకా 157 టీఎంసీలు అవసరం. తెలంగాణలో వర్షాలు తెరిపి ఇవ్వడంతో మూసీలో వరద ప్రవాహం తగ్గింది. పులిచింతల ప్రాజెక్టులోకి 11,949 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 30.78 టీఎంసీలకు చేరుకుంది. మరో 15 టీఎంసీలు చేరితే పులిచింతల ప్రాజెక్టు పూర్తిగా నిండుతుంది. మున్నేరు, కట్టలేరు, బుడమేరులలో వరద తగ్గుతుండటంతో ప్రకాశం బ్యారేజ్‌లోకి చేరుతున్న ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రకాశం బ్యారేజ్‌లోకి 1,06,370 క్యూసెక్కులు చేరుతుండగా.. అంతే స్థాయిలో వరదను 60 గేట్లు రెండు అడుగులు, పది గేట్లు మూడు అడుగుల మేర ఎత్తి సముద్రంలోకి వదిలేస్తున్నారు.

సంగమేశ్వరుడిని చుట్టేస్తున్న కృష్ణమ్మ

కొత్తపల్లి (నంద్యాల): శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద ప్రవాహం పెరగడంతో కొత్తపల్లి మండలంలోని సప్త నదీ సంగమేశ్వరాలయాన్ని కృష్ణాజలాలు చుట్టేస్తున్నాయి. ఆలయం జలాధివాసానికి చేరువలో ఉంది. ఈ నేపథ్యంలో ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ దంపతులు శనివారం ఆలయంలోని వేపదారు శివలింగానికి కుంకుమార్చన, పుష్పార్చన, నది జలాలతో అభిషేకం, మంగళహారతి వంటి విశేషపూజలు చేశారు. గంటగంటకు నీరు పెరుగుతుండటంతో శనివారం రాత్రి 9 గంటల సమయానికి గర్భాలయంలోకి నీరుచేరుతుందని పురోహితులు తెలిపారు.



సంగమేశ్వరాలయం చుట్టూ కృష్ణా జలాలు

పేదలు ఉన్నత విద్య అభ్యసించడమే సీఎం లక్ష్యం

ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తదితరులు

సాక్షి, అనకాపల్లి: పేదింటి పిల్లలు ఉన్నత విద్య అభ్యసించాలన్నదే సీఎం వైఎస్ జగన్ ఆకాంక్ష అని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. అరబిందో ఫార్మసీ రూ.2 కోట్ల ఆర్థిక సహకారంతో సమకూర్చిన 2,500 సైకిళ్లను అనకాపల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం పంపిణీ చేశారు. అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రితో పాటుగా అరబిందో ఫార్మసీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నిత్యానంద రెడ్డి, అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి హాజరయ్యారు. మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ నాలుగేళ్లలో విద్యావ్యవస్థలో అనేక మార్పులు తెచ్చినట్లు చెప్పారు.

దళిత ద్రోహి లోకేశ్‌ను అరెస్ట్ చేయాలి

దళిత విలేకరిపై దాడి దారుణం: మంత్రి మేరుగు



దళిత నాయకులతో కలిసి నిరసన తెలుపుతున్న మంత్రి మేరుగు నాగార్జున

తిరుపతి సిటీ: దళిత ద్రోహి నారా లోకేశ్‌ను వెంటనే అరెస్ట్ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున డిమాండ్ చేశారు. 'సాక్షి' విలేకరి కరుణాకర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ శనివారం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద అంబేడ్కర్ విగ్రహం ఎదుట దళిత సంఘాల నాయకులు నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నాగార్జున మాట్లాడుతూ వార్తల కవరేజ్ చేస్తున్న దళిత విలేకరిని అతి దారుణంగా లోకేశ్ గూండాలు తిట్టడం, కొట్టడం అమానుషమన్నారు. నాయకులు మల్లారపు మధు, నల్లారి బాబు, వెంకటస్వామి, యలమంచిలి ప్రవీణ్, తళారి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేగంగా సాయం..

▶ మొదటి పేజీ తరువాయి

మొత్తం 26 మండలాల్లోని 211 గ్రామాలపై గోదావరి వరద ముంపు ప్రభావం పడినట్లు నిర్ధారించి, ముందస్తు సహాయక చర్యలు చేపట్టారు. అత్యధికంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 96 గ్రామాలు ప్రభావితమయ్యాయి. ఈ నేపథ్యంలో 10 ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను వరద ప్రభావిత ప్రాంతాల్లో అందుబాటులో ఉంచారు. ఏలూరు జిల్లా వేలేరుపాడు, కుక్కునూరులో రెండు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మామిడికుదురు, అయినవిల్లి, ముమ్మిడివరం, ఐ పోలవరంలో ఒక్కొక్కటి చొప్పున ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో కూనవరం, చింతూరు, పి గన్నవరం, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం, ఏలూరు జిల్లాలోని వేలేరుపాడులో ఒక్కొక్కటి చొప్పున ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచారు. ఆ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. వరద ప్రభావిత ప్రాంతాల పరిస్థితిని తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్టేట్ ఎమర్జెన్సీ సెంటర్ నుంచి నిరంతరం అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఆయా జిల్లాలకు ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు జారీ చేస్తున్నారు.

ఎక్కడికక్కడ పర్యవేక్షణ

- వరద తాకిడికి గురైన చింతూరు, వీఆర్‌పురం, కూనవరం ఎటపాక మండలాల్లోని వరద ప్రభావిత గ్రామాల ప్రజలకు సంబంధించి ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో బాధితులకు తాగు నీటితో పాటు వాడుక నీటి సౌకర్యం కల్పించారు. విద్యుత్ అందుబాటులో లేని ప్రాంతాల్లో జనరేటర్ సౌకర్యం కల్పించారు. బాధితులకు నిత్యావసరాలతో పాటు కూరగాయలు, పాలు అందిస్తున్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా కేంద్రాల పరిసరాల్లో బ్లీచింగ్, ఫాగింగ్ వంటి పారిశుధ్య చర్యలు చేపట్టారు. గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లను అందుబాటులో వుంచారు. ఎక్కడికక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నారు.
- చింతూరు మండలంలో బాధితులకు కూరగాయలు, పాలతో పాటు కొవ్వొత్తులు పంపిణీ చేశారు. కిరోసిన్ పంపిణీకి కలెక్టర్ ఏర్పాట్లు చేస్తున్నారు. సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకుంటున్న వారికి 10 వేల టార్పాలిన్లను సిద్ధం చేస్తున్నారు. కూనవరం మండలంలో 12, వీఆర్‌పురం మండలంలో 10, చింతూరు మండలంలో 8 మర పడవలను సహాయక చర్యలకు వినియోగిస్తున్నారు. ఇళ్లు దెబ్బతిన్న వారికి పరిహారం పంపిణీకి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.
- వరద ముంపు ప్రాంతాలకు లాంచీలు, పడవల ద్వారా కూరగాయలను పంపించారు. చింతూరు జీసీసీ గోడౌను నుంచి వీఆర్‌పురం, కూనవరం మండలాలకు 3 టన్నుల చొప్పున ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, 2 టన్నుల చొప్పున వంకాయలు, దొండకాయలు పంపించారు.



వేలేరుపాడు మండలంలో వరదముంపునకు గురైన ప్రాంతాలకు తరలిస్తున్న కూరగాయలు

నడి గోదావరిలో ఆరుగురు గర్భిణుల తరలింపు

నడి గోదావరిలో శనివారం రాత్రి 10.30 గంటలకు బోట్‌పై ఆరుగురు గర్భిణులను ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఏలూరు జిల్లా వేలేరుపాడు మండల కేంద్రానికి తరలించాయి. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ రాజీవ్ వేలేరుపాడు మండలంలో అత్యంత మారుమూల గ్రామాలైన టేకుపల్లి, టేకూరులో ఆరుగురు గర్భిణులను గుర్తించారు. వీరిని వెంటనే పునరావాస కేంద్రానికి తరలించేందుకు బోట్‌పై ప్రయత్నించగా, తిర్లాపురం గ్రామానికి వచ్చేసరికి చీకటి పడి అక్కడే బోట్ ఆగిపోయింది. దీంతో ఎన్డీఆర్ఎఫ్ బృందానికి సమాచారం అందించారు. రంగంలోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ మోహన్ యాదవ్, మిగిలిన బృంద సభ్యులు.. ఆరుగురు గర్భిణులను వేలేరుపాడుకు తరలించారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి వారిని తీసుకెళ్లారు.



పశ్చిమగోదావరి జిల్లా భీమల్లాపురంలోని ముంపు బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు

నిత్యావసర వస్తువుల పంపిణీ

- పశ్చిమగోదావరి జిల్లాలోని ఆచంట మండలంలో అయోధ్య లంక, మర్రిమూల, పెదమల్లం గ్రామాల్లో మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు పర్యటించి, బాధితులకు భరోసా ఇచ్చారు. యలమంచిలి మండలంలోని దొడ్డిపట్ల, కనకాయలంక, పెదలంక, లక్ష్మీపాలెం, ఏనుగువానిలంక, బాడవ గ్రామాలు ముంపు బారిన పడ్డాయి. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి లంక గ్రామాల్లో పర్యటించారు.
- ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో 35 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. శనివారం రాత్రి ఇళ్లలోకి వరద నీరు చేరుతుండటంలో ఐదు గ్రామాలు నీటమునిగాయి. పాత నార్లవరం, ఎడవల్లి, టేకూరు, రుద్రమకోట, వేలేరుపాడు సంతబజారుల్లో 30 ఇళ్ల వరకు నీటమునగడంతో జనం పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. వీరందరికీ భోజన వసతి కల్పించారు. వేలేరుపాడులో పది దేశీయ బోట్‌లు, రెండు పెద్ద బోట్‌లు, మరో రెండు ఫైర్ బోట్‌లు వినియోగిస్తున్నారు. వరద బారిన పడిన కుటుంబాలన్నిటికీ ఆదివారం 3,900 లీటర్ల వంట నూనె, 4 వేల కేజీల కందిపప్పు, కుటుంబానికి 25 కేజీల బియ్యం, కూరగాయలు పంపిణీ చేయనున్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఝాన్సీ వరద పరిస్థితిని పరిశీలిస్తున్నారు.
- బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పలు గ్రామాల్లో ఇళ్ల మధ్య వరద చేరింది. అధికార యంత్రాంగం ప్రజలకు నిత్యావసర వస్తువులు అందజేసింది. వైద్య సేవలకు ఏర్పాట్లు చేశారు. మంత్రి పినిపే విశ్వరూప్ అల్లవరం మండలం బోడసుకుర్రు పల్లిపాలెంలో పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడారు. జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మామిడికుదురు, అయినవిల్లి మండలాల్లో పర్యటించి వరద ఉధృతిని పరిశీలించారు.
- అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లోని పలు గ్రామాల్లోకి వరదనీరు ప్రవేశిస్తోంది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ శనివారం కూనవరం, వీఆర్‌పురం మండలంలో వరదముంపు ప్రాంతాల్లో పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని 30 పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు.





రుద్రకోట గ్రామస్తులను పడవలో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న అధికారులు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సుందరపల్లిలో గట్టుపటిష్టం చేసేందుకు ఇసుక బస్తా మోసుకు వెళ్తున్న మంత్రి వేణు



ముంపు ప్రాంత ప్రజలతో మాట్లాడుతున్న ఏలూరు జిల్లా అధికారులు



ఏలూరు జిల్లా తిర్లాపురం నుంచి బోట్‌లలో గర్భిణులను తరలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం పెంపు

సాక్షి, అమరావతి: గోదావరి వరద ముంపు గ్రామాలకు చెందిన బాధితులు పునరావాస కేంద్రాల నుంచి తిరిగి ఇళ్లకు వెళ్లేటప్పుడు ప్రత్యేక ఆర్థిక సాయం కింద రూ.1,000 నుంచి రూ.2,000 వరకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో సీఎం వైఎస్ జగన్ నిర్వహించిన సమీక్షలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ సొమ్మును పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు ఆర్థికసాయంపై రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా ఈ జిల్లాల్లో ముంపునకు గురైన కుటుంబాలకు ఉచితంగా 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, లీటర్ పామాయిల్, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళాదుంపలు ఇవ్వాలని మరో ఉత్తర్వు జారీచేశారు. ఈ సరుకులను సమకూర్చాల్సిందిగా మార్కెటింగ్‌కు ఆదేశాలిచ్చారు. దెబ్బతిన్న, పాడైన ఇళ్లకు ఇచ్చే పరిహారాన్ని సీఎం జగన్ ఆదేశాల మేరకు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతూ మరో ఉత్తర్వు జారీ చేశారు.



ఆతురపడి మాటలాడువానిని చూచితివా?
వానికంటె మూర్ఖుడు సులువుగా గుణపడును.

– క్రైస్తవ ధర్మం

మహిళాశక్తిపై మారీచ యుద్ధం!

జనతంత్రం



వర్ధెల్లి మురళి

పవన్ కల్యాణ్ అమ్ముల పొదిలో అన్నీ పచ్చబాణాలే ఉంటాయన్న నిజం ఎప్పటికప్పుడు నిగ్గుదేలుతూనే వస్తున్నది. ఇటీవల ఆయన వదిలిన ఒక పచ్చబాణం మీడియాలో విస్తృత చర్చకు కారణమైంది. ఒక రాజకీయ పార్టీకి సిద్ధాంత నిబద్ధత లేనప్పుడు, స్వార్థ ప్రయోజనాలే ఆ పార్టీ కార్యక్రమంగా ఉన్నప్పుడు... మాయోపాయాలతో కూడిన వ్యూహాలనూ, ఎత్తుగడలనూ ఆశ్రయిస్తుంది. అటువంటి ఒక పార్టీ తెలుగుదేశం పార్టీ. తాను అధికారంలోకి రావడానికి కారణమైన ఎన్నికల మ్యానిఫెస్టోను మాయం చేసి, వెబ్‌సైట్‌లోంచి కూడా తొలగించిన ఏకైక పార్టీ తెలుగుదేశం. పార్టీ అధ్యక్షుడు తన సిద్ధాంత గ్రంథంగా వెలువరించిన 'మనసులో మాట' అనే పుస్తకాన్ని కూడా మార్కెట్‌లో ఎక్కడా లభ్యం కాకుండా మాయం చేసిన ఘనత ఆ పార్టీదే. ఇటువంటి ఘనత ప్రపంచంలో మరో పార్టీకి లేదు.

స్వార్థ ప్రయోజనాలకూ, సిద్ధాంత నిబద్ధతకూ చుక్కెదురు. తన ఆశయ గ్రంథాన్నీ, ఎన్నికల హామీలనూ జనంలో లేకుండా దాచేయడం సిద్ధాంత నిబద్ధత లేదనడానికి నిదర్శనం. స్వార్థ ప్రయోజనాల కోసం ఎప్పటికెయ్యది ప్రయోజనమో అప్పటికా జెండా ఎత్తడాన్ని ఆ పార్టీ ఒక వ్యూహంగా అనుసరిస్తూ వస్తున్నది. ప్రత్యర్థి పార్టీ ఒక భావజాల నిబద్ధతతో ఉన్నప్పుడు, తాను ప్రకటించిన కార్యక్రమాలను వరుసగా అమలు చేస్తున్నప్పుడు, తన మ్యానిఫెస్టోకు పటం కట్టి, ఇంటింటికీ వెళ్లి మీరే మార్కులేయండని అడుగుతున్నప్పుడు... ఈ పారదర్శకతను ఎదుర్కోవడం, ఈ నిబద్ధతతో తలపడటం స్వార్థపక్షానికి సాధ్యమవుతుందా? కాదు కనుకనే వైసీపీపై మారీచ యుద్ధ వ్యూహాన్ని టీడీపీ ఎంచుకున్నది. వైసీపీ అమలు చేస్తున్న పేదల అనుకూల కార్యక్రమాలన్నింటిపైనా దుష్ప్రచారం చేయడమే ఎజెండాగా అది తలకెత్తుకున్నది. ఇందులో ఎల్లో మీడియా, రాజకీయ భాగస్వామిగా కొనసాగుతున్న పవన్ కల్యాణ్ పార్టీ తమకు తాము నిర్దేశించిన పాత్రలను పోషిస్తున్నాయి.

పేదల సంక్షేమం కోసం జగన్ ప్రభుత్వం ఒక్క పైసా వృథా కాకుండా ఇప్పటికి రెండు లక్షల పాతిక వేల కోట్ల రూపాయలను వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేసింది. ఈ కార్యక్రమం వల్ల ఏపీ మరో శ్రీలంక కాబోతున్నదని వీరు చేసిన ప్రచారం సంగతి అందరికీ తెలిసిందే. కానీ ఈ కార్యక్రమం రాష్ట్రాన్ని మాంద్యంలోకి జారకుండా కాపాడిందనీ, జీఎస్‌డీపీ వృద్ధికి దోహదపడిందనీ ఆర్థికవేత్తలు పలువురు ప్రశంసించడంతో వారి గొంతులో వెలక్కాయ పడింది. నగదు బదిలీ అంశాన్ని వదిలిపెట్టి అడ్డగోలు అప్పులు చేస్తున్నదని రాష్ట్ర ప్రభుత్వంపై ప్రచారం మొదలు పెట్టారు. ఈ ప్రచారం తప్పని మొన్న కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో విడుదల చేసిన రాష్ట్రాలవారీ అప్పుల జాబితా రుజువు చేసింది.

పేద పిల్లల ఇంగ్లీషు మీడియం చదువుపై చేసిన దుష్ప్రచారం కూడా ఈ కోవలోదే. భాషాభిమానులను రెచ్చగొట్టడానికి చేతనైనంత ప్రయత్నం చేశారు. నిన్న మొన్నటి దాకా రాజ్యాంగ పదవులు నిర్వహించిన ఒకరిద్దరి సేవలను కూడా ఇందుకు ఉపయోగించుకున్నారు. రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలిస్తే నగరం మైలపడిపోతుందని (demographic imbalance) కోర్టుకెక్కారు. 30 లక్షల మంది మహిళలకు ఇళ్ల పట్టాలిచ్చి కాలనీలు ఏర్పాటు చేస్తుంటే చేసిన తప్పుడు ప్రచారం కూడా అప్పుడే మరిచిపోయేది కాదు. ఇటువంటి ఉదాహరణలు కొన్ని వందలు ఇవ్వొచ్చు. జగన్ ప్రభుత్వం మహిళా సాధికారత కార్యక్రమం కూడా ఇప్పుడు వీటి సరసన చేరింది. వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన ప్రాధాన్య కార్యక్రమాల్లో మహిళా సాధికారత ఒకటి. చంద్రబాబు – పవన్ – ఎల్లో మీడియా కూటమికి సిద్ధాంత నిబద్ధత లేకపోవడంతో పాటు ప్రత్యేకంగా మహిళా సాధికారత పట్ల వ్యతిరేకత, మహిళల పట్ల వివక్ష వారి స్వభావాల్లోనే ఉన్నది. బహిరంగంగా వారు మాట్లాడిన మాటల ద్వారానే ఈ సంగతిని గ్రహించవచ్చు. వీరి మహిళా వ్యతిరేక వైఖరిని ఇటీవల జరిగిన ఒక బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ ఎండగట్టిన విషయం తెలిసిందే. ఇటువంటి మనస్తత్వమున్న వ్యక్తులు మహిళా సాధికారతను ఎలా సహిస్తారు? అలాగని ఆ భావనను బహిరంగంగా వ్యతిరేకించలేరు. అందుకని దుష్ప్రచారాలతో చేసే పరోక్ష దాడినే ఎంచుకున్నారు. ఈ దాడిలో తొలి బాణాన్ని వేసే బాధ్యతను పవన్ కల్యాణ్‌కు అప్పగించారు చంద్రబాబు.

గోదావరి జిల్లాల పర్యటనలో పవన్ కల్యాణ్ ఈ దాడులకు దిగారు. పవన్ ప్రసంగంలోని రెండు అంశాలను మహిళా సాధికారతపై పరోక్షంగా జరిగిన దాడిగా విశ్లేషకులు పరిగణిస్తారు. మొదటి అంశం – 'ఉమన్ ట్రాఫికింగ్'. రాష్ట్రం నుంచి మూడేళ్లలో 30 వేల మంది మహిళల అక్రమ రవాణా జరిగిందనీ, ఇంత జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా ఉన్నదనీ పవన్ ఆరోపించారు. రెండో అంశం – 'వలంటీర్ వ్యవస్థ'. ఒంటరి మహిళలు, వితంతువులు, నిస్సహాయుల వివరాలు సేకరించి వలంటీర్లు సంఘవిద్రోహ శక్తులకు అప్పగించారనీ, అందువల్లనే ఇన్ని వేలమంది అక్రమ రవాణా సాధ్యమైందనీ ఆయన ఆరోపణ. ఈ వలంటీర్లలో 55 శాతం మంది మహిళలే కావడం ఇక్కడ గమనించదగ్గ విషయం. మహిళా సాధికారత కార్యక్రమాలు ఒక ఉద్యమంగా సాగుతున్న తరుణంలో ఈ తరహా వ్యాఖ్యలు కచ్చితంగా బురద జల్లడానికీ, పక్కదోవ పట్టించడానికీ ఉద్దేశించినవేననే అభిప్రాయం కలుగుతున్నది.

మహిళా సాధికారత అంటే ఏమిటో అర్థమైతే ఈ తరహా దాడులు ఎందుకు జరుగుతున్నాయో అర్థమవుతుంది. మహిళా సాధికారత అనే అంశానికి చాలామంది చాలా రకాలుగా నిర్వచనాలు చెప్పారు. వాటన్నింటినీ క్రోడీకరిస్తే తేలే విషయం ఒక్కటే. 'సమస్త జీవన రంగాల్లో భాగస్వామిగా ఉండగలిగే స్వేచ్ఛ – అందలాలను అందుకోవడానికి, వనరులను వినియోగించుకోవడానికి, నిర్ణయాధికార స్వాతంత్ర్యానికి సంబంధించి సమాన అవకాశాలు – సాంఘిక కట్టుబాట్లు, వివక్ష లేకుండా తన జీవితంపై తాను సంపూర్ణ హక్కులు కలిగి ఉండటం.' ఇటువంటి పరిస్థితులన్నీ ఒనగూడితేనే మహిళా సాధికారత సిద్ధించిందని భావించవలసి ఉంటుంది. ఇటువంటి వ్యవస్థ సాధ్యమవుతుందా అనేది పితృస్వామిక వ్యవస్థల్లో తలెత్తే మొదటి ప్రశ్న. గడచిన కొన్ని దశాబ్దాల పరిణామాలను, కొన్ని పశ్చిమ దేశాలు సాధించిన గణనీయమైన పురోగతిని పరిశీలిస్తే ఇది అసాధ్యమైన విషయం కాదని బోధపడుతుంది. కాకపోతే, ఇందుకు ప్రభుత్వాలు, వ్యవస్థలు, సంస్థలు ఈ దిశలో పట్టుదలగా పని చేయవలసి ఉంటుంది.



మహిళా సాధికారతకు దోహదపడే అంశాలేమిటి? అందుకు అడ్డుపడే అంశాలేమిటి? స్థూలంగా ఒక ఐదు అంశాలు సాధికారతకు దోహదపడతాయని నిపుణులు చెబుతున్నారు. 1. సాధికారతకు 'విద్య' తొలి మెట్టు. తమ జీవిత లక్ష్యాలను ఎంచుకోవడానికి, చేరుకోవడానికి, అందుకు సంబంధించిన నిర్ణయాలను స్వయంగా తెలివిడితో తీసుకోవడానికి, సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా మెలగడానికి విద్య దోహదపడుతుంది. 2. రెండో మెట్టు – 'ఆర్థిక స్వాతంత్ర్యం'. ఉత్పాదక రంగంలో స్త్రీల ప్రాతినిధ్యం జనాభా నిష్పత్తిలో పెరగాలి. ఆర్థిక వనరులు వారికి కూడా అందుబాటులో ఉండాలి. నిర్ణయాధికార స్థానాల్లో వారికి సమాన అవకాశాలు ఉండాలి. 3. 'ఆరోగ్యం–సంక్షేమం' మూడో ముఖ్యాంశం. వైద్య–ఆరోగ్య అవకాశాలు అందుబాటులో ఉండటం. వివక్షకు, హింసకు దూరంగా ఉండటం. 4. 'రాజకీయ ప్రాతినిధ్యం' నాలుగోది. వివిధ స్థాయిల్లో వారికి రాజకీయ ప్రాతినిధ్యం ఉండాలి. వారి జీవితాలపై ప్రభావం చూపే చట్టాల రూపకల్పనలో వారి వాణి బలంగా వినిపించాలి. 5. సాంఘిక కట్టుబాట్లు ఐదో అంశం. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా జీవనశైలి మారకుండా అవరోధంగా ఉండే శృంఖలాలను తెంచుకుంటూ లింగ వివక్షను తొలగించడం. ఈ ఐదు అంశాల్లో పురోగతి సాధిస్తే సూత్రప్రాయంగా మహిళా సాధికారత సాధించినట్టే! ఈ ఐదు అంశాలకూ విరుద్ధంగా పనిచేస్తే అవే సాధికారతకు ఆటంకాలుగా మారుతాయి.

మహిళా సాధికారతలో ప్రభుత్వాల చిత్తశుద్ధి, కృషి ముఖ్యం. ఈ పదాన్ని ఉపయోగించకపోయినా భారత రాజ్యాంగంలో ఇదే తరహా కర్తవ్యబోధ ఉన్నది. రాజ్యాంగ పీఠికల్లోనూ, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల్లో వివక్షలేని మహిళాభ్యున్నతికి సంబంధించిన అధికరణాలున్నాయి. పేదరికం, పెరుగుతున్న అసమానతలు, పర్యావరణ ముప్పు అనే మూడు భూతాలు మొత్తం భూగోళానికే ప్రమాదకరంగా పరిణమిస్తున్న నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించిన సంగతి తెలిసిందే. ప్రపంచ రాజ్యాలన్నీ 2015లో సమావేశమై మెరుగైన ప్రపంచం కోసం 17 లక్ష్యాలను ఏర్పరచుకున్నాయి. ఈ లక్ష్యాలను 2030లోగా సాధించాలన్న గడువును కూడా పెట్టుకున్నారు. ఈ లక్ష్యాల్లో ఐదవది మహిళా సాధికారత. తీర్మానమైతే చేసుకున్నారు కానీ, చాలా దేశాల్లో సంకల్పం కొరవడినట్టు కనిపిస్తున్నది. మన దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఇందుకు సంబంధించిన స్పృహే ఉన్నట్టు కనిపించడం లేదు. ఇందుకు ప్రధాన కారణాలు – రాజకీయ నేతలు స్వార్థ ప్రయోజనాలకే పెద్దపీట వేసుకోవడం! పేదరికం నుంచి ప్రజలను బయటకు తీసుకురావడంపై, అసమానతల తొలగింపుపై వారికి అవసరమైన సామాజిక దృక్పథం లేకపోవడం! ఈ ధోరణికి ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన నాలుగేళ్లుగా సాగుతున్న వైఎస్ జగన్ పరిపాలన భిన్నమైనది.

అంబేడ్కర్ రాజ్యాంగ ఆశయాలను జగన్ ప్రభుత్వం ఔదలదాల్చింది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను గీటురాళ్లుగా పెట్టుకున్నది. ఇందుకు మనం అనేక ఉదాహరణలు ఉటంకించవచ్చు. పేదరికం నుంచి విముక్తి, అసమానతల నిర్మూలన కోసం పెద్ద ఎత్తున ఉద్యమస్థాయి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. ఇదిగో ఈ ఉద్యమంపైనే చంద్రబాబు – ఎల్లో మీడియా – పవన్ కల్యాణ్ టీమ్ బురదజల్లింది. ఆంధ్రప్రదేశ్ శ్రీలంకలా మారుతుందని శాపనార్థాలు పెట్టింది కూడా దీనిపైనే. మహిళా సాధికారత విషయంలోనూ ఏపీ ప్రభుత్వం కీలకమైన నిర్ణయాలు తీసుకొని పనిచేస్తున్నది. మహిళా సాధికారతకు దోహదపడే అంశాలను అధ్యయనం చేసి అందుకు అనుగుణమైన చర్యలను తీసుకున్నది. నాణ్యమైన విద్యావకాశాలను అందరికీ అందుబాటులో తెచ్చే కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లలు చదువులకు దూరం కాకుండా ఉండేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. పద్దెనిమిదేళ్లు నిండిన తర్వాతే అమ్మాయిలకు పెళ్లి కానుక (కల్యాణమస్తు, షాదీ తోఫా) వర్తిస్తుందనే నియమం వెనుక బాల్య వివాహాలను నిరోధించడంతోపాటు కనీసం ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకైనా బాలికలు డ్రాపవుట్‌లుగా మిగలకుండా ఉంటారనే ఆశాభావం కూడా ఉన్నది. ఈ నిబంధనను కూడా విమర్శించి తన సామాజిక స్పృహ స్థాయేమిటో ప్రతిపక్షం వెల్లడించింది. ఈ నాలుగేళ్ల చర్యల ఫలితంగా పాఠశాలల్లో బాలికల సంఖ్య పెరిగింది. అమ్మ ఒడి కూడా అందుకు దోహదపడింది. ఇప్పుడు పాఠశాలల్లో బాలికల సంఖ్య సుమారు 48 శాతానికి చేరుకున్నది. డ్రాపౌట్ల సంఖ్య స్థిరంగా తగ్గుతున్నది.

ఆర్థిక రంగంలో మహిళల పురోభివృద్ధికి తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. 'చేయూత' పథకం ద్వారా లబ్ధి పొందిన మహిళల్లో పదహారున్నర లక్షల మంది మహిళలు కొత్త వ్యాపారాలను ప్రారంభించడమో, పాత వ్యాపారాలను వృద్ధి చేసుకోవడమో జరిగింది. చంద్రబాబు నమ్మకద్రోహంతో నిస్తేజమైన పొదుపు సంఘాలను 'ఆసరా' పథకం ఆదుకున్నది. పునరుజ్జీవం పొందిన పొదుపు సంఘాలకు ఈ నాలుగేళ్లలో బ్యాంకులు ఒక లక్షా పదహారు వేల కోట్ల రుణాలను అందజేశాయి. దీంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పొదుపు సంఘాలు క్రియాశీల పాత్రను పోషిస్తున్నాయి. 30 లక్షలమంది మహిళలకు ఇళ్ల పట్టాలు లభించి, ఇళ్ల నిర్మాణం జరుగుతున్నది. ప్రభుత్వ పథకాల ప్రధాన లబ్ధిదారులుగా మహిళలే ఉన్నారు.

గతంలో ఎన్నడూ లేని స్థాయిలో మహిళల రాజకీయ ప్రాతినిధ్యం పెరిగింది. బాబు కేబినెట్‌లో ఇద్దరు మహిళలుంటే ఇప్పుడు నలుగురున్నారు. గతం కంటే ముఖ్యమైన శాఖలను వారు నిర్వహిస్తున్నారు. మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, సర్పంచ్‌లు, మండలాధ్యక్షులు, జడ్పీ చైర్మన్ పదవుల్లో 55 శాతం మంది మహిళలే. 50 శాతం నామినేటెడ్ పదవులను వారికి రిజర్వ్ చేశారు. గ్రామ సచివాలయాల్లో 1,38,026 మందిని నియమిస్తే అందులో 77,935 మంది మహిళలు. వలంటీర్లలో 55 శాతం మంది మహిళలు. ఆరోగ్య శాఖలో చేసిన 48 వేల నియామకాల్లో అత్యధికులు మహిళలు. ఈ సంవత్సరం డిగ్రీ పూర్తిచేసి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలు పొందిన లక్షా ముప్పయ్‌వేల మందిలో 60 శాతం అమ్మాయిలు. మహిళా సాధికారత దిశలో ప్రభుత్వం చేపట్టిన చర్యల వలన కలిగిన ఫలితాల్లో ఇవి కొన్ని మాత్రమే! గర్భిణీలు, బాలింతల దగ్గర నుంచి మహిళల ఆరోగ్య పరిరక్షణకు వివిధ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. వేధింపులకు విరుగుడుగా తీసుకొచ్చిన 'దిశ' యాప్ సూపర్ హిట్టయ్యింది.

ఈ విజయాలను పక్కదారి పట్టించడానికే వ్యూహం ప్రకారం మహిళల అక్రమ రవాణా అంశాన్ని పవన్ కల్యాణ్ తెరపైకి తెచ్చారని అభిప్రాయం కలుగుతున్నది. ఎందుకంటే పవన్ చెప్పినట్టు ఈ మూడేళ్లలో 30 వేలమంది మహిళల అక్రమ రవాణా జరగలేదు. కేంద్రం పార్లమెంట్‌కు సమర్పించిన నివేదిక, రాష్ట్ర పోలీసు అధికారుల వివరణ ప్రకారం ఈ మూడేళ్లలో 26,099 మంది 'అదృశ్య'మయ్యారు. వీటిని మిస్సింగ్ కేసులు అంటారు. ట్రాఫికింగ్ అనరు. ఈ మొత్తంలో 2019కి ముందు అదృశ్యమై అప్పటికి ఆచూకీ లభించని వారి సంఖ్య కూడా కలిసి ఉన్నది. ఈ అదృశ్యమైన వారిలో 23,394 మందిని గుర్తించి, తిరిగి ఇంటికి చేర్చడం కూడా జరిగింది. ఇక మిగిలింది 2705 మంది. ఇది 2021 డిసెంబర్ 31 నాటి లెక్క. ఆ తర్వాత ఇందులో మరెంతమంది ఇల్లు చేరారనే అంశంపై పోలీసు శాఖ ఆ యా కేసులను పరిశీలించవలసి ఉన్నది. కేంద్రం విడుదల చేసిన జాబితా ప్రకారం ఆంధ్రప్రదేశ్ 14వ స్థానంలో ఉన్నది. కానీ, పవన్ తీసిన రాగం, దానికి యెల్లో మీడియా, చంద్రబాబు చేసిన రాద్ధాంతం చూస్తే ఆంధ్రప్రదేశ్ నుంచి మాత్రమే వేలాది మంది అదృశ్యమయ్యారనే అపోహ కలుగుతుంది. ఈ అపోహ కలిగించడమే వారి లక్ష్యం.

వందలు, వేలు కాదు. పదిమంది అదృశ్యమైనా, ఒక్కరు అక్రమంగా రవాణా అయినా ఆందోళన చెందవలసిన విషయమే. సిగ్గుపడవలసిన సంగతే! ఈ పరిస్థితులకు కారణాలేమిటి? పేదరికం, అవిద్య, నిస్సహాయత – ఇటువంటివన్నీ కారణాలవుతాయి. మహిళా సాధికారత ద్వారానే వీటిని జయించగలుగుతారు. ఆ దిశలో పనిచేస్తున్న జగన్ ప్రభుత్వ విజయాలను మరపించేందుకే ట్రాఫికింగ్‌ను ముందుకు తెచ్చారనే వాదనకు బలం చేకూరుతున్నది. సాధికారతకు దోహదపడే అంశాలను బలపరచకపోగా అడ్డంకిగా ఉండే సాంఘిక రుగ్మతలను మాత్రం తెలుగుదేశం కూటమి ఎగదోస్తున్నది. 'కోడలు మగపిల్లాడిని కంటానంటే అత్త వద్దంటుందా?' అంటూ చంద్రబాబు చేసే ప్రచారం ఈ రుగ్మతలకు ఆజ్యం పోసేదే! పైగా ఈ ముఠాలోని ముఖ్యనేతలంతా గతంలో మాట్లాడిన మాటలూ, చేసిన చేష్టలూ మహిళను సాటి మనిషిగా కాక, ఆట వస్తువుగా పరిగణించే దృక్పథానికి ప్రతీకలు. ఇటువంటి శక్తులు మహిళా సాధికారతను సహిస్తాయా? చస్తే సహించవు. లక్షన్నరమంది మహిళలు ఒక్కసారిగా వలంటీర్లుగా సేవారంగంలోకి అడుగుపెట్టి క్రియాశీలంగా వ్యవహరిస్తుంటే తట్టుకోలేని ప్రబుద్ధుడు వారిపై నిందలు మోపడం ఈ అసహనానికి పరాకాష్ఠ!

vardhelli1959@gmail.com

రాయని డైరీ

సచిన్ పైలట్ (కాంగ్రెస్)

మాధవ్ శింగరాజు

ఇంట్లోంచి బయటికి వస్తుంటే కారు విండోలోంచి ఒక అపరిచితుడు కనిపించాడు. నాకొక ఆలోచన వచ్చింది. కారును అతడికి దగ్గరగా ఆపి, కారు విండోను కిందికి దించి, నా చేతిని బయటికి పెట్టి, ఒక వేలు పట్టుకోమని ఆ అపరిచితుడిని అడిగితేనో!

నమ్మదగని ఇద్దరు వ్యక్తులలో ఒకరిని తప్పనిసరిగా నమ్మవలసి వచ్చినప్పుడు రెండు వేళ్లలో ఒకటి పట్టుకోమని అడిగేందుకు ఎవరైనా ఒక నమ్మకస్థుడైన వ్యక్తిని మాత్రమే మనం ఎంపిక చేసుకోవలసిన అవసరం ఏముంటుంది? అపరిచితుడిని కూడా అడగవచ్చు కదా!

రెండు వేళ్లూ నా చేతివే అయినప్పుడు, ఆ రెండు వేళ్లలో ఒకటి అశోక్ గెహ్లోత్ అని, రెండోది రాజేంద్రసింగ్ గుఢా అని మనసులో అనుకునేది నేనే అయినప్పుడు, వాటిల్లో ఒక వేలు పట్టుకునే ఆ అపరిచితుడు గెహ్లోత్ వేలును పట్టుకుని కూడా, నేను పట్టుకున్నది గుఢా వేలును అని నాతో వాదించడానికేం ఉంటుంది కనుక?



డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు. గెహ్లోత్‌తో కలిసి గుఢాను పక్కన పెట్టడమా? గుఢాతో కలిసి గెహ్లోత్‌ను పక్కన పెట్టడమా?

గెహ్లోత్ ముఖ్యమంత్రి. గుఢా జూలై 21 వరకు మంత్రి. నేనైతే ముఖ్యమంత్రినీ కాదు, మంత్రినీ కాదు. నేను ఏదీ కాకపోయినా ఒకరంటే ఒకరికి పడని గెహ్లోత్, గుఢా ఒకర్నొకరు దూషించుకోడానికి నన్ను కీర్తిస్తున్నారంటే ఆ దూషణ, కీర్తన నమ్మదగినవే అయినా వాళ్లిద్దరూ నమ్మదగనివారే!

గెహ్లోత్ నన్ను సీఎంని కానివ్వడం లేదు. "ఈసారి మిమ్మల్నెలా సీఎంని కానివ్వరో నేనూ చూస్తా.." అని గుఢా అంటున్నారు!

కాలేజ్‌లో ఉన్నప్పట్నుంచి చూస్తున్నా... రాజస్థాన్‌లో ఎప్పుడూ వరుసగా రెండుసార్లు కాంగ్రెస్ రాలేదు. వరుసగా రెండుసార్లు బీజేపీ రాలేదు. కానీ కాంగ్రెస్ వచ్చిన ప్రతిసారీ వరుసగా గెహ్లోతే సీఎంగా వస్తున్నారు. రివాజుగా 2023లో బీజేపీ వస్తే కనుక 2028 వరకు సచిన్‌కు సీఎం అయ్యే ఛాన్స్ లేదనే ధీమా వల్ల కావచ్చు గెహ్లోత్ నన్ను కొంతకాలంగా చిరునవ్వుతో పలకరించే ప్రయత్నం చేస్తున్నారు. "నీకు చపాతీ, మిక్స్‌డ్ వెజిటబుల్స్ ఇష్టం కదా సచిన్? వస్తావా అలా మంచి రెస్టారెంట్‌కి వెళ్లొద్దాం?" అని కూడా నేడో, రేపో అడిగేసేలా ఉన్నారు.

చపాతీలు, మిక్స్‌డ్ వెజిటబుల్స్ కోసం గెహ్లోత్‌తో కలిసి వెళితే ఆయన ఏం అడుగుతారో నాకు తెలుసు. "గుఢా దగ్గరున్న 'ఎర్ర డైరీ' ఒరిజినల్‌ని ఎలాగైనా సంపాదించమంటారు. ఆ ఎర్ర డైరీలోని అక్రమాల లిస్టులో తన పేరుందేమోనని ఆయన భయం.

గుఢా బీఎస్పీ ఎమ్మెల్యే. ఆయన్ని కాంగ్రెస్‌లోకి తీసుకుంది గెహ్లోతే. మంత్రిని చేసిందీ గెహ్లోతే. మంత్రిగా తొలగించింది గెహ్లోతే.

గెహ్లోత్‌పై తిరుగుబాటుకు చెయ్యి కలిపితే 20 కోట్లు ఇస్తానని సచిన్ ఆశ చూపారని చెప్పి గెహ్లోత్ దగ్గర మంత్రి పదవి సంపాదించి, మంత్రి పదవి పోయాక ఇప్పుడు నా వైపు మాట్లాడుతున్నారు గుఢా! నేనెంత గొప్పవాణ్ణో, మా నాన్నగారు ఇంకెంత గొప్పవారో గెహ్లోత్‌కి వినిపించేలా నలుగురికీ చెబుతున్నారు!

వెళ్లి ఆ అపరిచితుడి దగ్గర కారు ఆపాను. కారు విండో కిందికి దించాను. నా చేతిని బయటికి పెట్టాను. చూపుడు వేలు, మధ్య వేలు చూపించి ఒక వేలు పట్టుకోమన్నాను.

అపరిచితుడు పట్టుకోలేదు!

"మీరు సచిన్ పైలట్ కదా.." అన్నాడు.

"అవును. సచిన్ పైలట్‌నే" అన్నాను.

"నేను మీ కార్యకర్తను సచిన్ జీ. నేను చెప్పడం ఏంటంటే... మీరు మీ వేళ్లనే కాదు, మీ చేతినీ నమ్మకండి.." అన్నాడు!!

ఒక్కసారిగా ఆశ్చర్యచకితుణ్ణి అయ్యాను!

అతడు నిజంగా అపరిచితుడేనా అని చూశాను. ఊహు. అపరిచితుడు కాదు. పనికొచ్చే సలహా ఇచ్చినవాడు ఆత్మీయుడౌతాడు కానీ అపరిచితుడౌతాడా?


గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** శు. ద్వాదశి ఉ.7.08 వరకు, తదుపరి త్రయోదశి తె.5.13 వరకు (తెల్లవారితే సోమవారం), **నక్షత్రం:** మూల రా.7.44 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.6.13 నుండి 7.45 వరకు, తదుపరి తె.4.53 నుండి 6.24 వరకు (తెల్లవారితే సోమవారం), **దుర్ముహూర్తం:** సా.4.47 నుండి 5.39 వరకు, **అమృతఘడియలు:** ప.1.31 నుండి 3.04 వరకు.

సూర్యోదయం : 5.41
సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

సవాళ్లను ఎదుర్కొనేవాళ్లకే భవిష్యత్తు

అభిప్రాయం



జాన్‌సన్ చోరగుడి

అమెరికాతో ఆయుధ కొనుగోళ్ల ఒప్పందం ముగిసిన నెల రోజుల్లోనే మళ్ళీ అదే పని మీద మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫ్రాన్స్ వెళ్లారు. జూలై 14న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో 26 రఫెల్ మెరైన్ ఫైటర్ జెట్స్, మూడు స్కార్పియన్ డీజిల్ –ఎలక్ట్రిక్ సబ్ మెరైన్స్ కొనుగోలుకు ఒప్పందం జరిగింది. భారత ప్రభుత్వం వీటిని మన నౌకాదళం (నేవీ) అవసరాల కోసం సమకూర్చుకోబోతున్నది. యుద్ధ సమయంలో వినియోగించే డాక్ షిప్స్ 'ల్యాండింగ్ ప్లాట్ ఫారమ్స్' నిర్మాణానికి, ఫ్రాన్స్ తరఫున – 'ఎల్ అండ్ టీ', ఇక్కడ మన విశాఖపట్టణం 'హిందుస్థాన్ షిప్‌యార్డ్' రెండూ కలిసి పనిచేయాల్సి ఉంటుంది.

ఈ రెండు దేశాల పర్యటనల్లో కొన్ని ఇతర అంశాలు ఉన్నప్పటికీ, ఈ దేశాలతో ఆయుధాల కొనుగోలు ఒప్పందాలు ఇక్కడ ప్రాముఖ్యం కలిగి ఉన్నాయి. గత నెల 20–24 తేదీల్లో జరిగిన మన ప్రధానమంత్రి అమెరికా పర్యటనలో అమెరికాకు చెందిన 'జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ', మన 'హెచ్ఏఎల్'తో కలిసి– ఫైటర్ జెట్స్ తయారీకీ, మన సముద్ర తీరంలో వినియోగానికీ 3 బిలియన్ డాలర్ల వ్యయంతో 31 'సీ– గార్డియన్ డ్రోన్స్' కొనడానికీ ఒప్పందం కుదిరింది. 'ఇండో–పసిఫిక్' రీజియన్ (ఇది మన దేశం చుట్టూ ఉంది) సముద్ర జలాల్లో అమెరికా యుద్ధనౌకలు ఉన్నప్పుడు– వాటి సర్వీస్, మరమ్మత్తులు మనదేశంలోని 'కట్టుపల్లి' షిప్ యార్డ్ (చెన్నై), 'మెజగాంవ్' డాక్ (ముంబై), 'గోవా' షిప్ యార్డ్‌లలో చేయడానికి అమెరికాతో ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందాలు సముద్ర జలాలతో ముడిపడినవి కావడంతో, మున్ముందు ఇందుకు సంబంధించిన పర్యవసానాలు, ఇండియాలో రెండవ పెద్ద సముద్రతీరం ఉన్న రాష్ట్రంగా ఏపీని అవి నేరుగా తాకే అంశం. ఈ వ్యాసం రాస్తున్న సమయంలోనే సముద్రం మీద నుంచి ఉగ్రదాడి జరిగితే ఎలా స్పందించాలనే మాక్ డ్రిల్ తూర్పు నౌకాదళం, మెరైన్ పోలీసులూ కలిసి ఏపీ తీరంలో నిర్వహించారనే వార్త రావడం ఇక్కడ గమనార్హం.

అంతర్జాతీయ సంబంధాలలోకి 'జియో–పొలిటిక్స్' వచ్చాక, మారిన కొత్త దృశ్యం ఇప్పుడు అన్ని ఆసియా దేశాల్లో కనిపిస్తున్నది. పదేళ్ల వెనక్కి వెళితే అప్పటి పరిస్థితి ఏమిటి? 2013 జనవరి 1న అమెరికా న్యూస్ ఏజెన్సీ– 'రాయిటర్' కాలమిస్ట్ 'జిమ్ ఉల్ఫ్' ఆసక్తికరమైన వ్యాసం రాశారు. అందులో అమెరికా ప్రెసిడెంట్ బరాక్ ఒబామా– 'ఇండో–పసిఫిక్' విషయంలో తీసు



కున్న వైఖరితో– 'మన పరిశ్రమలకు మంచి రోజులు రాబోతున్నాయి; చైనా రక్షణ వ్యయం కారణంగా అమెరికా ఆయుధాల వ్యాపారం ఆగ్నేయ – ఆసియాలో పెరగనుంది' అని అమెరికా 'ఏరో స్పేస్ ఇండస్ట్రీస్ అసోసియేషన్' వైస్–ప్రెసిడెంట్ 'ఫ్రెడ్ డానీ' అన్నట్టుగా ఆ కాలమిస్ట్ రాశారు.

సరే 21వ శతాబ్ది నాటికి 'జియో పాలిటిక్స్' కీలకమైంది. మనం ఒకందుకు వాళ్లొకందుకు అన్నట్టుగా సాగిన ఈ వ్యవహారంలో, ఎప్పుడైతే అమెరికాతోపాటు యూరప్‌లోని అగ్రదేశాల విదేశాంగ విధానం– 'ఇండో–పసిఫిక్' కేంద్రితం అయిందో; అప్పట్లోనే అంటే యూపీఏ –2 నాటికే 'రీ మ్యాపింగ్ ఇండియా' అవసరం మనకు అనివార్యం అయింది.

గడచిన రెండు దశాబ్దాల పరిణామాలు చూశాక, జూన్ రెండవ వారంలో సీనియర్ బీజేపీ నాయకుడు, కేంద్ర మాజీ హోం శాఖ సహాయమంత్రి సీహెచ్ విద్యాసాగరరావు–'డా॥ అంబేడ్కర్ చెప్పినట్టుగా హైదరాబాద్‌ను ఇండియాకు రెండవ రాజధాని చేయాలి' అని కోరడాన్ని మన దేశం– 'రీ మ్యాపింగ్' అవసరాలకు అదనపు కొనసాగింపుగా చూడాల్సి ఉంటుంది. భారత ప్రభుత్వం ఆగ్నేయ–ఆసియా అవసరాలు దృష్ట్యా ఢిల్లీ పర్యవేక్షణ దక్షిణ కేంద్రితంగా ఉండాల్సిన అవసరం కనుక ఏర్పడితే, దేశీయంగా కూడా 'జియో–పాలిటిక్స్' వైఖరి ప్రయోజనకరం కావొచ్చు. అటువంటి సందర్భం వచ్చినప్పుడు, తెలంగాణ ప్రభుత్వం కొత్తగా నిర్మించిన సెక్రటేరియట్ భవన సముదాయం అందుకు దీటైన తోడ్పాటు అవుతుంది.

జనరల్ ఎన్నికలకు సమీపాన ఇప్పుడు మనం చూస్తున్నవి విజయాలు అనిపిస్తే, ఇదేదో ప్రధాని నరేంద్ర మోదీ, తీరాంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభావం అని చెప్పడం ఇక్కడ ఉద్దేశ్యం కాదు. అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు ఒకానొక కాలం నాటికి ఎలా పరిణమించాయి అనేది ఇక్కడ ప్రధానం. అప్పటికి అక్కడ వాటిని ఎదుర్కోవలసిన ప్రభుత్వాలు ఏ మేరకు మారినా – 'జియో–పొలిటికల్' వేడిని తట్టుకోవడానికి తగినంత సంసిద్ధత ఏ మేరకు ఉంది? అనేదే ఇక్కడ ప్రధానం.

ఎందుకంటే... ప్రజలు, ప్రాంతం, సార్వభౌమత్వం అనే 'రాజ్యం' ఉపాంగాల భద్రత కోసం కాలానుగుణంగా 'ప్రభుత్వం' తనను తాను 'రీ–మ్యాపింగ్' చేసుకోవలసి ఉంటుంది. ఇటువంటి అవసరం పడిన తర్వాత, మన వద్ద మొదట 2014లో రాష్ట్ర విభజన రూపంలో జరిగితే, సూక్ష్మస్థాయిలో మరోసారి అది 2022లో కొత్త జిల్లాల ఏర్పాటుగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ సీఎంఓ ప్రధాన సలహాదారు అజయ్ కల్లం తరచూ అంటూ ఉండే – 'కోర్స్ కరెక్షన్' ప్రక్రియను మన మారబోయే అవసరాలకు సిద్ధంగా ఉండటంగా చూడాల్సి ఉంటుంది. పదేళ్ల విభజన తర్వాత, జరగనున్న జనరల్ ఎన్నికల్లో ప్రజల ఎంపిక ఎలా ఉండాలి? అన్నప్పుడు మన రాష్ట్రం సరిహద్దుల్లో వేగంగా మారుతున్న 'గ్లోబల్' పరిణామాలను ఎదుర్కోవడానికి పటిష్ఠమైన 'గవర్నెన్స్'తో సిద్ధమవుతున్నది ఎవరు? అనేదే కొలమానం.

వ్యాసకర్త అభివృద్ధి – సామాజిక అంశాల వ్యాఖ్యాత

ఆ జన్మ ధన్యం!

తెల్లవారి లేచి చూసేసరికి, ప్రకృతిలో సర్వే సర్వత్రా ఎన్నెన్ని కోట్ల కొత్త పుష్పాలు పుట్టుకొస్తాయో! ఎన్నిసార్లు చూసినా ఈ వైచిత్రి ఆనందాన్నీ, ఆశ్చర్యాన్నీ కలిగిస్తూనే ఉంటుంది. ఈ సౌందర్యసృష్టి అంతా ప్రకృతి ప్రాణికోటికి నిత్యం అయాచితంగా అందజేసే వెలలేని కానుక. గతం... భవిష్యత్తు కోసం వర్తమానంలో నిలిపిన పునాది ఇది.

అయితే పుష్పాలన్నీ ఫలించవు. గాలి వల్లో, తుమ్మెదల వల్లో, ఇతర ప్రాణుల వల్లో తన జాతికి చెందిన పుప్పొడితో 'పరాగ సంపర్కం' జరిగితే, పరిస్థితులన్నీ అనువుగా ఉంటే, పుష్పం ఫలిస్తుంది. అలా ఫలించేది నూటికీ, వెయ్యికీ ఒక్క పుష్పం. మరి మిగిలిన పుష్పాల మాట? 'ఆయువు కల్గు నాల్గు గడియల్ కని పెంచిన తీవ తల్లి జా/తీయత దిద్ది తీర్చుము, తదీయ కరమ్ముల లోన స్వేచ్ఛమై/ఊయల లూగుచున్, మురియుచుందుము..' (కరుణశ్రీ) అన్న పరిధిలో ఉండిపోతాయి. తమ సౌందర్యంతో బాహ్య ప్రపంచానికి విందు చేసి, ఆయువు తీరగానే, ఆ తీవ తల్లి పాదాల మ్రోలనే వాలి, కన్ను మూస్తాయి. కొన్ని పూలకు మాత్రం, తమ జన్మకూ, తమ తీవతల్లి జన్మకూ కూడా కారణమైన జగదీశ్వరుడి కైంకర్య భాగ్యం లభిస్తుంది. పుట్టుక ధన్యమౌతుంది.

జ్యోతిర్మయం

మామూలుగా అయితే ఒక పుష్పానికి శక్తి ఎంత? అన్ని పరిస్థితులూ అనుకూలిస్తే, అది తన జాతికే చెందిన ఫలంగా పరిణమించగలదు. అంతే. కానీ భక్తుడు ఆ పుష్పాన్ని శ్రద్ధగా శివపూజకు ఉపయోగిస్తే, దాని శక్తి పెరిగిపోతుంది. దానికి కొత్త సిద్ధులు, మహిమలు అబ్బుతాయి. తమకు ధన్యత కలిగించిన భక్తుడి పట్ల కృతజ్ఞతతో, అవి దారసుతులూ, ధన కనక వస్తు వాహనాది రూపాలైన ఫలాలుగా మారి ఆ భక్తుడికి అందుతాయి. '...మీ పాద పయోజ పూజితములై, అత్యద్భుతం(బు!), ఆ విరుల్ / కరులౌ, అశ్వములౌ, అనర్ఘమణులౌ, కర్పూరమౌ, హారమౌ, తరుణీ రత్నములౌ, పటీర తరులౌ, తథ్యంబు! విశ్వేశ్వరా!' అంటాడు యథావాక్కుల అన్నమయ్య అనే కవీశ్వరుడు. పటీర తరువు అంటే చందన వృక్షం. పన్నెండో శతాబ్దంలో అన్నమయ్య రచించిన 'సర్వేశ్వర శతకం' సర్వాంగ సుందరమైన, సలక్షణమైన శివస్తుతి శతకం.

– ఎం. మారుతి శాస్త్రి

క్లుప్తంగా...

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సోమయాజులు, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సోమయాజులు, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

బనగానపల్లెలో భక్తిశ్రద్ధలతో మాతం



మాతం నిర్వహిస్తున్న షియా మతస్తులు

బనగానపల్లె(నంద్యాల): బనగానపల్లె పట్టణంలో శనివారం భక్తిశ్రద్ధలతో మాతం నిర్వహించారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే మొహర్రంను పురస్కరించుకుని స్థానిక నవాబుకోట నుంచి నవాబు మీర్ ఫజలే అలీఖాన్, ఆయన కుమారుడు గులాం అలీఖాన్ పీర్ల వెంట నడువగా ఊరేగింపులో పలువురు షియా పెద్దలు, షియా మతస్తులు నల్లటివస్త్రాలు ధరించి వెంట నడిచారు. వీరంతా శోకగీతాలు ఆలపిస్తూ బ్లేడ్లు, చురకత్తులతో ఎద, వీపు పైన మాతం నిర్వహిస్తూ భక్తిని చాటుకున్నారు. కొండపేటలోని ఇమాంఖాసీం పీరు జుర్రేరు వాగు వద్దకు చేరుకున్న అన్ని పీర్లను ఆలింగనం చేసుకుంది. సుమారు 250 పీర్లను పట్టణంలోని జుర్రేరువాగు వద్ద శుద్ధి చేసి అనంతరం వాటిని చావిళ్లకు తీసుకెళ్లారు. ఊరేగింపునకు బనగానపల్లె పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి వేలాదిమంది వచ్చారు. కాగా, తెలంగాణ రాజధాని హైదరాబాద్ తర్వాత ఆ స్థాయిలో బనగానపల్లె పట్టణంలో మాతం నిర్వహించడం ప్రత్యేకత.

వైభవంగా గంధోత్సవం



పుష్పాలంకరణలో హజరత్ పీరుల్లా మాలిక్ సాహెబ్ మజార్

కడప కల్చరల్: ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రంగా పేరు గాంచిన వైఎస్సార్ జిల్లా కడప అమీన్‌పీర్ దర్గాలో హజరత్ పీరుల్లా మాలిక్ గంధోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా గురువులు హజరత్ పీరుల్లా మాలిక్ సాహెబ్ సజీవ సమాధి అయిన సందర్భంగా ఏటా ఉరుసును నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం నుంచి ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిపారు. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుస్సేనీ సాహెబ్ గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవిత్ర జలాన్ని భక్తులకు అందజేశారు. రాత్రి ప్రధాన గురువుల మజార్ వద్ద మరోమారు గంధం సమర్పణ చేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుస్సేనీ సాహెబ్‌ను దర్శించుకుని ఆశీస్సులు పొందారు. నెల్లూరులోని బారా షహీద్ దర్గా వద్ద రొట్టెల పండుగకు హాజరైన భక్తుల్లో చాలామంది పెద్దదర్గా ఉత్సవానికి రావడంతో దర్గా భక్తులతో నిండిపోయింది.

డీడీ యాదగిరిలో ఉద్యోగాలకు నోటిఫికేషన్

తెలంగాణ

అంబర్‌పేట (హైదరాబాద్): దూరదర్శన్ యాదగిరి హైదరాబాద్ కేంద్రంలోని ప్రాంతీయ వార్తా విభాగంలో వివిధ తాత్కాలిక ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ కింద యాంకర్ కమ్ కరస్పాండెంట్ గ్రేడ్-2, యాంకర్ కమ్ కరస్పాండెంట్ గ్రేడ్-3, బులెటిన్ ఎడిటర్, కాపీ ఎడిటర్, బ్రాడ్‌కాస్ట్ ఎగ్జిక్యూటివ్, వీడియో పోస్ట్ ప్రొడక్షన్ అసిస్టెంట్, అసైన్‌మెంట్ కో–ఆర్డినేటర్, కంటెంట్ ఎగ్జిక్యూటివ్, ప్యాకేజింగ్ అసిస్టెంట్, వీడియోగ్రాఫర్, సీనియర్ కరస్పాండెంట్ తదితర 11 కేటగిరీలకు తాత్కాలిక పద్ధతిలో ఉద్యోగాల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీడీ యాదగిరి జాయింట్ డైరెక్టర్, ఆర్‌ఎన్‌యూ హెడ్ రాహుల్ గొలికర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హతలు, ఎంపిక విధానం వంటి ఇతర పూర్తి వివరాలకు ప్రసారభారతి అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

తెలంగాణ పులులు 21

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో 21 పెద్ద పులులు ఉన్నట్టు 'స్టేటస్ ఆఫ్ టైగర్స్ 2022' నివేదిక వెల్లడించింది. ఈ మేరకు శనివారం కేంద్ర అటవీ, పర్యావరణశాఖ అధికారిక నివేదిక విడుదల చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో పులులు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లోనే ఉన్నాయని, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో ఒక్క పులి కూడా శాశ్వత ఆవాసం ఏర్పరచుకోలేదని పేర్కొంది. ఈ నివేదిక చూస్తుంటే కేవలం రెండు టైగర్ రిజర్వ్‌లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న పులుల సంఖ్యనే గుర్తించినట్టు కనిపిస్తోందని, రెండున్నరేళ్ల వయసుకు పైబడిన పులుల సంఖ్యనే పరిగణనలోకి తీసుకుంది.

అద్భుతం.. అన్నదాతల
ధాన్యాగారం

బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం అంతర్జాతీయ ఖ్యాతి

- అధిక దిగుబడి నిచ్చే వరి వంగడాల సృష్టి
- నూతన వంగడాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్న జగన్ సర్కార్
- తినేందుకు అనువుగా సన్న రకాలు
- దేశవ్యాప్తంగా లక్షల ఎకరాల్లో సాగు



సాగులో ఉన్న బీపీటీ 5204 రకం పైరు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం అద్భుత ఫలితాలు సాధిస్తూ అన్నదాతల ధాన్యాగారంగా ప్రగతి పథం వైపు దూసుకుపోతున్నది. ఇక్కడ శాస్త్రవేత్తలు సృష్టిస్తున్న వరి వంగడాలు నాణ్యమైన అధిక దిగుబడితో దేశవ్యాప్తంగా కీర్తిప్రతిష్టలు అందుకుంటున్నాయి. ఇక్కడ ఉత్పత్తి అయిన పలు రకాల వరి వంగడాలు రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాక దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో సాగవుతున్నాయి. విదేశాలకు ఏటా లక్షల టన్నుల బీపీటీ రకాల సన్నబియ్యం ఎగుమతి అవుతూ విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించి పెడుతోంది. దీంతో ఈ పరిశోధన స్థానం ఖ్యాతి అంతర్జాతీయ స్థాయికి ఎగసింది.

వరి పరిశోధన స్థానం నేపథ్యం..

1961లో తెనాలిలో ప్రారంభమైన వరిపరిశోధన స్థానం 1973లో బాపట్లకు మార్చారు. అప్పటి నుంచి బాపట్ల వరి పరిశోధన స్థానంగా పనిచేస్తోంది. 2017లో వరి పరిశోధన స్థానం నుంచి వ్యవసాయ పరిశోధన స్థానంగా అప్‌గ్రేడ్ చేస్తూ.. 15 ఎకరాల నుంచి 40 ఎకరాలకు విస్తరించారు.



పంపిణీకి సిద్ధంగా బీపీటీ రకాల విత్తనాలు

కొత్త వంగడాల సృష్టి కేంద్రం..

1982లో సోనామసూరి రకం (బీపీటీ 3291), ధాన్యలక్ష్మి (బీపీటీ 1235), 1986లో సాంబమసూరి (బీపీటీ 5204) అనే సన్న రకం వంగడాన్ని కనుగొన్నారు. 1987లో బీపీటీ 4358, 2001లో బీపీటీ 1768 సన్నాలు, 2010లో బీపీటీ 2270 రకాల వంగడాలను సృష్టించారు. 2010లో బీపీటీ 2231, 2018లో బీపీటీ 2295 రకం ఉత్పత్తి చేయగా 2019లో బీపీటీ 2595 తేజ రకం ఉత్పత్తి చేశారు. 2020లో బీపీటీ 2782 భవతి, బీపీటీ 2411 సశ్య, 2023లో బీపీటీ 3050, బీపీటీ 2846, బీపీటీ 2841 నల్లబియ్యం, బీపీటీ 2848 హైప్రొటీన్ రకం వంగడాలను ఉత్పత్తి చేశారు. తెగుళ్లను తట్టుకునేలా నాణ్యతతో కూడిన విత్తనాలు ఉత్పత్తి చేయడం వల్లే అధిక దిగుబడులు సాధ్యమవుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఇవి కాకుండా బీపీటీ 3082, 2858 రకాలు ఉత్పత్తి అయి మినీకిట్ దశలో ఉన్నాయి.

ప్రభుత్వ ప్రోత్సాహంతో ముందుకు..

వరి పరిశోధన స్థానం ఏర్పడి ఇప్పటికి 61 ఏళ్లు గడుస్తోంది. 2018 ఏడాది వరకు 57 ఏళ్ల కాలంలో కేవలం 7 వంగడాలను సృష్టించగా.. గడచిన 4 ఏళ్ల కాలంలోనే 9 రకాల కొత్త వరి వంగడాలు ఉత్పత్తి చేయడం గమనార్హం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రోత్సాహం, తోడ్పాటు వల్లే త్వరితగతిన నూతన వంగడాల సృష్టి సాధ్యమవుతున్నదని ఇక్కడి శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కొత్త వంగడాలు సృష్టించడమే కాకుండా దేశవ్యాప్తంగా రైతులకు అవసరమైన సీడ్‌ను ఉత్పత్తి చేసి అందిస్తున్నారు. ఏటా 60 ప్రైవేటు కంపెనీలకు సీడ్‌ను అందిస్తున్నారు. రెండు, మూడేళ్లుగా ఇక్కడ ఏడాదికి 600 క్వింటాళ్ల బ్రీడర్ సీడ్ తయారు చేస్తున్నారు.

బీపీటీ విత్తనాల సాగు ఇలా.

బాపట్ల వరి పరిశోధన స్థానంలో సృష్టించిన బీపీటీ 5204 రకం విత్తనం మన రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా.. దేశవ్యాప్తంగా సుమారు 75 నుంచి 80 లక్షల ఎకరాల్లో సాగవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

రైతుల కోసం నాణ్యమైన సీడ్



బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానంలో నూతన వరి విత్తనాల ఉత్పత్తి జరుగుతున్నది. ఇక్కడ సృష్టించిన బీపీటీ 5204 రకం దేశవ్యాప్తంగా 75 లక్షల ఎకరాలకు పైగా సాగవుతుండగా.. మరికొన్ని రకాల వంగడాలకు డిమాండ్ పెరిగింది. ఇవే కాకుండా బ్లాక్‌రైస్, హైప్రొటీన్‌రైస్ వంగడాలను సిద్ధం చేశాం. ఇవన్నీ తెగుళ్లు తట్టుకోవడంతోపాటు అధిక దిగుబడినిచ్చి రైతులకు ఆదాయాన్ని తెచ్చి పెడుతున్నాయి.

– బి.కృష్ణవేణి, సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్, బాపట్ల వరి పరిశోధన స్థానం

నేడు మంగళగిరిలో ప్రపంచ చేనేతల సదస్సు



అనకాపల్లి జిల్లా గునుపూడిలో నేత చీరను పరిశీలిస్తున్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

మంగళగిరి/నాతవరం (అనకాపల్లి జిల్లా): చేనేత కేంద్రంగా అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన మంగళగిరిలో ప్రపంచ చేనేతల సదస్సు ఆదివారం నిర్వహించనున్నారు. నగరంలోని జాతీయ రహదారి వెంబడి ఉన్న ఆర్‌ఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించే సదస్సు ఏర్పాట్లను ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి శనివారం పరిశీలించారు. వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సదస్సు నిర్వహించనున్నట్లు చిరంజీవి తెలిపారు. చేనేత సామాజిక వర్గాలకు చెందిన ఎన్నారైలు సభ్యులుగా ఏర్పడిన వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్‌లో చేనేత కుటుంబాల అభివృద్ధి కోసం వివిధ అవగాహనా శిబిరాలు నిర్వహిస్తామన్నారు. సదస్సుకు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు చిరంజీవి తెలిపారు.

చేనేత కార్మికులకు రూ.3700 కోట్ల లబ్ధి..

రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు వివిధ పథకాల రూపంలో రూ.3700 కోట్ల లబ్ధి చేకూర్చిందని రాష్ట్ర ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు.అనకాపల్లి జిల్లాలోని గునుపూడిలో శనివారం చేనేత కార్మికులు మగ్గాలపై తయారు చేస్తున్న పట్టుచీరలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆప్కో ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 900 సొసైటీలు ఉన్నాయని,గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉంచిన బకాయిలను రూ.40 కోట్లు చెల్లింపులు చేసి సొసైటీలను ఆర్థికంగా బలోపేతం చేశారని చెప్పారు. కొత్తగా మరో 50 షోరూమ్‌లు ఏర్పాటు చేసేందుకు దృష్టి సారించామన్నారు. చేనేతలకు రెండు ఎమ్మెల్సీలు, ఎంపీ పదవులిచ్చి జగన్ రాజకీయంగా పెద్దపీట వేశారన్నారు. పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

'డంబుల్స్' దోస



పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో భీమవరపు ఆలామ్ అనే వ్యక్తి ఇంటి పెరడులోని దోస పాదుకు కాసిన దోసకాయ అందర్ని ఆకర్షిస్తోంది. వెయిట్ లిఫ్టర్లు కసరత్తుల కోసం ఉపయోగించే డంబుల్స్ ఆకారంలో ఉండటంతో చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబరుస్తున్నారు.

-ఆకివీడు

ఘనంగా రొట్టెల పండుగ ప్రారంభం

- భక్తులతో పోటెత్తిన నెల్లూరు బారాషహీద్ దర్గా, స్వర్ణాల చెరువు
- వరాల రొట్టెలు ఇచ్చిపుచ్చుకున్న భక్తులు
- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు



నెల్లూరు స్వర్ణాల చెరువుకు పోటెత్తిన భక్తజనం (ఇన్‌సెట్లో) సమాధులను దర్శించుకుంటున్న భక్తులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కులాలు, మతాలకతీతంగా నిర్వహించుకునే నెల్లూరు రొట్టెల పండుగ శనివారం ఘనంగా ప్రారంభమైంది. కోర్కెలు తీరిన భక్తులు రొట్టెలు వదిలేందుకు... కొత్త కోర్కెలతో రొట్టెలు తీసుకునేందుకు వచ్చిన భక్తులతో బారాషహీద్ దర్గా ప్రాంగణం తొలి రోజు కిటకిటలాడింది. వరాల రొట్టెలు మార్చుకునే స్వర్ణాల చెరువు భక్తులతో నిండిపోయింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలవారు, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు హాజరయ్యారు. ఐదు రోజులపాటు నిర్వహించనున్న రొట్టెల పండుగలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా అధికార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్, అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి ఏర్పాట్లు పర్యవేక్షించారు. అంచనాకు మించి రెట్టింపు స్థాయిలో భక్తులు వచ్చినా ఆటంకాలు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో, వివిధ ప్రైవేటు హాస్పిటల్స్ వారు స్వచ్ఛందంగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

నిఘా నీడలో...

రొట్టెల పండుగ సందర్భంగా దర్గా ఆవరణతోపాటు స్వర్ణాల చెరువు, పార్కింగ్ ప్రదేశాల్లో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆయా ప్రాంతాల్లో 50 సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. తప్పిపోయిన చిన్నారులు, వృద్ధుల సమాచారాన్ని పోలీస్ కమాండ్ కంట్రోల్ విభాగం ద్వారా తెలియజేసి వారి కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగిస్తున్నారు. స్వర్ణాల చెరువు తీరం వెంబడి చిన్నారులు లోతుగా వెళ్లకుండా పటిష్టమైన నిఘా పెట్టారు. ముఖ్యంగా మహిళా భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

జర్నలిస్టు మీద దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- ఏఎస్పీకి వినతి పత్రం ఇచ్చిన జర్నలిస్టులు



ఏఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న 'సాక్షి' జర్నలిస్టులు

ఒంగోలు టౌన్: యువగళం పాదయాత్రను కవరేజ్ చేస్తున్న 'సాక్షి' దినపత్రిక జర్నలిస్టు మీద దాడిని ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎస్.మాధవరెడ్డి తీవ్రంగా ఖండించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావుకు జర్నలిస్టులు వినతి పత్రం అందజేశారు. ఒంగోలు రూరల్ రిపోర్టర్ కరుణాకర్‌ను టెంట్‌లోకి తీసుకెళ్లి దాడి చేయడమే కాకుండా.. సెల్‌ఫోన్ లాక్కుని అందులోని ఫొటోలను డిలీట్ చేసిన విషయాన్ని ఏఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. లోకేశ్‌కు రక్షణ ఇవ్వాల్సిన ప్రైవేటు సైన్యానికి ప్రజలపై దాడులకు పాల్పడే హక్కు ఎవరిచ్చారని మాధవరెడ్డి ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎడిషన్ ఇన్‌చార్జి రవిచంద్ర, వర్కింగ్ జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టులు ఏఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.

నోటీసులిచ్చాం: ఒంగోలు డీఎస్పీ

సాక్షి జర్నలిస్టుల మీద దాడి చేసిన విషయంపై పాదయాత్ర నిర్వాహకులకు నోటీసులిచ్చినట్టు ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి తెలిపారు. సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్‌గోపాల్, వలంటీర్స్ ఇన్‌చార్జి రవినాయుడులకు నోటీస్ ఇచ్చినట్టు చెప్పారు. జర్నలిస్టుపై దాడి చేయడం నేరమని, పాదయాత్రకు తగినంత పోలీస్ భద్రతను ఇచ్చామని, ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తేవాలన్నారు.

ఈఎన్‌టీ ఆసుపత్రిలో పదేళ్ల బాలికకు అరుదైన చికిత్స

తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: కోఠిలోని ప్రభుత్వ చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) ఆసుపత్రిలో పదేళ్ల బాలికకు శనివారం అరుదైన శస్త్ర చికిత్స చేశారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ముప్పారం గ్రామానికి చెందిన పదేళ్ల హేమలత తీవ్రమైన శ్వాస ఇబ్బందితో ఆసుపత్రికి వచ్చింది. వైద్యులు ఆ బాలికకు అన్ని రకాల పరీక్షలు చేసి, శ్వాసనాళం(కెరీనా)లో ఒక పులిపిరి ఉన్నట్లు గుర్తించారు. వైద్య పరిభాషలో దానిని 'పాపిల్లోమా' అంటారని డాక్టర్లు తెలిపారు. రెండు ఊపిరితిత్తులకు ఆక్సిజన్ అందించే గాలి గొట్టం (ట్రేకియా) ఎక్కడ రెండుగా విడిపోతుందో.. అక్కడికి కొద్దిగా ఎగువ ప్రాంతంలో ఈ 'పాపిల్లోమా' పెరిగింది. అది రెండు ఊపిరితిత్తులకు కూడా ఆక్సిజన్ అందకుండా అడ్డం పడుతుంది. వాస్తవానికి ఇలాంటి పాపిల్లోమాలు స్వరపేటికలో వస్తాయి. కానీ హేమలతకు కెరీనా ప్రాంతంలో ఏర్పడింది. ఇది ప్రాణానికి అత్యంత ప్రమాదకరమని వైద్యులు వివరించారు. ప్రభుత్వ ఈఎన్‌టీ ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలో హేమలతకు ఆపరేషన్ చేసి పాపిల్లోమాను తీసివేశారు. ఆపరేషన్ విజయవంతమైనట్లు వైద్యులు ప్రకటించారు. ఆపరేషన్ తర్వాత హేమలత ఆరోగ్యం మెరుగుపడిందని వారు తెలిపారు. ఆపరేషన్ చేసిన వైద్య బృందంలో డాక్టర్ రవిశంకర్, డాక్టర్ సత్య కిరణ్, డాక్టర్ ఆశీష్, డాక్టర్ మీనా, డాక్టర్ ఉమా, డాక్టర్ నిఖిల ఉన్నారు. ఆపరేషన్ విజయవంతం చేసిన వైద్య బృందానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.శంకర్ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

శ్రీవారి ఆలయంలో నూతన రూపంలో హుండీలు!

- తరలింపునకు సులభంగా.. చోరీలకు దూరంగా..



నూతన శ్రీవారి హుండీ

తిరుమల: శ్రీవారి ఆలయంలో నూతన రూపంలో హుండీలను ఏర్పాటు చేసేందుకు టీటీడీ అధికారులు చర్యలు చేపట్టినట్లు సమాచారం. అందులో భాగంగా శనివారం శ్రీవారి ఆలయంలోకి స్టీల్‌తో తయారు చేసిన ఐదు అడుగుల హుండీని ప్రయోగాత్మకంగా తీసుకెళ్లి పరిశీలించారు. ప్రస్తుతం కొప్పెరలో భారీ గంగాళాలను ఉంచి అందులో భక్తులు కానుకలు సమర్పించేలా హుండీలను, మరికొన్ని ఇత్తడి హుండీలను ఏర్పాటు చేసి వినియోగిస్తున్నారు. వీటిని శ్రీవారి సేవకులు, బ్యాంకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ద్వారా ట్రాలీల్లో శ్రీవారి ఆలయం నుంచి బయటకు, అక్కడి నుంచి లిఫ్ట్ ద్వారా లారీలో ఎక్కిస్తున్నారు. అక్కడి నుంచి నూతన పరకామణికి తరలిస్తున్నారు. అయితే ఇటీవల హుండీ తరలింపు సమయంలో కొన్ని ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో నూతన హుండీలను తయారు చేసినట్లు తెలుస్తోంది. అదేవిధంగా కొంత మంది ఆలయంలోకి ప్రవేశించి హుండీలో భక్తులు నగదు వేస్తున్న సమయంలో హుండీ లోపలకు చేయిపెట్టి చోరీ చేసిన సంఘటనలు తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ రెండు ఇబ్బందులు రాకుండా నూతన హుండీలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. నూతన హుండీలో మూడు వైపులా భక్తులు నగదు వేయవచ్చు. అదే సమయంలో ఇందులో భక్తుడి చేయి పూర్తిగా దూరే అవకాశం లేదు. మధ్యలో ఓ ఇనుప చువ్వను ఏర్పాటు చేశారు. ఈ మేరకు నూతన హుండీ పనితీరును అధికారులు పరిశీలిస్తున్నారు. వినియోగం సులభంగా ఉంటే దీనినే ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

నేడు శ్రీవారి పాదాల వద్ద ఛత్రస్థాపనోత్సవం

తిరుమల నారాయణగిరిలోని శ్రీవారి పాదాల వద్ద ఆదివారం ఛత్రస్థాపనోత్సవం జరుగనుంది. ఏడాదికోసారి ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఆలయంలోని బంగారు బావి నుంచి తీర్థాన్ని తీసుకొచ్చి శ్రీవారి పాదాలకు తిరుమంజనం నిర్వహించి, అలంకారం, పూజ, నైవేద్యం సమర్పిస్తారు.

మోరంచపల్లి.. తీరని వ్యథ

తెలంగాణ

- వరద మిగిల్చిన నష్టంతో కోలుకోని గ్రామస్తులు
- పలు కుటుంబాలు పునరావాస శిబిరంలోనే
- వరదలో గల్లంతైన వారిలో రెండు మృతదేహాలు లభ్యం
- మరో ఇద్దరి కోసం కొనసాగుతున్న గాలింపు

భూపాలపల్లి అర్బన్/చిట్యాల: వరద తాకిడికి తీవ్రంగా నష్టపోయిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి వ్యథ ఇప్పట్లో తీరే పరిస్థితి కనిపించడం లేదు. ఎవరిని కదిలించినా కన్నీరే కనిపిస్తోంది. కట్టుబట్టలు మినహా ఏమీ మిగలేదన్న ఆవేదన వినిపిస్తోంది. వరదలో గల్లంతైన నలుగురు గ్రామస్తుల్లో ఇద్దరి మృతదేహాలు శనివారం లభించాయి. ఇందులో గొర్రె ఓదిరెడ్డి మృతదేహాన్ని చిట్యాల మండలం ఒడితల–పాశిగడ్డ పంట పొలాల్లో, గంగిడి సరోజన మృతదేహాన్ని మోరంచపల్లి నుంచి కొత్తపల్లి వెళ్లే మార్గంలోని పొలాల మధ్య గుర్తించారు. మూడు రోజులుగా నీటిలోనే ఉండటంతో మృతదేహాలు పూర్తిగా కుళ్లిపోయాయి. గల్లంతైన వారిలో గొర్రె వజ్రమ్మ, గడ్డం మహాలక్ష్మి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు.

బురద పట్టిన సామగ్రి

గ్రామంలో ఏ ఇంటి తలుపు తట్టినా కన్నీరుమున్నీరవుతున్నారు. వరద నీరు ఇళ్లలోకి చేరడంతో సామగ్రి బురదతో నిండిపోయింది. చాలా వరకు వస్తువులు, పరికరాలు పాడైపోయాయి. గ్రామస్తులు ఇళ్లలో పనికొచ్చే వాటిని శుభ్రం చేసుకుంటూ, పనికిరానివి పడేస్తూ.. ఇళ్లను శుభ్రం చేసుకుంటూ కనిపించారు. చాలా ఇళ్లలో బియ్యం, ఇతర నిత్యావసరాలు పూర్తిగా తడిసి, పాడైపోయాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రముఖ కవి జావెద్ అక్తర్‌కు సినారె సాహిత్య పురస్కారం

- తెలుగు భాషా పరిరక్షణే సినారెకు నిజమైన నివాళి
- మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు

గన్‌ఫౌండ్రీ(హైదరాబాద్): తెలుగు భాషాపరిరక్షణే జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డికి నిజమైన నివాళి అని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు అన్నారు. శనివారం ఇక్కడి రవీంద్రభారతిలో సుశీలానారాయణరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో సినారె 92వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖకవి డాక్టర్ జావెద్ అక్తర్‌కు సినారె జాతీయ సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ సినారె ఎన్నో అంశాలు పరిశోధించి ఆణిముత్యాల్లాంటి రచనలు చేశారని కొనియాడారు. అక్షరాలు నక్షత్రాలుగా నిలుస్తున్నాయనడానికి సినారె కవితలే నిదర్శనమన్నారు. సినారె సొంత ప్రాంతంలో ఆయన పేరిట భవనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ సినారె రచనలు సృజనాత్మకంగా ఉంటాయే తప్ప ఎదుటివారిని కించపరిచే విధంగా ఉండవని అన్నారు. జావేద్ అక్తర్ మాట్లాడుతూ సినారె సాహిత్య పురస్కారాన్ని అందుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు దీపికారెడ్డి, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సినారె కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

నిద్రిస్తున్న బాలుడిని కాటేసిన రెండు పాములు

- చికిత్స పొందుతూ మృతి.. నిజామాబాద్ జిల్లాలో ఘటన

నవీపేట: ఇంట్లో నిద్రిస్తున్న బాలుడిని రెండు పాములు కాట్లు వేయడంతో మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. నవీపేట మండలం బినోల గ్రామానికి చెందిన మంగళి భూమేష్, అర్పిత దంపతులకు రెండున్నరేళ్ల కుమారుడు రుద్రాన్ష్, మూడు నెలల కూతురు ఉన్నారు. ఆ దంపతులు పిల్లలతో కలిసి తమ పెంకుటింట్లో ఎప్పటిలాగే శుక్రవారంరాత్రి నిద్రపోయారు. అది పురాతన ఇల్లు కావడంతో ఇటీవల కురిసిన వర్షాలకు పైకప్పు పాక్షికంగా కూలింది. ఈ క్రమంలో రాత్రి 12 గంటల ప్రాంతంలో రెండు పాములు ఇంట్లోకి చొరబడి నిద్రిస్తున్న రుద్రాన్ష్ చేయిపై కాట్లు వేశాయి. రెండు పాములు ఒకేసారి కుట్టడంతో ఆ బాలుడు ఒక్కసారిగా కేకలేశాడు. వెంటనే మేల్కొన్న తల్లి అర్పిత గమనించి ఆ పాములను దూరంగా విసిరేసింది. భూమేష్ కర్రతో ఆ పాములను చంపేసి, బాలుడిని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. బాలుడు చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు.

భద్రాచలం వద్ద మహోగ్రంగానే..

- వానలు తెరిపినిచ్చినా ఉప నదుల పరవళ్లతో గోదావరిలో పెరిగిన వరద
- భద్రాచలం వద్ద 55.8 అడుగులకు చేరిన నీటి మట్టం
- కొనసాగుతున్న మూడో ప్రమాద హెచ్చరిక
- ఎగువన ప్రాజెక్టుల్లో తగ్గిన ఇన్‌ఫ్లో..
- ఆదివారం నుంచి భద్రాచలం వద్ద శాంతించనున్న గోదావరి
- శ్రీశైలం ప్రాజెక్టుకు 1.51 లక్షల క్యూసెక్కుల ప్రవాహం.. 58.81 టీఎంసీల నిల్వ
- కృష్ణా నదిలోనూ ఎగువ నుంచి తగ్గుతున్న వరద

సాక్షి, హైదరాబాద్/ భద్రాచలం/ గద్వాల రూరల్/ ధరూర్/ దోమలపెంట: రాష్ట్రవ్యాప్తంగా వానలు తెరిపినిచ్చినా.. ఇప్పటికే చేరిన నీటితో ఉప నదులు, వాగులు పరవళ్లు తొక్కుతుండటంతో గోదావరి మహోగ్ర రూపం కొనసాగుతోంది. శనివారం రాత్రి 10 గంటలకు భద్రాచలం వద్ద ప్రవాహం సుమారు 16 లక్షల క్యూసెక్కులకు, నీటి మట్టం 56 అడుగులకు పెరిగింది. భారీగా వరద వస్తుండటంతో నీటి మట్టం మెల్లగా పెరుగుతూనే ఉంది. దీనితో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల వారిని పునరావాస శిబిరాల్లోనే ఉంచారు. మంత్రి పువ్వాడ అజయ్, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవిత తదితరులు సహాయక చర్యలను పరిశీలించి, బాధితులను పరామర్శించారు. శనివారం మధ్యాహ్నం 2 గంటల వరకు కూడా పునరావాస కేంద్రాల్లోని బాధితులకు భోజనం పెట్టకపోవడంతో వారంతా రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఆర్డీఓ మాధవి దీనిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారులు 3 గంటలకు భోజనం అందించారు.

ఎగువ నుంచి తగ్గుతూ..

ఇక మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లలో వర్షాలు ఆగిపోవడంతో.. ఎగువన గోదావరిలో వరద తగ్గుతోంది. శ్రీరాంసాగర్‌లోకి ప్రవాహం 60వేల క్యూసెక్కులకు పడిపోవడంతో ప్రాజెక్టు గేట్లను మూసేశారు. ఎల్లంపల్లి వద్ద 2.95 లక్షలు, పార్వతి బ్యారేజీ వద్ద 3.01 లక్షలు, సరస్వతి బ్యారేజీ వద్ద 1.98 లక్షలు, మేడిగడ్డ బ్యారేజ్ వద్ద 10.80 లక్షల క్యూసెక్కులకు వరద తగ్గింది. ఈ క్రమంలో ఆదివారం భద్రాచలం వద్ద గోదావరి శాంతించనుంది. భద్రాచలం నుంచి వెళ్తున్న భారీ వరద పోలవరం, ధవళేశ్వరం మీదుగా కడలిలోకి వెళ్లిపోతోంది.

శ్రీశైలంలోకి 1.51 లక్షల క్యూసెక్కులు

కృష్ణా ప్రధాన పాయ, తుంగభద్రలలోనూ వరద తగ్గుముఖం పట్టింది. ఎగువన కృష్ణాలో ఆల్మట్టిలోకి 1.30 లక్షల క్యూసెక్కులు, నారాయణ్‌పూర్‌లోకి 88,228 క్యూసెక్కులు వరద వస్తోంది. ఆ ప్రాజెక్టుల్లో కాస్త నీటిని నిల్వ చేస్తూ, మిగతా దిగువకు వదులుతున్నారు. జూరాలకు శనివారం ఉదయం నుంచి సాయంత్రం దాకా 2.20 లక్షల క్యూసెక్కుల వరదరాగా.. సాయంత్రానికి 1,35,900 క్యూసెక్కులకు తగ్గింది. ఇక్కడ గేట్లు, విద్యుత్ సరఫరా ద్వారా కలిపి 1,48,875 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. దీనికి సుంకేశుల నుంచి 2,181 క్యూసెక్కులు కలిపి.. మొత్తం 1,51,056 క్యూసెక్కుల ప్రవాహం శ్రీశైలంలోకి చేరుతోంది. శనివారం రాత్రి 9 గంటలకు ప్రాజెక్టులో నీటి నిల్వ 61.79 టీఎంసీలకు పెరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు. ప్రాజెక్టు నిండాలంటే మరో 157 టీఎంసీలు కావాలి. ఇక తెలంగాణలో వర్షాలు తెరిపి ఇవ్వడంతో మూసీలో వరద తగ్గింది. పులిచింతల ప్రాజెక్టులోకి 11,949 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 30.78 టీఎంసీలకు చేరుకుంది. మరోవైపు తుంగభద్ర డ్యామ్‌లోకి 84,202 క్యూసెక్కులు చేరుతుండగా.. నీటి నిల్వ 69.23 టీఎంసీలకు పెరిగింది.

క్లుప్తంగా...

సంపూర్ణంగా కోలుకున్న లాలూ

న్యూఢిల్లీ: కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స తర్వాత ఆర్‌జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ అనారోగ్యం నుంచి సంపూర్ణంగా కోలుకున్నారు. చాలా హుషారుగా బ్యాడ్మింటన్ ఆడుతూ కనిపించారు. లాలూ ఆడుతున్న వీడియోని ఆయన కుమారుడు, బిహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ''దేనికీ భయపడరు. దేనికీ తలవంచరు. పోరాడారు. పోరాడుతూనే ఉంటారు. జైల్లో పెట్టినా బెదరలేదు. అంతిమంగా విజయమే సాధించారు'' అని తేజస్వి యాదవ్ క్యాప్షన్ పెట్టారు.

నేడే పీఎస్‌ఎల్‌వీ సీ-56 ప్రయోగం



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): పీఎస్‌ఎల్‌వీ సీ-56 ఉపగ్రహ వాహకనౌకకు శనివారం ఉదయం 5.01 గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియ మొదలైంది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో), న్యూస్పేస్ ఇండియా తిరుపతి జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఆదివారం ఉదయం 6.31 గంటలకు దీనిని ప్రయోగించనున్నారు. 25.30 గంటలపాటు కౌంట్‌డౌన్ సాగుతుంది. శుక్రవారం సాయంత్రం ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ షార్‌కు చేరుకున్నారు. శాస్త్రవేత్తలతో సమీక్ష నిర్వహించి కౌంట్‌డౌన్ ప్రక్రియను ప్రారంభించారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ సజావుగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా రాకెట్‌కు నాలుగో దశలో 0.8 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపే ప్రక్రియను చేపట్టారు. శనివారం రాత్రికి రాకెట్‌కు రెండో దశలో 41 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపుతారు. ఈ ప్రయోగంలో సింగపూర్‌కు చెందిన 7 ఉపగ్రహాలను నియో ఆర్బిట్‌లోకి ప్రవేశ పెట్టనున్నారు.



హరియాణా నుంచి వచ్చిన మహిళలతో సరదాగా ముచ్చటిస్తున్న సోనియా గాంధీ, ప్రియాంక



తాము తెచ్చిన తినుబండారాలను రాహుల్‌కు తినిపిస్తున్న దృశ్యం

మీరే పిల్లను చూడండి..!

రాహుల్ పెళ్లి ప్రస్తావన తెచ్చిన హరియాణా మహిళా రైతులతో సోనియా గాంధీ ముచ్చట్లు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పెళ్లి ప్రస్తావన మరోసారి నవ్వులు పూయించింది. హరియాణాకు చెందిన కొందరు మహిళలు ఢిల్లీలోని టెన్ జన్‌పథ్‌కు వచ్చి సోనియాగాంధీ కుటుంబంతో కాసేపు గడిపారు. వారిని సాదరంగా ఆహ్వానించిన గాంధీ కుటుంబం ఆతిథ్యమిచ్చింది. ఆ మహిళలతో కలిసి సోనియా, ప్రియాంక, రాహుల్ భోజనాలు చేశారు. ఆ తర్వాత కాసేపు వారితో ముచ్చటించారు. వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. ఓ మహిళ సోనియాతో ''రాహుల్‌కి పెళ్లి చేద్దామా'' అని అడిగారు. దానికి సోనియా నవ్వుతూ ''మీరే పిల్లని చూడండి'' అని వాళ్లతో చెప్పారు. పక్కనే ఉండి ఇదంతా వింటున్న రాహుల్ ''అవుతుంది. అవుతుంది'' అని అన్నారు. దీంతో ప్రియాంక రాహుల్ స్వీట్‌గా కనిపిస్తున్నా చాలా కొంటెవాడని చెప్పారు. వారి సమావేశం అంతా ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగింది. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో పాల్గొన్నప్పుడు హరియాణా సోనిపట్ జిల్లాకు చెందిన మహిళలతో ముచ్చటించారు. వ్యవసాయ క్షేత్రాల్లో మహిళా కార్మికులతో కలిసి నాట్లు వేశారు. తాము ఇప్పటివరకు దేశ రాజధాని ఢిల్లీని చూడలేదని వారు చెబితే అప్పట్లోనే రాహుల్ వారికి ఢిల్లీకి పిలుస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు వారికి ఢిల్లీ చూపించాక తమ నివాసంలో భోజన ఏర్పాట్లు చేశారు. కొందరు మహిళలు రాహుల్‌కు ప్రేమగా తినిపించారు. దీనికి సంబంధించిన వీడియోని రాహుల్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ''మా ఇంటికి ప్రత్యేక అతిథులు వచ్చారు. ఈ రోజు మా అందరికీ బాగా గుర్తుండిపోతుంది. వారితో కలిసి భోజనం చేశాం. ముచ్చట్లు చెప్పుకున్నాం. వారంతా మాకు ఎంతో అమూల్యమైన కానుకలు ఇచ్చారు. దేశీ నెయ్యి, స్వీట్ లస్సీ, ఇంట్లో చేసిన ఊరగాయలు ఎంతో ప్రేమతో ఇచ్చారు'' అని రాహుల్ ట్వీట్ చేశారు. ఆ మహిళలతో కలిసి సోనియా, ప్రియాంక స్టెప్పులు వేశారు.

ఇదీ నేపథ్యం...

నా ఇంటిని ప్రభుత్వం లాగేసుకుంది

జూలై 8న భారత్ జోడో యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ హరియాణాలోని సోనిపట్ జిల్లా మదినా గ్రామానికి వెళ్లారు. అక్కడి గ్రామస్తులతో మాట్లాడారు. వ్యవసాయ క్షేత్రాల్లో రైతులు, రైతు కూలీలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కొందరు మహిళలు ఢిల్లీలోని రాహుల్ సొంతింటిని గురించి అడిగారు. అందుకు రాహుల్..తనకు సొంతిల్లు లేదని, దానిని ప్రభుత్వం తీసేసుకుందని బదులిచ్చారు. ఢిల్లీలోని తన సోదరి ప్రియాంకా గాంధీ వాద్రాకు ఫోన్ చేశారు. రైతు మహిళలు భోజనానికి రావాలనుకుంటున్నారని చెప్పారు...ఇదంతా 12 నిమిషాల నిడివున్న వీడియోలో ఉంది.



వారితో కలిసి నృత్యం చేస్తూ..

ఆ పాప నా మనవరాలే : బైడెన్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కుటుంబ వ్యవహారంపై గత కొన్నాళ్లుగా జరుగుతున్న చర్చకు ఆయన ఎట్టకేలకు తెర దించారు. నేవీ జాన్ రాబర్ట్స్ అనే నాలుగేళ్ల చిన్నారి తన మనవరాలేనని అంగీకరించారు. ఆ పాప తన ఏడవ మనవరాలని ఒక ప్రకటనలో వెల్లడించారు. '' నా కుమారుడు హంటర్ బైడెన్, లండెన్ రాబర్ట్‌లకు 2018లో కలిగిన సంతానమే చిన్నారి నేవీ. హంటర్, లండెన్‌లు తమ కుమార్తె క్షేమం కోసం వారిద్దరి మధ్య సంబంధాలను పెంపొందించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు'' అని ఆ ప్రకటనలో చెప్పారు. ఇదేమీ రాజకీయ వ్యవహారం కాదని, కుటుంబ వ్యవహారమని స్పష్టం చేశారు. నేవీతో పాటుగా తమ మనవలు, మనవరాళ్లు అందరికీ అంతా మంచి జరగాలని తాను, జిల్ బైడెన్ కోరుకుంటున్నామని బైడెన్ పేర్కొన్నారు. నేవీ రాబర్ట్స్ పెంపకం బాధ్యతలపై తల్లి లండెన్ రాబర్ట్ కోర్టుకెక్కిన సమయంలో వారిద్దరి మధ్య సంబంధం వెలుగులోకి వచ్చింది. అప్పట్లోనే డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించిన కోర్టు నేవీ తండ్రి హంటర్ బైడెనేనని నిర్ధారించింది. హంటర్ బైడెన్ 2021లో తాను రాసిన పుస్తకంలో లండెన్‌తో సంబంధం గురించి రాశారు. డ్రగ్స్‌కు బానిసగా ఉన్న సమయంలో ఆమె తన జీవితంలోకి వచ్చిందని ఆ తర్వాత ఆమెని మర్చిపోయానని ఆ పుస్తకంలో రాశారు. అయితే కోర్టు ఆదేశాల మేరకు పాప బాధ్యతను తాను కూడా తీసుకున్నానని అందులో రాసుకొచ్చారు. ఇంత జరిగినా అధ్యక్షుడు బైడెన్ ఈ వ్యవహారంపై స్పందించకపోవడం చిన్నారి నేవీని మనవరాలిగా స్వీకరించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో బైడెన్ ఈ ప్రకటన చేశారు.



బైడెన్ హంటర్



నేవీ

ఆర్‌టీఐ దరఖాస్తుకు 40 వేల పేజీల సమాధానం

ఎస్‌యూవీలో నింపుకుని తీసుకెళ్లిన దరఖాస్తుదారు

ఇండోర్: సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ)కింద అడిగిన ప్రశ్నకు అధికారులు 40 వేల పేజీల సమాధానం ఇచ్చారు. దీంతో, దరఖాస్తుదారు వాటన్నిటినీ ఎస్‌యూవీ వాహనంలో కుక్కి ఇంటికి తీసుకెళ్లాల్సి వచ్చింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఘటన చోటుచేసుకుంది. కోవిడ్ మహమ్మారి ప్రబలిన సమయంలో కొనుగోలు చేసిన మందులు, వైద్య పరికరాలు, అనుబంధ సామగ్రికి సంబంధించిన వివరాలు కోరుతూ ధర్మేంద్ర శుక్లా అనే వ్యక్తి ఇండోర్ ప్రధాన వైద్య, ఆరోగ్య అధికారి(సీఎంహెచ్‌వో)కు దరఖాస్తు చేసుకున్నా రు. నిబంధనల ప్రకారం నెల రోజుల్లోగా అధికారుల నుంచి ఆయనకు సమాధానం రాలేదు. దీంతో, శుక్లా మొదటి అప్పిలేట్ అధికారి డాక్టర్ శరద్‌గుప్తా దృష్టికి తీసుకెళ్లారు. సమాచారాన్ని ఉచితంగా శుక్లాకు అందజేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. సీఎంహెచ్‌వో నుంచి అందిన సమాచారం మేరకు శుక్లా కార్యాలయానికి వెళ్లారు. అధికారులు ఆయనకు 40 వేల పేజీల సమాచారాన్ని అందజేశారు. వాటన్నిటినీ తన ఎస్‌వీయూలో కుక్కి ఇంటికి తీసుకెళ్లారు. తన వాహనంలో డ్రైవర్ సీటుకు మినహా అంతా కాగితాలతోనే నిండిపోయిందని శుక్లా శనివారం తెలిపారు. అధికారులు అడిగిన సమాచారాన్ని నెల రోజుల్లోగా ఇవ్వనందునే నిబంధనల ప్రకారం పేజీకి రూ.2 చొప్పున రుసుము ఇవ్వలేదని కూడా ఆయన వివరించారు. కాగా, దరఖాస్తు దారు అడిగిన సమాచారాన్ని సకాలంలో అందివ్వకుండా ప్రభుత్వ ఖజానాకు రూ.80 వేల మేరకు నష్టం కలిగేందుకు కారణమైన అధికారిపై తగు చర్యలు తీసుకోవాలంటూ సీఎంహెచ్‌వోను ఆదేశించినట్లు అప్పిలేట్ అధికారి తెలిపారు.

ఎన్‌ఈపీలో ప్రతి భారతీయ భాషకు తగు గౌరవం



ఢిల్లీలో అఖిలభారతీయ శిక్షా సమాగంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడి

న్యూఢిల్లీ: నూతన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) ద్వారా దేశంలోని ప్రతి భాషకూ సముచిత గౌరవం లభిస్తుందని ప్రధాని మోదీ చెప్పారు. స్వార్థ ప్రయోజనాల కోసం భాషపై రాజకీయం చేసే వారు తమ దుకాణాలను మూసేసుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. శక్తి సామర్థ్యాల ఆధారంగా కాకుండా భాష ప్రాతిపదికన ప్రతిభను అంచనా వేయడం వల్ల విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోందని చెప్పారు. ఎన్‌ఈపీ ప్రారంభమై మూడో వార్షికోత్సవా న్ని పురస్కరించుకుని ఏర్పాటైన 'అఖిల భారతీయ శిక్షా సమాగమ్'నుద్దేశించి ఆయన ప్రసంగించారు. 'మాతృభాషలో విద్యా బోధన ద్వారా భారతీయ విద్యార్థులకు న్యాయం చేసే కొత్త రూపానికి నాంది పలుకుతోంది. సామాజిక న్యాయం దిశగా ఇది చాలా ముఖ్యమైన అడుగు'అని ప్రధాని అన్నారు. ప్రపంచంలోని అనేక భాషలు, వాటి ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి.. అనేక అభివృద్ధి చెందిన ముఖ్యంగా యూరప్ దేశాలు విద్యాబోధన స్థానిక భాషల్లో జరుగుతున్నందునే ఒక అడుగు ముందుకు వేశాయని చెప్పారు. మన దేశంలో అనేక ప్రాచీన భాషలున్నప్పటికీ, వాటిని వెనుకబాటుకు చిహ్నంగా చూపుతు న్నారని, ఇంగ్లిష్ మాట్లాడలేని వారిని విస్మరించారని, వారి ప్రతిభను గుర్తించడం లేదని మోదీ విచారం వ్యక్తం చేశారు. 'ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులు ఎక్కువగా నష్టపోతున్నారు. ఎన్‌ఈపీ రాకతో దేశం ఇప్పుడు ఈ నమ్మకాన్ని విస్మరించడం ప్రారంభించింది. ఐక్యరాజ్యసమితిలో కూడా నేను భారతీయ భాషలోనే మాట్లాడతాను' అని చెప్పారు. సామాజిక శాస్త్రాల నుంచి ఇంజినీరింగ్ విద్య వరకు అన్ని సబ్జెక్టుల్లోనూ భారతీయ భాషల్లోనే బోధిస్తున్నారని తెలిపారు. భాషపై విద్యార్థులు పట్టుసాధించగలిగితే, ఎలాంటి అవరోధాలు లేకుండా వారిలో నైపుణ్యం, ప్రతిభ బయటికొస్తాయని ప్రధాని అన్నారు. ప్రపంచం భారతదేశాన్ని కొత్త అవకాశాల వేదికగా చూస్తోంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) క్యాంపస్‌లను ఏర్పాటు చేయాలంటే అనేక దేశాలు కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదిస్తున్నాయని వెల్లడించారు. ఇప్పటికే టాంజానియా, అబుధాబిల్లో ఐఐటీ క్యాంపస్‌లు నెలకొల్పారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ శ్రీ (ఎస్‌హెచ్‌ఆర్‌ఐ) పథకం కింద మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ నిధులను విడుదల చేశారు.

నెలకు రూ.5లక్షలు చొప్పున 25 ఏళ్లపాటు

భారతీయుడిని వరించిన లాటరీ



దుబాయ్: యూఈఏలో ఉంటున్న ప్రవాస భారతీయుడిని అనుకోని అదృష్టం వరించింది. ఆయన కొనుగోలు చేసిన లాటరీ టికెట్ బంపర్ ఆఫర్ గెలుచుకుంది. నెలకు రూ.5.5 లక్షల చొప్పున 25 ఏళ్లపాటు అందుకునే అవకాశం లభించింది. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు చెందిన మహ్మద్ ఆదిల్ ఖాన్ ఆర్కిటెక్టుగా దుబాయ్‌లో పనిచేస్తున్నారు. ఆయన ఇటీవల ఫాస్ట్5 గ్రాండ్ లాటరీ టికెట్ కొనుగోలు చేశారు. ఈ నెల 22న తీసిన డ్రాలో ఆదిల్ టిక్కెట్ మొదటి బహుమతి గెలుచుకుంది. దీని కింద ఆదిల్‌కు నెలకు 25 వేల దిర్హామ్‌లు(సుమారు రూ.5.5 లక్షలు) వచ్చే 25 ఏళ్లపాటు అందుతుంది. ఈ విషయం తెలిసిన ఆదిల్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. 'నా కష్టాలు తీరాయి. వృద్ధులైన తల్లిదండ్రులతోపాటు తమ్ముడు చనిపోవడంతో అతడి కుటుంబ భారం కూడా నాపైనే పడింది. నాకు భార్య, ఒక కొడుకు ఉన్నాడు. ఈ డబ్బుతో ఇక్కడే ఇల్లు కొనుక్కుంటాం. నా కుటుంబాన్ని యూఏఈకి తీసుకవస్తా'అని ఆదిల్ అంటున్నారు. 'నేను లాటరీ టికెట్ కొనడం, దానికి ఇంత భారీ ప్రైజ్ దక్కడం ఇదే మొదటిసారి'అని ఆదిల్ తెలిపారు. ఈయన 2018లో సౌదీ అరేబియా నుంచి దుబాయ్ వెళ్లారు.

'ఇండియా' కూటమి భేటీ వాయిదా?

న్యూఢిల్లీ: ముంబైలో ఆగస్టులో జరగాల్సిన ప్రతిపక్ష ఇండియా కూటమి నేతల భేటీ సెప్టెంబర్ మొదటి వారానికి వాయిదా పడే అవకాశాలు కన్పిస్తున్నాయి. కూటమిలోని కొందరు నేతలు ఇతర కార్యక్రమాలతో బిజీగా ఉన్నామంటున్నందున ఆగస్టు 25, 26వ తేదీల్లో సమావేశం జరక్కపోవచ్చని విశ్వసనీయ వర్గాలంటున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీని ఢీకొట్టే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీల నేతల మొదటి రెండు సమావేశాలు పట్నా, బెంగళూరుల్లో జరిగిన విషయం తెలిసిందే.

ఫ్లాట్‌కు అడ్వాన్స్ రూ.25 లక్షలా!

- షాకైన బెంగళూరు టెక్ కంపెనీ సీఈవో
- పెద్ద ఎత్తున స్పందించిన నెటిజన్లు



బెంగళూరు: ఫ్లాట్ అద్దె అడ్వాన్సు రూ.25 లక్షలంటూ వచ్చిన ట్వీట్‌పై నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కోవిడ్ అనంతరం టెక్ ఉద్యోగులు వర్క్‌ఫ్రం హోం నుంచి తిరిగి ఆఫీసులకు వస్తుండటంతో బెంగళూరులో ఇళ్ల అద్దెలు ఏ స్థాయిలో పెరిగాయనేందుకు ఉదాహరణ ఇది. నగరంలోని హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్‌లో ఓ ఫ్లాట్‌కు అద్దె నెలకు రూ.2.5 లక్షలు కాగా, అడ్వాన్స్ రూ.25 లక్షలంటూ ఓ వ్యక్తి చేసిన ట్వీట్‌కు పెద్ద సంఖ్యలో యూజర్లు ఛలోక్తులు సంధించడంతోపాటు మండిపోతున్న ధరలపై ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా అనంతరం ఐటీ కంపెనీలు వర్క్ ఫ్రం హోంతోపాటు ఆఫీసుల్లోనూ విధులకు హాజరవ్వాలంటూ ఉద్యోగులకు ఆప్షన్ ఇచ్చాయి. చాలా వరకు కంపెనీలు మళ్లీ ఆఫీసులకొచ్చి డ్యూటీ చేయాలంటూ ఆదేశాలిచ్చాయి. ఉద్యోగులు తిరిగి ఆఫీసులకు చేరుతుండటంతో ఇళ్ల అద్దెలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. ఖరీదైన ప్రాంతాల్లోనైతే యజమానులు మరీ ఎక్కువగా డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని తేజస్వీ శ్రీవాస్తవ అనే టెక్ కంపెనీ సీఈవో ట్విట్టర్‌లో ప్రస్తావించారు. హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్‌లోని 4 బీహెచ్‌కే ఫ్లాట్‌కు నెల వారీ రెంట్ రూ.2.5 లక్షలు, డిపాజిట్ రూ.25 లక్షలంటూ ఉన్న ప్రకటనను చూసి ఆయన షాకయ్యారు. అడ్వాన్స్‌కు అవసరమైన మొత్తానికి లోన్ ఆప్షన్ కూడా ఉండటం ఆయన్ను మరింత షాక్‌కు గురి చేసింది. ఆయన ఈ ప్రకటనను స్క్రీన్ షాట్ తీసి ట్విట్టర్‌లో పెట్టారు. 'కిడ్నీ అమ్ముకోవడానికి కూడా ఆప్షన్ ఉంటే బాగుండేది'అంటూ శ్రీవాస్తవ క్యాప్షన్ ఇచ్చారు. ఆ ట్వీట్లపై కామెంట్లు పోటెత్తాయి. కొందరు నెటిజన్లు ఇంటి అద్దెలపై ఆగ్రహాన్ని వ్యక్తం చేయగా ఇంకొందరు రుణం కోసం దరఖాస్తు చేసుకునే ఆప్షన్‌పై మండిపడ్డారు.చివరి రెండు సున్నాల ముందు చుక్క పెట్టడం మరిచిపోయారేమో అంటూ మరో వ్యక్తి వ్యంగ్యంగా కామెంట్ చేశారు.

బాణాసంచా యూనిట్‌లో పేలుడు

తమిళనాట 8 మంది మృతి



హోసూరు: తమిళనాడులోని క్రిష్ణగిరి జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. క్రిష్ణగిరి పట్టణంలో ఓ టపాకాయల తయారీ యూనిట్‌లో పేలుడు సంభవించి 8 మంది మృతి చెందగా, మరో 20 మందికి పైగా గాయాలపాలయ్యారు. క్రిష్ణగిరి పాతపేటకు చెందిన రవి అదే ప్రాంతంలో అనధికారికంగా టపాకాయల తయారీ యూనిట్‌ను నిర్వహిస్తున్నాడు. ఇందులో కుటుంబ సభ్యులతో కలిపి 10 మందికి పైగా పనిచేస్తున్నారు. శనివారం ఉదయం 9.45 గంటల ప్రాంతంలో ఆ భవనంలో భారీ విస్ఫోటం సంభవించింది. ఆ తాకిడికి భవనంతో పాటు పక్కనే ఉన్న మూడిళ్లు నేలమట్టమయ్యాయి. కొన్ని ద్విచక్ర వాహనాలు తుక్కుతుక్కయ్యాయి. ప్రమాదంలో యజమాని రవి, కొడుకు రుతీష్, కూతురు రుతిక, ముగ్గురు పనివారు, అలాగే దగ్గరలో టీ హోటల్ నిర్వాహకులు ఇద్దరితో కలిపి మొత్తం 8 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మరో 20 మందికి పైగా గాయాలపాలయ్యారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తోనే పేలుడు జరిగిందని అంచనా. ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి పరిహారంగా ప్రకటించారు.

మణిపూర్‌లో ఇండియా

- 20 మంది ఎంపీల బృందం పర్యటన
- శిబిరాల్లో బాధితులతో మాటామంతి
- ఈ హింసతో దేశ ప్రతిష్ట దెబ్బ తింది
- అయినా మౌనమే మోదీ భాష: కాంగ్రెస్
- వాళ్లది ఫక్తు రాజకీయ నాటకం: బీజేపీ



ఇంఫాల్: కొంతకాలంగా హింసాకాండతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో విపక్ష 'ఇండియా' కూటమి రెండు రోజుల పర్యటన శనివారం మొదలైంది. ఇందుకోసం కాంగ్రెస్‌తో పాటు పలు పార్టీలకు చెందిన 21 మంది ఎంపీల బృందం శనివారం మణిపూర్ రాజధాని ఇంఫాల్ చేరింది. కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరితో పాటు కనిమొళి (డీఎంకే), సుష్మితా దేవ్ (తృణమూల్ కాంగ్రెస్), ఆర్జేడీ, ఆరెల్డీ, జేఎంఎం, సీపీఎం, సీపీఐ, ఆరెస్పీ తదితర పార్టీల ఎంపీలు వీరిలో ఉన్నారు. రాజకీయాలు చేసేందుకు రాలేదని అధీర్ స్పష్టం చేశారు. ''కేవలం బాధితులను కలిసి వారి సమస్యలను అర్థం చేసుకోవడమే మా ఉద్దేశం. సమస్యకు పరిష్కారానికి అన్ని పార్టీలూ చిత్తశుద్ధితో కృషి చేద్దాం'' అని పిలుపునిచ్చారు. మణిపూర్ కల్లోలం దేశ ప్రతిష్టను దెబ్బ తీస్తోందన్నారు. శనివారం తొలి రోజు ఇంఫాల్‌తో పాటు మొయిరంగ్, విష్ణుపూర్ జిల్లాలతో పాటు తాజాగా హింసాకాండ చెలరేగిన చౌరాచంద్‌పూర్‌లో కూడా ఎంపీల బృందం పర్యటించింది. కుకీ తెగకు చెందిన బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించింది. వారికి ధైర్యం చెబుతూ గడిపింది. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించేలా ఒత్తిడి తేవాలని బాధితులు వారిని కోరారు. అనంతరం ఎంపీలు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో హింసాకాండ బీజేపీ ఉద్దేశపూర్వకంగా అమలు చేస్తున్న కుట్ర ఫలితమేనని ఆరోపించారు. మణిపూర్ అంశంపై ప్రధాని, కేంద్ర మంత్రులు దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని అధీర్ దుయ్యబట్టారు. ''మమ్మల్ని పార్లమెంటులో నోరెత్తనివ్వడం లేదు. అందుకే నేరుగా ప్రభావిత ప్రాంతాలకే వచ్చి, బాధితులతో మమేకమవుతున్నాం. వారు అనుభవించిన చిత్రహింసలకు సంబంధించిన దారుణ గాథలను వారి నోటే విని చలించిపోయాం'' అని చెప్పారు. భద్రతా కారణాల రీత్యా ఇంఫాల్ నుంచి హెలికాప్టర్‌లో బృందం పర్యటన సాగింది. ఆదివారం వారు గవర్నర్ అనసూయా ఉయికెను కలిసి సమస్యపై చర్చిస్తారని సమాచారం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు గవర్నర్ తెలిపారు. ఇరు తెగత వారితోనూ చర్చలు జరుపుతున్నట్టు చెప్పారు. శనివారం చౌరాచంద్‌పూర్‌లో పునరావాస శిబిరాన్ని ఆమె సందర్శించారు.

భారీ ర్యాలీ

విపక్ష ఎంపీలు మణిపూర్‌లో అడుగు పెట్టిన రోజే రాష్ట్రంలో పలు జిల్లాలకు చెందిన వేలాది మంది కుకీ తెగ ప్రజలు ఇంఫాల్‌లో భారీ ర్యాలీ జరిపారు. తమ ప్రాబల్యమున్న ప్రాంతాలకు ప్రత్యేక పరిపాలన కావాలంటూ నినదించారు. మణిపూర్ సమగ్ర సమన్వయ కమిటీ సారథ్యంలో ఐదు కిలోమీటర్ల మేర ర్యాలీ జరిగింది.

ఈ గొంతులు అప్పుడేమైనట్టు: బీజేపీ

మణిపూర్‌లో విపక్ష ఎంపీల పర్యటన ఫక్తు రాజకీయ నాటకమని బీజేపీ దుయ్యబట్టింది. గత ప్రభుత్వాల హయాంలో మణిపూర్ భగ్గున మండి నెలల తరబడి స్తంభించినప్పుడు వీరంతా పార్లమెంటులో కనీసం నోరైనా ఎత్తలేదెందుకని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ ప్రశ్నించారు. బీజేపీ విమర్శలను ఇండియా బృందం తిప్పికొట్టింది. ''ప్రధాని సారథ్యంలో అఖిలపక్ష బృందం మణిపూర్‌లో పర్యటిస్తే అందులో ఆనందంగా భాగస్వాములం అయ్యేవాళ్లం. కానీ అందరికంటే ముందుగా, ఎక్కువగా స్పందించాల్సిన ఆయన అసలు సోదిలో కూడా లేకుండాపోయారు'అంటూ దుయ్యబట్టింది.

భర్త, కొడుకుల మృతదేహాలు చూపించండి

తన కుమారుడు, భర్త మృతదేహాలనైనా చూపించండంటూ అత్యాచార బాధితురాలు విపక్ష ఎంపీలను కోరారు. మణిపూర్‌లో ఇద్దరు మహిళలను ప్రత్యర్థి తెగకు చెందినవారు నగ్నంగా ఊరేగించడం తెలిసిందే. వారిలో ఒక మహిళను ఎంపీలు కనిమొళి (డీఎంకే), సుష్మితాదేవ్ (టీఎంసీ) కలిసి ధైర్యం చెప్పారు. అనంతరం ఎంపీలు మీడియాతో మాట్లాడుతూ ఈమె భర్తను, కొడుకును చంపడంతో పాటు ఆమె కూతురిపై కూడా అత్యాచారానికి ఒడిగట్టారన్నారు. ఈ కేసు విచారణను శనివారం సీబీఐ చేపట్టింది. మణిపూర్ హింసపై ఆరు కేసులను సీబీఐ దర్యాప్తు చేస్తోంది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం । 30 । జూలై । 2023



భళిరా పులి

పులిలా నటించడం అంటే పిల్లలకు ఎనలేని సరదా. పులుల దినోత్సవం నేపథ్యంలో శనివారం బెంగళూరు చామరాజపేటెలో డాన్ బాస్కో విద్యార్థుల ప్రదర్శన

న్యూస్‌రీల్

కాంగ్రెస్ టికెట్ కోరిన బీజేపీ నేత

చిక్కబళ్లాపురం: బీజేపీ మాజీ మంత్రి సుధాకర్ రాబోయే లోక్‌సభ ఎన్నికలో కాంగ్రెస్ నుంచి పోటీ చేయడానికి పార్టీ పెద్దలను కలిసి టికెట్ అడిగినది నిజం అని స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ చెప్పారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీ పెద్దలు ఎట్టి పరిస్థితిలోను ఆయనను చేర్చుకొనేది లేదని అన్నారు. సుధాకర్‌కు టికెట్ రాకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని ఎద్దేవా చేశారు. కాగా నేను గన్‌మ్యాన్ పెట్టుకోలేదు, నాకు అవసరం లేదని చెప్పారు. సుధాకర్ మద్దతుదారులు దౌర్జన్యాలకు పాల్పడితే చట్ట రీత్యా చర్యలు తప్పవని అన్నారు.

అరెస్టుపై బీజేపీ ఆందోళన



తుమకూరు: ఉడుపిలో ఉన్న నేత్రావతి నర్సింగ్ కళాశాలలో నగ్న వీడియోల కేసులో ప్రభుత్వం న్యాయం చేయాలని ట్వీట్ చేసిన బీజేపీ కార్యకర్తను అరెస్టు చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపునకు పాల్పడుతోందని తుమకూరు నగర ఎమ్మెల్యే జ్యోతి గణేష్ ఆరోపించారు. బీజేపీ ఐటీ సెల్ సభ్యురాలు శకుంతల నటరాజ్‌ను అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ శనివారం తుమకూరులో కలెక్టరేట్ ముందు బీజేపీ మహిళా మోర్చా కార్యకర్తలు భారీ ధర్నా నిర్వహించారు. తప్పు చేసినవారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఎమ్మెల్యే జయచంద్రకు బెదిరింపు కాల్స్

బనశంకరి: తుమకూరు జిల్లా శిర ఎమ్మెల్యే, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా ఉన్న టీబీ జయచంద్రకు బెదిరింపు కాల్స్ రావడంతో బెంగళూరులోని సంజయ నగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో మంత్రిగా ఉన్న అవధిలో టీబీ.జయచంద్ర నైస్ సంస్థ కుంభకోణంపై సర్కారుకు నివేదిక అందజేశారు. ఈ నివేదిక కు అనుగుణంగా నైస్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఇటీవల విధానసభలో ఆయన డిమాండ్ చేశారు. అప్పటి నుంచి జయచంద్రకు వరుసగా అనేక నంబర్ల నుంచి కాల్స్ చేసి అసభ్య పదజాలంతో దూషిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. సంజయనగర పోలీసులు డాలర్స్‌కాలనీలో ఆయన నివాసానికి వెళ్లి సమాచారం సేకరించారు.

బైక్‌లో ఉంచిన నగలు, నగదు చోరీ

పావగడ: పట్టపగలే పట్టణంలో భారీ చోరీ జరిగింది. తాలూకాలోని సీకే పురం గ్రామానికి చెందిన నాగరత్నమ్మ భర్త, కుమార్తెతో కలిసి బైకులో కర్ణాటక బ్యాంకు వద్దకు శనివారం వచ్చారు. బ్యాంకు లోపల ఏటీఎంలో డబ్బులు డ్రా చేసుకోడానికి ముగ్గురూ వెళ్లారు. ఈ లోగా గుర్తు తెలియని దొంగలు బైకు వెనుక బాక్స్‌లో ఉన్న రూ 2 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు,రూ 20 వేల నగదును అపహరించారు. డబ్బులు డ్రా చేసుకుని వచ్చిన నాగరత్నమ్మ కుటుంబసభ్యులు బైకు బాక్స్ తెరిచి ఉండడం చూసి గమనించగా అందులో ఉంచిన బంగారు నగలు, నగదు లేదు. దీంతో లబోదిబోమంటూ చుట్టుపక్కల గాలించగా అప్పటికే దొంగలు ఉడాయించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా ఇదివరకే పట్టణ సమీపంలోని రొప్పం గ్రామంలో రెండు ఇళ్ళలో భారీ చోరీ లు జరిగాయి. ఓ ఇంటిలో రూ.50 వేల విలువైన నాటు కోళ్లు, మరో ఇంటి లో తాళం పగుల గొట్టి రూ.3 లక్షల నగదు, బంగారు నగలు ఎత్తుకెళ్లారు. వరుస దొంగతనాలు జరుగుతుండడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు.

ఎక్స్‌ప్రెస్ వేకు అదనపు హంగులు

- సీఎం సిద్దరామయ్య వెల్లడి
- వేగమార్గం శాస్త్రీయంగానే ఉంది
- సర్వీస్‌రోడ్లు, బైపాస్‌లను అభివృద్ధి చేయాలి



మైసూరు ఎక్స్‌ప్రెస్ వే తనిఖీలో సీఎం సిద్దు



బెంగళూరు- మైసూరు ఎక్స్‌ప్రెస్ వే

మండ్య/ మైసూరు: బెంగళూరు- మైసూరు ఎక్స్‌ప్రెస్ వే అశాస్త్రీయంగా లేదు, కానీ పనులు ఆగమేఘాలపై చేయడం వల్ల కొన్ని సౌకర్యాల కొరత ఉంది, ఈ మార్గాన్ని మరింత సురక్షితం చేయడానికి చర్యలు చేపడతామని సీఎం సిద్దరామయ్య అన్నారు. ఎక్స్‌ప్రెస్ వేని అశాస్త్రీయంగా నిర్మించారు, అందుకే విచ్చలవిడిగా ప్రమాదాలు జరుగుతున్నాయని కాంగ్రెస్‌నేతలు ఆరోపణలు చేయడం తెలిసిందే. సీఎం దీనికి భిన్నంగా ప్రకటించారు. సీఎం శనివారం ఎక్స్‌ప్రెస్ వే మీదుగా మైసూరుకు వెళ్తూ మండ్య దగ్గర కొంతసేపు నిలిచి పరిశీలించారు. వాహనాల స్పీడ్ డిటెక్టర్ డెమోను తనిఖీ చేసి మీడియాతో మాట్లాడారు. ఎక్స్‌ప్రెస్ వే పనుల్లో ఎలాంటి అవైజ్ఞానికత లేదు, అయితే పనులు వేగవంతంగా చేయడం వలన కొన్ని సమస్యలు వచ్చాయి, రహదారి పక్కన సర్వీస్ రోడ్లను సరిగా అభివృద్ధి చేయలేదు, బైపాస్ రోడ్లు సక్రమంగా లేవు, దీని వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని సీఎం తెలిపారు. వాటిని అరికట్టడానికి ఇప్పటికే పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని అన్నారు.

రూ.151 కోట్లతో అభివృద్ధి పనులు

రామనగర, చన్నపట్టణ, మద్దూరు, మండ్య, శ్రీరంగపట్టణ వరకు సర్వీస్ రోడ్లను, బైపాస్‌లను అభివృద్ధి చేయాల్సి ఉందని సీఎం అన్నారు. ఇందుకోసం రూ. 151 కోట్ల నిధులు మంజూరు చేయాలని కేంద్రానికి నివేదిక పంపామని, ఆగస్టు, నవంబర్‌లో అనుమతి లభిస్తుందని అన్నారు. ఆపై పనులు ప్రారంభమవుతాయన్నారు. హైవేపై టోల్ పన్నుకు తాము వ్యతిరేకం కాదని, సమస్యలు పరిష్కారం అయ్యేవరకు వరకు టోల్‌ను నిలిపి వేయాలని, త్వరలోనే ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలిసి ఈ విషయాలపై చర్చిస్తానని చెప్పారు. ప్రస్తుతం వాహనాల వేగాన్ని అరికట్టడానికి స్పీడ్ డిటెక్టర్లతో తనిఖీలు చేయడం వల్ల వేగం తగ్గి చాలావరకు రోడ్డు ప్రమాదాలు అదుపులోకి వచ్చాయని చెప్పారు. అభివృద్ధి పనులు పూర్తయ్యేవరకు స్పీడ్ డిటెక్టర్‌లను అమలు చేస్తామన్నారు. జూన్‌లో సుమారు 20 ప్రమాదాలు జరిగితే, జూలైలో కేవలం 5 జరిగాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి మహాదేవప్ప, అధికారులు పాల్గొన్నారు.

ఈసారి వైభవంగా దసరా సంబరాలు



ప్రపంచ ప్రసిద్ది చెందిన మైసూరు దసరా వేడుకలను ఈ యేడాది అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హెచ్.సి. మహాదేవప్ప తెలిపారు. శనివారం మైసూరులో జలదర్శిని అతిథి గృహంలో ఆయన మాట్లాడారు. కరోనా వైరస్ వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు, ఆ సమయంలో ఉత్సవాలను సరళంగా నిర్వహించారు. ఈ ఏడాది కొత్త ప్రభుత్వం రావడంతో పాటు రాష్ట్రంలో మంచి వర్షాలు పడి ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఈ సమయంలో మైసూరు దసరా సంబరాలను వైభవంగా జరుపుతామని చెప్పారు. వేడుకలను ఎలా నిర్వహించాలి అనేదానిపై ఈ నెల 31వ తేదీన బెంగళూరులో సీఎం సిద్దరామయ్య ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి, ఇతర అధికారులు మైసూరు తాలూకాలోని టి.కాటూరుకు వెళ్లారు. అక్కడ ఫాంహౌస్‌లో సీఎం సిద్ధరామయ్య తనయుడు రాకేష్ 7వ వర్ధంతిని నిర్వహించారు. సిద్దరామయ్య భార్య పార్వతమ్మ, కుమారుడు యతీంద్ర, రాకేష్ భార్య స్మిత, పిల్లలు ధావన్, తన్మయ, బంధుమిత్రులు పాల్గొన్నారు.

నమామి శనీశ్వరాయ



శనీశ్వరునికి హారతి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

- భక్తిశ్రద్ధలతో అధిక శ్రావణ శనివార పూజలు

పావగడ: అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని పావగడలోని ప్రఖ్యాత స్థానిక శనీశ్వరాలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. పురుషుల కంటే మహిళలే ఎక్కువగా వచ్చి శాంతస్వరూపున్ని దర్శించుకున్నారు. ఉదయం 4 గంటల నుంచి భక్తులు దైవ దర్శనానికి కిలోమీటరు దూరం క్యూ కట్టారు. సర్వ సేవా పూజలు, నవగ్రహాలకు తైలాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. అనేక జిల్లాల నుంచి కేఎస్సార్టీసీ బస్సుల్లో మహిళలు ఉచిత ప్రయాణం చేయడంతో ఆలయ ప్రాంగణం మహిళలతో కిక్కిరిసింది.

అన్ని బస్సులు ఫుల్

అలాగే బస్సుల్లో సీట్లు లేక పురుషులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బస్టాండులో బస్సులు ఫుల్ కావడంతో మధ్యలో ఎక్కడా ఆపకుండా గమ్యానికి వస్తున్నారు. దీంతో మధ్య మధ్యలో వచ్చే ఊళ్ల ప్రజలకు సీట్లు దొరకడం గగనమైంది. బస్సులు నిలిపి ఎక్కించుకోవాలని ప్రజలు మొరపెట్టుకున్నారు.

ఆర్థిక కుంభకోణంలో ఐపీఎస్‌కు ఊరట

శివాజీనగర: బెంగళూరులో వేలాది కోట్ల ఐఎంఏ కుంభకోణంలో ఆరోపణలు వచ్చిన ఐపీఎస్ అధికారి అజయ్ హిలోరికి హైకోర్టులో ఊరట దక్కింది. ఆయనపై సీబీఐ నమోదు చేసిన కేసును రద్దుచేస్తూ హైకోర్టు శుక్రవారం ఆదేశాలిచ్చింది. ఐఎంఏ కేసులో నిందితునిగా సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేయాలని అజయ్ హిలోరి వేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న ధర్మాసనం విచారించింది. శాఖాపరమైన విచారణలో అజయ్ హిలోరికి క్లీన్ చిట్ లభించడాన్ని ఆధారం చేసుకొని కేసు కొట్టేయాలని ఆదేశించారు.

ఏమిటీ కేసు

శివాజీనగరలో ఉండే ఐఎంఏ గ్రూపు ప్రజల నుంచి రూ.4 వేల కోట్లకు పైగా డిపాజిట్లను సేకరించి బోర్డు తిప్పేసింది. కేసులో అనుకూలంగా ఉండడానికి అప్పటి తూర్పు విభాగపు డీసీపీగా ఉన్న అజయ్ హిలోరి 2017 జనవరి 1 నుండి 2018 అక్టోబరు 16 మధ్యలో ఐఎంఏ కంపెనీ డైరెక్టర్‌ల నుండి భారీ మొత్తాల్లో లంచం పుచ్చుకొన్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఐఎంఏ కేసును విచారించిన సీబీఐ హిలోరి పేరును కూడా కేసులో చేర్చింది.

ఏకాంత వీడియో బలిగొంది

- వైరల్ కావడంతో డిగ్రీ విద్యార్థి జంట ఆత్మహత్య



బనశంకరి: ఏకాంతంగా ఉన్న వీడియో వైరల్ కావడంతో ఆందోళనకు గురైన యువతీ యువకుడు వేర్వేరుగా ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాద సంఘటన దావణగెరె నగరంలో చోటుచేసుకుంది.

వివరాలు... ఆలూరట్టి తాండాకు చెందిన రతన్ (20), జగళూరు తాలూకాకు చెందిన యువతి దావణగెరె కాలేజీలో డిగ్రీ బీకాం రెండవ ఏడాది విద్యార్థులు. ఇద్దరూ ప్రేమించుకున్నట్లు తెలిసింది. 2 నెలల కిందట కాలేజీ పైన ఇద్దరూ ఏకాంతంగా ఉండడాన్ని గమనించి వారికి తెలియకుండా ఎవరో మొబైల్‌ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇది స్థానికంగా సోషల్ మీడియాతో పాటు ఇంటర్నెట్‌లోని కొన్ని వెబ్‌సైట్లలో బాగా ప్రసారమైంది.

మొదట యువతి బలవన్మరణం

ఇది తెలిసి యువతి ఇంట్లో ఏమంటారోనని భయాందోళనకు గురై, శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ప్రియురాలి మరణవార్త తెలుసుకుని రతన్ హాస్టల్ నుంచి సొంతూరు ఆలూరట్టి తాండాకు చేరుకుని రాత్రికి ఉరివేసుకుని తనువు చాలించాడు. పిల్లలను కోల్పోయిన కుటుంబసభ్యులు రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై ఇద్దరి తల్లిదండ్రులకు పోలీసులకు ఫిర్యాదు చేసి ఘోరానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేసును ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్న జిల్లా ఎస్పీ అరుణ్ తెలిపారు.

జీపీ సభ్యుల కిడ్నాప్?

యశవంతపుర: విజయపుర జిల్లా దేవర హిప్పరగి తాలూకా యలగోడ గ్రామ పంచాయతీకి చెందిన ముగ్గురు సభ్యులను అపహరించారని మరో జీపీ సభ్యుడు మహ్మద్ రఫీక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆగస్టు 2న జీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. దీంతో సభ్యులు చేజారి పోకుండా మహ్మద్ రఫీక్ యలగోడ నుంచి 7 మంది సభ్యులను తీసుకువచ్చి విజయపురలోని గెస్ట్ హౌస్‌లో ఉంటున్నారు. ఈనెల 27న తెల్లవారుజామున ముఖానికి బట్ట కట్టుకొని వచ్చిన 8-10 మంది దుండగులు కాశీరాయ బిరాదార, బసవలింగప్ప జాయి, ప్రకాశ రాథోడ్‌లను అపహరించుకు వెళ్లారని రఫీక్ తెలిపారు. గ్రామ పంచాయతీకి చెందిన రూపా హసకి భర్త చంద్రశేఖర్ ఈ కిడ్నాప్ వెనకున్నట్లు ఆరోపించారు.

కాళ్లూ చేతులు కట్టేసి హత్య

బొమ్మనహళ్లి: బెంగళూరు నగర జిల్లా పరిధిలోని ఆనేకల్ తాలూకాలోని యారండహళ్లి గ్రామం వద్ద నిర్జన ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న భవనంలో ఒక వ్యక్తి హత్య జరిగింది. దుండగులు కాళ్లూ చేతులు కట్టేసి చంపి పరారయ్యారు. భవనంలో నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు సూర్య సిటీ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి పరిశీలించారు. కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం కనిపించింది. నాలుగైదు రోజుల కిందటే హత్య జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. అదనపు ఎస్పీ పురుషోత్తం కూడా పరిశీలించారు. ఇటీవల కొందరు వ్యక్తులు ఈ భవనంలోకి వచ్చి మద్యం తాగారని, వారిలో గొడవ జరిగి హత్య చేసి పరారైనట్లు అనుమానాలున్నాయి. వలస కార్మికులు ఈ పని చేసి ఉంటారని భావిస్తున్నారు.



శనివారం ధార్వాడ వద్ద శివళ్లిలో పీర్లదేవుళ్ల ఊరేగింపు



బెంగళూరు జాన్సన్ మార్కెట్‌లో అషూరా పాటిస్తున్న ముస్లింలు



ధార్వాడ నగరంలో జన సందోహం మధ్య పీర్ల ఊరేగింపు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

- వాడవాడలా పీర్లదేవుళ్ల ఊరేగింపు

బనశంకరి: బెంగళూరుతో పాటు వివిధ నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో శనివారం హిందూ, ముస్లింలు ఐకమత్యంతో మొహర్రం ఆచరించారు. జాతి మత భేదాలు లేకుండా ఊరూరా మండపాలు వేసి పీర్లదేవుళ్లను కూచోబెట్టారు. 9 రోజులు నిత్యం ధూపదీపాలతో పూజలు, ప్రార్థనలు ఆచరించారు. పల్లె ప్రాంతాలు, ముస్లింలు అధికంగా ఉండే ప్రాంతాల్లో మొహర్రం సందడి ఎక్కువగా ఉంది. ఉదయాన్నే అగ్నిగుండాల్లో పీర్లను ఎత్తుకున్నవారు, అశేష భక్తజనం నడిచి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా షియా ముస్లింలు విషాదానికి గుర్తుగా శోకగీతాలు ఆలపిస్తూ రక్తం వచ్చేలా గాయపరచుకుని నివాళులర్పించారు. ఉత్తర కర్ణాటకలో జిల్లాల్లో ఈ అషూరా ఘట్టాన్ని ఎక్కువగా జరుపుకొన్నారు.



శనివారం బెళగావి జిల్లా బైలహొంగల వద్ద మలప్రభ నది ప్రవాహం

తెరిపినిచ్చిన వర్షాలు

- వరద బాధిత జిల్లాలకు ఊరట

బనశంకరి: రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు తగ్గుముఖం పట్టగా వరదల ముప్పు సైతం తగ్గింది. వారంరోజులుగా తీవ్రమైన వర్షాలు, వరదలతో కోస్తా, మల్నాడు, ఉత్తర కర్ణాటక జిల్లాల్లో వరుణుడు బీభత్సం సృష్టించడం తెలిసిందే. వంతెనలు మునిగి, రహదారులు కొట్టుకుపోయి, ఇళ్లు కూలిపోయి ప్రజలు అవస్థలు పడ్డారు. ఇప్పటివరకు వాతావరణం మేఘావృతమై ఉండగా శనివారం చెదురుమదురుగా ఎండ కాసింది. బెంగళూరులోనూ జడివానలు తగ్గాయి. హాసన్ జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రత, దక్షిణ కన్నడ జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

చెదురుమదురు వానలు

పశ్చిమ కనుమలు, ఉత్తర ఒళనాడు జిల్లాల్లో చెదురుమదురు వర్షాలు కురిసే అవకాశం ఉంది. కరావళి భారీ వర్షం లేదా జల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. దక్షిణ ఒళనాడు జిల్లాలో అతి తక్కువ వర్షం కురిసే అవకాశం ఉంది. ఉడుపి, ఉత్తర కన్నడ, దక్షిణ కన్నడ, బీదర్,కలబురిగి జిల్లాలో వర్షం ప్రమాణం తగ్గుముఖం పట్టింది. కృష్ణానదికి భారీగా నీరు విడుదల చేస్తుండడంతో నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నది పరిసరాల్లోకి వెళ్లరాదని అధికారులు ప్రకటించారు. ఎండిపోయి కనిపించిన మలప్రభ నది నిండుగా ప్రవహిస్తోంది.



బెంగళూరు మల్లేశ్వరంలో జల్లుల్లో వెళ్తున్న నర్సింగ్ విద్యార్థులు

జాతీయ పదవి నుంచి సీటీకి విశ్రాంతి

- రాష్ట్ర బీజేపీ పగ్గాలు ఇచ్చే చాన్స్

శివాజీనగర: బీజేపీ జాతీయ మండలిని ప్రక్షాళన చేసి కొత్త పదాధికారులను నియమించగా, ఇందులో జాతీయ ప్రధాన కార్యదర్శి స్థానం నుంచి సీటీ రవి ని తొలగించారు. దీంతో రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పగ్గాలు ఇస్తారన్న వాదనకు బలం చేకూరింది. 2020లో ఆయనను రాష్ట్ర మంత్రి పదవి నుంచి తప్పించి జాతీయస్థాయిలో పార్టీ పదవినిచ్చారు. ఇప్పుడు తప్పించడంతో రాష్ట్ర రాజకీయాలకు పరిమితం చేస్తారని తెలిసింది. అలాగే బీజేఎల్పీ నేతగా వివాదాస్పద నాయకుడు, ఎమ్మెల్యే బసవనగౌడ పాటిల్ యత్నాల్ ఖరారైనట్లు సమాచారం. తాజా బీజేపీ జాతీయ పునర్వ్యవస్థీకరణలో రాష్ట్రం నుంచి ఎవరికీ చోటు దక్కలేదు. బీఎల్ సంతోష్‌ను జాతీయ ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శిగా అదే స్థానంలో కొనసాగించారు. యడియూరప్ప సహా ఇతర సీనియర్ల వర్గాలకు ప్రాధాన్యం దక్కకపోవడం గమనార్హం.

క్లుప్తంగా

ఆగస్టులో జాతీయ స్థాయి కరాటే పోటీలు



మాట్లాడుతున్న కట్టిస్వామి తదితరులు

బళ్లారిటౌన్: నగరంలోని వాల్మీకి భవనంలో ఆగస్టు 26, 27 తేదీల్లో జాతీయ స్థాయి కరాటే కటా, కుమితె పోటీలను ఏర్పాటు చేసినట్లు అకాడమి అధ్యక్షుడు కట్టిస్వామి తెలిపారు. శనివారం పత్రికా భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ పోటీల్లో రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి దాదాపు 800 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ పోటీల ప్రారంభ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రితో పాటు సిటీ ఎమ్మెల్యే, విద్యా, క్రీడా శాఖల అధికారులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు నగరంలో వసతిని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కరాటే ఉపాధ్యాయులకు గతంలో మాదిరిగా ప్రభుత్వ పాఠశాలల్లో పాఠాల బోధనకు మళ్లీ అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్షులు మహమ్మద్ నదాఫ్, సతీష్, రవికుమార్, సురేష్‌కుమార్, రామకృష్ణ, ప్రసాద్, హులుగేష్, గురునాథ్, సంతోష్ పాల్గొన్నారు.

1న ఆరోగ్య పరీక్ష శిబిరం

రాయచూరు రూరల్: నగరంలో ఆగస్టు 1న ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మున్నూరు కాపు బలిజ సమాజం అధ్యక్షుడు అంబరేష్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగరంలోని వీరాంజనేయ స్వామి కళ్యాణ మంటపంలో ఉచిత కంటి, క్యాన్సర్ పరీక్షలతో పాటు ఆపరేషన్, లెన్స్‌ల అమరికకు ఏర్పాట్లను చేస్తారన్నారు.

తల్లీబిడ్డల ఆస్పత్రిని ప్రారంభించండి



మాట్లాడుతున్న నరసింహులు

రాయచూరు రూరల్: నగరంలో తల్లీబిడ్డల ఆస్పత్రి(ఎంసీహెచ్)ని ప్రారంభించాలని దళిత సంఘర్ష సమితి అధ్యక్షుడు నరసింహులు డిమాండ్ చేశారు. శనివారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆస్పత్రిని ప్రారంభించి తగిన వైద్య సిబ్బందిని నియమించాలన్నారు. ఆరు నెలల క్రితం దేవదుర్గ తాలూకా గబ్బూరులో కేంద్ర హోం మంత్రి అమిత్ షా వర్చువల్ ద్వారా ఆస్పత్రిని ప్రారంభించారని గుర్తు చేశారు. రూ.15 కోట్లతో 60 పడకల ఆస్పత్రిని ప్రారంభించినా వైద్యులు, సిబ్బంది, అధికారులు, ఉద్యోగుల నియామకాలు చేపట్టలేదన్నారు.

రెడ్‌క్రాస్ సంస్థ సేవలు భేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భరత్‌రెడ్డి

బళ్లారిటౌన్: రెడ్‌క్రాస్ సంస్థ సేవలు శ్లాఘనీయం అని సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రెడ్‌క్రాస్ శతమానోత్సవ ఉద్యానవనానికి భూమిపూజ చేసి మాట్లాడారు. ఈ సంస్థ చాలా ఏళ్లుగా సమాజ సేవ చేస్తూ ఆదర్శంగా నిలిచిందన్నారు. ఉద్యానవనం, ఇతర కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో పాలికె కార్పొరేటర్ పేరం వీరేష్, వివేక్(విక్కీ) రెడ్ క్రాస్ సంస్థ ప్రముఖులు ఎస్‌జేవీ మహిపాల్, పోలా రాధాకృష్ణ, అటవీ అధికారి ఇర్ఫాన్, ఎంపి షకీబ్, కప్పగల్ వీరేష్, వీ.దేవణ్ణ తదితరులు పాల్గొన్నారు.

అల్లరిమూకల స్వైరవిహారం



కారు అద్దాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

గంగావతి: నగరంలో శుక్రవారం రాత్రి దుండగులు నాలుగు కార్లు, 8 బైకులపై దాడి చేసి అద్దాలను, లైట్లను పగలకొట్టిన ఘటనలు జరిగాయి. మొహర్రంను పురస్కరించుకొని మసీదు వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయగా అల్లరిమూకలు 27వ వార్డు కన్యకా పరమేశ్వరి దేవస్థానం సమీపంలోని కల్మటం వద్ద వాహనాల అద్దాలను, ముందు భాగంలోని బైక్‌ల డూమ్‌లైట్లను పగలకొట్టి ధ్వంసం చేశారు. ఈనేపథ్యంలో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసి దుండగులను బంధించి శిక్షించాలని ఒత్తిడి చేశారు.



బైక్ లైట్ డూమ్‌ను పగులగొట్టిన దృశ్యం

భారీ వర్షాలతో కృష్ణమ్మ ఉగ్రరూపం



రోడ్డు వంతెనపై గుండా ప్రవహిస్తున్న కృష్ణా నది



రాయచూరు తాలూకాలో నీట మునిగిన ఉపేంద్ర తీర్థ అలయం



నిండుకుండలా తొణికిసలాడుతున్న తుంగభద్ర డ్యాం

- ఆల్మట్టి నుంచి 1.79 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల
- వరద గుప్పిట్లో లోతట్టు ప్రాంతాలు

రాయచూరు రూరల్: మహారాష్ట్రతో పాటు ఉత్తర కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తుండడంతో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. దీంతో ఆల్మట్టి డ్యాం నుంచి 1.79 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. నారాయణపూర్ డ్యాం నుంచి 1.60 లక్షల క్యూసెక్కుల నీరు వదలడంతో ఉత్తర కర్ణాటక, కళ్యాణ కర్ణాటకలోని పలు జిల్లాలు వరద ముంపునకు గురయ్యాయి. నదీ తీర ప్రాంత గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రమాదపు హెచ్చరికలు జారీ చేశారు. రాయచూరు తాలూకా కాడ్లూరు వద్ద ఉపేంద్ర తీర్థ ఆలయం నీట మునిగింది. జిల్లాలోని లింగసూగూరు, దేవదుర్గ, రాయచూరు తాలూకాల్లో నదీ తీరం వెంట అధికారులు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఉప్పొంగుతున్న నదులు:
మహారాష్ట్ర, ఉత్తర కర్ణాటకలో కురిసిన వర్షాలతో కృష్ణా ఉపనదులు ఉప్పొంగుతున్నాయి. దూద్‌గంగ, వేదగంగ, ఘటప్రభ, మలప్రభ నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. బెళగావి జిల్లాలో శంకరలింగ ఆలయం నీట మునిగింది. లింగసూగూరు తాలూకాలో శీలహళ్లి వంతెన వద్ద ఉప్పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దేవదుర్గ తాలూకాలో హూవినహెడగి వంతెనను తాకుతూ కృష్ణమ్మ ఉరకలెత్తుతోంది.

నిలకడగా తుంగభద్ర వరద
హొసపేటె: ఎగువన విస్తారంగా కురుస్తున్న వర్షాలతో తుంగభద్ర డ్యాంలో జలకళ ఏర్పడింది. రైతుల జీవనాడి అయిన తుంగభద్ర డ్యాంకు వస్తున్న వరద ఉధృతి నిలకడగా ఉంది. శనివారం డ్యాంకు 90,793 క్యూసెక్కుల నీరు వస్తుండడంతో నీటి నిల్వ 66.521 టీఎంసీలకు, డ్యాంలో నీటిమట్టం 1621.80 అడుగులకు చేరిందని మండలి అధికారులు తెలిపారు.

కిడ్నాప్ కలకలం

- అనంతపురంలో కర్ణాటక వాసి కిడ్నాప్
- జీపీ అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో ప్రత్యర్థివర్గం దాడి
- బాధిత వర్గంలోని ఇరువురికి స్వల్ప గాయాలు



కిడ్నాపర్ల దాడిలో గాయపడ్డ తిప్పేనాయక్



కిడ్నాప్‌కు గురైన వ్యక్తి లలీంద్ర

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురంలో శనివారం కర్ణాటక వాసి కిడ్నాప్ కలకలం సృష్టించింది. ఇక్కడ ప్రత్యేక క్యాంప్‌లో తలదాచుకున్న ఓ వార్డు మెంబర్‌ను రెండు కార్లలో వచ్చిన ప్రత్యర్థి వర్గీయులు దాడి చేసి అపహరించుకుపోయారు. దాడి ఘటనలో బాధితుడి వర్గీయులు ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో జరిగిన కిడ్నాప్ ఉదంతానికి సంబంధించిన వివరాలను త్రీటౌన్ సీఐ ధరణీకిషోర్, నాల్గవ పట్టణ సీఐ ప్రతాప్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. కర్ణాటకలోని రాయచూరు మేజర్ పంచాయతీలో వపురతిప్లి, తురకనదోణ, అల్కూరు గ్రామాలు ఉన్నాయి. ఈ పంచాయతీలో 16 వార్డు మెంబరు స్థానాలున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, జేడీఎస్ పోటాపోటీగా అంటే చెరో ఎనిమిది స్థానాల్లో గెలుపొందాయి. గెలిచిన అభ్యర్థులు ఆగస్టు రెండో తేదీన సర్పంచ్, ఉప సర్పంచులను ఎన్నుకోవాల్సి ఉంది. సర్పంచ్ స్థానం కోసం జేడీఎస్ తీవ్ర ప్రయత్నాలు చేపట్టింది. ఒకరిని కొనుగోలు చేయాలని లేదా భయపెట్టి మెజార్టీ పెంచుకోవాలని చూసింది. వారికి ఆ చాన్స్ ఇవ్వకూడదని కాంగ్రెస్ పార్టీ తన వార్డుమెంబర్లను సురక్షితంగా కాపాడుకునేందుకు ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డు సమీపంలోని శ్రీతేజ లాడ్జిలో కాంగ్రెస్ వార్డు సభ్యులు నాగరాజు, తిప్పేనాయక్, లలీంద్ర, యల్లప్ప, బసిరెడ్డి, యేసు, రెడ్డెప్ప, వానేష్ బస చేశారు.

పట్టపగలే దర్జాగా కిడ్నాప్
లాడ్జ్‌కు సమీపంలోని రిటైర్డు డీఎస్పీ బాలనరసింహారెడ్డి ఇంటి ముందు హోటల్‌లో కాంగ్రెస్ వార్డు సభ్యులు టిఫిన్ చేసేందుకు వచ్చారు. అప్పటికే వీరి కదలికలపై నిఘా ఉంచిన ప్రత్యర్థి వర్గం రెండు కార్లు(ఇన్నోవా, ఆడీ)తో సిద్ధంగా ఉంది. వార్డు మెంబర్లలో ఒకరైన లలీంద్రను బలవంతంగా కారులోకి ఎక్కించారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన మిగిలిన వారిలో మరో ఇద్దరిని అపహరించేందుకు ప్రయత్నించగా వారు తప్పించుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాలూ కూల్‌డ్రింక్ బాటిళ్లతో పరస్పరం దాడులకు తెగబడ్డారు. లలీంద్ర వర్గీయుల్లో తిప్పేనాయక్, మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. అనంతరం క్షణాల వ్యవధిలో ప్రత్యర్థి వర్గం వారు లలీంద్రను కిడ్నాప్ చేసుకుని కార్లలో కర్నూలు వైపు ఉడాయించారు. ఈ హఠాత్పరిణామంతో ఉలిక్కిపడ్డ స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

రంగంలోకి ప్రత్యేక బృందం
బాధితుడు తిప్పేనాయక్ ఫిర్యాదుతో కిడ్నాప్‌ను ఛేదించేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. హైఅలర్ట్ యాప్‌తో జిల్లా వ్యాప్తంగా పోలీసులతో రహదారులపై వాహనాలతో తనిఖీలు చేయించారు. పోలీసులు జేడీఎస్ అభ్యర్థులతో ఫోన్‌లో మాట్లాడారు. లలీంద్రను వదిలిపెట్టాలని ఆదేశించగా.. తాము ఎవరినీ కిడ్నాప్ చేయలేదని అటు వైపు నుంచి సమాధానమిచ్చారు. దీంతో పోలీసులు వివిధ రూట్లల్లో గాలింపు చేపట్టారు.

ఆగస్టు 2న రాఘవ జయంత్యుత్సవం



కృష్ణ



ఉమారాణి



నటరాజ్



ఓంకారమ్మ



లాల్‌రెడ్డి



బాలరాజు

- పలువురు కళాకారులకు అవార్డుల ప్రదానం

సాక్షి,బళ్లారి: రైతు బిడ్డ, ప్రముఖ న్యాయవాది, అన్నింటి కన్నా ముఖ్యంగా ప్రముఖ రంగస్థల కళాకారుడుగా దేశ, విదేశాల్లో తెలుగు, కన్నడ, హిందీ, మరాఠీ తదితర భాషల్లో అద్భుతమైన నటనను ప్రదర్శించి కోట్లాది మంది అభిమానులను కూడగట్టుకున్న బళ్లారి రాఘవ జయంత్యుత్సవాన్ని ఆగస్టు 2, 3వ తేదీల్లో బళ్లారి రాఘవ కళామందిరంలో ఘనంగా నిర్వహించనున్నారు. పేరులోనే బళ్లారి రాఘవగా కీర్తింపబడిన బళ్లారి రాఘవ 143వ జయంత్యుత్సవ వేడుకలను ఘనంగా జరిపేందుకు సంస్థ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా మాదిరిగానే కన్నడ, తెలుగు భాషలకు చెందిన ప్రముఖ కళాకారులకు రాఘవ పేరు మీద రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులను ప్రదానం చేస్తూ ఆయన ఖ్యాతిని మరింత ఇనుమడింపజేస్తున్నారు. ఈసారి బళ్లారి రాఘవ అవార్డులకు ఎంపికైన కళాకారులు వీరే..ఆంధ్రప్రదేశ్, కర్ణాటకకు చెందిన బాగల్‌కోటెకు చెందిన ఉమారాణి, విజయవాడకు చెందిన పీ.వీ.ఎస్ కృష్ణ, ఓంకారమ్మ బళ్లారి, నటరాజ్, లాల్‌రెడ్డి, చక్రవరం బాలరాజు తదితరులకు అవార్డులు ప్రదానం చేయనున్నారు. రెండు రోజుల పాటు రాఘవ కళామందిరంలో ఏర్పాటు చేయనున్న ఈ అవార్డుల ప్రదానోత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

కిసాన్ సమృద్ధి లబ్ధి పొందండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: రైతులు కిసాన్ సమృద్ధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కిసాన్ సమృద్ధి పథకం కార్యనిర్వాహక డైరెక్టర్ సురేష్‌కృష్ణ తెలిపారు. శనివారం పట్టణంలో కిసాన్ సమృద్ధి కేంద్రం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయమే ప్రజల జీవనాధారమైన దేశంలో జనాభాకు అనుగుణంగా ఆహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు సాంప్రదాయక వ్యవసాయ పద్ధతులకే కట్టుబడకుండా శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించాలన్నారు. రైతుల కోసం ప్రధాని మోదీ దేశంలో 125 లక్షల కిసాన్ సమృద్ధి కేంద్రాలను ప్రారంభించారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కెఎస్ వేణుగోపాల్, ఎం లక్ష్మణగౌడ, కిసాన్ సమృద్ధి పథకం అధికారులు ఆనందరావ్, మాధవ్, ఉమా శంకర్ పాల్గొన్నారు.


భారీ వర్షానికి కూలిన ఇంటి గోడ



కూలిపడిన ఇంటి గోడను పరిశీలిస్తున్న దృశ్యం

హొసపేటె: ఎడతెరిపి లేని వర్షానికి ఇంటి గోడ కూలిపడిన ఘటన విజయనగర జిల్లా హరపనహళ్లి తాలూకా కావలహళ్లిలో శనివారం జరిగింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామానికి చెందిన జగదీశ్ ఇంటి గోడ నానిపోయి కూలిపడింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం కలగలేదు. రెవెన్యూ శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

డ్యాం వద్ద సందర్శకుల సందడి



నీటి అలలను సెల్ఫీ తీసుకుంటున్న యువకులు

కంప్లి: తుంగభద్ర డ్యాంకు భారీ వర్షాలతో వరద పోటెత్తుతోంది. ఈనేపథ్యంలో జలాశయ సందర్శనకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మరో వైపు కొంతమంది యువత జలాశయంలో రేగుతున్న అలలను సెల్ఫీల్లో బంధించేందుకు గట్టు వద్ద అలల తాకిడిని సైతం లెక్కించకుండా సెల్ఫీలు తీసుకుంటున్నారు.

అతిసారానికి ఓఆర్ఎస్ అమృత సంజీవిని



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

బళ్లారి రూరల్: పిల్లల్లో తరచూ వచ్చే అతిసార వ్యాధికి ఓఆర్ఎస్(ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్) పానీయం అమృత సంజీవిని వంటిదని విమ్స్ పీడియాట్రిక్ హెచ్ఓడీ డాక్టర్ దుర్గప్ప తెలిపారు. విమ్స్ పీడియాట్రిక్ విభాగం ఆధ్వర్యంలో శనివారం పీడియాట్రిక్ వార్డులో ఏర్పాటు చేసిన ఓఆర్ఎస్ డేలో ఆయన మాట్లాడారు. పిల్లలకు వాంతులు, విరేచనాలు అవుతుంటే తరచూ ఓఆర్ఎస్‌ను తాగించాలన్నారు. అతిసార సమయంలో పిల్లలకు శుచి, శుభ్రతతో కూడిన ఆహారం తప్పనిసరిగా ఇస్తుండాలన్నారు. ప్లేట్లు, గ్లాసులు వేడి నీటితో కడిగి శుభ్రంగా ఉంచాలన్నారు. పిల్లలకు తల్లి పాలు రామబాణం వంటివన్నారు. విమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ ఖాసా సోమశేఖర్ మాట్లాడుతూ 1981లో డాక్టర్ దిలీప్ ఓఆర్ఎస్ పౌడర్‌ను తయారుచేసి అతిసార బాధిత పిల్లలకు ఇవ్వొచ్చని కనుగొన్నట్లు తెలిపారు. ఓఆర్ఎస్‌ను ఇంట్లోనే తయారు చేసుకోవచ్చన్నారు. కాచి చల్లార్చిన మంచినీటిలో చెంచాడు ఉప్పు కలిపి పిల్లలకు తాగించడం వల్ల బ్యాక్టీరియా నశిస్తుందన్నారు. కార్యక్రమంలో బాలింతలకు పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ గడ్డి దివాకర్, పీడియాట్రిక్ వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ దత్తాత్రేయరెడ్డి, డాక్టర్ సువర్ణ, బాలింతలు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం అసమ్మతిని పక్కనపెడదాం



మాట్లాడుతున్న ఎంపీ మునిస్వామి

శ్రీనివాసపురం: ప్రజాప్రతినిధులు ఎన్నికలు అయ్యేంత వరకే రాజకీయాలు చేయాలి, గెలిచిన తరువాత అందరం అభివృద్ధి కార్యక్రమాలకే ప్రాధాన్యత నివ్వాలని ఎంపీ ఎస్.మునిస్వామి తెలిపారు. శనివారం తాలూకాలోని సుగటూరులో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన సంజీవిని షెడ్, జీపీ భవనాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులందరూ ఐకమత్యంగా ఉండి అభివృద్ధి విషయంలో చిన్న చిన్న భేదాభిప్రాయాలన్నింటిని పక్కన బెట్టాలన్నారు. గ్రామాభివృద్ధికి కేంద్రం, రాష్ట్రాల నుంచి వస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని సర్వతోముఖాభివృద్ధికి సహకరించాలన్నారు. ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి మాట్లాడుతూ సుగటూరు జీపీని అన్ని పంచాయతీల కన్నా ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. తాలూకాలోని అన్ని పంచాయతీల్లో పార్టీల కతీతంగా ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

కోచిముల్‌లో అక్రమాలపై తనిఖీకి డిమాండ్



మాట్లాడుతున్న లక్కహళ్లి మంజునాథ్

కోలారు: కోలారు, చిక్కబళ్లాపుర జిల్లాల పాల సమాఖ్య(కోచిముల్)లో జరిగిన అక్రమాలపై తనిఖీ చేయడమే కాకుండా పాలక మండలిని రద్దు చేసి కొత్త పాలనాధికారిని నియమించాలని జనాందోళన సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం పాత్రికేయుల భవనంలో సంఘం ప్రముఖుడు లక్కహళ్లి మంజునాథ్ విలేకరులతో మాట్లాడారు. కట్టడాల నిర్మాణం, యంత్రోపకరణాల కొనుగోలులో ప్రభుత్వ ప్రణాళిక ఆమోదం కంటే చాలా రెట్లు అధికంగా ఖర్చు చేశారన్నారు. ప్రభుత్వ వివిధ శాఖల నిధులను కూడా దుర్వినియోగం చేసిన కోచిముల్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కెవై నంజేగౌడ, డైరెక్టర్ హనుమేష్‌లపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేశారు. ఈసందర్భంగా సంఘం సభ్యులు సిద్ధార్థ ఆనంద్, మునేష్, ఆనంద్ కుమార్, నవీన్ మహరాజ్ పాల్గొన్నారు.

చదువు, ఆటలకు సమప్రాధాన్యం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

శ్రీనివాసపురం: చదువు, క్రీడలు ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాల వంటివని, రెండింటికీ సమ ప్రాధాన్యత ఇవ్వాలని జీపీ అధ్యక్షురాలు అరుణా వెంకట్ తెలిపారు. శనివారం తాలూకాలోని రాయల్పాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఫిర్కా స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించి ఆమె మాట్లాడారు. స్నేహ సౌహార్దతలను పెంచే వారధి లాంటిది క్రీడలు అన్నారు. విద్యార్థులు క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే స్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. గ్రామ ప్రముఖుడు వెంకటరమణప్ప మాట్లాడుతూ యాంత్రిక జీవితం వల్ల శారీరక శ్రమ తక్కువై అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. వీటిని తప్పించడానికి విద్యార్థులు నిరంతరం క్రీడల్లో పాల్గొనాలన్నారు. ఈసందర్భంగా జీపీ మాజీ సభ్యుడు సిమెంట్ నారాయణస్వామి, గౌరవాధ్యక్షుడు రామచంద్ర, మారెణ్ణ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా మొహర్రం



కౌల్‌బజార్‌లో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

బళ్లారి రూరల్: మొహర్రం సందర్భంగా శనివారం కౌల్‌బజార్‌లో సంబరాలను ఆచరించారు. వాయిద్యాలతో పీర్లను ఊరేగించారు. నగరవాసులు, ముస్లిం సోదరులు పెద్దసంఖ్యలో ఊరేగింపులో పాల్గొని భక్తి శ్రద్ధలతో పండుగను జరుపుకున్నారు.

బళ్లారి అర్బన్: హిందూ, ముస్లింలు ఐకమత్యంగా జరుపుకునే మొహర్రం వేడుక శనివారం సాయంత్రం ముగిసింది. ఈ నెల 22న ప్రారంభమై వారం రోజుల పాటు పీర్ల చావిళ్లను విద్యుత్ దీపాలతో, దేవుళ్లకు ఆభరణాలు, పూలతో అలంకరించి భక్తులు చక్కెర, పానకం చదివింపులతో మొక్కులను తీర్చుకున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ పండుగను విశేషంగా జరుపుకున్నారు. పీర్లచావిళ్ల ముందు ఉన్న అగ్నిగుండాన్ని వెలిగించి తప్పెట్లు, బ్యాండ్ వాయిద్యాలతో చిందులు వేస్తూ దేవుళ్లను ఊరేగించారు.

జిల్లాలో వైభవంగా మొహర్రం
రాయచూరు రూరల్: జిల్లాలో మొహర్రం వేడుకలు ఘనంగా ఆచరించారు. శుక్రవారం రాత్రి అగ్నిగుండం నిర్వహించారు. భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. శనివారం సాయంత్రం పీర్ల సవారీ జరిపారు. నగరంలోని తీన్‌కందిల్, ఏక్‌మినార్, అంద్రూన్ కిల్లా, ముదగల్, యాపలదిన్ని, గురుగుంట, జవళగేరల్లో మొహర్రం వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. ముదుగల్‌లో పీర్ల పండుగ సంబరాలకు పలు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఆకట్టుకున్న పులి వేషగాళ్ల ప్రదర్శన
హొసపేటె: మొహర్రం సందర్భంగా నగరంలో పులి వేషగాళ్ల ప్రదర్శన ఆకట్టుకుంది. శనివారం పులివేషగాళ్లు చిత్తవాడిగి, చప్పరదహళ్లి, అంబేడ్కర్ నగర్, రాణిపేట, ఆజాద్‌నగర్, అమరావతి, అనంతశయన గుడితో పాటు వివిధ వార్డుల్లో ప్రదర్శనలిచ్చారు.

నేడు ప్రతిభా పురస్కారాల పంపిణీ

రాయచూరు రూరల్: నగరంలో ఆదివారం అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభ జిల్లా స్థాయి ప్రతిభా పురస్కారాల పంపిణీని నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లాధ్యక్షుడు మురళీధర్ పేర్కొన్నారు. ఆయన శనివారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాఘవేంద్ర స్వామి కళ్యాణ మంటపంలో రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజు, రాయచూరు ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమక్షంలో సింధనూరు ప్రముఖ వైద్యుడు రాఘవేంద్ర జోషికి విప్రశ్రీ అవార్డును, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేస్తారని అన్నారు.

జెడ్పీ సీఈఓ శశిధర్ బదిలీ



శశిధర్ కురేరా

రాయచూరు రూరల్: జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి శశిధర్ కురేరాను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జేమ్స్ తుకారాం ఆదేశాలు జారీ చేశారు. శశిధర్‌ను బాగల్‌కోటె జిల్లా పంచాయతీకి సీఈఓగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో వేరొక అధికారిగా ఇంకా ఎవరినీ నియమించలేదు.

కాకినాడ రైలును పునరుద్ధరించరూ

రాయచూరు రూరల్: కోవిడ్ సమయంలో నిలిపివేసిన కాకినాడ-రాయచూరు ఎక్స్‌ప్రెస్ రైలు సేవలను పునరుద్ధరించాలని, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం నుంచి విజయవాడ, తెలంగాణలోని హైదరాబాద్ మీదుగా మహబూబ్‌నగర్ వరకు నడుస్తున్న రైలు(నెం-12861-12862)ను రాయచూరు వరకు పొడిగించాలని గుంతకల్లు దక్షిణ మధ్య రైల్వే మేనేజర్ మనీష్ అగర్వాల్‌కు విన్నవించారు. శనివారం రాయచూరు రైల్వేస్టేషన్‌లో దక్షిణ మధ్య రైల్వే బోర్డు సలహాదారుడు బాబూరావ్ మాట్లాడుతూ రాయచూరు లోక్‌సభ పరిధిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రజలు అధికంగా నివాసం ఉంటున్నారన్నారు. వారి ప్రయాణానికి అనుకూలమయ్యేలా విశాఖపట్నం రైలును విస్తరించాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం విశాఖపట్నం నుంచి మహబూబ్‌నగర్ రైలును, మచిలీపట్నం-కర్నూలు మధ్య నడిచే రైలును రాయచూరు వరకు నడపాలని, గుంతకల్లు నుంచి రాయచూరు వరకు నడిచే రైలును మహబూబ్‌నగర్ వరకు పొడిగించాలని కోరారు.

పార్టనర్‌ను చేస్తామంటూ మోసం

హుబ్లీ: సింటెక్స్ వాటర్ ట్యాంక్ క్లీనింగ్ వస్తువుల కంపెనీకి డెలివరీ పార్టనర్‌గా చేర్చుకుంటామని నమ్మించి ఓ వ్యక్తి నుంచి రూ.1.44 లక్షల మేరకు మోసగించిన ఘటనపై శుక్రవారం సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. హుబ్లీకి చెందిన శివశంకరగౌడర్ బాధితుడు. సోషల్ మీడియాలో టోరా ఇంటర్నేషనల్ హ్యాండ్‌బుజ్ పేరున సింటెక్స్ వాటర్ ట్యాంక్ క్లీనింగ్ వస్తువుల వీడియో చూశాడు. ఈ క్రమంలో అందులో ఉన్న నెంబర్‌కు ఫోన్ చేశాడు. తమ కంపెనీలో డెలివరి పార్టనర్‌గా చేర్చుకుంటామని నమ్మబలికిన అవతలి వ్యక్తి దశల వారీగా పైమేరకు సొమ్మును తన ఖాతాకు బదలాయించుకున్నట్లు బాధితుడు తన ఫిర్యాదులో వివరించాడు.

నియామకం

రాయచూరు రూరల్: అఖిల కర్ణాటక వీరశైవ లింగాయత సంఘం జిల్లాధ్యక్షుడిగా మల్లికార్జునను రాష్ట్రాధ్యక్షుడు రాజశేఖర్ నియమించారు. శుక్రవారం సాయంత్రం బళ్లారిలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో వీరశైవ లింగాయతులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించి సంఘాన్ని బలోపేతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాజ్, కార్యదర్శి లోకేష్‌రెడ్డి, కోశాధికారి మల్లికార్జునలున్నారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి

మాలూరు: చేపలు పట్టడానికి వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో మునిగి మరణించిన ఘటన తాలూకాలోని భావనహళ్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రవికుమార్(35) అనే వ్యక్తి శనివారం చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. ఆ సమయంలో అకస్మాత్తుగా కాలు జారి చెరువులో పడి మునిగి బయటకు రాలేక చనిపోయాడు. విషయం తెలిసిన వెంటనే మాలూరు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మణిపూర్ దుండగులపై చర్యలేవీ?



ఎస్పీకి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: మణిపూర్‌లో మారణకాండకు కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) కార్యకర్తలు శనివారం జిల్లా ఎస్పీ ఎం.నారాయణ ద్వారా రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం పార్టీ కార్యకర్తలు మాట్లాడుతూ మణిపూర్ ఘర్షణల్లో నిందితులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అక్కడ శాంతిభద్రతలను కాపాడి పౌరులకు రక్షణ కల్పించాలన్నారు. అక్కడి ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించాలని ఒత్తిడి చేశారు. ఈసందర్భంగా మునికృష్ణ, వరుణ్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త కమిషనర్‌ను నియమిస్తాం

కోలారు: నగరసభకు కొత్త కమిషనర్ నియామకానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. శనివారం పాత కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కమిషనర్‌పై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. పనుల కోసం నేరుగా తనను కలవాలన్నారు. ప్రజా సేవ కోసమే తాను కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఎస్ఎన్ఆర్ జిల్లా ఆస్పత్రిలో అక్రమాలపై, పేదలకు సరైన వైద్యం అందడం లేదనే ఆరోపణలపై చర్యలు తీసుకుంటామన్నారు. కేసీ వ్యాలీ నీటి వల్ల రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. భూగర్భ జలాలు వృద్ధి చెంది రైతుల బోరుబావుల్లోకి పుష్కలంగా నీరు చేరిందన్నారు.

క్లుప్తంగా

పోటీ పరీక్షల అభ్యర్థులకు హాస్టల్ వసతి కల్పించండి

తుమకూరు : పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే కర్ణాటక విద్యార్థులకు ఢిల్లీలో హాస్టల్ సదుపాయాలు కల్పించాలని ఎంపీ జీ.ఎస్. బసవరాజు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు రాష్ట్ర ప్రజాపనుల శాఖ మంత్రి సతీష్ జార్కిహొళిని కలిసి మాట్లాడారు. సివిల్స్‌తోపాటు ఇతర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం కర్ణాటక విద్యార్థులు ఎక్కువగా ఢిల్లీకి వెళ్లి శిక్షణ తీసుకుంటున్నారన్నారు. వారికి హాస్టల్ సదుపాయం కల్పించాలని కోరారు.

పిల్లల ఉన్నతికి బాటలు వేయాలి


స్కూలు బ్యాగులు అందజేస్తున్న హోం మంత్రి పరమేశ్వర్

తుమకూరు: పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు వారికి సంస్కారం నేర్పి వారి ఉన్నతికి బాటలు వేయాలని జిల్లా ఇన్‌చార్జ్, హోం మంత్రి డాక్టర్.జీ పరమేశ్వర్ అన్నారు. జిల్లాలోని కొరటగెరె తాలూకా, కోలాళ గ్రామంలో ఉన్న బసవేశ్వర కేంద్రీయ సంయుక్త పీయు కళాశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి అందజేశారు. మంత్రి మాట్లాడుతూ పిల్లల చదువులపై తల్లిదండ్రులు శ్రద్ధపెట్టాలన్నారు.

జాయింట్ కమిషనర్ దృష్టికి సమస్యలు

బొమ్మనహళ్లి: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు బొమ్మనహళ్లి బీబీఎంపీ కార్యాలయంలో ఉన్న బెంగళూరు ఒన్ కేంద్రానికి వచ్చిన దరఖాస్తుదారులను బీజేపీ నాయకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈమేరకు బీబీఎంపీ జాయింట్ కమిషనర్ అజిత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్‌నాయకులు ఉమాపతి శ్రీనివాస్ గౌడ, టి. వాసుదేవ రెడ్డి, రాఘవేంద్రగౌడ, రామచంద్ర తొలుత బెంగళూరు వన్ కేంద్రాన్ని సందర్శించారు. అర్జీదారులతో కలిసి బీబీఎంపీ నూతన జాయింట్ కమిషనర్ అజిత్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ప్రజలను సమస్యలను వివరించారు. కొన్ని సంవత్సరాలుగా బొమ్మనహళ్లిలో నాణ్యత లేని అభివృద్ధి పనులు చేపట్టారని, తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వైద్య సేవలను వినియోగించుకోండి


మాతా శిశు ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుండూరావు

కృష్ణరాజపురం: వర్తూరులోని నగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి చేసిన మాతా, పిల్లల విభాగం భవనాన్ని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దినేష్ గుండూరావు, ఎమ్మెల్యే మంజులా అరవింద లింబావళితో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ స్థానిక ప్రజలు వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా వైద్యం అందించేందుకు సదుపాయాలు కల్పించామన్నారు. ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు.


బొమ్మనహళ్లిలో మొహర్రం



బొమ్మనహళ్లి : బొమ్మనహళ్లిలో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముస్లింలు, హిందువులు పెద్ద సంఖ్యలో వచ్చి పీర్లస్వాములను దర్శించుకొని చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు ఉమాపతి శ్రీనివాస గౌడ పీర్లస్వాములకు పూజలు నిర్వహించారు.

విజయపుర(బెంగళూరు గ్రామీణ) : విజయపుర పట్టణంలోని గాంధీ చౌక్‌లో హిందూ, ముస్లింలు భక్తి శ్రద్ధలతో మొహర్రం వేడుకలు నిర్వహించారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న ప్రదీప్ తదితరులు

గౌరిబిదనూరు: నేపాల్ లో జరిగే కబడ్డీ క్రీడలో పాల్గొనడానికి వెళుతున్న క్రీడాకారులు అక్షయకుమార్, నందీశ్ రెడ్డిలకు బలిజ యువ ఘర్జన సంఘం అండగా నిలిచింది. సంఘం అధ్యక్షుడు ప్రదీప్ శనివారం ఆర్థిక సాయం అందజేశారు. క్రీడల్లో సత్తా చాటి భారత్‌కు ఖ్యాతి తీసుకురావాలని సూచించారు.

జీవితాలు బుగ్గి చేసిన విస్ఫోటం


పేలుడులో ధ్వంసమైన గోదాము వద్ద దట్టంగా అలుముకున్న పొగ


మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది


ఘటన స్థలంలో జేసీబీలతో శిథాలాలు తొలగిస్తున్న దృశ్యం

- యజమాని కుటుంబంతో సహా 8 మంది మృత్యువాత
- పలు ఇళ్లు, షాపులు ధ్వంసం
- క్రిష్ణగిరిలో ఘోర విషాదం

క్రిష్ణగిరి: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి పట్టణంలో శనివారం ఉదయం జరిగిన టపాసుల గోదాము విస్ఫోటం తీవ్ర సంచలనం సృష్టించింది. క్షణాల్లోనే 8 మంది ఘటనా స్థలంలో మరణించగా 20 మంది వరకూ గాయపడ్డారు. క్రిష్ణగిరి పాతపేట ప్రాంతానికి చెందిన రవి టపాకాయల గోడౌన్ నిర్వహిస్తూ దానికి అనుకునే ఇంటిలో నివాసం ఉంటున్నారు. ఈ గోడౌన్ పక్కనే వెల్డింగ్ దుకాణం కూడా ఉంది. ఏం జరిగిందోకానీ ఆకస్మాత్తుగా పేలుడు జరిగి టపాసుల గోదాము తునాతునకలైంది. పేలుడు తీవ్రతకు చుట్టుపక్కల ఉన్న కొన్ని ఇళ్లు, షాపులు కూడా ధ్వంసమయ్యాయి. గోదాము యజమాని రవి(46), అతని భార్య జయశ్రీ(40) కొడుకు రుతీష్ (21), కూతురు రితిక (19), ఇబ్రహీం కయాల్లా (21), ఇమ్రాన్(18)తో పాటు ఎనిమిది మంది మృతి చెందారు.

గాయపడినవారు...

అలాగే మునిరత్నం(33), జఫీర్(30), సుఫియాన్ (14), తిరుపతి (66), శంకరి (39), ఇమ్రాన్‌ఖాన్ (20), శివరాజ్ (25), తమిళ్‌సెల్వన్(26), జగదీషన్(48), పార్థసారథి (22), మాదేష్ (42), జయేంద్రన్ (22)లతో పాటు 20 మందికి పైగా గాయాలపాలయ్యారు. వీరందరూ గోదాము చుట్టుపక్కల ఇళ్లు, షాపుల్లో ఉండేవారు.

జేసీబీలతో శిథిలాల తొలగింపు

విషయం తెలిసిన వెంటనే క్రిష్ణగిరి పట్టణ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంలో ఇరుక్కుపోయి ప్రాణాపాయ స్థితిలో ఉన్న క్షతగాత్రులను బయటకు తీసి ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. జేసీబీ యంత్రాల ద్వారా గోదాము శిథిలాలను తొలగించి మృతదేహాలను వెలికితీశారు. టపాకాయల గోదాము పక్కనే ఉన్న వెల్డింగ్ దుకాణం నుంచి నిప్పురవ్వలు ఎగిరిపడి ప్రమాదం జరిగిందని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

మంత్రి, ఎమ్మెల్యేల పరామర్శ

బాధితులను ఆహారభద్రతా శాఖ మంత్రి చక్రపాణి, హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాష్, బర్గూరు ఎమ్మెల్యే మధియళగన్, జిల్లా కలెక్టర్ శరయు తదితరులు ఆస్పత్రిలో పరామర్శించారు. మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ. 2 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.3 లక్షలు, తీవ్ర గాయాలపాలైన వారికి రూ.1.50 లక్షలు, స్వల్పగాయాలేర్పడిన వారికి రూ. రూ.50 వేలు అందజేస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారు. పట్టణ పరిధిలో టపాకాయల గోడౌన్ నిర్వహణకు అనుమతిపై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. తమను ఆదుకోవాలని నాయకులు, అధికారుల ముందు బాధిత కుటుంబాల వారు రోదించారు. కట్టుబట్టలతో మిగిలామని విలపించారు.


పేలుడు ధాటికి ధ్వంసమైన బైక్


చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు


బాధితుడిని పరామర్శిస్తున్న మంత్రి చక్రపాణి

సెల్‌ఫోన్ చూడొద్దన్నందుకు బాలిక ఆత్మహత్య


విద్యాశ్రీ (ఫైల్)

గౌరిబిదనూరు: సెల్‌ఫోన్ అతిగా చూడొద్దని మందలించడంతో బాలిక ఆత్మహత్య చేసుకొని తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చింది. దివ్యశ్రీ(15) అనే విద్యార్థిని పట్టంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో చదువుతోంది. దివ్యశ్రీ కొంతకాలంగా సెల్‌ఫోన్‌ను ఎక్కువగా వినియోగిస్తూ చదువులపై శ్రద్ధ పెట్టలేదు. గమనించిన తల్లిదండ్రులు మందలించడంతో గురువారం రాత్రి ఇంటినుంచి వెళ్లిపోయింది. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు దివ్యశ్రీ ఫొటోలను వాట్సాప్‌లో, సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. సదరు బాలిక ఉత్తర పినాకినీ నదిలో బైపాస్ వంతెన వద్ద పడినట్లు శుక్రవారం మధ్యాహ్నం సమాచారం అందింది. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం అనంతరం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

తల్లితో క్లోజ్‌గా ఉన్నాడని హత్య

దొడ్డబళ్లాపురం: తల్లితో సన్నిహితంగా ఉంటున్న వ్యక్తిని కుమారుడు హత్య చేసిన ఘటన మాగడి రోడ్డులోని గోపాలపురంలో చోటుచేసుకుంది. రవి భండారి(44), సురేష్ భండారీ అనే వ్యక్తులు బసవేశ్వరనగర్ కేహెచ్‌బీ కాలనీలో ఉన్న పీజీలో వంటపనిచేస్తున్నారు. అక్కడే పద్మావతి అనే వివాహిత కూడా చేస్తోంది. రవి భండారి పద్మావతితో సన్నిహితంగా ఉండేవాడు. గమనించిన కుమారుడు రాహుల్... ఎలాగైనా రవిభండారిని ముట్టబెట్టాలని భావించాడు. శుక్రవారం సాయంత్రం ఫోన్ చేసి నీతో మాట్లాడాలి ఇంటికి రావాలని సూచించాడు. అతను రాగానే కత్తితో పొడిచి హత్య చేసి పరారయ్యాడు. ఎంతసేపైనా రవిభండారి రాకపోవడంతో పద్మావతి, సురేశ్ భండారి వెళ్లి చూడగా హత్యోదంతం వెలుగు చూసింది. పోలీసులు రవి భండారీ మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

రైతును బలిగొన్న కరెంటు తీగలు

మైసూరు: కరెంటు షాక్ కొట్టి రైతు మృతి చెందిన ఘటన మైసూరు జిల్లా హెచ్.డీ.కోటె తాలూకా భారతీపుర గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శ్రీకంటెగౌడ కుమారుడు నాగరాజు(37) తన పొలంలో పసుపు పంటకు మందు పిచికారీ చేస్తుండగా పొలం మీదుగా తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన కరెంటు తీగలు తగిలాయి. దీంతో అతను విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. హెచ్‌డీ కోటె పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆక్రమ తవ్వకాల ఘటనలో ముగ్గురి అరెస్ట్

యశవంతపుర: బెంగళూరు ఉత్తర తాలూకాలోని కల్లుగుడ్డదహళ్లి కొండల్లో అక్రమంగా బండరాళ్లు కొడుతున్నారనే ఆరోపణలపై గ్రామానికి చెందిన శంకర్(30), కుమార(21), దాసేనహళ్లికి చెందిన శ్రీనివాస్(40)ను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి సల్ఫర్, పొటాషియం నైట్రేట్ స్వాధీనం చేసుకున్నారు.

అడవులను సంరక్షించుకోవాలి

- మంత్రి ఈశ్వర్ ఖండ్రె

శివాజీనగర: అడవులు, వన్యజీవులను కాపాడటం అటవీ శాఖ ప్రథమ కర్తవ్యమని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఈశ్వర ఖండ్రె అన్నారు. బెంగళూరులోని రాడిసన్ బ్లూలో శనివారం ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర మంత్రుల చర్చాగోష్టిలో ఆయన పాల్గొని ఆయన మాట్లాడారు. పడమటి కనుమలు అరుదైన జీవ వైవిధ్యతతో కూడుకొని ఉన్నాయన్నారు. వాటిని కాపాడుకోవాలన్నారు. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాలు పశ్చిమ ఘట్టలతో కూడి ఉన్నాయని, వాటి సంరక్షణకు రాష్ట్ర స్థాయిలో సమన్వయం చేసుకోవాల్సి ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో కళాకారుడు మృతి

మండ్య: మండ్య తాలూకా నియలియూరు సమీపంలోని బెంగళూరు –మైసూరు జాతీయ రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చామరాజ నగర జిల్లా గుండ్లుపేటె తాలూకా దొడ్డతప్పుతూరు గ్రామానికి చెందిన కళాకారుడు లోకేష్(28) మృతి చెందాడు. ఇతను శనివారం వేకువజామున బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొందని మండ్య రూరల్ పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

రుణం చెల్లించినా ఆగని వేధింపులు

యశవంతపుర: లోన్ యాప్ దారా తీసుకున్న రుణం తీర్చినా నిర్వాహకులు వేధింపులకు పాల్పడి తన ఫొటోను ఎడిట్ చేసి అశ్లీలంగా పోస్ట్ చేసినట్లు బాధితుడు మంగళూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు లోన్ యాప్‌లో రూ.3,500కు దరఖాస్తు చేసుకోగా అతని ఖాతాకు రూ.2,800 జమా చేశారు. జులై 26 వరకు గడువు ఉండగా బాధితుడు జులై 19న రూ.1400 జమ చేశాడు. మిగిలిన డబ్బును పలు విడతలుగా వాట్సాప్ పంపిన వ్యక్తికి చెల్లించాడు. అయినా అతని ఫొటోను ఎడిట్ చేసి అశ్లీలంగా వాట్సాప్ నంబర్‌కు అప్‌లోడ్ చేశారు.

కారు ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి

మైసూరు: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మైసూరులోని విజయనగర మొదటి స్టేజీలో చోటు చేసుకుంది. మైసూరులోని కుంబారకొప్పలుకు చెందిన బసవరాజు (52) విజయనగర మొదటి స్టేజ్‌లోని కొడవ సమాజంలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా అతి వేగంతో వచ్చిన కారు ఢీకొంది. తలకు బలమైన గాయాలు కావడంతో బసవరాజు అక్కడికక్కడే మృతి చెందాడని వీవీపురం పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

డాక్టర్‌గా మారిన కలెక్టర్


చికిత్సలు చేస్తున్న కలెక్టర్ వెంకటేశ

యశవంతపుర: జిల్లా కలెక్టర్ ఓ వృద్ధురాలికి ప్రాథమిక చికిత్స చేసిన ఘటన దావణగెరెలో జరిగింది. కలెక్టర్ కోర్టు హాల్‌లో ఓ కేసుకు సంబంధించి విచారణ జరుగుతోంది. హావేరికి చెందిన వృద్ధురాలు మురిగెమ్మ ధర్మప్ప(73) హాజరయ్యారు. నిలబడి ఉన్న కుప్పకూలి పడిపోయింది. కలెక్టర్ డాక్టర్ ఎంవీ వెంకటేశ్ తక్షణం ఆమెకు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం ఆస్పత్రికి తరలించారు.

పుస్తకం విడుదల

శివాజీనగర: సాహితీవేత్త పురుషోత్తమదాస్ హెగ్డే విరచిత రామాయణ కథగా పేరు గాంచిన 'పురుషోత్తమాయణ' అనే రెండు పుస్తకాల పెద్ద కావ్యాన్ని మాజీ మంత్రి హెచ్.ఎం.రేవణ్ణ విడుదల చేశారు. నగరంలోని కేఆర్‌డీసీఎల్ సభా మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకా కాగినెలె మహాసంస్థానపు కనక గురుపీఠం సిద్ధరామానందపురి స్వామి సమక్షంలో ఈ పుస్తకాన్ని లోకార్పణం చేశారు. సీనియర్ సాహితీవేత్త డాక్టర్ పురుషోత్తమ బిళిమలె, రచయిత పురుషోత్తమ దాస్ హెగ్డే, డాక్టర్ సెల్వకుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విచారణాధికారి బదిలీ

యశవంతపుర: ఉడుపిలో నగ్న వీడియోలు చిత్రీకరించిన ఘటనపై విచారణకు నియమించిన మల్పె సీఐ మంజునాథ్‌గౌడను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. మంజునాథగౌడ స్థానంలో కుందాపుర డీఎస్పీ బెళ్లియప్పను నియమించారు.

యాత్రికులతో బయల్దేరిన కాశీ దర్శన్ రైలు

బనశంకరి: కాశీ దర్శన్ పేరుతో దేవదాయ శాఖ చేపట్టిన భారత్‌గౌరవ్ 4వ కాశీయాత్ర రైలు శనివారం యశవంతపుర రైల్వేస్టేషన్ నుంచి బయల్దేరింది. 700 మంది ప్రయాణికుల సామర్థ్యం ఉన్న ఈ రైలులో 400 మంది కాశీయాత్రకు బయల్దేరి వెళ్లారు. 8 రోజుల యాత్రలో వారణాసి, ఆయోధ్య, ప్రయాగ్‌రాజ్‌ను దర్శిస్తారు. రూ.20 వేలు చార్జీలుగా నిర్ణయించారు. ప్రభుత్వం రూ.5 వేలు రాయితీ అందిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలనుంచి పర్యాటకులు ముందస్తు టికెట్ బుకింగ్ చేసుకున్నారు. యశవంతపుర, దావణగెరె, బీరూరు, హావేరి,హుబ్లీ, బెళగావి, రాయభాగ స్టేషన్లలో రైలు ఆగుతుంది. ఆగస్టు 15న 5వ కాశీయాత్ర ప్రారంభమవుతుంది.



యశవంతపుర రైల్వేస్టేషన్ నుంచి కాశీ యాత్రకు బయలుదేరిన రైలు

ఎంపీ ఉమేశ్ జాదవ్‌కు చేదు అనుభవం

బనశంకరి: స్వంత పార్టీ కార్యకర్తలు, నాయకులతో బీజేపీ ఎంపీ ఉమేశ్‌జాదవ్‌కు చేదు అనుభవం ఎదురైంది. కల్యాణ కర్ణాటక వాణిజ్య పారిశ్రామిక సంస్థ సభాంగణంలో శనివారం నిర్వహించిన పార్టీ సమావేశానికి ఆయన విచ్చేసి ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్సీ ఎన్.రవికుమార్ ఎన్నికల సమయంలో శ్రమించారని పేర్కొన్నారు. ఈయన వ్యాఖ్యలపై కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఎన్నికల సమయంలో కనబడిన మీరు... ఇప్పుడు వచ్చారు... ఇన్ని రోజులు ఎక్కడికి వెళ్లారంటూ ప్రశ్నించారు. పలువురు నేతలు జోక్యం చేసుకొని సర్దిచెప్పారు. బీజేపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, ఏదైనా సమస్యలుంటే చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్. రవికుమార్ మాట్లాడుతూ ఎంపీ ఉమేశ్‌జాదవ్ కార్యకర్తల కష్టంతో గెలిచారని, ఆయన విజయం.. కార్యకర్తల గెలుపు అని పేర్కొంటూ కార్యకర్తలను సమాధానపరిచారు.

విధానసౌధ వద్ద డ్రోన్ ఎగురవేయడానికి యత్నం

బనశంకరి: ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు శనివారం విధానసౌధ వద్ద డ్రోన్ ఎగురవేయడానికి ప్రయత్నించగా విధానసౌధ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి బెయిల్ ఇచ్చి పంపించారు. కంపెనీ 15 ఏళ్ల సంబరాల నేపథ్యంలో ఆ ఇద్దరు వ్యక్తులు డ్రోన్లతో చిత్రీకరించేందుకు యత్నించారని పోలీసులు తెలిపారు.

ఇంజిన్ లోపంతో నిలిచిన రైలు


ఇంజన్ లోపాలను గుర్తిస్తున్న సిబ్బంది


రైలు నుంచి దిగివెళ్లిపోతున్న ప్రయాణికులు

కళ్యాణదుర్గం: ఇంజిన్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యతో కదిరిదేవరపల్లి– తిరుపతి ప్యాసింజర్ రైలు మొరాయించింది. ఈ సంఘటన శనివారం మధ్యాహ్నం కళ్యాణదుర్గం నియోజకవర్గం కంబదూరు మండలం కదిరిదేవరపల్లి రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. కదిరిదేవరపల్లి నుంచి కళ్యాణదుర్గం, రాయదుర్గం, బళ్లారి, గుంతకల్లు, అనంతపురం మీదుగా తిరుపతి వెళ్లాల్సిన తిరుపతి ప్యాసింజర్ రైలు ఇంజిన్‌లో సమస్య రావడంతో ఉన్నఫళంగా నిలిచిపోయింది. మధ్యాహ్నం 3.50 గంటలకు రాయదుర్గం చేరాల్సిన రైలు ముందుకు కదల్లేదు. బళ్లారి నుంచి వేరొక ఇంజిన్ తెప్పిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాగా, గంటలకొద్దీ నిర్మానుష్య ప్రదేశంలో రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొందరు రైలు నుంచి దిగిపోయి ఆటోలు, బస్సులలో కళ్యాణదుర్గం చేరుకున్నారు.

హోసూరు వార్తలు..

మధురై సమావేశానికి తరలిరావాలి


మాట్లాడుతున్న తంబిదురై

హోసూరు: అన్నాడీఎంకే పార్టీ ఆగస్టు 20వ తేదీ మధురైలో నిర్వహించే వీరచరిత్ర స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని శనివారం హోసూరు కార్పొరేషన్ మత్తిగిరి కూడలి రోడ్డు వద్ద ఉన్న లావణ్యమహాల్లో జరిగిన కార్యకర్తల సమావేశంలో క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, మాజీ మంత్రి పి.బాలక్రిష్ణారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాజ్యసభ ఎంపీ తంబిదురై ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అన్నాడీఎంకే అభ్యర్థులను గెలిపించుకునేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఆగస్టులో మధురైలో జరిగే వీరచరిత్ర స్వర్ణోత్సవ మహాసభను విజయవంతం చేసేందుకు క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్నాడీఎంకే నాయకులు రామణ్ణ, వాసుదేవన్, బర్గూర్ మాజీ ఎమ్మెల్యే రాజేంద్రన్, జే.పి. జయప్రకాష్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

క్రిష్ణగిరి: తాలూకా కేంద్రం సూళగిరి సమీపంలోని అళగుబావి వద్ద సమత్వపురం ఏర్పాటుకు స్థల పరిశీలన నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ వందనా కార్గ్, సూళగిరి యూనియన్ చైర్పర్సన్ లావణ్య మధు పాల్గొన్నారు. స్థల పరిశీలన అనంతరం యూనియన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీల్లో ప్రజల ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. బీడీవో కార్యాలయ అధికార్లు విమల్, రవి కుమార్, బాబి ఫ్రాన్సి తదితరులు పాల్గొన్నారు.

పాపం చిన్నారి.. చిదిమేసిన ట్రాక్టర్

కెలమంగలం: ట్రాక్టర్‌తో పొలం దుక్కి చేస్తున్న సమయంలో ట్రాక్టర్‌పై కూర్చున్న 5 ఏళ్ల బాలుడు కుదుపులకు క్రిందపడగా అతని మీద ట్రాక్టర్ వెళ్లిపోవడంతో మృతి చెందాడు. ఈ ఘటన కెలమంగలం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల మేరకు సూళగిరికి సమీపంలోని ఒడ్రపాళ్యం గ్రామానికి చెందిన విజయ్ కొడుకు ప్రభాస్(5). అతని భార్య గౌతమి గత రెండు రోజుల క్రితం కొడుకును తీసుకొని కెలమంగలం సమీపంలోని నెప్పురుగుట్టలో పుట్టింటికెళ్లింది. శుక్రవారం గౌతమి చిన్నాన్న ట్రాక్టర్‌లో పొలం దుక్కి చేసేందుకెళ్తుంటే నేనూ వస్తానంటూ ప్రభాస్ కూడా వెళ్లాడు. దుక్కి చేస్తుండగా బాలుడు పట్టుతప్పి ట్రాక్టర్ కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన బాలున్ని చికిత్స కోసం హోసూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ఫలితంలేక మృతి చెందాడు.

దొంగల ముఠా అరెస్టు

హోసూరు: హోసూరు సమీపంలోని ప్రైవేట్ కంపెనీలో రూ.10 లక్షల విలువ చేసే విడిభాగాలను దొంగలించిన ముగ్గురు బాలలతో పాటు 8 మంది దొంగల గుంపును పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు హోసూరు సమీపంలోని మోర్నపల్లి వద్ద నిర్వహిస్తున్న కర్మాగారంలో ఇంజిన్ల విడిభాగాలు, ఏసీ మిషన్‌లు, ల్యాప్‌టాప్‌లు చోరీకి గురైనట్లు నిర్వాహకులు హడ్కో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఇన్‌స్పెక్టర్ పద్మావతి నేతృత్వంలో విచారణ జరిపారు. మోర్నపల్లి ప్రాంతంలో నివాసముంటున్న ఉత్తర భారతీయులు సందీప్(34), సుబత్ (26), ధర్మపురి జిల్లాకు చెందిన పళణి(42), హోసూరుకు చెందిన శివరాజ్(20), సునీల్‌కుమార్(19), మరో ముగ్గురు బాలురును పోలీసులు అరెస్ట్ చేసి వస్తు సామగ్రిని సీజ్ చేశారు. ధర్మపురికి చెందిన పళణి గుజరీ షాపు నిర్వహిస్తూ బృందాన్ని వీరిని దొంగతనాలకు ప్రేరేపిస్తున్నట్లు తెలిసింది.


పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు, విడిభాగాలు

సామాజిక న్యాయానికి కట్టుబడి ఉంటే వర్గీకరణ చేపట్టండి

- సీఎంకు కేంద్రమంత్రి నారాయణస్వామి సవాల్

శివాజీనగర: సామాజిక న్యాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంటే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి ఎస్సీ వర్గీకరణ చేయాలని కేంద్ర మంత్రి ఏ.నారాయణస్వామి సీఎం సిద్దరామయ్యకు సవాల్ విసిరారు. శనివారం బీజేపీ కార్యాలయంలో మాజీ మంత్రి గోవింద కారజోళ, ఎమ్మెల్సీ ఛలవాది నారాయణస్వామి, మాజీ మంత్రి హాలప్ప ఆచార్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను చేస్తామని ఎన్నికలకు ముందు సిద్దూ చెప్పి మాట మార్చారన్నారు. కాంతరాజు కమిషన్ నివేదికను స్వీకరించి రిజర్వేషన్ వర్గీకరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉడుపి కాలేజీ కేసును ఆయన ప్రస్తావిస్తూ ఈ ఘటనను రాజకీయంగా, మతపరంగా చూడటం సరికాదన్నారు. అయితే తనిఖీ సంస్థలకు ప్రభుత్వం పూర్తి స్వాతంత్ర్యం ఇవ్వాలన్నారు. అవసరమైతే ఈ కేసును కేంద్రం దృష్టికి తీసుకొస్తామని నారాయణస్వామి విలేకరులకు తెలిపారు.

ఆగస్టు నెలాఖరు నుంచి బెంగళూరుకు విమాన సర్వీసు

శివమొగ్గ: శివమొగ్గ–బెంగళూరు మధ్య ఆగస్టు 31న విమాన సర్వీసులు ప్రారంభమవుతాయని శివమొగ్గ జిల్లా ఎంపీ బీ.వై.రాఘవేంద్ర తెలిపారు. శనివారం ఆయన శివమొగ్గలో విలేకరులతో మాట్లాడారు. ఉడాన్ పథకం కింద శివమొగ్గ నుంచి తిరుపతి, హైదరాబాద్, గోవా నగరాలకు విమానాలను నడపడటానికి టెండర్లు పిలువగా మూడు విమానాయాన సంస్థలు ముందుకు వచ్చాయన్నారు. 90 రోజుల్లో ఆయా నగరాలకు విమాన సర్వీసులు ప్రారంభం అవుతాయన్నారు. శివమొగ్గ నుంచి ముంబైకి విమాన సర్వీసు నడిపేందుకు కేంద్ర విమానాయాన శాఖ మంత్రిని కోరినట్లు తెలిపారు. శివమొగ్గ విమానాశ్రయంలో రాత్రిళ్లు విమానాలు ల్యాండింగ్, టేకాఫ్ అయ్యేందుకు చేపట్టిన పనులు జోరుగా సాగుతున్నాయన్నారు.

ఇద్దరు యువకులు దుర్మరణం

- బైక్‌ను ఢీకొన్న వాహనం

క్రిష్ణగిరి: ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు చనిపోగా, మరొకరు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఈ ఘటన జిల్లా కేంద్రం క్రిష్ణగిరి తాలూకాలో చోటు చేసుకొంది. వివరాల మేరకు కావేరిపట్టణం సమీపంలోని మిట్టహళ్లి గ్రామానికి చెందిన కళాశాల విద్యార్థి కమలేష్ (23), మిత్రులు విఘ్నేష్ (23), మారియప్పన్(22)లు కలిసి శుక్రవారం సాయంత్రం సూళగిరి సమీపంలోని సామలపల్లం గ్రామంలో వెలసిన గ్రామదేవత ఆలయానికెళ్లారు. సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో తిరిగి వస్తుండగా హోసూరు –క్రిష్ణగిరి హైవే కాటినాయకనపల్లి ఆంజనేయస్వామి ఆలయం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన కమలేష్, విఘ్నేషులు ఘటనా స్థలంలోనే మృతి చెందగా మారియప్పకు తీవ్ర గాయాలేర్పడి క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై క్రిష్ణగిరి తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.


ఘటనా స్థలంలో కమలేష్, విఘ్నేష్ మృతదేహాలు

విదేశీ విద్యపైనా 'ఈనాడు' విషం

జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం, ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేలా తప్పుడు రాతలు

- ప్రతిభ ఉన్నవారికే పారదర్శకంగా పథకం అమలు
- ప్రపంచంలో టాప్–50లో ఉన్న 320 విద్యా సంస్థల్లో ప్రవేశాలు
- చంద్రబాబు ప్రభుత్వంలో కనీస నిబంధనలు పాటించకుండానే అమలు
- ఇచ్చింది గరిష్టంగా రూ.15 లక్షలు మాత్రమే
- నూరు శాతం ఫీజు చెల్లిస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం
- 3,326 మందికి రూ.318 కోట్లు ఎగ్గొట్టిన చంద్రబాబు ప్రభుత్వం
- ప్రస్తుతం 357 మంది విద్యార్థులకు రూ.142.71 కోట్లు చెల్లింపు
- అయినా ప్రజలను తప్పుదోవ పట్టించడమే లక్ష్యంగా ఈనాడు కథనం

సాక్షి, అమరావతి: ప్రభుత్వం ఏదైనా సంక్షేమ పథకాన్ని రూపొందించేటప్పుడు లబ్ధిదారులకు ఉండాల్సిన అర్హతలు, ఎంపికలో నిబంధనలను స్పష్టంగా పేర్కొంటుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అత్యున్నత ప్రతిభావంతులకు రూ. కోటికి పైగా సాయం అందించే అద్భుత పథకం 'జగనన్న విదేశీ విద్యా దీవెన'. ఈ పథకానికీ నిబంధనలు రూపొందించి పారదర్శకంగా అమలు చేస్తోంది. అది కూడా సంతృప్త స్థాయిలో సాధ్యమైనంత ఎక్కువ మందికి లబ్ధి కలిగేలా రూపొందించిన పథకమిది. ఈ పథకంతో రాష్ట్రానికి చెందిన అనేక మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు నోబెల్ గ్రహీతలకు నిలయమైన గొప్ప సంస్థల్లో చదువుకుంటున్నారు. టిమ్ కుక్, స్టీవ్ జాబ్స్ వంటి ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల సీఈవోలు చదువుకున్న విశ్వవిద్యాల యాలలో విద్యనభ్యసిస్తున్నారు. ఇదే ఎల్లో మీడియాకు కంటగింపుగా మారింది. అవాస్తవా లతో 'ఈనాడు' పత్రిక ఓ విష కథనాన్ని ప్రచురించింది. గత ప్రభుత్వంలో ఊరూ పేరూ లేని కొన్ని విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశాలు కల్పించడంతో పాటు నిబంధనలకు పాతరేసి నిధులను దోచుకున్నా పట్టించుకోని ఈ విష పత్రిక.. ప్రస్తుత ప్రభుత్వం ప్రతిభ ఉన్నవారికి ప్రపంచంలో అత్యున్నత ప్రమాణాలు, గుర్తింపు పొందిన గొప్ప యూనివర్సిటీల్లో చేరిన వారికి అవకాశాలు కల్పిస్తుంటే తప్పుగా చూపిస్తోంది. ప్రభుత్వ నిబద్ధతను, ఉన్నత ఆశయాలను దెబ్బతీసేలా, ప్రజలను తప్పుదోవ పట్టించడమే లక్ష్యంగా కథనాన్ని ఇచ్చింది.

గతం కంటే పెరిగిన విదేశీ విద్యా సంస్థలు

ప్రభుత్వం 2022 జూలై 11న ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం క్యూఎస్/ టైమ్ ర్యాంకుల్లో ఉన్న 200 యూనివర్సిటీలనే తీసుకుంది. కానీ, ఎక్కువ మంది విద్యార్థులు ప్రయోజనం పొందేలా 21 కోర్సులకు సంబంధించి ప్రతి కోర్సుకు టాప్ 50లో ఉన్న విద్యా సంస్థలకూ వర్తింపజేసింది. దీంతో మొత్తం విద్యా సంస్థల సంఖ్య 320కి పెరిగింది. అంటే గతంలోకంటే 120 యూని వర్సిటీలు అధికంగా ఉన్నాయి. పైగా విద్యార్థులు ఫలానా దేశంలోని యూనివర్సిటీ లకు మాత్రమే వెళ్లాలనే నిబంధన ఏదీ విధించకుండా ఆ ర్యాంకింగ్‌లో ఉన్న ఏ విద్యా సంస్థకైనా వెళ్లి చదువుకునే అవకాశం కల్పించింది. మరి విద్యా సంస్థలు ఎక్కడ తగ్గిపోయాయో రామోజీనే చెప్పాలి. గత ప్రభుత్వంలో విదేశీ విద్యా సంస్థల ఎంపికకు ఎలాంటి ప్రమాణాలు పాటించలేదు. ర్యాంకింగ్‌ను పట్టించుకోకుండా 15 దేశాల్లోని విద్యా సంస్థల్లో చదువుకునే అవకాశమిచ్చారు. దాంతో విద్యార్థులు నాసి రకమైన సంస్థల్లో ప్రవేశాలు పొంది భవిష్యత్‌ను ప్రమాదంలోకి నెట్టుకున్నారు.

బాబు పాలనలో ఫీజు రూ.15 లక్షలే.. ఇప్పుడు రూ.1.25 కోట్లు

గత చంద్రబాబు ప్రభుత్వం విదేశాల్లో చదువు కునేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు గరి ష్టంగా రూ.15 లక్షల చొప్పున, ఓసీలకు రూ.10 లక్షల చొప్పున చెల్లించి చేతులు దులుపుకొంది. కానీ వైఎస్ జగన్ ప్రభుత్వం నూరు శాతం ఫీజు చెల్లిస్తోంది. ఓసీలకు రూ.కోటి, ఇతర వర్గాలకు రూ.1.25 కోట్లు వెచ్చిస్తోంది.

- గత చంద్రబాబు ప్రభుత్వం విద్యార్థుల సంఖ్యను, వర్గాన్నిబట్టి 100 నుంచి 500 మందికి మాత్రమే పరిమితం చేసింది. దాంతో ప్రతిభావంతులైన విద్యార్థులకు అన్యాయం జరిగింది. విద్యార్థుల ఎంపికలో పెద్దఎత్తున అవినీతి చోటు చేసుకుంది. విద్యార్థి కుటుంబ వార్షికాదాయ పరిమితిని కూడా రూ.6 లక్షల కు పరిమితం చేసింది. కుటుంబంలో ఒక్కరికే పథకం వర్తింపజేస్తూ నిబంధన పెట్టారు.
- ప్రస్తుత వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రతిభావంతులు ఎందరున్నా వారందరికీ అవకాశం కల్పిస్తోంది. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు పెంచింది.
- గత ప్రభుత్వం ఇమ్మిగ్రేషన్ కార్డు రాగానే ఒకసారి, మొదటి సెమిస్టర్ పూర్తవగానే రెండోసారి ఫీజు చెల్లించి వదిలేసేది. తర్వాత విద్యార్థి ఏమయ్యాడో పట్టించుకోలేదు. పైగా 2016–17, 2018–19 సంవత్సరాల్లో 3,326 మంది విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.318 కోట్లు ఎగ్గొట్టింది.దీంతో వారి తల్లిదండ్రులు అప్పుల ఊబిలో కూరుకుపో యారు. చాలామంది విద్యార్థులు విదేశీ చదువును మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది. కానీ, వైఎస్ జగన్ ప్రభుత్వం నిధుల దుర్వి నియో గానికి తావు లేకుండా విద్యార్థి సెమి స్టర్/ టర్మ్ పత్రాలు సమర్పించగానే ఆ నిధు లను విడుదల చేస్తోంది. ఈ మార్గదర్శ కాల్లో ఎలాంటి మార్పు లేకున్నా ఈనాడు పత్రిక మాత్రం నిధుల విడుదలకు అదనపు ఆంక్షలు అంటూ తప్పుడు ప్రచారం చేస్తోంది.
- గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం అమలులో జరిగిన తీవ్రమైన లోపాలు విజిలె న్స్ విచారణలో బయటపడ్డాయి. చాలా మంది విద్యార్థులు నిధులు మంజూరైన తర్వాత విద్యా సంస్థను మార్చే యగా, మరికొంత మంది కోర్సును మధ్య లో ఆపేసి వచ్చేశారు. పథకానికి ఎంపికై న వారిలో కొందరు దరఖా స్తులో ఇచ్చిన చిరు నామాలో లేకపోవడం గమనార్హం. ఇప్పుడు ప్రతి విద్యార్థీ ఎక్కడ ఏ కోర్సు చదువుతు న్నారు, వారి చిరునామా, కుటుంబ వివరా లతో సహా పారదర్శకంగా పరిశీలిస్తున్నారు.

357 మంది లబ్ధిదారులకు రూ.142.71 కోట్లు

జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కింద గత ఏడాది 290 మంది, ఈ ఏడాది 67 మందికి కలిపి రూ.142.71 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. 2022–23 విద్యా సంవత్సరానికి గత ఏడాది ఫిబ్రవరిలో లబ్ధిపొందిన 290 మందిలో ఎస్సీ విద్యార్థులు 27 మంది, బీసీలు 64 మంది, క్రిస్టియన్‌లు నలుగురు, ముస్లింలు 20 మంది, ఈబీసీలు 175 మంది ఉన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఫాల్ సీజన్ కింద ఎంపికై న 67 మందిలో ఎస్సీ విద్యార్థులు ఐదుగురు, ఎస్టీ ఒకరు, బీసీలు 13 మంది, క్రిస్టియన్‌లు నలుగురు, ముస్లింలు 8 మంది, ఈబీసీలు 36 మంది ఉన్నారు. 2022–23 బ్యాచ్ విద్యార్థులకు రెండో విడత వాయిదా ఫీజు, వీసా చార్జీలు, విమాన ఖర్చులతో సహా రూ.35.40 కోట్లను ఇటీవల ప్రభుత్వం విడుదల చేసింది. కానీ ఈనాడు మాత్రం కేవలం ఐదుగురు ఎస్సీ, ఒక ఎస్టీ విద్యార్థులు మాత్రమే లబ్ధి పొందారని, బీసీ విద్యార్థులెవరికి ఈ పథకం వర్తించలేదని అబద్ధపు కథనం ప్రచురించింది.

విదేశీ విద్యా దీవెనతో టాప్ యూనివర్సిటీల్లో చదువుతున్న విద్యార్థుల్లో కొందరు..

వర్సిటీ	క్యూఎస్ ర్యాంకింగ్	విద్యార్థి పేరు	చెల్లించిన ఫీజు(రూ.ల్లో)
వాగెనింగెన్ యూనివర్సిటీ అండ్ రీసెర్చ్, నెదర్లాండ్స్	1	కుంబాల విక్రమ్ (బీసీ)	35,10,187
కార్నెగీ మెలన్ యూనివర్సిటీ, పిట్స్‌బర్గ్, యూఎస్ఏ	2	ఆలపాటి మనోహర్‌సాయి (ఈబీసీ)	43,51,594
యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్	1	నగిరిమడుగు సుష్మశ్రీ (ఎస్సీ)	36,97,400
చికాగో యూనివర్సిటీ	10	షాహుల్ హమీద్ షేక్ (మైనారిటీ)	42,25,000
జాన్ హాప్కిన్స్ యూనివర్సిటీ	15	నరాల అనుదీప్‌రెడ్డి (ఈబీసీ)	1,02,93,568
డ్యూక్ విశ్వవిద్యాలయం, డర్హమ్	17	పొట్లూరి గీతికా చంద్రిక (ఈబీసీ)	40,23,436
యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్	16	సూర్యదేవర శ్రీహర్ష (ఈబీసీ)	1,37,59,748

(నోట్: అనుదీప్‌రెడ్డి, శ్రీహర్షలకు ప్రభుత్వం రూ.కోటి చొప్పున ఫీజు చెల్లించింది)

జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం పేద విద్యార్థులకు ఎంతగా మేలు చేస్తుందో చెప్పడానికి లబ్ధిపొందిన ఓ విద్యార్థి అధికారులకు రాసిన లేఖే ఉదాహరణ.. ఇదిగో లేఖ..

"రెస్పెక్టెడ్ సర్,

నా పేరు సుకుమార్ దొడ్డ. ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లా వణుకూరు గ్రామం నుంచి వచ్చాను. ప్రస్తుతం ఆస్ట్రేలియాలోని మోనాష్ విశ్వవిద్యాలయంలో మాస్టర్ ఆఫ్ డేటా సైన్స్ చదువుతున్నా. వణుకూరులోనే పాఠశాల విద్య పూర్తి చేశాను. అండర్ గ్రాడ్యుయేట్ వరంగల్ ఎన్ఐటీలో చేశాను. మా నాన్న దినసరి కూలీ. అమ్మ గృహిణి. మా ఆర్థిక స్థోమత తక్కువగా ఉన్నప్పటికీ, నాన్న నన్ను కష్టపడి చదవమని ప్రోత్సహించేవారు. నేను విదేశాలలో మాస్టర్స్ చదవాలని ఎన్నో కలలు కన్నాను. కానీ నా ఆర్థిక పరిస్థితి కారణంగా ఆ అవకాశం లేదని విరమించుకున్నాను. అదృష్టవశాత్తూ మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని ప్రవేశపెట్టడంతో నా కల మలుపు తిరిగింది. ఈ పథకం ఆంధ్రప్రదేశ్‌లోని విద్యార్థులు విదేశాలలో చదువుకునేందుకు తోడ్పాటు నిచ్చింది. నేను ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొన్ని టాప్ 50 విశ్వవిద్యాలయాలకు దరఖాస్తు చేశాను. ఎస్ఎల్‌సీ కమిటీ ఇంటర్వ్యూ ద్వారా ఈ పథకానికి ఎంపికయ్యా ను. 2023 జూలై 24 నుంచి క్లేటన్‌లోని మోనాష్ విశ్వవిద్యాలయంలో చదువుతు న్నాను. విదేశాలలో చదువుకో వాలనే నా కలను సాధ్యం చేసినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, ముఖ్యంగా ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నేను రూ.52 లక్షల స్కాలర్‌షిప్ కూడా ప్రభుత్వం నుంచి అందుకున్నాను, ఇది నా రెండేళ్ల ట్యూషన్ ఫీజు మొత్తం. ఈ ఉదారమైన స్కాలర్‌షిప్ నా కలను నెరవేర్చుకునేందుకు, నన్ను నేను నిరూపించుకునేందుకు దోహదపడింది.

కృతజ్ఞతలతో
– అనుకుమార్ దొడ్డ

డ్రామోజీరావు తప్పుడు రాతలు

- వైఎస్సార్‌సీపీ ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యేలు కైలే అనిల్ కుమార్, కొరముట్ల శ్రీనివాసులు ధ్వజం

సాక్షి, అమరావతి: జగనన్న విదేశీ విద్యాదీవెన దేవుడిచ్చిన వరమని, పేద విద్యార్థులు సైతం ప్రపంచంలోని టాప్ యూనివర్సిటీల్లో ఉన్నత విద్య చదివేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తున్నారని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు చెప్పారు. దళితులు, గిరిజనులు, బడు గు బలహీనవర్గాలు, మైనార్టీలకు కనిపిస్తున్న దేవు డు వైఎస్ జగన్ అని చెప్పారు. అద్భుత పథకంపై చంద్రబాబు, టీడీపీ నేతలు, ఎల్లో మీడియా విమర్శలు చేయడం ప్రజలను వంచించడమేనని మండిపడ్డారు. ఈనాడులో డ్రామోజీరావు తప్పుడు వార్త లు రాస్తున్నారని ధ్వజమెత్తారు. శనివారం వారు వెల్లడించిన అభిప్రాయాలు వారి మాటల్లోనే..

డ్రామోజీరావు విషపూరిత రాతలు



విదేశీ విద్యా దీవెనపై ఈనాడులో డ్రామోజీరావు విషపూరిత రాతలు రాస్తున్నారు. రాజధాని ఏరియాలో ఎస్సీలు, ఎస్టీలు ఉండటానికి వీల్లేదని కూడా అడ్డగోలుగా రాశారు. పెత్తందారీ వ్యవహారాన్ని చూపించారు. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలకు చేయాల్సిన నష్టం చంద్రబాబు చేశారు. వారిని దారుణంగా అవమానపరిచారు. విదేశీ విద్యా దీవెన పథకం కింద అర్హులందరికీ న్యాయం చేస్తున్నాం. ఈనాడు రాసే బురద వార్తలను పట్టించుకోవాల్సిన పనిలేదు. ప్రత్యేక హోదాని తాకట్టు పెట్టి పోలవరాన్ని నాశనం చేసిన వ్యక్తి చంద్రబాబు

– ఎంపీ నందిగం సురేష్

రామోజీరావువి గావుకేకలు..



జగనన్న విదేశీ విద్యా దీవెన పై రామోజీరావు, చంద్రబాబు గావు కేకలు పెడుతున్నారు. ఈ పిచ్చి రాతలు, కూతలు ప్రజలను మభ్య పెట్టలేవు. ఈ పథకాన్ని అత్యంత పారదర్శకంగా వివక్ష, లంచాలు లేకుండా అమలు చేస్తున్నాం. సాచ్యురేషన్ పద్ధతిలో అర్హులందరినీ ఆదుకుంటున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పిల్లలు రూ.1.25 కోట్ల వరకు, ఇతరులకైతే రూ.1 కోటి వరకు చెల్లిస్తున్నాం. విమాన, వీసా చార్జీలూ చెల్లిస్తున్నాం. ఈ సత్యాలను ఈనాడు దాచేసినంత మాత్రాన నిజాలు దాగవు. ప్రజలకు వాస్తవాలు తెలుసు.

– కైలే అనిల్ కుమార్, ఎమ్మెల్యే

చంద్రబాబు ఇచ్చింది అరకొరే..



గత చంద్రబాబు ప్రభుత్వంలో విదేశాలకు వెళ్లి చదువుకొనే విద్యార్థులకు చేసిన ఆర్థిక సాయం అరకొరే. అప్పుడు ఇచ్చింది కేవలం రూ.10 లక్షలే. ఎస్సీ, ఎస్టీలకు రూ.15 లక్షలు మాత్రమే ఇచ్చేవారు. ఈ అమౌంట్ ఎక్కడ? సీఎం జగన్ ఇస్తున్న రూ.1.32 కోట్లు ఫీజు ఎక్కడ? చంద్రబాబు హయాంలో ప్రతి దానిలో కోత పెట్టేవారు. దరఖాస్తు చేసుకున్నవారందరికీ దొరికేది కాదు. సాచ్యురేషన్ విధానం లేదు. సిఫార్సులతో ఇచ్చేవారు. అది కూడా సక్రమంగా ఇవ్వకుండా దాదాపు రూ.318 కోట్లు బకాయిలు పెట్టారు.

– కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్యే




బాబు కమీషన్ల కక్కుర్తే పోలవరానికి శాపం

జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపాటు

లేదంటే 2022 నాటికే సీఎం వైఎస్ జగన్ పూర్తి చేసేవారు

- నా ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా సిగ్గుశరం లేకుండా మాట్లాడతావా?
- కేంద్రమే కట్టాల్సిన ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను ఎందుకు తీసుకున్నావ్?
- 2016–17 ధరలతో రామోజీ బంధువుకు పనులు ఎలా అప్పగించావ్?
- తొలుతే రూ.400 కోట్లతో డయాఫ్రమ్ వాల్‌ను ఎందుకు నిర్మించావ్?
- నీ కమీషన్ల నిర్వాకం వల్లే వరద ఉధృతికి దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్
- వైఎస్ జగన్ సీఎం అయ్యాక పనులను పరుగెత్తిస్తున్నారు
- కోతకు గురైన దిగువ కాఫర్ డ్యామ్ ఫిబ్రవరి 15 నాటికే పూర్తి
- సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు డయాఫ్రమ్ వాల్ పనులు
- వైఎస్సార్ ప్రారంభించిన ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేసేది సీఎం వైఎస్ జగనే



విజయవాడ ఇరిగేషన్ క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సాక్షి, అమరావతి : కమీషన్లు కాజేయాలనే దుర్బుద్ధితోనే 2014–19 మధ్య సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రొటోకాల్‌కు విరుద్ధంగా పనులు చేపట్టి, పోలవరం ప్రాజెక్టును ముంచేశారని జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లేదంటే.. 2022 నాటికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోలవరాన్ని పూర్తి చేసేవారని పునరుద్ఘాటించారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన పోలవరం ప్రాజెక్టు పనుల పై ప్రత్యేకంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. టీడీపీ సర్కార్ తప్పిదాలను ఎత్తిచూపుతూ.. చంద్రబాబు చేసిన విమర్శలను ఆధారాలతో తిప్పికొడుతూ.. ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టి సీఎం వైఎస్ జగన్ ప్రాజెక్టును పూర్తి చేస్తున్న తీరును కళ్లకు కట్టినట్లు వివరించారు. రాజకీయాల్లో తనను మించిన మహానటుడు లేరని చంద్రబాబు నిరూపించుకున్నారని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల గురించి మూడు రోజులపాటు నవరసాలు పండించారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నటనకు ఆస్కార్ ఇచ్చినా తప్పు లేదన్నారు. పోలవరాన్ని 2018 నాటికే పూర్తి చేసి.. గ్రావిటీపై ఆయకట్టుకు నీళ్లందిస్తానని చంద్రబాబు శాసన సభ సాక్షిగా హామీ ఇచ్చారు(ఆ వీడియోను ప్రదర్శిస్తూ). నాటి మంత్రి దేవినేని ఉమా కూడా 2018 నాటికే పూర్తి చేస్తామని సవాల్ చేశారు. కానీ ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నిస్తుంటే ఇద్దరూ నోరు మెదపడం లేదు. పోలవరానికి పట్టిన శని, పీడ, చీడ చంద్రబాబే' అని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో మంత్రి అంబటి ఇంకా ఏం చెప్పారంటే..



డయాఫ్రమ్ వాల్ విధ్వంసం నిర్వాకం చంద్రబాబుదే

- పోలవరం ప్రాజెక్టు ఈసీఆర్ఎఫ్ (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్ పునాదికి డయాఫ్రమ్ వాల్ అత్యంత కీలకం. గోదావరి ప్రవాహ దిశను కృత్రిమంగా మళ్లించేలా అప్రోచ్ ఛానల్, స్పిల్ వే, స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్.. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేశాకే డయాఫ్రమ్ వాల్ నిర్మించాలి. కానీ.. ప్రాజెక్టు ప్రొటోకాల్‌ను చంద్రబాబు తుంగలో తొక్కి, గోదావరి ప్రవాహ దిశను మళ్లించకుండానే బావర్ కంపెనీతో రూ.400 కోట్లు వెచ్చించి డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించేశారు.
- స్పిల్ వేను పునాది స్థాయిలో వదిలేసి.. 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను చేపట్టి.. వాటిని పూర్తి చేయలేక.. వాటికి ఇరు వైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేసి చంద్రబాబు చేతులెత్తేశారు. వైఎస్ జగన్ సీఎంగా 2019 మే 30న ప్రమాణ స్వీకారం చేశాక జూన్ నాలుగో వారంలో వరద వచ్చింది. ఆ ప్రవాహానికి ఎగువ కాఫర్ డ్యామ్ అడ్డంకిగా మారడంతో.. దానికి ఇరువైపులా వదిలిన ఖాళీ ప్రదేశాల గుండా అధిక ఉధృతితో ప్రవహించడం వల్ల డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతం కోతకు గురై నాలుగు చోట్ల భారీ అగాధాలు(స్కవర్స్) ఏర్పడ్డాయి. ఈ విధ్వంసానికి బాధ్యత ఎవరిది? ఇది చంద్రబాబు చేసిన చారిత్రక తప్పిదం కాదా?
- స్పిల్ వే పూర్తి కాకుండానే.. రెండు పియర్స్ మధ్య ఇనుప రేకు పెట్టి.. దాన్నే గేటుగా చిత్రీకరిస్తూ.. ప్రాజెక్టును పూర్తి చేసినట్లు రూ.83 కోట్లు వెచ్చించి బస్సుల్లో జనాన్ని తీసుకెళ్లి 'జయము జయము చంద్రన్న' అంటూ చంద్రబాబు భజన చేయించుకున్నారు. ఇది ప్రజలను మోసం చేయడం కాదా?

కేంద్రమే కట్టాల్సిన ప్రాజెక్టు పోలవరం

- మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన పోలవరం ప్రాజెక్టును విభజన చట్టంలో సెక్షన్ 90 ప్రకారం వంద శాతం వ్యయాన్ని భరించి తామే పూర్తి చేస్తామని కేంద్రం అంగీకరించింది. అలాంటప్పుడు ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను ఎందుకు తీసుకున్నావని 15 నెలలుగా ప్రశ్నిస్తుంటే చంద్రబాబు సమాధానం చెప్పడం లేదు. కమీషన్లు కాజేయాలన్న దుర్బుద్ధితోనే పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకున్నారు.
- 2016 సెప్టెంబర్ 7న పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకునే క్రమంలో 2013–14 ధరల ప్రకారం రూ.20,398.61 కోట్లతోనే పూర్తి చేయడానికి చంద్రబాబు అంగీకరించారు. వాస్తవంగా 2017–18 ధరల ప్రకారం ప్రాజెక్టు వ్యయం రూ. 55,656.87 కోట్లు. కానీ 2013–14 ధరలతోనే ప్రాజెక్టు ను పూర్తి చేస్తానని కేంద్రం వద్ద అంగీకరించిన చంద్రబాబు.. 2016–17 ధరలతో 'ఈనాడు' రామోజీరావు బంధువుకు చెందిన నవయుగకు కాంట్రాక్టు పనులను నామినేషన్ పై కట్టబెట్టారు. ఇదంతా కమీషన్ల కోసమే అని స్పష్టమవుతోంది. అందుకే ప్రధాని మోదీ.. ఈ ప్రాజెక్టును బాబు ఏటీఎంలా వాడుకుంటున్నారని చెప్పిన విషయం తెలిసిందే.

శరవేగంగా పూర్తి చేస్తుంటే ఎందుకంత కడుపుమంట?



- వైఎస్ జగన్ సీఎం అయ్యాక చంద్రబాబు తప్పిదాలు సరిదిద్దుతూ అప్రోచ్ ఛానల్, స్పిల్ వే(48 గేట్లతో సహా), స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసి.. 2021 జూన్ 11నే 6.1 కి.మీల పొడవున మళ్లించారు.
- కోతకు గురైన దిగువ కాఫర్ డ్యామ్‌ను సీడబ్ల్యూసీ, డీడీఆర్పీ మార్గదర్శకాల మేరకు జియోమెంబ్రేన్ బ్యాగ్‌లలో ఇసుకను నింపి, కోతకు గురైన ప్రాంతంలో వేసి.. వైబ్రో కాంపాక్షన్ చేస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 15కు 31.5 మీటర్ల ఎత్తుతో పూర్తి చేయించారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తయ్యాయి. ఇప్పుడు డయాఫ్రమ్ వాల్ నిర్మించాలి.
- గోదావరి వరదలకు దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను మార్చి 3, 4 తేదీల్లో సీడబ్ల్యూసీ, డీడీఆర్పీ, ఎన్‌హెచ్‌పీసీ బృందం తనిఖీ చేసి.. దెబ్బతినిందని తేల్చింది. ఇప్పుడు వారి మార్గదర్శకాల మేరకు డయాఫ్రమ్ వాల్ చేపట్టి.. దానిపై ఈసీఆర్ఎఫ్ డ్యామ్‌ను నిర్మించి.. ప్రాజెక్టును పూర్తి చేసే దిశగా సీఎం వైఎస్ జగన్ అడుగులు వేస్తున్నారు.
- చంద్రబాబు అంగీకరించిన మేరకు 2013–14 ధరల ప్రకారం పోలవరాన్ని పూర్తి చేయడం సాధ్యం కాదని.. 2017–18 ధరల ప్రకారం నిధులు ఇచ్చి ప్రాజెక్టును పూర్తి చేయడానికి సహకరించాలని నాలుగేళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులకు సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఫలితంగా తొలి దశ పూర్తి చేసేందుకు అవసరమైన రూ.12,911.15 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం ఇటీవల అంగీకరించింది. పూర్తి స్థాయిలో అంటే 45.72 మీటర్ల మేరకు ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను కేంద్రం ఇస్తుంది. ప్రాజెక్టు ఎత్తు ఒక్క అంగుళం కూడా తగ్గదని ఇటు సీఎం వైఎస్ జగన్.. అటు కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి షెకావత్ స్పష్టం చేసినా.. ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తున్నారంటూ చంద్రబాబుతో పాటు ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తోంది.

9 ఏళ్లలో ఒక్క ప్రాజెక్టు గురించైనా ఆలోచించావా?

- 14 ఏళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు ఒక్కటంటే ఒక్క ప్రాజెక్టును డిజైన్ చేసి, టెండర్లు పిలిచి, పూర్తి చేయలేదు. నువ్వు చెబుతున్నట్లుగా ఎన్టీఆర్ డిజైన్ చేయించిన గాలేరు–నగరి, హంద్రీ–నీవాను కూడా చేపట్టకుండా ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచినట్లు వాటికీ వెన్నుపోటు పొడిచి ప్రజలను మోసం చేసింది నువ్వు కాదా బాబూ?
- మహానేత వైఎస్సార్ 2004లో సీఎంగా బాధ్యతలు చేపట్టాక.. సముద్రంలో కలుస్తున్న నదీ జలాలను బంజరు భూములకు మళ్లించి.. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడానికి హంద్రీ–నీవా, గాలేరు–నగరిసహా 84 ప్రాజెక్టులను జలయజ్ఞం కింద చేపట్టారు. అందులో భాగంగానే పోలవరాన్నీ చేపట్టారు. తాను సీఎంగా ఉన్న ఐదేళ్ల మూడు నెలల్లోనే ప్రాజెక్టుల పనులను పరుగులు పెట్టించారు. పోలవరానికి రూ.4,730.61 కోట్లను వ్యయం చేశారు. మహానేత వైఎస్ చేపట్టిన ప్రతి ప్రాజెక్టును.. పోలవరం సహా పూర్తి చేసి, జాతికి అంకితం చేసేది సీఎం వైఎస్ జగనే. ఈ నేపథ్యంలో శని చంద్రబాబు ప్రాజెక్టుల వద్దకు వెళ్తానంటున్నారు. ఆయన వెళ్తే వాటికి ఏ ముప్పు వాటిల్లుతుందోననే భయం ప్రజల్లో ఉంది.

ఆంబోతుల వద్దకు ఆవులను పంపిందెవరు?

చంద్రబాబుకు వయసు పెరిగిన కొద్దీ పైత్యం పెరుగుతోంది. అధికారంలో లేనని.. మళ్లీ ఇక అధికారంలోకి రాలేననే నిరాశ, నిస్పృహలతో పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు. నన్ను ఆంబోతు రాంబాబు అంటూ సంస్కారం లేకుండా దూషిస్తున్నారు. నేనూ చంద్రబాబును దూషించగలరు. కానీ నాకు సంస్కారం ఉంది. కానీ.. చంద్రబాబు పదే పదే దూషిస్తున్నారు. ఎన్టీఆర్‌కు అల్లుడివి కాకపోతే చంద్రబాబు సీఎంగా అయ్యేవారా? పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, పార్టీని, అధికారాన్ని దక్కించుకున్న చంద్రబాబు.. సైకిల్ గుర్తును దక్కించుకోవడానికి ఆంబోతుల వద్దకు ఆవులను పంపలేదా? నన్ను చంద్రబాబు ఆంబోతు అన్నప్పుడల్లా.. ఆంబోతులకు ఆవులను సరఫరా చేసే నీచుడు చంద్రబాబు అనే వాస్తవాన్ని కూడా నేను చెబుతాను.

నేను డ్యాన్స్ చేస్తే సంక్రాంతి.. పవన్ చేస్తే చీకటిరాత్రి

'సత్తెనపల్లిలో ఎమ్మెల్యేగా నేను గెలిచి.. ముగ్గుల పోటీ పెట్టి.. సంక్రాంతి రోజున ఆనందతాండవం చేస్తా. డ్యాన్స్ నేను చేస్తే సంక్రాంతి.. నువ్వు చేస్తే చీకటిరాత్రి' అంటూ జనసేన అధ్యక్షుడు, సినీ నటుడు పవన్ కళ్యాణ్‌పై మంత్రి అంబటి రాంబాబు వ్యంగ్యోక్తులు విసిరారు. 'బ్రో' సినిమాలో తనను అనుకరిస్తూ డ్యాన్స్ చేసిన నటుడిపై పవన్ కళ్యాణ్ సెటైర్లు వేసి ఆత్మ సంతృప్తి పొందారన్నారు. పవన్ కళ్యాణ్‌ది శునకానందమేనన్నారు. తాను ఎవరి వద్ద ప్యాకేజీలు తీసుకుని డ్యాన్స్‌లు చేయనని.. చంద్రబాబు వద్ద ప్యాకేజీలు తీసుకుని డ్యాన్స్‌లు చేసే పవన్ కళ్యాణ్ తన డ్యాన్స్‌పై సెటైర్లు వేసే స్థాయికి దిగజారినందుకు జాలి పడుతున్నానని చెప్పారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేకే, ఎవరో ఖర్చు పెట్టి తీసిన సినిమాలో, పారితోషికం తీసుకుని తనపై పవన్ సెటైర్లు వేయడం సిగ్గుచేటన్నారు. తన అన్న సినిమా నటుడు కాదని.. మామ సీఎంగా పని చేయలేదని.. విద్యార్థి దశ నుంచి నిత్యం ప్రజలతో మమేకమవుతూ 1989లో రేపల్లె నుంచి, 2019లో సత్తెనపల్లి నుంచి ఎమ్మెల్యేగా గెలిచానంటూ పవన్ కళ్యాణ్, చంద్రబాబులకు చురకలు అంటించారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
ఆదివారం ॥ 30-7-2023

వైరల్





వెన్నెల నవ్వితే... ఆ అందం నువ్వే!

రజనీకాంత్ 'జైలర్' సినిమాలోని 'నువ్వు కావాలయ్యా' పాట సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. అనిరుథ్ రవిచందర్ ఈ పాటకు స్వరాలు సమకూర్చి శిల్పారావుతో కలిసి పాడాడు. ఈ పాటకు తమన్నా భాటియా వేసిన స్టెప్‌లను నెటిజనులు షేర్ చేస్తున్నారు. ఈ క్యాచీ బీట్స్ పాట యూ ట్యూబ్‌లో 74 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

ఈ పాటలో తమన్నా హుక్ స్టెప్స్‌ను అనుసరిస్తూ మిస్ కేరళ (2017) ప్రియాంక మేనన్ అందమైన వీడియో చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో 47.2 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. కామెంట్ సెక్షన్ హార్ట్ ఇమోజీలతో నిండిపోయింది.

నా లోగో నా ఇష్టం



'నా లోగో నా ఇష్టం' అని ఎలాన్ మస్క్ అనుకున్నా సరే, నెటిజనులు మాత్రం రకరకాల మీమ్స్‌తో ట్విట్టర్ కొత్త లోగోను ఆటపట్టిస్తున్నారు.

'అడల్ట్ ఫిల్మ్ సైట్ లోగోలా ఉంది'

'ట్విట్టర్ ఎక్స్–లవర్‌ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది అని చెప్పేలా ఉంది ఈ లోగో'... ఇలాంటి కామెంట్స్ సంగతి ఎలా ఉన్నా, సోషల్ మీడియాలో రకరకాల మీమ్స్ సందడి చేస్తున్నాయి. ప్రాంతీయ భాష చిత్రాల నుంచి హాలీవుడ్ సినిమాలలోని సీన్‌ల వరకు ఈ మీమ్స్ వైరల్ అయ్యాయి.

ఒక సృజనకారుడు పాత ట్విట్టర్ లోగో పిట్ట, కొత్త లోగో 'ఎక్స్'ను మిక్స్ చేసి సరికొత్త లోగోను సృష్టించాడు. ఈ లోగోను మస్క్‌గానీ చూశాడంటే పుసుక్కున 'ఇదే నా కొత్త లోగో' అని ఎనౌన్స్ చేయడం ఖాయం!



రైలు చివరి బోగీపై పెద్ద సైజులో 'ఎక్స్' అనే గుర్తు ఉంటుందనేది తెలిసిందే. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఒకాయన రైల్వే డిపార్ట్‌మెంట్‌కు ఇలా విన్నవించుకున్నాడు...

'మీ గుర్తును వాళ్లు లాగేసుకున్నారు. కాబట్టి బోగీ చివర 'ఎక్స్' స్థానంలో ట్విట్టర్ పాత లోగో పిట్ట ఉండాల్సిందిగా నా విజ్ఞప్తి'.

ఇస్మార్ట్ ఆఫర్



డ్యాన్స్ జెయ్యాలే... ఫ్రీగా ఐస్‌క్రీమ్ తినాలే!

'డ్యాన్స్ చేయండి. ఐస్‌క్రీమ్ ఫ్రీగా తినండి' అని ఎవరైనా ఆఫర్ ఇస్తే ఎంత బాగుంటుంది!

ఎవరో ఎందుకు సాక్షాత్తూ ఒక ఐస్‌క్రీమ్ కంపెనీ ఇలాంటి ఆఫర్‌ను కస్టమర్‌లకు ఇచ్చింది.

'ఐస్‌క్రీమ్ డే'ను పురస్కరించుకొని బెంగళూరుకు చెందిన 'కార్నర్ హౌజ్ ఐస్‌క్రీమ్స్' అనే ఐస్‌క్రీమ్ కంపెనీ షాప్ ముందు నుంచి కౌంటర్ వరకు డ్యాన్స్ చేస్తూ వచ్చే వాళ్లకు ఫ్రీ ఐస్‌క్రీమ్ ఆఫర్ ఇచ్చింది. ఇక డ్యాన్సులే డ్యాన్సులు!

కంపెనీ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ డ్యాన్స్ వీడియోలు వైరల్ అయ్యాయి.

'ఫ్రీ ఐస్‌క్రీమ్ మాటేమిటోగానీ ఎంతో మంది డ్యాన్సింగ్ స్కిల్స్‌ను చూసే అవకాశం వచ్చింది'

'డ్యాన్స్ చేస్తే ఫ్రీగా టమాటాల ఆఫర్ ఎవరైనా ఇస్తే బాగుండేది'... ఇలాంటి కామెంట్స్ నెటిజనుల నుంచి వచ్చాయి.

టెంపుల్ ఆఫ్ టీ సర్వీస్

అమృత్‌సర్ పేరు వినబడగానే 'స్వర్ణ దేవాలయం' గుర్తుకు వస్తుంది. ఈ పవిత్ర నగరంలో ఒక విశేషమైన టీ స్టాల్ ఉంది. 'టెంపుల్ ఆఫ్ టీ సర్వీస్' అనే ఈ టీ స్టాల్‌లో టీ ఉచితంగా ఇస్తారు. ఎనభై సంవత్సరాల అజీత్‌సింగ్ ఎన్నో సంవత్సరాలుగా ఒక పెద్ద చెట్టు ఊడల మధ్య ఈ టీ స్టాల్‌ను నిర్వహిస్తున్నాడు.

అజీత్‌సింగ్‌ను అందరూ 'బాబాజీ' అని పిలుస్తారు.

'టెంపుల్ ఆఫ్ టీ సర్వీస్'లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు వరకు ఎప్పుడైనా ఉచితంగా టీ తాగవచ్చు.

గతంలో ఈ టీస్టాల్‌లోని వస్తువులను దొంగలు దోచుకెళ్లారు. అయినప్పటికీ బాబాజీ ఉచిత టీ ఇవ్వడం ఆపలేదు.



బాలీవుడ్ బార్బీ



ప్రపంచ వ్యాప్తంగా బార్బీయ మేనియా కమ్మేసింది. మన దేశం కూడా ఇందుకు మినహాయింపు కాదు. బాలీవుడ్ సినిమాల బార్బీ ఫైడ్ సీన్‌లు వైరల్ అవుతున్నాయి. తాజాగా 'ఓంశాంతి ఓం' సినిమాలోని 'ఫిర్ మిలేంగే ఛల్తే ఛల్తే' పాటను బార్బీఫైడ్ చేశారు. పింక్ కోర్టులో షారుఖ్‌ఖాన్, దీపిక పదుకొణె బ్యాడ్మింటన్ ఆడుతూ పాడుతుంటారు. అయితే అది 'ఫిర్ మిలేంగే...' పాట కాదు. ఇంగ్లీష్ సాంగ్ రైటర్, సింగర్ దువ లిపా 'బార్బీ' సినిమా సౌండ్ ట్రాక్ కోసం రాసిన 'బేబీ, యూ కెన్ ఫైండ్ మీ అండర్ ది లైట్స్/డైమండ్స్ అండర్ మై ఐస్' పాట బ్యాక్‌గ్రౌండ్‌లో వినిపిస్తుంటుంది. ఈ పాట నేపథ్యంలో షారుఖ్, దీపికాలను 'బార్బీ' సినిమాలో లీడ్ రోల్స్ పోషించిన మార్గోవ్ రాబీ(బార్బీ), రెయాన్ గాస్లింగ్ (కెన్)లుగా ఊహించుకోవాలి.

కార్గిల్ యుద్ధ వీరుడికి సలాం



ఇండిగో ఎయిర్‌లైన్స్ పుణె ఫ్లైట్‌లో ప్రయాణిస్తున్న మేజర్ సంజయ్ కుమార్‌ను ఇండిగో సిబ్బంది సత్కరించారు. కార్గిల్ యుద్ధవీరుడు, పరమవీర చక్ర పురస్కార గ్రహీత సంజయ్ కుమార్‌ను ప్రయాణికులకు పరిచయం చేసి ఆనాటి యుద్ధంలో ఆయన సాహసాలను గురించి చెప్పారు ఎయిర్‌లైన్స్ పైలట్. సంజయ్ కుమార్‌ని ప్రయాణికులు ప్రశంసల్లో ముంచెత్తారు. దీనితాలూకు దృశ్యాలు నెటిజనులను ఆకట్టుకున్నాయి.

హెల్త్

షిజెల్లోసిస్..! పిల్లల్ని బంకలా పట్టేస్తాయి!



చికిత్స
ఇది బ్యాక్టీరియా కారణంగా వచ్చే సమస్య కాబట్టి సిప్రోఫ్లాక్సిన్, అజిథ్రోమైసిన్ వంటి యాంటీబయాటిక్స్‌ను డాక్టర్ల ఆధ్వర్యంలో తగిన మోతాదులో కోర్సుగా వాడాలి.

వర్షాలు కొన్ని ఆరోగ్య సమస్యల్ని వెంటబెట్టుకొస్తాయి. మరికొన్ని వ్యాధుల్ని మరింతగా పెచ్చరిల్లేలా చేస్తాయి. మరీ ముఖ్యంగా పిల్లల్లో! వాళ్లతో పాటు పెద్దల్లో కూడా. ఇది చిన్నదిగా కనిపించే పెద్ద సమస్యే. సామాన్యజనం పరిభాషలో 'నెత్తుటిబంక విరేచనాలు' అంటారు. విరేచనాలవుతూ ఉండగా అందులో కొద్దిగా రక్తం, మరికొద్దిగా చీములా పడుతుండటంతో ఈ పేరు. షిజెల్లా అనే ప్రజాతికి చెందిన ఓ బ్యాక్టీరియాతో వచ్చే సమస్య ఇది. కలుషితమైన నీటి వల్ల ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే వ్యాధి. నీరు కలుషితం అవ్వడానికి అనువుగా ఉండే ఈ సీజన్‌లో మరింత ఎక్కువగా కనిపిస్తుంది. షిజెల్లోసిస్ వ్యాధిపై అవగాహన కోసం ఈ కథనం.

మానవ విసర్జకాలతో కలుషితమైన నీరు తాగడం వల్ల, ఆ నీటితో చేసిన వంటల వల్ల షిజెల్లా బ్యాక్టీరియా ఒకరి నుంచి మరొకరికి వ్యాపించి, మానవ జీర్ణవ్యవస్థలోకి చేరి, విరేచనాలు మొదలవుతాయి. ఈ విరేచనాలు కాస్త జిగటగా, నెత్తురుతో ఉండటంతో మామూలు వాటికంటే ఎక్కువగా ఆందోళన కలిగిస్తాయి. పిల్లల్లో అందునా ఐదేళ్లలోపు వారిలో ఎక్కువగా కనిపిస్తుంటాయి. కాబట్టి వారి విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తుంటారు.

లక్షణాలు: ● విరేచనాల్లో బంక (మ్యూకస్), నెత్తురు కనిపించడం. ● కడుపు పట్టేసినట్లుగా అనిపించడం (స్టమక్ క్రాంప్స్), కడుపు నొప్పి ● జ్వరం (జ్వరతీవ్రత 101 ఫారెన్‌హీట్ వరకు ఉండవచ్చు) ● వికారం, కొన్నిసార్లు వాంతులు.

వ్యాప్తి ఇలా... ● **కలుషితాహారంతో :** షిజెల్లా బ్యాక్టీరియాతో కలుషితమైన నీటితో తయారు చేసిన ఆహారంతో లేదా ఆ నీళ్లు తాగడం వల్ల; లేదా ఆ నీటిలో ఈదినప్పుడు నోట్లోకి వెళ్లినప్పుడు మింగడం వల్ల. ● **వ్యక్తి నుంచి వ్యక్తికి:** ఈ బ్యాక్టీరియా కలిగి ఉన్న వ్యక్తి తన పెదవుల్ని చేతులతో తాకాక అవే చేతుల్ని ఇతరులు ముట్టుకున్నప్పుడు. ● ఇది పిల్లల డే కేర్ సెంటర్లలో, పిల్లలను ఆడిపించే క్రష్‌లు, స్విమ్మింగ్‌పూల్స్ ద్వారా... అలాగే హైజీన్ తక్కువగా ఉండే విద్యార్థుల హాస్టల్స్, మెస్‌లు, క్యాంపస్‌లలో వ్యాపించే అవకావం ఎక్కువ. ఇక ప్రయాణాల్లో అంతగా పరిశుభ్రత పాటించని హోటళ్ల వల్ల కూడా ఒకరినుంచి మరొకరికి పాకవచ్చు.

కొన్నిసార్లు కాంప్లికేషన్లు...

● **డీ–హైడ్రేషన్‌తో :** విరేచనాల కారణంగా దేహంలోని ద్రవాలను కోల్పోవడంతో డీ–హైడ్రేషన్‌కు గురికావచ్చు. ఫలితంగా తల తిరగడం (డిజ్జీనెస్); తేలిగ్గా అనిపించడం (లైట్ హెడెడ్‌నెస్); పిల్లల్లో కన్నీళ్లు కూడా కనిపించక పోవడం, కళ్లు లోతుకుపోయినట్లుగా కనిపించడం... మరీ చిన్న పిల్లల్లో ఈ పరిస్థితులు తీవ్రమైతే ఒక్కోసారి షాక్‌కూ... అటు తర్వాత ప్రాణాపాయానికి కూడా దారితీయవచ్చు.

● **మూర్ఛ (సీజర్స్) :** కొంత మంది పిల్లల్లో మూర్ఛ (సీజర్స్) కనిపించవచ్చు. జ్వర తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నప్పుడు ఇలా జరిగే అవకావాలు ఎక్కువ.

● **మలద్వారం చివరి భాగం బయటికి జారడం (రెక్టల్ ప్రొలాప్స్) :** జిగురుతో కూడిన మ్యూకస్ బంకలా పడటం వల్ల మలద్వారం చివరి భాగం బయటకు జారే అవకాశం ఉంటుంది. దీన్నే రెక్టల్ ప్రొలాప్స్ అంటారు.

● **హీమోలైటిక్ అనీమియా :** ఇది చాలా అరుదుగా మాత్రమే కనిపించే ముప్పు అయినప్పటికీ కొట్టి పారేయలేని సమస్య. నెత్తుటి విరేచనాలు అవుతుండటంవల్ల ఎర్రరక్తకణాల సంఖ్య తగ్గడం (హీమోలైటిక్ అనీమియా), ప్లేట్‌లెట్స్ తగ్గడం (థ్రాంబోసైటోపీనియా)... చాలా అరుదుగా ఒక్కోసారి మూత్రపిండాల వైఫల్యం కనిపించవచ్చు.

● **టాక్సిక్ మెగాకోలన్ :** ఇది కూడా చాలా అరుదుగా మాత్రమే కనిపించే ముప్పు. ఇందులో పేగుల కదలిక (బవెల్ మూవ్‌మెంట్) మందగించి మలం ముందుకు కదలడం ఆగిపోవచ్చు. దాంతో గ్యాస్ గానీ, మల విసర్జన గానీ జరగకపోవచ్చు. ఇలాంటి వైఫల్యం కనిపించినప్పుడు దీన్ని మెడికల్ ఎమర్జెన్సీగా పరిగణించి వెంటనే చికిత్స తీసుకోకపోతే పెద్దపేగు గాయపడటంతో పాటు ఒక్కోసారి ప్రాణాపాయానికీ దారితీసే ప్రమాదం ఉంటుంది.

● **బ్యాక్టీరిమియా :** షిజెల్లా ఇన్ఫెక్షన్‌తో పేగుల లోపలి లైనింగ్ దెబ్బతినవచ్చు. దాంతో ఇలా దెబ్బతిన్న ప్రాంతం నుంచి ఇన్ఫెక్షన్ రక్తంలోకి వ్యాపిస్తుంది. ఇది కాస్త అరుదు.

నివారణ

● **కేర్‌ఫుల్ డిస్పోజల్ ఆఫ్ డయపర్స్ :** చిన్న పిల్లల డయపర్స్‌ను జాగ్రత్తగా పారేయాలి. వీటిని నీటివనరు (వాటర్ సోర్స్)తో కలవనివ్వకుండా జాగ్రత్తపడాలి. ● అప్పటికే విరేచనాలూ, నీళ్ల విరేచనాలూ, నెత్తుటిబంక విరేచనాలతో బాధపడుతున్నవారు... వంట చేయడం సరికాదు. వాళ్లు కిచెన్ నుంచి దూరంగా ఉండాలి. ● భోజనానికి ముందు, మల విసర్జన తర్వాత తప్పనిసరిగా కనీసం 20 సెకండ్ల పాటు సబ్బుతో రుద్దుతూ చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. ● **గుడ్ టాయిలెట్ హ్యాబిట్స్:** పిల్లలకూ చేతులు కడుక్కునే అలవాటు నేర్పాలి. ● స్కూల్స్, పిల్లల కేర్ సెంటర్స్, ఆటస్థలాలు, పిల్లలు ఆడుకునే ప్రదేశాలు, వాళ్ల టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

● పిల్లలు స్విమ్మింగ్ పూల్స్‌లో లేదా పల్లెల్లో చెరువులు, బావుల్లో ఈదుతున్నప్పుడు ఆ నీటిని మింగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ● చెరువులు, వాగుల వంటి నీటి వనరు నుంచి తెచ్చిన నీటిని కాచి వడబోయకుండా తాగవద్దు. అలాగే పట్టణాల్లోనూ కొళాయి/నల్లా నీటిని శుభ్రం చేయడం, వడబోయడం వంటివి చేయకుండా వాడకూడదు.



డాక్టర్ శివనారాయణ రెడ్డి
సీనియర్ పీడియాట్రీషియన్

మెడిటిప్ ఆస్తమా నివారణ ఇలా...



ఆస్తమా ఊపిరాడనివ్వకుండా చేస్తూ... ఎంతగా ఇబ్బంది పెడుతుందో తెలిసిన విషయమే. పైగా వర్షాలతో ఇప్పుడున్న వాతావరణం ఆస్తమాకు మరింత దోహదం చేస్తుంది. కొన్ని ఆహారాలతో ఆస్తమా అటాక్ రాకుండా నివారణ ఇలా...

◗ తమకు సరిపడని పదార్థాలతో ఆస్తమా ట్రిగర్ అవుతుంది. అందుకే ఆహారాల్లో తమకు సరిపడని వాటికి దూరంగా ఉండాలి. ◗ భోజనంలో... ఆకుకూరల్లో పాలకూర, బచ్చలి వంటి వాటివి... కాయగూరల్లో కాకర, గుమ్మడి, క్యారట్, బీట్‌రూట్, మొలకెత్తిన గింజలు, రాగులు, సజ్జలు వంటి పొట్టుతో కూడిన చిరుధాన్యాలు తీసుకోవాలి. ◗ పండ్లలో పుల్లటి పండ్లయిన కమలాలు, నిమ్మ, బత్తాయి, అరటిపండు వంటి వాటిని మినహాయించి, మిగతావాటిని అంటే ఉదాహరణకు బెర్రీ, బొప్పాయి వంటి పండ్లను తీసుకోవచ్చు. ◗ ఆహారాన్ని వండేందుకు ఉపయోగించే దినుసుల్లో వెల్లుల్లి, ఉల్లిపాయలు, ఆలివ్ ఆయిల్ వంటివి వాడుకోవచ్చు. ధనియాలు, లవంగం, దాల్చిన చెక్క, ఏలకులు, జీలకర్ర, అల్లం, పసుపు వంటి సహజ మసాలాదినుసులు ఆస్తమా తీవ్రతను తగ్గిస్తాయి.

పెద్దవయసు వారిని వణికించే పార్కిన్‌సన్స్ వ్యాధి!



పార్కిన్‌సన్స్ వ్యాధి కాస్త వయసు పెరిగిన వారిలో అంటే 60 ఏళ్లు పైబడిన వారిలో కనిపించే వ్యాధి. ఇందులో బాధితుల వేళ్లు, చేతులు వణుకుతుంటాయి. ఈ వ్యాధిని డాక్టర్ జేమ్స్ పార్కిన్‌సన్ అనే వైద్యనిపుణుడు 1817లో గుర్తించి, 'షేకింగ్ పాల్సీ' అని పేరు పెట్టినప్పటికీ... కనిపెట్టినవారి పేరుతోనే ఇది ప్రాచుర్యం పొందింది. ఈ వ్యాధి గురించి ప్రాథమిక అవగాహన కోసం ఈ కథనం.

పార్కిన్‌సన్స్ వ్యాధి మహిళల్లో కంటే పురుషుల్లో దాదాపు ఒకటిన్నర రెట్లు ఎక్కువ. కొందరిలో యుక్తవయసులో అంటే 30 ఏళ్ల వారిలోనూ కనిపిస్తుండటంతో దీన్ని అనువంశీకంగా కనిపించే పార్కిన్‌సనిజమ్ (హెరిడిటరీ పార్కిన్‌సనిజమ్) అంటున్నారు.

లక్షణాలు: ● కదలికలు నెమ్మదిస్తాయి (దీన్ని బ్రాడీకైనేసియా అంటారు). దాంతో నడక, స్నానం, దుస్తులు ధరించడం కష్టమవుతుంది. ముందుకు పడిపోతున్నట్లు అనిపిస్తుంటుంది. బ్యాలెన్స్ కోల్పోతారు. ● కాళ్లూ, చేతుల్లోని కండరాలు బిగుసుకుపోవడం, వణకడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ● తీవ్రమైన అలసట (ఫెటీగ్)కనిపిస్తూ, తరచూ నిద్రాభంగమవుతుంది. ఈ పరిణామాలతో పాటు మెదడులోని కొన్ని రసాయనాల అసమతౌల్యత వల్ల కుంగుబాటు (డిప్రెషన్), నిద్రసమస్యలు కనిపిస్తాయి. పీడకలలూ, రాత్రి నిద్రలేమితో అకస్మాత్తుగా పగటినిద్ర రావచ్చు. ● కొందరిలో మింగడం కష్టం కావడం, మింగలేకపోవడంతో ఆహారం గొంతులో పట్టేయడం /ఇరుక్కుపోవడం. ● కొందరిలో కండరాల నొప్పులు / కీళ్ల నొప్పులు. ● మొదట్లో కనిపించే ఈ లక్షణాల్ని నిర్లక్ష్యం చేస్తే, అవి మరింత ముదిరి బాధితులు తమ రోజువారీ పనులు చేసుకోలేనంతగా ఇబ్బంది పడతారు. ● కొన్ని చర్మ సమస్యలతో పాటు నాడీ వ్యవస్థ దెబ్బతినడం వల్ల మూత్ర విసర్జన సమస్యలూ అలాగే మలబద్ధకం వంటి లక్షణాలూ కనిపించవచ్చు.

నిర్ధారణ ఇలా... పార్కిన్‌సన్స్ వ్యాధిని పసిగట్టడం అన్నది ప్రధానంగా వ్యాధి లక్షణాల్ని బట్టి, క్లినికల్ పరీక్షల సహాయంతో జరుగుతుంది. నిర్ధారణ కోసం ఈ కింది పరీక్షలు అవసరమవుతాయి.

● మెదడు ఎమ్మారై పరీక్ష, స్పెక్ట్ అనే పరీక్ష. దీన్నే డాట్ స్కాన్ అని కూడా అంటారు. ● పెట్ స్కాన్ పరీక్ష.

చికిత్స : ● వయసు పెరగడంతో మెదడులోని డోపమైన్ తగ్గడం, దాంతో కదలికలను నియంత్రించే మెదడు కణాలు నశించడం వల్ల పార్కిన్‌సన్స్ వ్యాధి వస్తుంది. డోపమైన్ ఉత్పత్తిని పెంచే మందులతో లక్షణాల్ని అదుపులోకి తేవచ్చు. అయితే పెరిగే వయసుతో పాటు డోపమైన్ ఉత్పాదన / మెదడులో దాని మోతాదు తగ్గుతూ వస్తుండటంతో మందుల మోతాదును పెంచుతూ పోవాల్సి ఉంటుంది. ● లెవోడోపా / కార్బిడోపా అనే మందులు దేహంలోకి వెళ్లగానే డోపమైన్‌గా మారతాయి. మావో–బి ఇన్హిబిటార్స్ మందులు మరింత డోపమైన్ లభ్యమయ్యేలా చేస్తాయి. ● యాంటీ కొలినెర్జిక్ మందులు లక్షణాల తీవ్రతను తగ్గించి, ఉపశమనాన్ని స్తాయి.

● **శస్త్రచికిత్స :** మందుల మోతాదు పెరుగుతున్న కొద్దీ ఓ దశలో దుష్ప్రభావాలు మొదలవుతాయి. అందుకే మాత్రలు వేసుకున్నా ప్రయోజనం లేని సందర్భాల్లో ఇక చివరి యత్నంగా 'డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ సర్జరీ' అనే శస్త్ర చికిత్స అవసరం పడవచ్చు.

నివారణతో పాటు అవసరమయ్యే ఇతర పద్ధతులు:
వ్యాయామం పార్కిన్‌సన్ వ్యాధిని కొంత మేరకు నివారిస్తుంది. ఫిజియోథెరపీ, రీ–హ్యాబిలిటేషన్, మింగలేని సమయాల్లో పోషకాహార లోపాలను అధిగమించడానికి విటమిన్ సప్లిమెంట్స్ తీసుకోవడం. అలాగే పార్కిన్‌సన్ వ్యాధి వల్ల కుంగుబాటు (డిప్రెషన్) వంటి మానసిక సమస్యలు పార్కిన్‌సన్ వ్యాధికి దారితీసే ప్రమాదమూ ఉంది. అందుకే సైకియాట్రిక్ ఇవాల్యుయేషన్ అవసరం కావచ్చు.



డాక్టర్ ఎం. సాయి స్రవంతి
కన్సల్టెంట్ న్యూరోఫిజీషియన్



మను భాకర్‌కు రెండు స్వర్ణాలు

వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో భారత అగ్రశ్రేణి షూటర్ మనూ భాకర్ రెండు పసిడి పతకాలతో మెరిసింది. ఓవరాల్‌గా ఈ పోటీల్లో శనివారం భారత్ ఖాతాలో 3 స్వర్ణాలు, ఒక కాంస్యం చేరాయి. భారత్ ఖాతాలో చైనాలోని చెంగ్డూలో జరుగుతున్న క్రీడల్లో భాకర్ 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ వ్యక్తిగత, మహిళల టీమ్ విభాగాల్లో స్వర్ణాలు సాధించింది. టీమ్ ఈవెంట్‌లో ఆమెతో పాటు యశస్విని సింగ్ దేశ్వాల్, అభింద్య అశోక్ పాటిల్ సభ్యులుగా ఉన్నారు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలోనూ భారత్‌కు చెందిన ఎలవెనిల్ వలరివన్ స్వర్ణ పతకం గెలుచుకుంది. మరో వైపు జూడో 57 కేజీల మహిళల విభాగంలో భారత్‌కు చెందిన యామిని మౌర్య కాంస్య పతకం సాధించింది.

భారత్ 181 ఆలౌట్

- రాణించిన ఇషాన్ కిషన్
- కట్టడి చేసిన షెఫర్డ్, మోతీ
- విండీస్‌తో రెండో వన్డే

బ్రిడ్జ్‌టౌన్: కరీబియన్‌లో భారత జట్టు ప్రపంచకప్ సన్నాహం పేలవంగా సాగుతోంది. ప్రస్తుతం జరుగుతున్న వన్డే సిరీస్‌లో ఆశావహులే కాదు... కచ్చితంగా పరిశీలనలో ఉన్న క్రికెటర్లు కూడా నిరాశపరిచారు. శనివారం జరిగిన రెండో వన్డేలో పాండ్యా, జడేజా మినహా పూర్తి స్థాయిలో కుర్రాళ్ల జట్టునే బరిలోకి దించినా... వారి ఆటతీరు కూడా తీసికట్టుగా సాగింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ 40.5 ఓవర్లలో 181 పరుగులకే ఆలౌటైంది. ఇషాన్ కిషన్ (55 బంతుల్లో 55; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించగా, శుబ్‌మన్ గిల్ (49 బంతుల్లో 34; 5 ఫోర్లు) రాణించాడు. రొమారియో షెఫర్డ్ (3/37), గుడకేశ్ మోతీ (3/36), అల్జారి జోసెఫ్ (2/35) కలిసికట్టుగా భారత్‌ను కట్టడి చేశారు. కుర్రాళ్లను పరీక్షించడం కోసం స్టార్ బ్యాటర్ కోహ్లి, కెప్టెన్ రోహిత్ శర్మలకు రెండో వన్డేలో విశ్రాంతి ఇవ్వడంతో హార్దిక్ పాండ్యా ఈ మ్యాచ్‌కు నాయకత్వం వహించాడు. ఆ ఇద్దరి స్థానాల్లో సంజూ సామ్సన్, అక్షర్ పటేల్‌లను తుది జట్టులోకి తీసుకున్నారు. **అనంతరం 182 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ కడపటి వార్తలందేసరికి 10 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 64 పరుగులు చేసింది.**

ఓపెనర్లు మినహా...

టాస్ నెగ్గిన విండీస్ ఫీల్డింగ్ ఎంచుకోగానే... భారత బ్యాటింగ్ లైనప్ చూసుకొని సగటు క్రికెట్ అభిమాని గర్వం! ఇక మనవాళ్లు కుమ్మేస్తారనే గంపెడాశలు! కానీ 50 ఓవర్ల పాటు కూడా కరీబియన్ బౌలింగ్‌ను ఎదుర్కోలేకపోవడమే పెద్ద షాక్. ఇన్నింగ్స్ ఓపెన్ చేసిన ఇషాన్ కిషన్ గానీ, శుబ్‌మన్ గిల్ గానీ చెప్పుకోదగ్గ మెరుపులే మెరిపించలేదు. అయితే భారత ఇన్నింగ్స్‌లో వీళ్లిద్దరే కుదురుగా ఆడారు. దీంతో జోరు లేకపోయినా స్కోరు బోర్డు మందకొడిగా సాగింది. అడపాదడపా బౌండరీలే తప్ప అలరించే సిక్సర్లు కరువయ్యాయి. గుడ్డిలో మెల్ల అన్న చందంగా ఇషాన్ కొట్టిన ఏకైక సిక్సరే ఇన్నింగ్స్‌కు బంగారమైంది! ఆ తర్వాత హార్డ్ హిట్టర్లు సూర్యకుమార్, హార్దిక్ పాండ్యాల వల్ల కూడా ఒక్క సిక్సర్ అయినా నమోదు కాలేదు. 17వ ఓవర్లో ఇషాన్ ఇషాన్ ఫిఫ్టీ 51 బంతుల్లో పూర్తికాగానే... అదే ఓవర్లో శుబ్‌మన్ నిష్క్రమించాడు. దీంతో 90 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం ముగిసింది. మరుసటి ఓవర్లో ఇషాన్ ఆటకు షెఫర్డ్ చెక్ పెట్టాడు. వీళ్లిద్దరు ఉన్నంతసేపే పరుగులొచ్చాయి. ఆ తర్వాత వికెట్లే రాలాయి. అక్షర్ పటేల్ (1)ను నాలుగో స్థానంలో ప్రమోషన్‌గా దింపితే తీవ్రంగా నిరాశ పరిచాడు. 97 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయిన దశలో ఆదుకుంటాడనుకున్న పాండ్యా (7) కూడా ప్రత్యర్థి బౌలింగ్‌కు తలవంచాడు. సూర్యకుమార్ (25 బంతుల్లో 24; 3 ఫోర్లు) మెరిపించలేకపోయినా కాసేపు కుదురుగా ఆడాడు. జడేజా (10), శార్దుల్ (16; 2 ఫోర్లు) ఇలా అందరు వచ్చిన దార్లోనే పెవిలియన్ చేరడంతో మొదటి 90 పరుగుల వరకు వికెట్ కోల్పోని భారత్... తర్వాతి 91 పరుగులకే అన్ని వికెట్లు (10) కోల్పోయి సుమారు పది ఓవర్ల ముందే ఆలౌటైంది.





స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) అతనెజ్ (బి) షెఫర్డ్ 55; గిల్ (సి) జోసెఫ్ (బి) మోతీ 34; సామ్సన్ (సి) కింగ్ (బి) కరియ 9; అక్షర్ (సి) హోప్ (బి) షెఫర్డ్ 1; పాండ్యా (సి) కింగ్ (బి) సీల్స్ 7; సూర్యకుమార్ (సి) అతనెజ్ (బి) మోతీ 24; జడేజా (సి) కరియ (బి) షెఫర్డ్ 10; శార్దుల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జోసెఫ్ 16; కుల్దీప్ నాటౌట్ 8; ఉమ్రాన్ (సి) కార్టీ (బి) జోసెఫ్ 0; ముకేశ్ (సి) హెట్‌మైర్ (బి) మోతీ 6; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (40.5 ఓవర్లలో ఆలౌట్) 181. వికెట్ల పతనం:** 1-90, 2-95, 3-97, 4-113, 5-113, 6-146, 7-148, 8-167, 9-167, 10-181. **బౌలింగ్:** మేయర్స్ 5-0-18-0, సీలెస్ 6-0-28-1, జోసెఫ్ 7-0-35-2, గుడకేశ్ మోతీ 9.5-0-36-3, షెఫర్డ్ 8-1-37-3, కరియ 5-0-25-1.

పోరాడి ఓడిన లక్ష్యసేన్

జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్



టోక్యో: బీడబ్ల్యూఎఫ్ టూర్ సూపర్-750 జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్‌లో భారత షట్లర్ లక్ష్య సేన్ ఆట ముగిసింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో లక్ష్య పోరాడి ఓడాడు. ఈ మ్యాచ్‌లో ఇండోనేసియాకు చెందిన ఐదో సీడ్ జొనాథన్ క్రిస్టీ 21-15, 13-21, 21-16 స్కోరుతో సేన్‌ను ఓడించాడు. 68 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరు తొలి గేమ్‌లో క్రిస్టీ చేసిన పొరపాట్లతో సేన్ 7-4తో ముందంజ వేశాడు. ఆ తర్వాత ఒక్కసారిగా చెలరేగిన క్రిస్టీ 15-12తో ఆధిక్యంలోకి వచ్చేశాడు. రెండో గేమ్‌లో చక్కటి సర్వీస్, ర్యాలీలతో 11-5తో సేన్ ముందంజ వేశాడు. ఆపై పదునైన స్మాష్‌లతో చెలరేగి భారత షట్లర్ రెండో గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. చివరి గేమ్‌లో మాత్రం మొదటినుంచి ఆధిక్యం ప్రదర్శించిన క్రిస్టీ చివరి వరకు దానిని నిలబెట్టుకున్నాడు.

భారత మహిళల ఘన విజయం

3-0తో ఇంగ్లండ్ చిత్తు



లాల్‌రెమ్‌సియామి

బార్సిలోనా: స్పానిష్ హాకీ ఫెడరేషన్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జరుగుతున్న టోర్నీలో భారత మహిళల జట్టుకు తొలి విజయం దక్కింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-0 గోల్స్ తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. భారత్ తరఫున అన్నీ గోల్స్ తానే సాధించిన లాల్‌రెమ్‌సియామి 'హ్యాట్రిక్' నమోదు చేయడం విశేషం. మ్యాచ్ 13వ, 17వ, 56వ నిమిషాల్లో ఆమె మూడు ఫీల్డ్ గోల్స్ కొట్టింది. మొదటి, రెండో క్వార్టర్‌లో ఒక్కో గోల్ సాధించిన భారత్ చివరి క్వార్టర్‌లో మరో గోల్‌తో ముగించింది. ఈ టోర్నీలో రౌండ్ రాబిన్ లీగ్ దశలో ఇంగ్లండ్, స్పెయిన్‌లతో తొలి రెండు మ్యాచ్‌లను భారత్ 'డ్రా'గా ముగించింది. సవితా పూనియా నాయకత్వంలోని మన జట్టు తమ తర్వాతి పోరులో నేడు స్పెయిన్‌తో తలపడుతుంది.

వెర్‌స్టాపెన్‌కు పోల్

స్పా-ఫ్రాంకోర్‌చాంప్స్ (బెల్జియం): గత వారం హంగేరియన్ గ్రాండ్‌ప్రిలో పోల్ పొజిషన్ సాధించడంలో విఫలమైన మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) ఈ సారి మళ్లీ ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. శనివారం జరిగిన బెల్జియన్ గ్రాండ్ ప్రి క్వాలిఫయింగ్ రేసులో అగ్ర స్థానంలో నిలిచిన అతను 0.011 సెకన్ల తేడాతో పోల్ పొజిషన్‌ను సాధించాడు. ల్యాప్‌ను అందరికంటే వేగంగా 1 నిమిషం 49.056 సెకన్లలో వెర్‌స్టాపెన్ పూర్తి చేశాడు. మెక్లారెన్ డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రీ (1 నిమిషం 49.067 సె.) రెండో స్థానంలో నిలవగా, కార్లోస్ సెయింజ్ (ఫెరారీ - 1 నిమిష 49.081 సె.)కు మూడో స్థానం దక్కింది.

అదరగొట్టిన ఇంగ్లండ్

- రెండో ఇన్నింగ్స్‌లో 389/9
- ఆసీస్‌తో చివరి 'యాషెస్' టెస్టు

లండన్: తొలి రోజునుంచే ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ప్రతిష్టాత్మక 'యాషెస్' సిరీస్‌లో మరో రసవత్తర ముగింపునకు రంగం సిద్ధమైంది. చివరిదైన ఐదో టెస్టును గెలుచుకునే ప్రయత్నంలో ఇంగ్లండ్ బలంగా పట్టు బిగించింది. పదునైన బ్యాటింగ్‌తో చెలరేగి ఆస్ట్రేలియా ముందు దాదాపు అసాధ్యమైన లక్ష్యాన్ని ఉంచేందుకు సిద్ధమైంది. మ్యాచ్ మూడో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 389 పరుగులు చేసింది. అండర్సన్ (8 బ్యాటింగ్), బ్రాడ్ (2 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. ఇప్పటికే ఆ జట్టు 377 పరుగుల ఆధిక్యంలో ఉంది. మిగిలిన రెండు రోజులు ఆసీస్ బ్యాటర్లు నిలబడి లక్ష్యాన్ని ఛేదిస్తారా లేక ఇంగ్లండ్ 2-2తో సిరీస్‌ను సమం చేస్తుందా చూడాలి.



బెయిర్‌స్టో

ఇంగ్లండ్ మరోసారి తమ బ్యాటింగ్‌లో తొలి బంతినుంచే 'బజ్‌బాల్' దూకుడును ప్రదర్శించింది. ఓపెనర్లు జాక్ క్రాలీ (76 బంతుల్లో 73; 9 ఫోర్లు), బెన్ డకెట్ (55 బంతుల్లో 42; 7 ఫోర్లు) ఎప్పటిలాగే ధాటిగా ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 17 ఓవర్లలోనే 79 పరుగులు జోడించారు. మూడో స్థానంలో వచ్చిన కెప్టెన్ బెన్ స్టోక్స్ (67 బంతుల్లో 42; 3 ఫోర్లు, 1 సిక్స్) కూడా జోరు తగ్గకుండా బ్యాటింగ్ కొనసాగించాడు. అనంతరం జో రూట్ (106 బంతుల్లో 91; 11 ఫోర్లు, 1 సిక్స్), జానీ బెయిర్‌స్టో (103 బంతుల్లో 78; 11 ఫోర్లు) ఇన్నింగ్స్‌లు ఇంగ్లండ్‌ను మరింత పటిష్ట స్థితికి చేర్చాయి. రూట్, బెయి ర్‌స్టో ఐదో వికెట్‌కు 110 పరుగులు జత చేశారు. 2019లోనూ ఇంగ్లండ్ గడ్డపై జరిగిన 'యాషెస్' సిరీస్ 2-2తో సమంగా ముగిసింది. ఇరు జట్లు చెరో 2 టెస్టులు గెలవగా, మరో టెస్టు 'డ్రా' అయింది. ఆ తర్వాత 2021లో తమ సొంతగడ్డపై జరిగిన 'యాషెస్'లో ఆస్ట్రేలియా 4-0తో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది.

'డెమెంతియా' బాధితులకు మద్దతుగా...

మూడో రోజు ఆటలో ఇంగ్లండ్ ఆటగాళ్లు భిన్నమైన రీతిలో డెమెంతియా (మతిమరపు) వ్యాధిగ్రస్తులకు సంఘీభావం ప్రకటించారు. ప్రతీ ఆటగాడు తమ పేరు రాసి ఉన్న జెర్సీ కాకుండా జట్టులోని మరో సభ్యుడి జెర్సీని ధరించి మైదానంలోకి దిగారు. మతిమరపు కారణంగా తమ వస్తువులను గుర్తించడంలో గందరగోళానికి గురి కావడం 'డెమెంతియా' లక్షణాల్లో ఒకటి. బ్రాడ్ పేరుతో అండర్సన్, స్టోక్స్ పేరుతో బెయిర్‌స్టో, వోక్స్ పేరుతో అలీ...ఇలా ఆటగాళ్లు టీ షర్ట్‌లు ధరించి ఆడారు.



జో రూట్

రిటైర్మెంట్ ప్రకటించిన బ్రాడ్

ఇంగ్లండ్ పేస్ బౌలర్ స్టువర్ట్ బ్రాడ్ 17 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. ప్రస్తుతం ఓవల్‌లో జరుగుతున్న మ్యాచే తనకు చివరి టెస్టు అని 37 ఏళ్ల బ్రాడ్ వెల్లడించాడు. యాషెస్‌లో చివరి టెస్టుకు ముందు 166 టెస్టుల్లో 27.68 సగటుతో 600 వికెట్లు తీసిన బ్రాడ్, అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. 2016లో చివరి వన్డే ఆడిన బ్రాడ్ అప్పటినుంచి ఒక్క టెస్టులకే పరిమితమయ్యాడు.

సినిమా

ప్రయోగం, పరిశోధన, భవిష్యత్ కాల ప్రయాణం, మరమనిషి... ఇలా సైంటిఫిక్ ఎలిమెంట్స్‌తో ముడిపడిపోయారు కొందరు నటీనటులు. సైన్స్ ఫిక్షన్ చిత్రాలకు సై అంటూ సైన్ చేశారు. ఈ స్టార్స్ చేస్తున్న వెండితెర సైన్స్ ప్రాజెక్ట్స్ వివరాలు తెలుసుకుందాం...

సైన్స్‌కి సై



ప్రభాస్



సూర్య



శివ కార్తికేయన్



విశాల్



తాప్సీ

28వ శతాబ్దంలో...

ఉన్నట్లుండి కొన్ని వందల సంవత్సరాలు ముందుకు వెళితే ఎలా ఉంటుంది? అసలు.. 28వ శతాబ్దంలో ప్రపంచం ఎలా ఉంటుంది? అనే ఓ ఊహాత్మక కథ వెండితెరపైకి వస్తే అదే 'కల్కి 2898 ఏడీ' చిత్రమట. ప్రభాస్, కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సైన్స్ ఫిక్షన్ అండ్ టైమ్ ట్రావెల్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. 'మహానటి' ఫేమ్ నాగ్ అశ్విన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. 18వ శతాబ్దంలో మొదలై 28వ శతాబ్దంలోకి ఈ కథ వెళ్తుందని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ సినిమా రెండు భాగాలుగా రిలీజయ్యే చాన్స్ ఉందని టాక్. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

చారిత్రాత్మక కంగువా

ఇటీవల విడుదలైన 'కంగువా' సినిమా వీడియో గ్లింప్స్‌ను బట్టి ఇది పూర్తి చారిత్రాత్మక నేపథ్యం ఉన్న సినిమా అనేది కొందరి ఊహ. కానీ చారిత్రాత్మక భాగం కొంతవరకే ఉంటుందని, ఎక్కువ శాతం సమకాలీన కాలంలోనే జరుగుతుందని తెలిసింది. అలాగే కొంత భాగం 18వ శతాబ్దంలో ఉంటుందని, పరాక్రమవంతుడైన ఓ యోధుడు అంతు చిక్కని వ్యాధితో మరణించి, అతనే మళ్లీ జన్మించి, గత జన్మలో తాను ఎలా మరణించాడో తెలుసుకునే అంశాల సమాహారంగా సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్‌తో 'కంగువా' కథనం ఉంటుందని భోగట్టా. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో దిశా పటానీ హీరోయిన్. కాగా 'కంగువా' సినిమాలోని తొలి భాగం 2024 ఏప్రిల్ 12న విడుదల కానున్నట్లు సమాచారం.

ఫిక్షనల్ గ్యాంగ్‌స్టర్

సాధారణంగా సైన్స్ ఫిక్షన్ సినిమాలంటే.. విభిన్నమైన పేర్లతో ఆపరేషన్స్ చేయడం, పరిశోధనలు, ఆవిష్కరణలు వంటి అంశాలు మిళితమై ఉంటాయి. కానీ గ్యాంగ్‌స్టర్ యాక్షన్‌కు సైన్స్ ఫిక్షన్, టైమ్ ట్రావెల్ అంశాలను జోడించి ఓ కొత్త ప్రయత్నం చేశారు అధిక్ రవిచంద్రన్. విశాల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'మార్క్ ఆంటోనీ' టైమ్ ట్రావెల్ బేస్డ్ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ డ్రామాగా రూపొందింది. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో విశాల్ డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తారు. విశాల్‌కు జోడీగా రీతూ వర్మ నటించిన ఈ చిత్రం సెప్టెంబరు 15న రిలీజ్ కానుంది.

ఓ గ్రహాంతరవాసి కథ

ఓ గ్రహాంతరవాసి భూగ్రహంపై నివాసం ఉండాల్సి వస్తే ఏం జరుగుతుంది? అనే అంశం నేపథ్యంలో బాలీవుడ్‌లో గతంలో హృతిక్ రోషన్ 'కోయీ.. మిల్ గయా', ఆమిర్ ఖాన్ 'పీకే' వంటి సినిమాలు వచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది. కాస్త అటూ ఇటూగా ఈ చిత్రాల తరహాలోనే తమిళ సైన్స్ ఫిక్షన్ మూవీ 'అయలాన్' ఉంటుందట. శివ కార్తికేయన్ హీరోగా ఆర్. రవికుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రకుల్ ప్రీత్‌సింగ్ హీరోయిన్. ఈ సినిమాలో ఓ ఏలియన్ పాత్ర ఉన్నట్లు పోస్టర్స్ స్పష్టం చేస్తున్నాయి. ఈ ఏడాది దీపావళికి ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

ఇండియాలో ఏలియన్స్ ఉంటే..

ఇండియాలో ఏలియన్స్ నివాసం ఏర్పాటు చేసుకోవాలనుకుంటే ఏం జరుగుతుంది? అనే పాయింట్‌తో తమిళ చిత్రం 'ఏలియన్' రూపొందుతోందట. తాప్సీ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం ఇది. భరత్ నీలకంఠన్ దర్శకత్వం వహిస్తున్నారని తెలిసింది. ఆల్రెడీ షూటింగ్ జరుగుతోంది.



హన్సిక



కృతీ సనన్

రోబోలుగా హీరోయిన్లు

ఓ మనిషిని రోబో ప్రేమిస్తే ఎలా ఉంటుంది? అనే పాయింట్ రజనీకాంత్ 'రోబో'లో చూశాం. అయితే ఓ రోబోటిక్స్ ఎక్స్‌పర్ట్ రోబోతో ప్రేమలో పడితే, రోబోలు ప్రేమించుకుంటే.. అనే అంశాలతో హిందీలో ఓ సినిమా తెరకెక్కుతోందని టాక్. షాహిద్ కపూర్, కృతీ సనన్ జంటగా నటిస్తున్న ఓ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ కథ ఇది అని సమాచారం. అమిత్ జోషి, ఆరాధన షా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రోబోగా కృతీ సనన్, రోబోటిక్ ఎక్స్‌పర్ట్ పాత్రలో షాహిద్ కపూర్ నటిస్తున్నారట. మరోవైపు 'ఎంవై 3' అనే సైన్స్ ఫిక్షన్ వెబ్ సిరీస్‌లో నటిస్తున్నారు హన్సిక. ఇందులో హన్సిక చేస్తున్న రెండు పాత్రల్లో రోబో పాత్ర ఒకటి. శ్రీశ్రీ

బిగ్ బుల్!



సంజయ్ దత్

రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్'లో సంజయ్ దత్ కీలక పాత్ర చేయనున్నారనే వార్త శుక్రవారం గుప్పుమన్న విషయం తెలిసిందే. ఆ వార్త నిజమే అని, బిగ్ బుల్‌గా సంజయ్ దత్ పవర్‌ఫుల్ రోల్ చేస్తున్నారని ఈ చిత్ర యూనిట్ శనివారం ప్రకటించి, లుక్‌ని కూడా విడుదల చేసింది. "డబుల్ ఇస్మార్ట్'లో సంజయ్ దత్ ఫుల్ లెంగ్త్ రోల్ చేస్తున్నారు" అని చిత్ర యూనిట్ తెలియజేసింది. "మాస్‌కే డైరెక్టర్ అయిన పూరి జగన్నాథ్, ఎనర్జిటిక్ రామ్‌తో కలిసి ఈ సైన్స్ ఫిక్షన్ మాస్ ఎంటర్‌టైనర్‌లో నటించడం ఆనందంగా, గర్వంగా ఉంది. వచ్చే ఏడాది మార్చి 8 ('డబుల్ ఇస్మార్ట్' విడుదల) కోసం ఎదురు చూస్తున్నాను" అని సంజయ్ దత్ ట్వీట్ చేశారు. పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి హాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ జియాని జియానెల్లి పని చేస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కానుంది.

మిస్ అండ్ మిస్టర్ లేట్‌గా వస్తారు

మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి ఆగస్టు 4న థియేటర్లకు రావాలనుకున్నారు. అయితే కొన్ని పనులు మిగిలిపోయాయట. అందుకే కాస్త లేట్‌గా రావాలనుకుంటున్నారు. లేట్‌గా వచ్చినా వినోదం రెండింతలు ఇస్తామంటున్నారు. మిస్ శెట్టిగా అనుష్కా శెట్టి, మిస్టర్ పొలిశెట్టిగా నవీన్ పొలిశెట్టి నటించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'.



అనుష్క, నవీన్ పొలిశెట్టి

మహేష్ బాబు పి. దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 4న రిలీజ్ కావాల్సింది. అయితే వాయిదా పడింది. "పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి కాకపోవడంతో సినిమాని వాయిదా వేయాల్సి వచ్చింది. అయితే అపరిమితమైన వినోదంతో వస్తాం. అతి త్వరలో థియేట్రికల్ ట్రైలర్, సినిమా విడుదల తేదీలను ప్రకటిస్తాం" అని చిత్ర యూనిట్ పేర్కొంది.



దర్శకుడు ఎస్.ఎస్.ఆర్. ప్రసాద్ కన్నుమూత

ఆర్యన్ రాజేష్ హీరోగా డా. డి. రామానాయుడు నిర్మించిన 'నిరీక్షణ' చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమైన ఎస్.ఎస్.ఆర్. ప్రసాద్ (49) శనివారం తుది శ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లాలోని జంగారెడ్డిగూడెం ప్రసాద్ స్వస్థలం. పలువురు ప్రముఖ దర్శకుల దగ్గర రచయితగా, ఘోస్ట్ రైటర్‌గా చేశారాయన. సీతారామ్‌గా ప్రసాద్ చిత్రపరిశ్రమవారికి సుపరిచితులు. తొలి చిత్రం 'నిరీక్షణ' తర్వాత శ్రీకాంత్ హీరోగా 'శత్రువు', నవదీప్‌తో 'నటుడు' చిత్రాలకు దర్శకత్వం వహించారు ప్రసాద్. ఆయన దర్శకత్వం వహించిన చివరి చిత్రం 'రెక్కీ'. ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. కాగా కొంత కాలంగా ప్రసాద్ కేన్సర్‌తో బాధపడుతున్నారని, ఆ వ్యాధితో పోరాడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూశారని సమాచారం.

రీల్స్

అవకాశం ఇస్తే చేసి చూపిస్తాం



'దిల్' రాజు

తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ఎన్నికలు నేడు హైదరాబాద్‌లో జరగనున్నాయి. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్, స్టూడియో సెక్టార్స్ తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్‌లో ఉంటాయి. ఈ ఎన్నికల్లో నిర్మాతలు 'దిల్' రాజు, సి. కల్యాణ్ ప్యానల్స్ పోటీ పడుతున్నాయి. ఈ సందర్భంగా 'దిల్' రాజు మాట్లాడుతూ– "చాంబర్‌లో ఉన్న నాలుగు సెక్టార్స్‌కి సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి మాకు ప్రణాళికలు ఉన్నాయి. 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్), సినీ కార్మికుల ఫెడరేషన్స్‌తో కో ఆర్డినేట్ అవుతాం. అలాగే యూఎఫ్ఓ, క్యూబ్ రేట్ల విషయంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. ఇండస్ట్రీని ముందుకు తీసుకువెళ్లేవారిని గెలిపించాలనేది మా ప్యానెల్ రిక్వెస్ట్. ఒక నిర్మాతకు ఎన్ని బ్యానర్స్ ఉన్నా కానీ ఒకే ఓటు ఉండాలి. కానీ కొందరు డిఫరెంట్ బ్యానర్స్ పెట్టుకోవడం వల్ల డబుల్ ఓట్స్ ఉన్నాయి. ఇది కరెక్ట్ కాదు. మాకు రెండేళ్లు అవకాశం ఇస్తే మేం ఏం చేస్తామో చూపిస్తాం" అన్నారు.

చావని ప్రేమిది...



హెబ్బా, సుమన్

హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సందేహం'. సతీష్ పరమవేద దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సుమన్ ఊటుకూరు హీరో. సత్యనారాయణ పర్చా నిర్మించిన ఈ చిత్రం నుంచి సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ స్వరపరచిన 'చచ్చినా చావని ప్రేమిది..' పాటను దర్శకుడు దశరథ్ విడుదల చేశారు. "ఈ చిత్రంలో హెబ్బా పటేల్ డిఫరెంట్ క్యారెక్టర్ చేశారు. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తాం" అని చిత్ర యూనిట్ పేర్కొంది.

సాఫ్ట్‌వేర్ టు సినిమా



రఘురామ్

రిష్వి తిమ్మరాజు, విస్మయ శ్రీ జంటగా నటించిన చిత్రం 'కృష్ణగాడు అంటే ఒక రేంజ్'. రాజేష్ దొండపాటి దర్శకత్వంలో పెట్లా కృష్ణమూర్తి, పెట్లా వెంకట సుబ్బమ్మ, పీఎస్‌కే శ్రీలత, పెట్లా రఘురామ్ మూర్తి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 4న రిలీజ్ కానుంది. పెట్లా రఘురామ్ మూర్తి మాట్లాడుతూ– "నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. సినిమాలపై ఇష్టంతో ఇండస్ట్రీకి వచ్చి, ఘోస్ట్ రైటర్‌గా చేశాను. ఇక మా సినిమా కథ విషయానికి వస్తే... ఈ చిత్రంలో హీరో గొర్రెల కాపరి. కృష్ణగాడు అంటే ఒక రేంజ్ అని హీరో చెబుతుంటాడు. ఇదే మాటను అతను ఊరి జనంతో చెప్పించాడా లేదా? అనేది ఈ చిత్రకథ" అన్నారు.

హీరోనా.. విలనా?



నిరోజ్

నిరోజ్ పుచ్చా హీరోగా ధీన రాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'భారతీయన్స్'. శంకర్ ఎస్. అడుసుమిల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న రిలీజ్ అయింది. శనివారం విలేకరుల సమావేశంలో నిరోజ్ పుచ్చా మాట్లాడుతూ– "2019లో వచ్చిన ఓ షార్ట్ ఫిల్మ్‌తో నా యాక్టింగ్ జర్నీ మొదలైంది. 'భారతీయన్స్' చేస్తున్నప్పుడే నాకు విలన్‌గా చాన్స్ వస్తే, ఓకే చెప్పాను. ఎందుకంటే హీరోనా? విలనా అని కాదు.. యాక్టర్‌గా నిరూపించుకోవాలన్నదే నా లక్ష్యం" అన్నారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



కాపు/1st Marriage / 29y/ 5'9"/ M.Tech/SWE/36 Lakhs/PA/ కోట్ల ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9553652167 [H-788932]

SC హిందూ మాల/కట్న ప్రసక్తి లేదు/ B.Tech/C.Govt. గెజిటెడ్ ఆఫీసర్/ఇరిగేషన్ Dept/ 90,000/-PM/5'11" ఎత్తు/28సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-13967]

ముదిరాజ్/కట్న ప్రసక్తి లేదు/B.Tech/C. Govt.Asst. మేనేజర్/పంజాబ్ నేషనల్ బ్యాంక్/ 60,000/-PM/5'10" ఎత్తు/28సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-13967]

రాజులు/43/5'5"/B.Sc, ఫైనాన్స్/మేనేజర్/1L. PA, Hydలో సొంత ఇల్లు వరునికి రాజులు 1వ, 2వ(V). బ్రాహ్మణ, కమ్మ, కాపు, వెలమ, రెడ్డి, A.K.క్షత్రియ 1వ వధువు కావలెను. డైరెక్ట్: 8885861136 [HA-13973]

క్రిస్టియన్ మాల/33/5'7"/B.Tech, MBA/Govt. బ్యాంక్ మేనేజర్/1 Lakh. PM/అందమైన వరునికి తగిన వధువు కావలెను. అర్జెంట్. 8919759359 [HA-13973]

క్రిస్టియన్/2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/BA, B.Ed/Govt. టీచర్/1 Lakh.PM/4 కోట్ల ఆస్తి / 5'7"ఎత్తు/41 సం॥ల పిల్లలు లేని వరుడికి తగిన వధువు కావలెను. 9550650024 [HA-13973]

యాదవ/B.Tech(సివిల్)/C.Govt.Asst. మేనేజర్/ SBI/65000/-PM/ 5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. Ph: 9515755529 [HA-13973]

SC మాల & క్రిస్టియన్/M.Tech, NIT/Govt.AEE/ఇరిగేషన్ Dept/14 Lakhs. PA/5'9" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. Ph: 9676995093 [HA-13973]

రెడ్డి/55y/ డైవర్సీ/CNB/ AP స్టేట్ Govt. లో గ్రూప్-1 ఆఫీసర్‌గా ఉంటూ, సెలవులో UK Govt.లో ఆఫీసర్‌గా జాబ్ చేస్తూ UK PR కలిగిన వరునికి ఇండియా / అబ్రాడ్‌లో సెటిల్ అయ్యేందుకు అందమైన Rich వధువు కావలెను. Ph:6303487992, నో బ్రోకర్స్. [HA-13954]

SC మాదిగ & క్రిస్టియన్/B.Tech, C.Govt. మేనేజర్/యూనియన్ బ్యాంక్/ 85000/-PM/5'8" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. Ph: 9515755529 [HA-13973]

వడ్డెర/కట్న ప్రసక్తి లేదు/B.Tech/C. Govt.ఎలక్ట్రికల్ ఇంజినీర్/రైల్వే/80,000/-PM/5'10' ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-13973]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/Builder/MBA/Very Handsome Boy/1995/6' feet/150 Cr *1993/6'/50Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/Business.B.Tech/MBA/1997/5'9"/60Cr *1997/5'11"/100Cr *1995/5'9"/ 500 Cr *1994/5'11"/250Cr. * Cont: K.C.Reddy - Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/ MBBS/ PG*1995 /5'10"/400Cr *1989/5'9"/30Cr *1994/5'10"75Cr*1993/ 5'10"/50Cr. *1993/5'10"/20Cr. *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/USA Doctor*1995/5'8" * 1989/ 5'9" *1992/5'11" *1998/5'8" *1990/6' * 1991/5'10". * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech/MS/H1/USA *1991/ 5'11"/ 200Cr *1991/5'7"/60Cr *1995/ 5'7"/300K *1995/ 5'10"/260K/70Cr *1992/5'11/495K. *Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/Divorcee *B.Tech/MBA/Business/1981/5'8"/250Cr *IIT/B.Tech/ 1992/ 6'/ 200K/ 20Cr *IIT/ 1988/ 5'7"/42 L/yr. * Cont : K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/Divorcee/ MBBS/PG/1985/5'8"/ 50Cr *1994/5'9"/50Cr *MBA/ 1986/ 5'5"/ 1000Cr *1994/5'9"/300Cr. * Cont : K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015

Reddy/Divorcee/USA/H1/*MS/1992/6'/ 30Cr *1981/5'5"/300K *1986/ 6'/220K/20 Cr *USA/ Doctor/ 1982/ 5'8" *Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph: 9849321309

Reddy/Business/B.Tech/MBA/1993/5'7"/50Cr *1993/6'/50Cr *1988/5'8"/ 200Cr *1995 / 5'10" / 80Cr *1995/6'/ 100 Cr. * Cont: K.C. Reddy-Hyd Ph: 9849321309

Reddy/B.Tech/MS/H1/USA/1994/5'11/150 Cr *1995/6'/130K/400Cr *1997/6'/400Cr * 1993/5'9"/150K/20Cr *1994/5'7"/ 230K/ 60Cr * Cont: K.C. Reddy-Ph: 9849321309

వరుడు కావలెను

Reddy/(Divorcee) MBBS /MD / 1986/ 5'4"/30Cr *1994/5'5"/100Cr *1986/5'6"/ 50Cr *1981/5'3" *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/(Divorcee)B.Tech/1989 /5'5"/25Cr *1986/5'6"/20Cr*1993/5'6"/50Cr *1984/5'1"/ 20Cr *1985/5'5"/400Cr *1991/5'4"/ 15Cr. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/Divorcee/USA/ MBBS/ MD/1993/ 5'8"/40Cr*1992/5'3"/9Cr *USA/B.Tech/MS / 1986/5'6"/20Cr *1993/5'7"/15Cr. *Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309

Reddy/Divorcee/ B.Tech/SWE/ India/ 1993/5'4"/50L/yr/10Cr *1991/5'4"/10Cr *1987/ 5'6"/15Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/Divorcee/ MBBS/MD/ DM/1986/ 5'4"/Rich *1986/5'4"/30Cr *1993/5'8"/ Own Hospital/40Cr *1991/5'4"/10Cr. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/MBBS/PG/DM *1994/5'6"/100 Cr/ 1993/5'7"/100Cr *1995/5'5"/100Cr *1996/ 5'6"/60Cr *1995/ 5'7"/ 20Cr. * Cont: K.C. Reddy. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/Rich Family/ *1993/5'3"/ 500Cr *1997/5'4"/150Cr *1998/5'5"/100Cr *1993/5'7"/100Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS/H1/USA/1999/5'6"/500 Cr *1996/5'8"/15Cr *1990/5'8"/30Cr *1996/ 5'7"/50Cr *1998/5'4"/30Cr. *Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/1992/5'7"/20Cr *2001/5'3"/ 20Cr *1991/5'7"/10Cr *1997/5'5"/25Cr * 1999/ 5'8"/15Cr *1996/5'4"/30Cr. *Cont:K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/IIT/2001/5'5"/42L/yr*1998/5'3" /70L/yr *1994/5'4"/150K*1996/5'7" * 1997/5'4"/200K *1995/5'6"/150K*Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309 [D-524]

బ్రాహ్మణ/2వ పెళ్లి / 35yrs / పిల్లలు లేరు/కట్న ప్రసక్తి లేదు/పురోహిత్ well settled వరుడికి వధువు కావలెను. Ph: 8688860224 [WB-14113]

రెడ్డి Male, 33 సం॥ Fair 5'-10", M.Tech, M.S (USA) 2.5 Cr ప్రోపర్టీ Rs. 3.L / PM గల వరుడుకి వధువు కావలెను. Cont: 94932 42896 [G-787556]

మాల : MBBS; MD (Gen. Medicine), 5'10 / 28 Y/ V.Fair / 5Cr. /నెలకు 2 లక్షల జీతంతో డాక్టర్‌గా చేస్తున్న వరుని కొరకు అర్జంట్‌గా సంప్రదించండి. సెల్ : 81065 01139, 92484 34810. [M-266]

వాల్మీకి బోయ/B.Tech, MBA/Govt. DEE/Engineer / 74,000 PM / 5'8"/ 44y వరునికి 29-35 సం॥లోపు ఒంటరి వధువు కావలెను. సెల్: 91009 74477. [N-1189741]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE, MS, 28, 5' 8", Sr Engineer, 160 K, 30 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 28, 5' 11", Data Engineer, 13 L P/A, 4 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 10", SWE, 140 K, 35 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 6'2", Engineer, 150 K, 15 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, Doctor, 24, 5' 2", USA, 50 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 25, 5' 3", Analyst, 12 L P/A, 20 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5' 5", Software Developer, 120 K, H1, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 23, 5' 4", Developer, 10.8 L P/A, Hyd, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, PGDM, 30, 5' 8", Sr Analyst, 30.3 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, 27, 6' 1", Engineer, 150 K, 100 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 5' 10", P.G Doctor, Hyd, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 11", SWE, 170 K, 200 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 24, 5' 6", 64 L P/A, 10 Crores, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 25, 5' 8", SWE, 120 K, 7 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 28, 5' 3", P.G Doctor, 15 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, MS, 33, 5' 7", Data Manager, 200 K, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

Reddy, Now Hyd-28/5'10"/B.Tech-MS-USA. *32/5'10"/MBBS Residency USA. *28/ 5'10" /B.Tech IIT - MS - USA - 350K/ Rich. Cont: P.P.Reddy-9391198332. [H-189236]

Reddy, 25/5'4"/M.Com. *22 / 5'4"/ B.Com. *26/ 5'4"/ B.Tech/ SWE - Hyd. Cont: P.P.Reddy-9391198332. [H-189236]

Reddy, 2nd Marriage-42/5'9"/ B.Tech-MS-USA Citizen. *32/5'10"/ B.Tech-MS USA. *32/5'9"/B.Tech-SWE-Hyd. Cont: P.P.Reddy-9391198332. [H-189236]

★

రెడ్డి: లేట్ మ్యారేజ్/34y/నెలకు లక్ష రూపాయల ఆదాయం Hydలో సొంత ఇల్లు, కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి ఓన్లీ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ/ విడో OK పెల, కట్న ప్రసక్తి లేదు డైరెక్ట్. Ph:7989079290 [H-189373]

కులపట్టింపు లేదు: 32y, 5.8", M.Sc, GBM, Own Business, Hyd, 60 Lacs P/A, 50Cr Property గల వరునికి కులపట్టింపులేని వధువు కావలెను. Ph: 9030315599 [H-189508]

రెడ్డి: 28y, 5.8", B.Tech, M.S(UK), SWE, 3 Lacs P/M, UK, 15Cr Property గల వరునికి తగిన వధువు కావలెను. (Now in India) Ph: 7207930999 [H-189508]

రెడ్డి: 28y, 5.10", M.Tech, SWE, Canada, 120K P/A, Well Settled వరునికి India/Abroad వధువు కావలెను. (PR HOLDER) Ph: 9701960229 [H-189508]

రెడ్డి: 35y, 5.9", M.S, Ph.d, Scientist, Canada, PR Holder, 20 Cr Property, గల వరునికి India/Abroad Any వధువు కావలెను. (Now in India) Ph: 9248064777 [H-189508]


36 సం॥ల బిజినెస్ చేస్తూ ఉన్న 50 to 1 Cr ప్రాపర్టీ ఉన్న వరునికి రెండవ/విడో పిల్లలు ఉన్నవారైనా సం॥డి॥ చౌరీ, కుల ప్రసక్తి లేదు. Ph: 8885582668, 7396730091 [HA-30254]

క్రిస్టియన్ మాల 47, 5.3". విలేజ్‌లో 7 ఎకరాల వ్యవసాయ భూమి, ప్రైవేట్ పని, 4 గదుల పక్కా ఇల్లు. బైక్, కారు గల వరుడుకి వధువు కావలెను. కులం పట్టింపు లేదు. 9948604039 [Y-798244]

★★

OC, వయస్సు:50, బిజినెస్ వెల్‌సెటిల్ వరుడుకు 45 టు 50 అందమైన OC వెల్‌సెటిల్ వధువు కావలెను. (డైరెక్ట్) సంప్రదించండి : 94908 78646. [P-1167193]

వరుడు కావలెను



No Caste bar/1, 2వ 1 కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు. వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం Ok. త్వరగా చేసుకునే వారి కోసం మాత్రమే. Ph: 7794960803 [HA-29865]

కులపట్టింపు లేదు: 2వ పెళ్లి 37yrs/ Govt ఎంప్లాయ్ 3,00,000/- (PM) బాగా స్థిరపడికోట్ల ప్రాపర్టీస్ కలిగిన అందమైన వధువుకు వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా & ఇల్లరికం OK) సంప్రదించండి.Ph: 9502046384 [H-788794]

కాపు: 48yr/ కులపట్టింపు లేదు/ లేట్ మ్యాన్/ ఫెయిర్/Govt ఎంప్లాయ్ 1లక్ష (PM). వెల్ సెటిల్డ్ & 3 సొంత ఇల్లులు కలిగిన వధువుకి వరుడు కావలెను (1st & 2nd మ్యారేజ్ & ఇల్లరికం OK) సంప్ర: Ph: 8374802603 [H-788794]

2వ పెళ్ళి కుల ప్రసక్తిలేదు: 42yr/ MA English, P.hd/ Govt లెక్చరర్ 2 లక్షల (PM). పిల్లలు లేని తెల్లని అందమైన 30 కోట్ల ఆస్తి గల వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను(పిల్లలు ఉన్న&ఇల్లరికం OK) సంప్ర: 73862 13324 [H-788794]

రెడ్డి/విడో / 58y / పెన్షనర్/సొంత ఇల్లు/ పొలాలు/ఏ బాదరబందీలేని సాంప్రదాయ కుటుంబం గల వెల్ సెటిల్డ్ ఒంటరి వధువుకు వరుడు కావలెను. Ph: 9133521622 [H-788932]

రెడ్డి/52yrs/విడో/V.Fair/5'5" / Govt.Job/సొంత ఇల్లు & రెంట్స్/20 ఎకరాల పొలం ఏ బాదరబందీ లేని వెల్ సెటిల్డ్ ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. ఇల్లరికం OK. Ph: 9492718486 [H-788932]

కాపు/1st Marriage/24y/ 5'4"/ B.Tech / Very Fair/SWE/13.5 Lakhs/ PA/కోట్ల ప్రాపర్టీ గల వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9848226983 [H-788932]

క్రిస్టియన్ మాదిగ/B.Tech/C.Govt. డిప్యూటీ మేనేజర్/HAL/55000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9963410191 [HA-13967]

రజక/B.Tech/Govt.Jr.Asst./పంచాయతీరాజ్ Dept/35000/-PM/5'4" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-13967]

క్రిస్టియన్ మాల/50 లక్షల ఆస్తి/B.Tech/ Govt.Asst.ఇంజినీర్/RWS/50,000/-PM/ 5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8297439565 [HA-13967]

రెడ్డి/విడో/కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/ A: 30, Qly: డిగ్రీ/బిజినెస్‌లు కలిగిన అందమైన వధువుకి 1st or 2nd మ్యారేజ్ వరుడు కావలెను (ఇల్లరికం OK) Ph: 8143011223 [HA-13973]

రెడ్డి/1st మ్యారేజ్/Age: 27, Height. 5'4", Colour: Fair/Bank Job/ Single Person/అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9121300377 [HA-13973]

Reddy: 55yr/Widow/Fair/Hyd/Own-House Rents/ Own-Business (1కొడుకు-U.S.A సెటిల్డ్). Well Settled ఎటువంటి బాదరా బందీలేని అందమైన ఒంటరి వధువుకు FC/BC వరుడు కావలెను(సపోర్ట్ ఉండును) సంప్ర: 8519980423 [H-788794]

రెండోపెళ్ళి/63y&60y & 58y & 56y & 54y &52y&50y&48y&46y&44y&42y&40y& 37 y& 35y &33y &31y&29y &27y&25y/"మా సేవ" (Since 1998): PH/WA: 9291503949 [H-780723]

యాదవ B.Tech/31yrs/5'.4"/ గవర్నమెంట్ ఉద్యోగినికి తగిన వరుడు (స్టేట్ లేక సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగి) కావలెను సంప్రదించండి: 7997486067 [T-1191487]

Reddy Br. 26/5'6"/B.Tech (Bits) MS-USA/200Cr. *24/5'5"/B.Tech- MS-USA. 20Cr. *25/5'6"/B.Tech, SWE, 20Cr. Cont: P.P.Reddy-9391198332 [H-189236]

Reddy/30/5'5"/MD (Pediatrics) 15Cr. *24/5'5"/MD (Radiology) 2nd yr. *25/5'5"/MD (Gynic). Cont : P.P.Reddy-9391198332 [H-189236]

★

రెడ్డి: 26y, 5.6", B.Tech, M.S, USA, SWE, 180K P/A H1B Visa, 50 Cr Property గల వధువుకి తగిన USA/India వరుడు కావలెను. Ph: 9246960888 [H-189508]

★★

మాల క్రిస్టియన్, వయస్సు 25 సం॥ H.5'2" B.Sc, గవర్నమెంట్ ఆఫీసర్ వధువుకి హైదరాబాద్ సంబంధించిన వరుడు కావలెను. సాఫ్ట్‌వేర్, ప్రైవేట్ ఎంప్లాయ్, గవర్నమెంట్ ఎంప్లాయ్ కావలెను. ✆ : 96769 82230 [R-1199307]

SC మాల (Hindu) 25 Years Fair వధువునకు (B.Sc.,) తగిన వరుడు కావలెను. నో బ్రోకర్స్. Cont: 97015 06294 [R-6027]

వేదికలు



శ్రీ...శ్రీ...శ్రీ...కమ్మ, కాపు, రెడ్డి, వైశ్య బ్రాహ్మణ అన్ని కులాల 1వ, 2వ, లేటు, Govt, Doctor, SWE, రిచ్ & మిడిల్ క్లాస్ మ్యాచెస్ ఫాస్ట్ సెటిల్ సంప్ర: Ph: 9247217621 [H-788932]

వైశ్య రెండో పెళ్ళి: 35yr/ 5'6"/ SWE, 38y/ 5'10"/ SW/ 35y/5'6"/US/ 30Y/ 5'7"/ లెక్చరర్. CNB వధూవరులకై సం.ప్ర: Ph: 9247783541/ 9346019313 [H-788794]

వడ్డెర వధువు వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి : 9381553423 [HA-13973]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/Est: 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd పెళ్లి/విడో సంబంధాలకై సం॥ S.నాయుడు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690309 [H-788922]

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే. అన్ని కులాలవారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 8555980066/6302543297 [HA-10941]

ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 9949395407 [H-780945]

శ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులముల వారికి Govt/సాఫ్ట్‌వేర్/గెజిటెడ్/MBBS/PG/NRI /PVT/బిజినెస్/1వ/2వ/లేట్ AP/TS/15 సం॥ Exp. Ph: 9989140444 [HA-30213]

"పెళ్లి" ఫాస్ట్ సెటిల్‌మెంట్ మా ప్రత్యేకత. Software, Doctors, Abroad, Rich, Group 1,2 వారికి పెళ్లి సంబంధాలు చూడబడును. పూర్ణ మ్యాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-1481]

★

విశ్వ బ్రాహ్మణ వధూ-వరుల స్వయంవరం (online) 13th August 2023, Free Registration. bhavanimatrimony.com Hyd. Ph: 9704656103, 9533608887 [HA-297]

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC Matches, Late & 2nd Matchesకై సంప్రదించండి. Ph: 9704656103, 9533608887 (Whatsapp) [H-370]

★★

మాల (క్రైస్తవ, హిందూ) B.Tech, M.Tech, MS, MBA, MBBS చదువులతో డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, బ్యాంక్, Govt జాబ్ చేస్తున్న వధూవరుల వివరాలకు Kalyanamala.org. ✆ 9440545049. [B-1193455]

కళ్యాణం మ్యారేజ్ బ్యూరో గచ్చిబౌలి, Hyd, AP, రెడ్డీస్, కమ్మ, కాపులకు, సాఫ్ట్‌వేర్, US, UK, AS, CANADA సంబంధములు కుదర్చబడును. ✆ 93922 34044, 98495 17613 [B-1193878]

మీకు పెళ్ళి కాని అమ్మాయి, అబ్బాయిలు ఉన్నారా! 1st, 2nd మేము అన్ని కులాలు వారికి పెళ్ళి సంబంధము చూడబడును. విశాఖ – మురళీనగర్ : 94917 52662 [V- 10898]


మాజీ ఐఏఎస్ విజయకుమార్‌కు తప్పిన ప్రమాదం



మద్దిపాడు: మాజీ ఐఏఎస్ అధికారి జీఎస్ ఆర్‌కే విజయకుమార్‌కు తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. రాష్ట్ర ప్రణాళికా బోర్డు కార్యదర్శిగా పనిచేస్తూ విజయకుమార్ ఇటీవలే తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఈ నెల 23న తడ నుంచి 'ఐక్యతా విజయపథం' యాత్ర చేపట్టిన ఆయన శుక్రవారానికి నాయుడుపేటకు చేరుకున్నారు. వారాంతపు విరామం సందర్భంగా విజయకుమార్ దంపతులు శుక్రవారం నాయుడుపేట నుంచి బయలుదేరి విజయవాడ వెళ్తుండగా, ప్రకాశం జిల్లా మద్దిపాడు సమీపంలో అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ముందు వెళుతున్న లారీ అకస్మాత్తుగా కుడి వైపునకు తిరగడంతో వెనుకనే ఉన్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో విజయకుమార్ దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు.

వర్షం తక్కువున్న జిల్లాల్లో ప్రత్యామ్నాయ పంటలు

- ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎస్ ఆదేశం
- ఆరు జిల్లాల్లోని 130 మండలాల్లో తక్కువ వర్షపాతం
- ఆగస్టులో లోటు భర్తీ కాకపోతే ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు
- అధిక వర్షంతో వరి నారు దెబ్బతిన్న రైతులకు స్వల్పకాలిక రకం విత్తనాలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో లోటు వర్షపాతం ఉన్న జిల్లాల్లో ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు కంటింజెన్సీ ప్రణాళికను సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా. కేఎస్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాలు, వ్యవసాయం, పశువుల గ్రాసం తదితర అంశాలపై ఆయన శనివారం వ్యవసాయ, పశు సంవర్థక, మత్స్య, ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల అధికారులతో సమీక్షించారు. ఆరు జిల్లాల్లోని 130 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని, ఈ జిల్లాల్లో ఆగస్టులో కూడా వర్షాలు తక్కువ ఉంటే ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. అధిక వర్షాల కారణంగా వరి నారు దెబ్బతిన్న రైతులకు స్వల్పకాలంలో దిగుబడినిచ్చే విత్తనాలు సరఫరా చేయాలని చెప్పారు. రాష్ట్రంలో వర్షాలు, వ్యవసాయంపై వ్యవసాయ, పశు సంవర్థక, మత్స్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో ఖరీఫ్ లో మొత్తం 34.39 లక్షల హెక్టార్లు సాధారణ విస్తీర్ణం కాగా ఇప్పటివరకు 9.22 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు వేశారని తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో సాధారణంకంటే 20 నుండి 50 శాతం అధిక వర్షపాతం నమోదైనట్లు చెప్పారు. కృష్ణా జిల్లాలో 60 శాతం పైగా అధిక వర్షపాతం నమోదైందని చెప్పారు. అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, నెల్లూరు, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో 20 నుండి 59 మిల్లీ మీటర్ల తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. వర్షపాతం తక్కువున్న జిల్లాల్లో ప్రత్యామ్నాయ పంటల కోసం సుమారు 10 వేల క్వింటాళ్ల మినుము, పెసర, కంది, ఉలవ, జొన్న, పొద్దుతిరుగుడు, వేరుశనగ తదితర విత్తనాలను ఏపీ సీడ్స్ వద్ద సిద్ధంగా ఉంచామని చెప్పారు. అధిక వర్షాలతో వరి నారు మడులు దెబ్బతిన్న రైతులకు స్వల్ప కాలంలో పంట దిగుబడినిచ్చే ఎంటీయూ 1010, 1121,1153, బీపీటీ 5204, ఎన్ఎల్ఆర్ 34449 వరి విత్తనాలను సుమారు 30 వేల క్వింటాళ్లు సిద్ధం చేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ సీహెచ్ హరికిరణ్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ డా. బి.ఆర్.అంబేద్కర్, పశు సంవర్థక శాఖ సంచాలకులు అమరేంద్ర కుమార్, ఏపీ సీడ్స్ ఎండీ శేఖర్ బాబు, మత్స్య శాఖ అదనపు సంచాలకులు డా. అంజలి, ఉద్యాన శాఖ అదనపు సంచాలకులు బాలాజీ నాయక్, వెంకటేశ్వర్లు తదితర అధికారులుపాల్గొన్నారు.

మైనర్ బాలికలనూ విడిచిపెట్టడం లేదు

- కుటుంబ సభ్యులే కాకుండా మహిళా ఉద్యోగులపైనా వేధింపులు
- టీడీపీ నేత నారాయణపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ధ్వజం

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి, టీడీపీ నేత నారాయణ వేధింపుల పర్వంపై వైఎస్సార్‌సీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి మండిపడ్డారు. వావివరసలు లేకుండా సొంత కుటుంబ సభ్యులనే కాకుండా ప్రజలను, తన సంస్థల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు, చదువుకుంటున్న మైనర్ బాలికలను కూడా వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు విజయసాయిరెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గద్దలు, డేగలు కోడి పిల్లల్ని తన్నుకుపోవడానికి పైనుంచి గురి చూసినట్లే నారాయణ అమాయక అబలలపై కన్నేసి వారిని ఖతం చేస్తున్నారని ఆరోపించారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ప్రకాశం జిల్లాలో కట్టిన ఫ్లెక్సీల్లో



'అసలోడు వచ్చే వరకే కొసరోడికి పండుగ' అని రాసి ఉందన్నారు. 'అసలోడు .. కొసరోడు'.. ఇందులో అంతరార్థం ఏమిటో చంద్రబాబు అధికారికంగా స్పష్టత ఇవ్వాలని కోరారు. కొసరోడు అంటే ఆ జిల్లాలో యువగళం చేస్తున్న చినబాబు కాదు కదా? అని ప్రశ్నించారు. ప్రజలకు వచ్చిన సందేహాన్నే తాను కూడా ప్రస్తావిస్తున్నానని విజయసాయిరెడ్డి తెలిపారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో చంద్రబాబును మించిన వారెవరూ ఉండరని ఎద్దేవా చేశారు. ప్రతి కార్యక్రమానికి ఏదో ఒక ఆకర్షణను జత చేసి జనాన్ని మొబిలైజ్ చేయడం ఆయనకు మొదటి నుంచీ అలవాటేనన్నారు. చినబాబు యువగళం యాత్రకు గ్లామర్ అద్దేందుకు టీవీ యాంకర్‌ను హైదరాబాద్ నుంచి రప్పించడం ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. దీన్నిబట్టి ఇక నుంచి సినీ నటుల సందడి మొదలవుతుందనేది అర్థమవుతోందని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలనూ బయట పెడతా

- మరో వీడియో విడుదల చేసిన పొంగూరు ప్రియ
- 29 ఏళ్లుగా నరకం అనుభవిస్తున్నా..
- నారాయణ విద్యార్థుల ఆత్మహత్యలపైనా బయట పెడతా
- స్త్రీ తలచుకుంటే శక్తి అవుతుందని నారాయణకు తెలియజేస్తా
- తాజా వీడియోలో ప్రియ వెల్లడి
- ప్రియతో రాజీకి గంటా చేసిన ప్రయత్నాలు విఫలం
- జనసేన వీరమహిళగా ఉన్న ప్రియ
- ప్రియకు అన్యాయం జరిగినా నోరెత్తని పవన్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు, టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి పొంగూరు నారాయణ ఆకృత్యాలపై ఆయన మరదలు ప్రియ ఇన్‌స్టాగామ్‌లో మరో వీడియో విడుదల చేశారు. నారాయణ ఆయన పరువు కోసం తనను అణచివేశారని ఆమె ఆరోపించారు. 29 ఏళ్ల నరకం అనుభవించినట్లు చెప్పారు. «నేను 29 ఏళ్లు భరించాను. ఇక భరించే శక్తి నాకు లేదు. సీతాదేవి కూడా 16 సంవత్సరాలు అరణ్యవాసం చేసింది. మరో 11 సంవత్సరాలు బిడ్డల్ని పెంచింది. మొత్తం 27 ఏళ్లు కష్టపడింది. నేను 29 ఏళ్లు నరకం అనుభవించాను. ఇప్పుడు కూడా ఇంటి విషయాలు మాట్లాడొద్దని అంటున్నారు. ఇంటి విషయాలైనా, పబ్లిక్ విషయాలైనా, నారాయణ విద్యా సంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యల విషయాలపైనా బయట పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాను. నా కళ్ల ముందు చెడు జరుగుతోంది కాబట్టి వాటిని బయటపెట్టేందుకు సిద్ధమయ్యాను. ముందు నా విషయం వెలుగులోకి తెస్తాను. తర్వాత విద్యా సంస్థల విషయాలు బయటపెడతా. పరువు అంటున్నారు. మహా అంటే పది మంది ఫోన్ చేస్తారు. అంతే కదా. ఇది నా జీవితం. 29 ఏళ్లు కష్టపడ్డా. నాకు క్యాన్సర్ వస్తే పలకరించే దిక్కు లేకపోతే నా పరిస్థితి ఏమిటి? అందుకే నేను మాట్లాడతా. విద్యా సంస్థల్లో పిల్లల ఆత్మహత్యల విషయం కూడా క్లియర్‌గా మాట్లాడతా. నేను ఫిజికల్‌గా క్యాన్సర్ పేషంట్‌ను కావచ్చు. ఫిజికల్‌గా వీక్ కావచ్చు. మెంటల్‌గా వీక్ కాను. ఒక స్త్రీ తలచుకుంటే శక్తి అవుతుందని నారాయణకు తెలియజేస్తా. నేను బ్రతుకుతానో లేదో తెలియదు. నాకు డబ్బులివ్వరు. అయినా నా ఆస్తులమ్మైనా ట్రీట్‌మెంట్ చేయించుకుంటా. నేను చనిపోయే లోపు వాస్తవాలు బయటపెడతా» అని ప్రియ ఆ వీడియోలో చెప్పారు.

సంచలనంగా ప్రియ వీడియోలు

రెండు రోజుల క్రితం ప్రియ సోషల్ మీడియాలో మొదటి వీడియో రిలీజ్ చేశారు. బావ అయిన మాజీ మంత్రి నారాయణ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇది రెండు తెలుగురాష్ట్రాల్లో, రాజకీయ వర్గాల్లో, నారాయణ విద్యాసంస్థల్లో చర్చనీయాంశమైంది. దీంతో నారాయణ తన వియ్యంకుడు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును రంగంలోకి దింపారు. ప్రియతో రాజీకి ప్రయత్నించారు. అయితే గంటా ప్రయత్నాలు విఫలమయ్యాయి. ప్రియ మరో వీడియో విడుదల చేసి, అందులో మరిన్ని విషయాలు వెల్లడించారు. ఇది మరింత సంచలనమైంది. సోదరుడి సతీమణినే నారాయణలైంగికంగా వేధించడం కుటుంబీకులకు తెలిసినా పరువు కోసం ఆమె నోరు నొక్కేయడంపై మహిళా సంఘాలు మండిపడుతున్నాయి.

ప్రియా జనసేన వీరమహిళ

పొంగూరు ప్రియ జనసేన సభ్యురాలు. ఆ పార్టీ వీరమహిళగా గుర్తింపు పొందింది. తన బావ టీడీపీలో కీలక నేతగా వ్యవహరిస్తున్నప్పటికీ, ఆమె మాత్రం జనసేన అధ్యక్షుడు పవన్ అభిమానిని అని ఆమె వీడియోలో వెల్లడించింది. తన కుమారుడు పుట్టిన రోజున పవన్‌తో దిగిన ఫొటోను కూడా సోషల్ మీడియాలో షేర్ చేసింది. తన ఓటు కూడా జనసేనకే వేశానని తెలిపింది. తన పార్టీ వీరమహిళగా ఉన్న ప్రియ లైంగిక వేధింపులతో నరకం చూశానంటూ సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేసినా జనసేన పార్టీ నుంచి స్పందన లేకపోవడంపై ఆ పార్టీ నేతలే అసహనం వ్యక్తం చేస్తున్నారు. మహిళల అక్రమ రవాణాలపై మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్ సొంత పార్టీలోని మహిళకు అన్యాయం జరిగితే ఎందుకు నోరు మెదపడంలేదని నెటిజన్లు మండిపడుతున్నారు.

ఓ వైపు కేసులు.. మరో వైపు పరువు

ఓ వైపు పదో తరగతి పరీక్ష పత్రాల లీకేజీ కేసు, మరో వైపు అమరావతి భూముల వ్యవహారంలో అక్రమాల కేసుల్లో ఉన్న నారాయణకు తాజాగా సొంత మరదలు ప్రియ చేస్తున్న ఆరోపణలు మరింత ఇబ్బందిగా మారాయి. తన విద్యా సంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యల వెనుక ఉన్న చీకటి కోణాన్ని కూడా వెలుగులోకి తెస్తానని ఆమె చెప్పడం చర్చనీయాంశంగా మారింది.

గణనీయంగా పెరిగిన పులుల సంఖ్య

- అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- ఎస్వీ జూలో ఘనంగా గ్లోబల్ టైగర్స్ డే

తిరుపతి మంగళం/ మార్కాపురం: ఏపీలో పెద్ద పులుల సంరక్షణ, సంఖ్య పెరగడంలో అటవీశాఖ గణనీయమైన వృద్ధి సాధిస్తోందని రాష్ట్ర అటవీ, విద్యుత్తు, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో గ్లోబల్ టైగర్స్ డే శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఏపీలోని నల్లమల అడవుల్లో గత సంవత్సరం జరిగిన గణనలో 74 పెద్దపులులు ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. ఈ సంవత్సరం వాటి సంఖ్య 80కి చేరినట్టు తేలిందన్నారు. నాగార్జున సాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వు ప్రాజెక్టు కింద పులుల సంరక్షణ పనులను అటవీశాఖ సమర్థంగా నిర్వహిస్తోందని అభినందించారు. పులుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోందని, అంతరించిపోతున్నాయన్నది దుష్ప్రచారమేనని చెప్పారు. రాబోయే రోజుల్లో నల్లమల నుంచి శేషాచలం అడవుల వరకు ప్రత్యేకంగా కారిడార్ అభివృద్ధి చేసి, టైగర్ రిజర్వు పరిధిని విస్తరించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. తద్వారా అటవీ రక్షణ, పులుల సంరక్షణ సులభతరం అవుతుందన్నారు.



గ్లోబల్ టైగర్స్ డే సందర్భంగా ఎస్వీ జూలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

అనంతరం పులుల సంరక్షణపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జూ ప్రవేశంలో ప్రత్యేకంగా వన్యప్రాణుల సంరక్షణపై స్టాళ్లను ఏర్పాటు చేశారు. పులుల సంరక్షణపై ఫొటో గ్యాలరీ నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఏపీ పీసీసీఎఫ్ మధుసూదన్ రెడ్డి, అడిషనల్ పీసీసీఎఫ్ శాంతిప్రియపాండే, సీసీఎఫ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నల్లమలలో 80 పెద్ద పులులు

నల్లమల అటవీ ప్రాంతంలో మొత్తం 80 పెద్ద పులులు ఉన్నట్లు ప్రకాశం జిల్లా మార్కాపురం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావ్ తెలిపారు. శనివారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా అధికారికంగా పులుల సంఖ్యను విడుదల చేశారు. ఎన్ఎస్‌టీఆర్– తిరుపతి కారిడార్ (నాగార్జున సాగర్ – శ్రీశైలం పులుల అభయారణ్యం) వరకూ ఇవి ఉన్నట్లు తెలిపారు.

క్లుప్తంగా...

మరో పారిశ్రామిక విప్లవానికి సన్నద్ధం అవుదాం

జీ20 సమ్మిట్‌లో పల్సస్ గ్రూప్ సీఈఓ గేదెల శ్రీనుబాబు



సాక్షి, అమరావతి: పారిశ్రామిక విప్లవం 4.0కు సన్నద్ధం అవుదామని పల్సస్ గ్రూప్ సీఈఓ గేదెల శ్రీనుబాబు పిలుపునిచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) తయారీలో ప్రపంచ కేంద్రంగా భారత్ ఎదగగలదని, ఇది డిజిటల్ ఇంటెలిజెన్స్ కొత్త శకానికి నాంది అని అన్నారు. న్యూఢిల్లీలో శుక్ర, శనివారాల్లో జరిగిన జీ20 సదస్సులో ఏఐ భవిష్యత్తు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం అనే అంశంపై జరిగిన చర్చలో శ్రీనుబాబు మాట్లాడారు. రానున్న ఐదు నుంచి ఏడేళ్లలో 70 లక్షల మంది ఏఐ ఇంజనీర్లను, డేటా సైన్స్ నిపుణులను సృష్టించవచ్చన్నారు. అయితే 2030 నాటికి ఏఐ, మెషీన్ లెర్నింగ్ రోబోలు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 5 కోట్ల ఉద్యోగాలను రీప్లేస్ చేయవచ్చని భావిస్తున్నామని తెలిపారు. 2030 నాటికి 15 ట్రిలియన్ డాలర్ల ప్రపంచ మార్కెట్‌కు 2 ట్రిలియన్ డాలర్ల మార్కెట్‌ను జోడించి, ప్రపంచ ఉత్పత్తి కేంద్రంగా ఉద్భవించే సామర్థ్యం భారత్‌కు ఉందన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది చంద్రబాబే..

పురందేశ్వరి బీజేపీ అధ్యక్షురాలా.. టీడీపీ అధ్యక్షురాలా?:మంత్రి రోజా



తిరుపతి సిటీ: ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల ఊబిలోకి నెట్టింది చంద్రబాబేనని పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా విమర్శించారు. ఆమె శనివారం తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని పురందేశ్వరి చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఆమె మాట్లాడుతున్న తీరు చూస్తుంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలా.. లేక టీడీపీ అధ్యక్షురాలా.. అన్న సందేహం కలుగుతోందన్నారు. చంద్రబాబు మాట్లాడుతున్న మాటలే ఆమె నోట రావడం దారుణమన్నారు. కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్ సాక్షిగా అన్ని రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ అప్పులు తక్కువని చెప్పిన మాట గుర్తుచేసుకోవాలన్నారు. పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టింది ప్రజల కోసం కాదని, తన ప్యాకేజీ కోసమేనని స్పష్టమైందన్నారు.

రుద్రమ, అనంత, హరిణి

- పులికూనలకు నామకరణం చేసిన అటవీశాఖ అధికారులు



తిరుపతి మంగళం: తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల సంరక్షణలో ఉన్న మూడు ఆడ పులి కూనలకు అటవీశాఖ అధికారులు పేర్లు పెట్టారు. జూపార్కులో శనివారం నిర్వహించిన గ్లోబల్ టైగర్ డే సందర్భంగా జూ అధికారులు నామకరణ మహోత్సవం నిర్వహించారు. పీసీసీఎఫ్ మధుసూదన్‌రెడ్డి, అడిషనల్ పీసీసీఎఫ్ శాంతిప్రియ పాండే పులి కూనలకు రుద్రమ, అనంత, హరిణిగా పేర్లు పెట్టారు. తల్లి నుంచి తప్పిపోయిన నేపథ్యంలో ఈ కూనలను మూడు నెలల కిందట కర్నూలు జిల్లా ఆత్మకూరు అటవీ సమీపంలోని ఓ గ్రామం వద్ద అటవీ అధికారులు స్వాధీనం చేసుకుని జూ పార్కుకు తీసుకుని వచ్చిన సంగతి విదితమే. ఇదిలా ఉండగా నాలుగున్నర నెలల వయసున్న పులికూనలను హైదరాబాద్‌కు చెందిన జీఏఆర్ గ్రూప్ సంస్థ యాజమాన్యం దత్తత తీసుకుంది. సంస్థ అధినేత జి.అమరేందర్‌రెడ్డి అతని కుటుంబ సభ్యులు పులి కూనల సంవత్సర కాలం పోషణార్థం రూ.11 లక్షలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా పీసీసీఎఫ్ వారికి దత్తత ధ్రువీకరణ పత్రం అందజేశారు.

ఫేస్‌బుక్ పరిచయం.. శ్రీలంక యువతితో వివాహం



వి.కోట(చిత్తూరు జిల్లా): ఫేస్‌బుక్‌లో పరిచయమైన శ్రీలంకకు చెందిన ఓ యువతిని చిత్తూరు జిల్లా యువకుడు ప్రేమ వివాహం చేసుకున్న ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... వి.కోట మండలంలోని ఆరిమాకులపల్లి గ్రామానికి చెందిన లక్ష్మణ్‌కు ఆరేళ్ల కిందట ఫేస్‌బుక్‌లో శ్రీలంక దేశం కొలంబోలోని బొలగుండుకు చెందిన విఘ్నేశ్వరితో పరిచయమైంది. వీరి పరిచయం కాస్త ప్రేమకు దారి తీసింది. ఈ నేపథ్యంలో విఘ్నేశ్వరి ఈ నెల 8వ తేదీ టూరిస్ట్ వీసా తీసుకుని ఇండియా వచ్చింది. ఈ నెల 20వ తేదీ లక్ష్మణ్, విఘ్నేశ్వరి వి.కోటలోని సాయిబాబా మందిరంలో వివాహం చేసుకున్నారు. ఆరిమాకులపల్లి గ్రామంలోని లక్ష్మణ్ ఇంట్లో ఉంటున్నారు. విఘ్నేశ్వరి టూరిస్ట్ వీసా గడువు ఆగస్టు 6వ తేదీతో ముగియనుందని సమాచారం. ఈ విషయం తెలుసుకున్న వి.కోట పోలీసులు లక్ష్మణ్, విఘ్నేశ్వరిలను చిత్తూరు ఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్లి విచారించినట్లు తెలిసింది.

శ్రీలంక ట్రింకోమలీ చేరిన ఐఎన్ఎస్ ఖంజర్



సింధియా(విశాఖ పశ్చిమ): భారత్, శ్రీలంక దేశాల మధ్య సన్నిహిత సంబంధాలను మెరుగుపరిచే ప్రక్రియలో భాగంగా భారత నౌకాదళ నౌక ఐఎన్ఎస్ ఖంజర్ శ్రీలంకలోని ట్రింకోమలీకి చేరుకుంది. నౌకకు శ్రీలంక నావికాదళం సంప్రదాయం ప్రకారం ఘనస్వాగతం పలికింది. ఓడ సందర్శన సమయంలో ఇరుదేశాల నౌకాదళాలు పరస్పర ఆసక్తి, క్రీడా మ్యాచ్‌లు, శ్రీలంకలోని నేవీ, మారిటైమ్ అకాడమీ నుంచి శిక్షణ పొందిన ట్రైనీల ద్వారా ఖంజర్ నౌక పలు కార్యకలాపాలను పూర్తి చేసింది. జీఆర్ఎస్ఈ కోల్‌కతా నిర్మించిన ఈ నౌక ఆధునిక ఆయుధాలు, సెన్సార్ల శ్రేణిని కలిగి ఉంది. కమాండర్ ఎస్‌వీఎస్‌పీ కుమార్ నౌకకు నాయకత్వం వహించారు.

సీఎం జగన్‌తోనే విద్యాభివృద్ధి

ఏపీ వైఎస్సార్ టీఎఫ్ నేతలు

పటమట(విజయవాడతూర్పు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి కంకణం కట్టుకుని పేద విద్యార్థుల భవిష్యత్ కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని పలువురు వక్తలు ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన శనివారం విజయవాడలో రాష్ట్ర స్థాయి విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి మాట్లాడుతూ డీఎస్సీ–1998 వారికి ఉద్యోగాలు, వేలాదిమంది ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వడంతోపాటు నాడు–నేడు, అమ్మఒడి వంటి అనేక కార్యక్రమాలు చేపట్టి విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యోధుడిలా కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, రామచంద్రరెడ్డి, చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా వ్యవస్థకు మరింత మేలు కలిగేందుకు ఉపాధ్యాయులందరూ సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని కోరారు. టీచర్ల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రణాళికను రూపొందిస్తున్నారని, త్వరలోనే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీలను ఉపాధ్యాయులు సన్మానించారు. వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. వైఎస్సార్ టీఎఫ్ ప్రధాన కార్యదర్శి గడ్డెల సుధీర్, గౌరవ అధ్యక్షుడు జాలిరెడ్డి, వ్యవస్థాపకులు ఓబులాపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అప్పులపై ఎలాంటి చర్చకైనా సిద్ధం

- వైఎస్సార్‌సీపీ ఉమ్మడి విశాఖ జిల్లా సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి సవాల్
- మెడికల్ కాలేజీల గురించి మాట్లాడే అర్హత బాబుకు లేదు : మంత్రి రజిని

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పులపై ఎలాంటి చర్చలకైనా సిద్ధమని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి విశాఖ జిల్లా సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి సవాల్ విసిరారు. విశాఖ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని అధ్యక్షతన శనివారం విశాఖ తూర్పు, దక్షిణ నియోజకవర్గాల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసే అప్పులన్నీ.. ప్రజా సంక్షేమం, అన్నిప్రాంతాల అభివృద్ధి కోసమే తప్ప.. టీడీపీ మాదిరిగా దోచుకోవడానికి కాదన్నారు. రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు సీఎంగా ఉన్న ఐదేళ్లలో రూ.1.80 లక్షల కోట్లు అప్పులు చేశారన్నారు. టీడీపీ హయాంలో రాష్ట్రంలో ఏ అభివృద్ధి జరిగిందో పురందేశ్వరి ప్రశ్నించాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీజేపీకి మద్దతిస్తున్నామని, అసలు అవిశ్వాస తీర్మానం ఎందుకు పెట్టారో ఆ పార్టీలకే స్పష్టత లేదని వైవీ ఎద్దేవా చేశారు.



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి రజిని తదితరులు

ఆ ఆలోచన చేసేందుకే బాబు భయపడ్డారు

సెప్టెంబర్ 1 నుంచి 5 వైద్య కళాశాలలను సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభించనున్నామని మంత్రి రజిని వెల్లడించారు. టీడీపీ హయాంలో కొందరు ఎమ్మెల్యేలు ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తే.. కాలేజీ ఏర్పాటుకు రూ.500 కోట్లకు పైగా ఖర్చవుతుందని, దాని నిర్వహణ భారంగా మారుతుందన్నట్టుగా మాట్లాడారని గుర్తు చేశారు. కాలేజీ ఏర్పాటు ఆలోచనకే భయపడిన బాబుకు.. వాటి గురించి విమర్శించే అర్హతే లేదన్నారు.

విశాఖకు మరింత ప్రాముఖ్యత

సాక్షి, విశాఖపట్నం/తాటిచెట్లపాలెం: విశాఖలో నిర్మించే ఇనార్బిట్ మాల్ దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద మాల్‌గా నిలుస్తుందని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి విడదల రజిని తెలిపారు. విశాఖ నగరం సాలగ్రామపురం పోర్ట్ ఆస్పత్రి సమీపంలో నిర్మించే ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన కార్యక్రమం ఏర్పాట్లను కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పోర్టు స్థలంలో రహేజా గ్రూప్ ఈ మాల్ నిర్మిస్తోందని తెలిపారు. ఈ మాల్ ద్వారా రాష్ట్రానికి, ముఖ్యంగా విశాఖకు ప్రాముఖ్యత మరింతగా పెరుగుతుందన్నారు. సీఎం జగన్ విశాఖను ఆర్థికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేస్తూ, పరిపాలనా రాజధానికి కావలసిన అన్ని సదుపాయాలు ముందుగానే సమకూరుస్తూ నగరాన్ని, ఉత్తరాంధ్రను మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి చేస్తున్నారని రజిని తెలిపారు. గ్రేటర్ విశాఖలో సుమారు రూ.135 కోట్లతో చేపట్టే పనులకు కూడా సీఎం 1న శంకుస్థాపన చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ హరి వెంకటకుమారి, ఎంపీ భీశెట్టి సత్యవతి, ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు పాల్గొన్నారు.

జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌ల్లో ప్రభుత్వ ఉద్యోగులకు రాయితీ

సాక్షి, అమరావతి/మంగళగిరి: మధ్య తరగతి ఆదాయ వర్గాల(ఎంఐజీ) కోసం మంగళగిరిలో అభివృద్ధి చేసిన 'జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్'లోని ప్లాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రాయితీ కల్పిస్తున్నట్టు సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. టౌన్‌షిప్‌లో 10 శాతం ప్లాట్లు రిజర్వు చేయడంతో పాటు ధరలో 20 శాతం రాయితీ కల్పించామని పేర్కొన్నారు. ఇక్కడి లే అవుట్‌లో 200, 240 చ.గ. ప్లాట్లు అందుబాటులో ఉన్నాయని, చదరపు గజం ధర రూ.17,499గా నిర్ణయించినట్లు తెలిపారు. కొనుగోలుదారుకు మేలు చేసేందుకు అగ్రిమెంట్ చేసుకున్న నెలలోపు ఏకమొత్తం ఒకేసారి చెల్లిస్తే ధరలో ఐదు శాతం మినహాయింపు ఇచ్చామన్నారు. డెవలప్‌మెంట్ చార్జీల్లో 40 శాతంపై రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా మినహాయింపు, బ్యాంకు రుణ సదుపాయం కూడా ఉందన్నారు. ఆయా వివరాలు ఆగస్టు ఒకటి నుంచి https://migapdtcp.ap.gov.in, https://rda.-ap.gov.in వెబ్‌సైట్లలో ఉంటాయని, సందేహాల నివృత్తికి 0866- 2527124 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



సముద్రతీర ప్రాంతంలో మడమొక్కలు నాటేందుకు తవ్విన కాలువలు

తీర రక్షణ కవచాలకు సర్కార్ దన్ను

మడ అడవుల పెంపకానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం

- బాపట్ల జిల్లా తీర ప్రాంతంలో రెవెన్యూ భూభాగం గుర్తింపు
- ఇప్పటికే చినగంజాంలో పెంపకం
- త్వరలో నిజాంపట్నం ప్రాంతంలోనూ
- మొత్తం 3 వేల హెక్టార్లు గుర్తింపు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: తీర ప్రాంతాల రక్షణ కవచాలుగా నిలుస్తున్నాయి.. మడ అడవులు. వీటి సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపడుతోంది. సముద్ర తీరప్రాంతాల సంరక్షణ, ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో మడ అడవులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాటిని మరింత విస్తృతం చేసి అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తున్న సర్కార్ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కల పెంపకాన్ని చేపట్టింది. మరోవైపు మడ అడవుల సంరక్షణకు కూడా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా బాపట్ల జిల్లా తీర ప్రాంతంలో ఉపాధి హామీ పథకం కింద కొత్తగా మడ అడవులను పెంచుతోంది. ఇందుకు చినగంజాం మండలం పెదగంజాం వద్ద సుమారు 150 ఎకరాలను గుర్తించింది. ఈ నెల 19న తొలుత 2.50 ఎకరాల విస్తీర్ణంలో మడ విత్తనాలను అధికారులు నాటారు. మిగిలిన ప్రాంతంలోనూ మడ అడవుల పెంపకానికి సిద్ధమవుతున్నారు. అలాగే కర్లపాలెం మండలం తుమ్మలపాలెం, పెద్దపులుగువారి పాలెం గ్రామాల పరిధిలో 8 ఎకరాలు, నిజాంపట్నం మండలంలోని కొత్తపాలెం వద్ద మరో పది ఎకరాల్లో మడ విత్తనాలను నాటుతున్నారు. ఇవికాకుండా తీరం వెంట ఉన్న రెవెన్యూ భూభాగాన్ని గుర్తించి అందులోనూ మడ అడవులు పెంచాలన్నది ప్రభుత్వం ఉద్దేశం. మడ అడవుల పెంపకానికి ఒక్కో ఉపాధి హామీ కూలీకి 500 పనిదినాలు కేటాయించింది.

మడ అడవుల ప్రాధాన్యత..

- తీర ప్రాంతాల్లో మడ మొక్కలు ఐదేళ్ల నుంచి పదేళ్ల లోపు 10 మీటర్ల ఎత్తు వరకూ పెరుగుతాయి. తుపానులు, సునామీలు లాంటి ఉపద్రవాల నుంచి కాపాడే రక్షణ కవచాలు మడ అడవులే. అందుకే వీటికి తీర సైన్యమని పేరుంది.
- ఉప్పుకయ్యలు, వాటిని ఆనుకొని ఉండే ప్రాంతాలకు ఎదురయ్యే తుపానుల ప్రభావాన్ని మడ అడవులు అడ్డుకుంటాయి.
- తీరప్రాంతాల నేలలు కోతకు గురికాకుండా చేస్తాయి.
- తుపాను గాలుల ప్రభావాన్ని తగ్గించడంలో సాయపడతాయి. తద్వారా నష్ట తీవ్రతను తగ్గిస్తాయి.
- నదుల ద్వారా వచ్చే అవక్షేపాలను సముద్రంలోకి చేరకుండా ఆపి, తద్వారా ఎన్నో సముద్ర జీవజాతులకు అవసరమైన గడ్డికి, పగడపు దీవులకు హాని కలగకుండా కాపాడతాయి.
- వంద మీటర్లు వెడల్పు ఉండే మడ అడవి ప్రాంతం నుంచి ప్రయాణించే తుపాను అలలు మూడింట రెండు వంతుల శక్తిని కోల్పోయి బలహీనపడతాయని నిపుణులు చెబుతున్నారు.
- మడ అడవులు ఆర్థికంగా కీలకమైన మత్స్య, ఆల్చిప్ప జాతులకు అనువైన స్థావరాలు. విస్తారంగా వ్యాపించే మడ జాతి మొక్కల వేళ్ల సముద్ర, తీర ప్రాంత చేపలు, ఆల్చిప్ప జాతుల సంతానోత్పత్తికి అనుకూలంగా ఉంటాయి.
- అలాగే స్థానిక, వలస పక్షులకూ నెలవులుగా ఉంటాయి.
- ఈ అడవులతో స్థానికులకు జీవనోపాధి కూడా లభిస్తోంది. ఇక్కడ దొరికే తేనె, పశుగ్రాసంతో పలు ప్రయోజనాలు సమకూరతాయి.
- పర్యావరణ పర్యాటక కేంద్రాలుగానూ మడ అడవులు భాసిల్లుతున్నాయి.



చినగంజాంలో ఇటీవల నాటిన మడ మొక్కలు



చినగంజాంలో మడ మొక్కలు నాటుతున్న కూలీలు

ప్రస్తుతం రెండు వేల హెక్టార్లలో..

బాపట్ల జిల్లాలో 40 కిలోమీటర్ల మేర సముద్ర తీర ప్రాంతం ఉండగా తీరం వెంట మూడు వేల హెక్టార్ల భూభాగం ఉంది. ఇందులో చినగంజాం మండలం మోటుపల్లి, పల్లెపాలెం, పెదగంజాం పంచాయతీ పరిధిలోని ఏటిమొగ్గ మొదలుకొని సూర్యలంక, పెదపులుగువారి పాలెం, నిజాంపట్నం, దిండి, అడవులదీవి, కొత్తపాలెం వరకూ రెండువేల హెక్టార్లలో ప్రస్తుతం మడ అడవులు విస్తరించి ఉన్నాయి. అడవి మధ్యలో గ్యాపుల రూపంలో మరో వెయ్యి ఎకరాలు ప్రస్తుతం ఖాళీగా ఉంది. గతంలో ఈ ప్రాంతంలోనూ మడ అడవులు ఉన్నా.. స్థానిక ప్రజల అవసరాలు, వ్యవసాయం, కలప కోసం నరికేయడం తదితర కారణాలతో చాలావరకు అడవి అంతరించింది. ఇప్పుడు ఈ ఖాళీ ప్రాంతంలోనూ మడ అడవులను పెంచనున్నారు. రిజర్వ్ ఫారెస్ట్ అధికారులు గ్రీన్ క్లైమేట్ ఫండ్ ద్వారా మడ అడవులను మరింత అభివృద్ధి చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే ముత్తాయి పాలెం పరిధిలో 500 హెక్టార్లు, నిజాంపట్నంలో 500, దిండిలో 400, అడవులదీవిలో 400, కొత్తపాలెంలో 300, పులుగువారిపాలెంలో 300 హెక్టార్లు చొప్పున 2,400 హెక్టార్లలో అడవులు ఉండగా.. వీటి పరిధిలో మరో 1,500 హెక్టార్ల మడ అడవులను కొత్తగా పెంచబోతున్నారు. 90 శాతం అడవులను విత్తనాల ద్వారా, మిగిలిన పది శాతం నర్సరీ ద్వారా పెంచనున్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట



పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని తీరప్రాంతంలో మడ అడవులను పెంచుతున్నాం. ఉపాధి హామీ ద్వారా మడ మొక్కలను, విత్తనాలను నాటి పేదలకు పనికల్పిస్తున్నాం. చినగంజాం మండలం ఏటిమొగ్గలో మడ మొక్కలను నాటాం. నిజాంపట్నం ప్రాంతంలోనూ త్వరలోనే మడ మొక్కలు పెంచబోతున్నాం.

– రంజిత్ బాషా, కలెక్టర్, బాపట్ల జిల్లా

వెయ్యి హెక్టార్లలో మడ అడవులు



జిల్లాలో కొత్తగా వెయ్యి హెక్టార్లలో మడ అడవులను పెంచబోతున్నాం. మడ అడవుల వల్ల తీరప్రాంతం సురక్షితంగా ఉంటుంది. సునామీ లాంటి ఉపద్రవాలు వచ్చినా మడ అడవులు వాటి నుంచి రక్షణ కల్పిస్తాయి.

–ఎల్.భీమయ్య, జిల్లా అటవీ శాఖ అధికారి

భూములను గుర్తించాం



ఇప్పటికే చినగంజాం, నిజాంపట్నం ప్రాంతాల్లో తీరంలో ఉన్న రెవెన్యూ భూములను గుర్తించాం. వాటిలో మడ అడవుల పెంపకం చేపట్టాం.

–శంకర్ నాయక్, పీడీ డ్వామా

'ఇగ్నో'తో ఉపాధికి ఊతం



- ఉన్నత విద్యావ్యాప్తికి ఇగ్నో విశేష కృషి
- విజయవాడ ప్రాంతీయ కేంద్రం పరిధిలో 8 జిల్లాలు
- 200 కోర్సులను అందిస్తున్న ఇగ్నో ప్రాంతీయ కేంద్రం
- ఎస్సీ, ఎస్టీ వర్గాలకు పలు కోర్సుల్లో ఉచిత అడ్మిషన్లు
- ఈ నెలాఖరు వరకు అడ్మిషన్లకు గడువు

పటమట (విజయవాడ పశ్చిమ): సార్వత్రిక విద్యను అందించే విద్యా సంస్థల్లో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) అగ్రగామిగా నిలుస్తోంది. ఇగ్నో అందించే కోర్సులు ఉపాధికి ఊతమిస్తున్నాయి. భారత్‌లో ఉన్నత విద్యావ్యాప్తి కోసం పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం చేసి 1985 నవంబర్ 19న ఢిల్లీ కేంద్రంగా ఇగ్నోను ఏర్పాటు చేశారు. రెగ్యులర్ విద్యా విధానంలో ఉన్నత చదువులు చదవాలనే కాంక్ష ఉండి విద్యాసంస్థలకు వెళ్లి చదువుకోవడానికి అవకాశం లేని లక్షల మందికి ఇగ్నో బాసటగా నిలుస్తోంది.

8 జిల్లాలు 21 స్టడీ సెంటర్లు...

విజయవాడలో 2008లో ఏర్పాటైన ఇగ్నో ప్రాంతీయ కార్యాలయం పరిధిలో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలున్నాయి. ఈ జిల్లాల్లో 200 కోర్సులను 21 స్టడీ సెంటర్లు ఆఫర్ చేస్తున్నాయి. వీటిలో డిప్లమో, పీజీ డిప్లమో, డిగ్రీ, పీజీ, సర్టిఫికెట్ కోర్సులున్నాయి. ఏటా వేల మంది ఈ ప్రాంతీయ కార్యాలయం ద్వారా ఎంబీఏ, ఎంసీఏ చదువుతున్నారు. ఆయా స్టడీ సెంటర్ల ఆధ్వర్యంలో 1,200 మంది అధ్యాపకులు తరగతుల నిర్వహణలో భాగస్వాములవుతున్నారు. స్థానిక పరిశ్రమల అవసరాల మేరకు ఇగ్నో అందిస్తోన్న కొన్ని ప్రత్యేక కోర్సులకు భారీ డిమాండ్ ఉంది. వీటిలో బీకాం (అకౌంట్స్ అండ్ ఫైనాన్స్), ఎంబీఏ (ఆరు ప్రత్యేకాంశాలు), ఎంఏ (సైకాలజీ), డిప్లొమో ఇన్ న్యూట్రిషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్, పీజీ డిప్లొమో ఇన్ ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ కోర్సులున్నట్లు స్టడీ సెంటర్ల నిర్వాహకులు చెప్పారు.

నాణ్యతలో రాజీపడబోం

ఇగ్నో అందించే కోర్సుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ ఉండదు. కోర్సులకు సంబంధించి అసైన్‌మెంట్లు, స్టడీ మెటీరియల్ తదితర అంశాల్లో మంచి విధానాలను కొనసాగిస్తున్నాం. నాణ్యతా ప్రమాణాల విషయంలో ప్రపంచంలోని మేటి సార్వత్రిక వర్సిటీల్లో ఒకటిగా ఇగ్నో కొనసాగుతోంది. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులు ఇగ్నో కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ బి.ప్రసాద్‌బాబు, సహాయ సంచాలకులు

ఎస్సీ, ఎస్టీలకు ఫీజు రాయితీ

ఎస్సీ, ఎస్టీలకు కొన్ని డిగ్రీ కోర్సుల్లో ఇగ్నో ఉచితంగా కోర్సులను అందిస్తుంది. బీఏ, బీకాం, బీఎస్సీ, సీబీసీఎస్ కోర్సులకు పూర్తి ఫీజు మినహాయింపు ఇస్తోంది. దరఖాస్తు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500లు చెల్లించి అడ్మిషన్ పొందవచ్చు. ఇగ్నోలో జూలై 2023 నుంచి ప్రారంభమయ్యే విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా వివిధ కోర్సుల దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 31 వరకు గడువు ఉంది. వివరాల కోసం విజయవాడలోని ఇగ్నో రీజనల్ కార్యాలయంలో స్వయంగా గానీ లేదా ఫోన్ నెంబర్ 0866–2565253ను సంప్రదించాలి.

వృత్తుల వారీ సర్టిఫికెట్ కోర్సు

ఉద్యోగాల్లో కొనసాగుతూ తమ విద్యార్హతలను మరింతగా పెంపొందించుకునేందుకు లక్షలాది మంది ఇగ్నోలో కోర్సులను ఆశ్రయిస్తున్నారు. తద్వారా ముందుకు సాగుతూ తమ అవకాశాలను మెరుగుపరచుకుంటున్నారు. విద్యావ్యాప్తితో పాటుగా ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే క్రమంలో ఇగ్నో అనుసరిస్తున్న విధానాలు యువతకు బాసటగా నిలుస్తున్నాయి. కొన్ని వృత్తులకు సంబంధించి సర్టిఫికెట్ కోర్సులనూ ఇగ్నో అందిస్తుంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943